# మూసీ

# MUSI

◆ Samputi : 28 ◆ Sanchika : 02 ◆ Pages : 64 ◆ Rs. 20
◆ December 2024

UGC CARE List
Approved Journal


- సంశ్లిష్ట, సంక్లిష్టాల మధ్య సంయుక్త కవిత
- శ్రీమాన్ సముద్రాల రంగరామానుజాచార్యులు
- శేషేంద్రశర్మ వ్యాస సౌరభం
- భగవద్గీత – ఒక అధ్యయనం
- తిరుమలలో క్షేత్రయ్య
- దళిత సంచార కులాలు : జీవితం – కళలు
- గంగు కిషన్‌ప్రసాద్ కవిత్వ, విమర్శ ప్రస్థానం
- నృత్త రత్నావళి – సంగ్రహ పరిచయం



మూసీ వ్యవస్థాపకులు

కీ॥ శే॥ భిన్నూరి నరసింహ శాస్త్రిగారి 92వ జయంతి




వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి


# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 2
డిసెంబర్ - 2024
'క్రోధి' మార్గశీర్ష మాసం

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

UGC APPROVED JOURNAL

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. MANOHARI**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక'
(MUSI Telugu Monthly Magazine)
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992


## ఈ సంచికలో ...

### వ్యాసాలు


సంశ్లిష్ట, సంక్లిష్టాల మధ్య సంయుక్త కవిత ... డా. సుంకర గోపాల్ 7
శ్రీమాన్ సముద్రాల రంగరామానుజాచార్యులు ... ఆచార్య పెన్నా మధుసూదన్ 13
శేషేంద్రశర్మ వ్యాస సౌరభం ... డా. జొన్నలగడ్డ భారతి 17
భగవద్గీత - ఒక అధ్యయనం ... డా. వీపూరి వేంకటేశ్వర్లు 22
తిరుమలలో క్షేత్రయ్య... ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి 25
దళిత సంచార కులాలు : జీవితం - కళలు ... డా. గోపని చంద్రయ్య 29
గంగు కిషన్‌ప్రసాద్ కవిత్వ, విమర్శ ప్రస్థానం ... కొడుపుగంటి సంతోష్ 35
నృత్త రత్నావళి - సంగ్రహ పరిచయం ... డా. కె. రత్నశ్రీ 39
నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము... డా. గంద్ర లక్ష్మణరావు 41
ప్రజా చైతన్య దిశగా సాహిత్య సంస్థలు ... డా. ఎన్. రజని 43
మహాభారతం ధర్మప్రశ్నలు - భీష్మ సమాధానాలు-10 ... డా. అట్టెం దత్తయ్య 51
శ్రీచరణ శరణాగతి - రావికంటి కవిత్వానుశీలన ... డా. జి. శ్రీనివాసరావు 54


### సమీక్షలు


'అవని' తత్త్వ ఆకళింపే జీవితం ... డా. ఎం. విప్లవకుమార్ 58
స్వీకృతి... 61


### కవితలు


కష్టము ... ఆల్వాల లక్ష్మణ మూర్తి - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; వేధ - ఖర్మం ... డా. వొజ్జల శరత్‌బాబు - 12; చలికి వణుకుతున్న చంద్రుడు ... డా. అంజనాశ్రీ - 24; అంతర్యామి ... మల్యాల మనోహర రావు - 40; రాజకీయం ... ఎస్. ఆర్. పృథ్వి - 50; నానీల కమ్మలు ... డా. మడత భాస్కర్ - 60; ఏమో! ఎట్లుంటదో! ... కందుకూరి అంజయ్య - 62.




ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by :*
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 2  హైదరాబాద్ డిసెంబర్ : 2024

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు
నీవే వెలుగై వ్యాపించు**





# అభయం

దైవ విగ్రహ హస్తాలకు 'అభయ' ముద్ర, 'వరద' ముద్రలు ఉండడం మనకు తెలిసిందే. శ్రేష్టమైనవానిని మనకు ఇవ్వడానికి సిద్ధమైనది వరద హస్తమైతే, భయ రహితంగా, ధైర్యంగా మనని నిలబెట్టే హస్తం అభయ హస్తం.

అభయ ముద్ర అవసరం ఏమిటి? అసలు భయం ఎందుకు? భయం వల్ల ఏం జరుగుతుంది? దైవ విగ్రహాలతో సహా అందరూ ఈ భయాన్ని గూర్చే ఎందుకు చర్చించుకుంటున్నారు? చిన్న వయసులోని వారి నుండి అతి పెద్దవారి వరకు ప్రతివారూ ఏదో ఒక అంశం గూర్చి భయపడుతూనే ఉంటున్నారు. భయరహితమైన లోకంలోకి తీసుకువెళ్ళాలని రవీంద్రుడు కోరుకున్నా అందరూ భయస్థులయ్యే ఉంటున్నారు. మన శరీరం, మనం వినియోగించుకునే వస్తువులు, మనం ఎక్కి తిరిగే వాహనాలు, మన చుట్టూ ఉండే సమాజం, మానవ, పశు, పక్షి, క్రిమికీటక, సర్పాదులు, వృక్షాదులు అన్నింటితోనూ భయమే ఉంటుంది. ఇంకా ప్రకృతితో మరింత భయం. అందరికీ ఈ భయం సమానం కాదు. అందరూ అన్ని విషయాలలోనూ ఒకే విధంగా స్పందించరు. భయం మాత్రం అన్ని జీవులకూ ఉంటుంది. అవమాన భయం, మరణ భయం తప్పనిసరిగా ఉన్నాయి.

మనం బాగా నిద్రించినపుడు మనం పురుషులమా? స్త్రీలమా? పొడుగా? తెలుపా? ధనవంతులమా? హీనులమా? ఆరోగ్యవంతులమా? కామా? ఏ విషయాలూ గుర్తుండే అవకాశం లేదు. నిద్ర లేస్తూనే తాము ధరించిన శరీరంతో మమైకం పొందగానే ఈ శరీరావసరాలతో కలిసి పోతూ ఈ లోక వ్యవహారంలోకి వస్తుంటాం. నిద్రించినపుడు మనకున్న పూర్తిస్థాయి చైతన్యం ఈ శరీరంతో కలియగానే ఎన్ని భయాలు ఉంటాయో, అన్నింటిలోనూ చేరిపోతుంది. మన బలహీనతలు, భయాలు ఎన్ని ఉంటాయో అన్నింటిలోనూ మన శక్తి నిత్యం చేరిపోతూ ఉండి, క్రమంగా మనం శక్తిహీనులం అవుతున్నాం. అనారోగ్యం, బాధలు, కష్టాలు అన్నీ కొని తెచ్చుకుంటున్నాం.

భయ కారణాలు అన్వేషించాలి. సృష్టిలో భయాలు లేవు. అజ్ఞానం వల్లనే అన్నింటినీ వెంట తెచ్చుకుంటున్నాం అని అన్ని ఆధ్యాత్మిక శాస్త్రాలు చెప్తూనే ఉన్నాయి. ధైర్యంతో, బలంతో, శక్తితో చేసే ప్రతిపని కూడా విజయవంతమై ఉన్నతంగా ముందుకు సాగుతుంది. వారికి ప్రకృతి పరిపూర్ణంగా తోడు ఉంటుంది. సపోర్ట్ చేస్తుంది. బలహీనులకు ఏ తోడూ దొరకదు. అందుకే లోపల భయాదులు తొలగించడం కోసం అందరు గొప్పవారూ కృషి చేస్తూనే వచ్చారు. భయ రహితులైన వారు తామే స్వయంగా వరాలను అందరికీ ఇచ్చేవారే అవుతారు.

మన మనస్సు మాత్రమే ఈ లోపాలకు గురి అవుతుంది. భయ రహితమైన మనస్సే ఆత్మ అవుతుంది. ఆనందమయమవుతుంది. శక్తి, చైతన్యాదులకు ఎప్పుడూ భయం ఉండదు. మనస్సుకు తగిన జ్ఞానం లేకపోవడం వల్ల, తమ గతానుభవాల వల్ల, ఎవరో చెప్పిన విషయాలు గుర్తు పెట్టుకోవడం వల్ల తన పరిమితి పెంచుకుంటుంది. మనః పరిమితి తగ్గి, శక్తి పరిమితి పెంచుకున్న వారిదే లోకం. శక్తి పరిమితి తగ్గించుకుని, మనః పరిమితి పెంచుకుంటున్న వారికే కష్టాలు, భయాలు, లోపాలు, ఒత్తిడులు, చికాకులు, అనారోగ్యాలు. మనస్సుకున్న బలహీనతలు శరీరం మీద ప్రభావాన్ని చూపి శరీరం అంతా బలహీనం చేస్తుంది. అనారోగ్యానికి గురి చేస్తుంది.

అందుకే తనను తాను తెలుసుకోవాలి, జ్ఞానం పెంచుకోవాలి. ఉత్తమ మార్గం అనుసరించాలి. ఉన్నత స్థితికి చేరుకోవాలి. సాధించాలి. కృషి, ప్రయత్నం ఈ లోకంలో దాని కోసమే. మిగిలినవి వాటంతట అవే చేకూరుతాయి. అప్పుడే చైతన్యశీలత.

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 2

హైదరాబాద్ డిసెంబర్ : 2024

# కష్టము







కష్టము లేని జీవితము కానగరాదు జగచ్చరిత్రలో
కష్టము చేయు మానవుడు కష్ట ఫలంబుల నందుకొన్నచో
కష్టము నిష్టమే యగును, కాని పనుల్ యెపుడైన చేయుచో
స్పష్టమె – నష్టముల్ కలుగ సాగదు జీవిత యానమో సఖా!

కష్ట నష్టాలు వచ్చినన్ కలతనొంది
చిన్నబోవక గమియించి చేరవలయు
ఉన్నతాదర్శ శిఖరంబు – నోర్మి గలిగి
అదియె ధీరత మాన్యత యవని యందు

ఇష్టమైనది కాబోదు కష్టమెపుడు
నష్టమెంచము నెప్పుడున్ నిష్టమైన
కష్టపడియైన సాధింత్రు నిష్టమనుచు
స్పంద నీరీతి లోకంబు స్పష్టమగును

జీవితమందు కష్టములు చెప్పియు రావవి నష్టహేతువుల్
పూవుల పాన్పు గాదెపుడు పొందిక యోచన యోర్మి నుండుచున్
భావికి బాటలన్ వెదకి బాధ్యతగా శ్రమియించగా వలెన్
కోవిద పద్ధతిన్ గనుము కోరుచు సల్పుము సంఘ సేవలున్

కదలవు కష్టముల్ సతము కర్మలు కూడియు కాటు వేయునే
నిదురను మున్గువారలకు – నిశ్చల సంపద లబ్బు నెన్నగాన్
సదమల వృత్తితో మెలగు సాత్త్వికు లైనటువంటి వారికిన్
చెదరని దీక్ష పట్టుదల చిత్తము ధర్మము నందు నిల్పగాన్.

ఆకలి నిద్ర కష్టములు నందర కొక్కటెగాని జ్ఞానిగా
ఈ కలి లక్షణం బెరిగి యెన్నడు గూడ చలింపకుండగన్
శోకము చెందబోకెపుడు శుద్ధిగ నుండి తరించు యత్నమున్
చీకటియే వెలుంగునిడు జీవిత మిద్ది యటంచు నెంచుమా!

మర్యాదగు పద్ధతులే
ఆర్యుల సూక్తులు – జగతికి హానిని జేయున్
పర్యవసానము నెంచని
కార్యంబులు సేయుచుండ కష్టము లొదవున్

**అల్వాల లక్ష్మణ మూర్తి**
కలువకుర్తి, ఫోన్ : 9550 467 431

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 2 (6) హైదరాబాద్ డిసెంబర్ : 2024

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. '**భారత ధ్వని దర్శనము**'. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

# తుకారాం అభంగం

ముక్తిమందిరము పండరీపురము
విటుకమీదున్నది ఆది దైవము
అడుగున అడుగై పదమును కలుపుతు
చేరు పరమాత్మ ధామమును

జాతిభేదమును విడిచి విస్తార
నామ ప్రసంగము చేయుదము
సాధు యతీంద్రుల పవిత్ర బోధల
పదము పదమునవి పంచెదము
పల్లెలన్నీ పలు వరుసలై కదిలి
పావన మూర్తిని చేరుదము

మాయ పొరలు కమ్ముకున్న దేహము
మరలు మార్గమిది మహిమాన్వితము
పన్నగ శయనుడి పావన మంత్రము
కనుల పొరలు తొలచు సంజీవనము
హృదయ మందార మధుర గానమున
మైలను పారద్రోలుదుము

తుకావాక్కుల సత్యపరిమళము
పంచుతు పోవును జీవమును
అడుగున అడుగై పదమును కలుపుతు
చేరు పరమాత్మ ధామమును




అనువాదం
డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

# సంశ్లిష్ట, సంక్లిష్టాల మధ్య 'సంయుక్త కవిత'

డా. సుంకర గోపాల్, ఫోన్ : 9492638547

**పరిచయం :**

తెలుగు సాహిత్యంలో మొదటి నుంచి ప్రయోగాలు ఉన్నాయి. మహాభారతాన్ని ముగ్గురు ఆంధ్రీకరించారు కానీ ఇది విభిన్న చారిత్రక స్థల కాలాదుల మధ్య అంతరంతో జరిగింది. ఆ తర్వాత కథాకావ్యాలు వచ్చాయి. చారిత్రక కావ్యాలు, ప్రబంధాలు, సంకీర్తనలు, యక్షగానాలు ఉన్నాయి. పద్య కావ్యాలను జంటగా రాసిన కవులు ఉన్నారు. తెలుగు సాహిత్యంలో నంది మల్లయ్య, ఘంట సింగనలు తొలి జంట కవులు. ఆ తర్వాత జాబితా కొద్దిగా పెరిగింది. ఆధునిక కావ్యాల కాలం వచ్చాక పింగళి–కాటూరి, జాషువా–దీపాల పిచ్చయ్య శాస్త్రి, తిరుపతి వేంకట కవులు, వేంకట పార్వతీశ కవులు, శేషాద్రి రమణ కవులు, రామకృష్ణకవులు మొదలైనవారు ఉన్నారు. నవలలు, నాటకాలు కూడా ఇద్దరు రాసిన వాళ్ళు ఉన్నారు. అవధానాలు జంటగా నడిపిన వాళ్ళు ఉన్నారు. కొవ్వలి–జంపన నవలలు కలిసి రాశారు.

వచన కవిత రంగ ప్రవేశం చేసింది. రకరకాల కవిత్వ ఉద్యమాలు మొదలయ్యాయి. దిగంబర కవులు, నయాగరా కవులు, తిరగబడు కవులు, పైగంబర కవులు, చేతనా వర్త, నిరసన, నిశికవులు, కవిసేన కవులు వీళ్లంతా జట్టు కవులు. వాళ్ల ఉమ్మడి అజెండా ఒక్కటే. అందరూ కలిసి విడివిడిగా కవిత్వం రాసి సంకలనం చేశారు.

ఇద్దరూ లేదా అంతకంటే ఎక్కువమంది కలయికతో సంయుక్త కవితలు రాశారు. అయితే వీరి ఉమ్మడి లేదా కూటమి కలయికకు తాత్విక బేధాలు ఉన్నాయి. ఒకే తాత్విక చింతన కలిగిన వాళ్లు తక్కువ. ఇద్దరూ లేదా అంతకంటే ఎక్కువమంది కలిసి ఒకే గొంతుగా మాట్లాడడం సంయుక్త కవితలో ప్రధానం. సంయుక్త కవితల్లో భీముని భాగం దీర్ఘ కవితలే ఉన్నాయి. అయితే ఇందులో ఇతరేతర ప్రయోజనాల కోసం ఒకే గొంతు కావడం కనిపిస్తుంది. ఇద్దరు రాసిన కవితల్లో డిబేట్ ఉందా లేదా అనేది ప్రధానంగా చూడాలి. ఆ ఇద్దరు మధ్య చర్చ సాగాలి. దాని వలన ప్రయోజనం ఉంటుంది. నిజాయితీ, కొన్ని నిజాలు నిగ్గు తేలుతాయి. అయితే ఇప్పటివరకు వచ్చిన కొన్ని సంయుక్త కవితల వివరాలు ఇలా ఉన్నాయి.

1. మేమే – శ్రీశ్రీ, అబ్బూరి, ఆరుద్ర
2. కవితా ప్రయోజనం – శ్రీశ్రీ, ఆరుద్ర
3. మోహార్ణవం – వేగుంట మోహన ప్రసాద్, శిఖామణి
4. క్రితం తర్వాత – అఫ్సర్, త్రిపుర శ్రీనివాస్, ప్రసేన్, నరసింహ చారి, కృష్ణుడు, నీలిమా గోపీచంద్



5. అతడూ ఆమె మేము – అఫ్సర్, నామాడి శ్రీధర్, ఓమ్మి రమేష్ బాబు, ఎం. ఎస్ .నాయుడు, పెద్ది రామారావు
6. ఇదేదో చాటుమాటు వ్యవహారం – శ్రీరామ కవచం సాగర్, డాక్టర్ ఎన్. శైలజ, జె.వి.ఎన్ మూర్తి
7. ఊరూ వాడ – మద్దూరి నగేష్ బాబు, రాణి శివశంకర శర్మ
8. పద పారిపోదాం – మో, శివప్రసాద్
9. విద్యావరణం – డాక్టర్ బండి సత్యనారాయణ, ద్వానా శాస్త్రి
10. నేను రుద్రవీణని, జగిత్యాలని – కె.వి నరేందర్, సంగవేని రవీంద్ర
11. నేను నాయకరాలు నాగమ్మని మాట్లాడుతున్నా
12. అరాచకుని స్వగతాలు – పి. శ్రీనివాస గౌడ్, కొత్తపల్లి సురేష్, జి.వి రత్నాకర్

**కవితా ప్రయోజనం :**

ఇది శ్రీశ్రీ ఆరుద్రల కవితాత్మక సంవాదం. కవిత్వ ప్రయోజనం గురించి చేసిన చర్చ. రాయడం వెనుకున్న తాత్వికత, కవిత్వం అంటే ఏమిటి? సహృదయ హృదయ స్పందనం శిరః కంపనం అసలైన కవిత్వానికి గీటురాయని శ్రీశ్రీ అంటాడు. కవిత్వం మేల్కొల్పాలి గాని జోకొట్టకూడదు. మెజారిటీకి అందని ఊహలు ప్రజాస్వామ్య అంగీకార ఆలోచనలు కవిత్వంలో ఉండాలని ఇద్దరూ చెప్తారు. ఏమిటి చెప్పడం, ఎలా చెప్పడం అనేవి రెండూ రెండు చక్రాలు, చూసావా ఆరుద్ర ఒక తమాషా సంప్రదాయం నిలిచి ఉంటుంది హమేషా, నవ్యత్వం ప్లస్ మానవత్వం ఈజీక్వల్ట్ కవిత్వం లాంటి వాక్యాలు ఇప్పటికీ

అనేక ఉపన్యాసాల్లో మనం ఉపయోగిస్తూ ఉంటాం. సమకాలిక జీవితమే సత్కవితా వస్తువు అనేమాట కూడా శ్రీశ్రీ చివరిలో అంటాడు. అంతర్లీనంగా ఇందులో సాహిత్య ప్రయోజనం సాహిత్య విమర్శ వస్తు చర్చ, సంవిధానం గురించి వాళ్ళు ఇప్పటికీ ఉపయోగపడే చర్చ చేశారు.

**మేమే :**

ఇది అబ్బూరి, శ్రీశ్రీ, ఆరుద్రల సంయుక్త కవిత. ఇందులో వాళ్ళ ముగ్గురు ప్రాసకి, శ్లేషకి, వ్యంగ్యానికి ప్రాధాన్యమిస్తూ, అంత్య ప్రాసలతో రాసిన పాదాలలో ఎవరికి తోచిన అర్థాన్ని వారు తీసుకోవచ్చు. కొన్ని వాక్యాలలో డాడాప్రభావం కనిపిస్తుంది. సిరిసిరి మువ్వలం / చెరిగిన దవ్వలం /Washroom పెరట్లో మందార పువ్వలం / భగవంతుని వితంతువులం / కరుణమా బ్రతుకు/ కవనంమా మెతుకు ఇట్లా సాగుతుంది. మేము మానవజాతి Obviously, కొరుకుపడిన ఆయఃపిండాలమని, భగవంతుని మైక్రోస్కోపులమని ఎక్కుపెట్టిన టెలిస్కోపులం, శతకోటి స్టెతస్కోపులమని, అనంతకోటిబయోస్కోపులమని ప్రకటించారు. ఇవి నినాదాలుగా ఉన్నప్పటికీ ఆలోచింపజేసే వాక్యాలు కనిపిస్తాయి.

**మోహర్ణవం :**

ఇది మో, శిఖామణిల సంయుక్త కవిత. శిఖామణి మార్గానికి, మో మార్గానికి కిలోమీటర్ల వ్యత్యాసం ఉంది. 64 పాదాలు ఉన్న కవిత. లైంగికత శరీరాల భాష కాదు ఆత్మల కలయిక. దేహాత్మల సంఘర్షణ మనుషులకు సరిగా తెలియదు. సిగ్మండ్ ఫ్రాయిడ్ చెప్పిన లిబిడో పునాది మీదుగా చరిత్ర, సంస్కృతినుండి మానవునిలో ఉన్న లైంగిక ప్రవృత్తిని ఈ ఇద్దరి కవులు లోని స్వ అనుభవాలను కలిపి కుట్టిన 2బై2 గులాబీ రంగు జాకెట్ ఈ కవిత.

వసంత సేన, చారుదత్తుల ఇతివృత్తం అంతర్లీనంగా ఉంటుంది ఈ ఇద్దరి కవుల ప్రేమ గంధ వాక్యం మోహార్ణవం. ఫకాల్మని, పఠీల్మ మని, ఫక్కుమని నిర్మాణించుకుందాం, చీకటిటుక ఉదయ రక్త అశ్రు స్రావం, మోహప్పాలు, వాసనోదయపుటుదయం లాంటి పదాలు ముద్రని పట్టి చూపుతాయి. మహా నాగసర్పం వసంతసేన, చారు దత్తుడు లాంటి మిత్ లు శిఖామణిని పట్టిస్తాయి.

**"క్రీ.పూ. నుంచి క్రీస్తు శకం దాకా**
**సంస్కృతాన్నుంచి ఆంధ్రం దాకా**
**ఇక మేమెప్పుడూ ఏ కటి తప్పు చేయలేం**
**నీలోని నాలోని చీకటెప్పుడు తొలగిపోతుందో గానీ"** అనే వాక్యాలతో ఈ కవిత ముగుస్తుంది.

**ఊరూ వాడ :**

మద్దూరి నగేష్ బాబు, రాణి శివశంకర్ సంయుక్త కవిత. ఇది ఒక బ్రాహ్మణుడు దళితుడు కలిసి రాసిన దీర్ఘ కవిత, కనుక వాళ్ళు ఉప శీర్షిక సంకర కవిత అని పెట్టారు. బ్రాహ్మణిజాన్ని విడిచి, దళిత మార్గంలోకి ఆహ్వానించడం ఇందులో ప్రధానమైన అంశం. ఇది మామూలుగా వచ్చిన కవితలా కాక ప్రోస్ పోయెట్రీ లాగా వాక్యాలు పొదుగ్గా ఉండే రూపలక్షణంతో సాగింది. రెండు బద్ధ విరోధ వాదాలు ఒకటి కావడం గమనించవచ్చు కానీ ఆ తర్వాత ఎవరు ఇలాంటి ప్రయత్నం చేయలేదు. తరతరాలుగా ఉన్న వివక్ష, అంటరానితనం, కులపిచ్చి అన్ని వదిలేసుకుని అందరం కలిసి పోవాలని ఈ కవిత కోరుకుంది. **"బ్రాహ్మణత్వాన్ని వదులుకున్న వారు ధన్యులు వారు దళితు ప్రేమను చవిచూస్తా"**రంటూ భారతదేశాన్ని దళితరాజ్యంగా ప్రకటించాలని ఆర్డర్ వేశారు. అసలు ఈ కుల పిచ్చోళ్లకు హార్ట్ ఉంటే వాడ పద్యం ఊరు పద్యాల మధ్య భేదాలు ఎందుకు ఉంటాయని చెప్తారు.

**"రారా నా తూర్పుగోదావరి వరివెన్నా వాడ పెన్నా / జంజాల్ని తెంచుకున్న శివుడా శంకరుడా / సంఘీభావి రా తండ్రి"** అంటూ శివ శంకర్ ని నగేశ్ బాబు కోరుతారు. ఊరికి దూరంగా వాడను నెట్టేసి కష్టాల్లో వాడ ఉంటే, ఏమాత్రం పట్టకుండా హాయిగా నిద్రిస్తున్న ఊరికి నిద్ర భంగం చేయాలని కోరుకున్నారు. తన తలలో కుక్క మెదడునైనా అమర్చుకుంటే నిద్రాణంగా ఉన్న ఊరిని మేలుకొలుపుతానని ప్రకటించారు. హిందూ దేవతలను పురాణాలను వాషింగ్ మిషన్ లో వేశారు.

ఆచారాలు సంప్రదాయాల పేరుతో గుడి చుట్టూ జీవితాంతం తిరగాల్సిన తనకు దళిత స్ఫూర్తి వెలుగునిచ్చిందని శివశంకర్ చెప్తారు. ఇంతకాలం మొద్దుబారిన తన ఆలోచనలను సరిచేసి వాటిని కవిత్వంగా చేయమని నగేష్ బాబు శివశంకర్ ని ఆహ్వానిస్తాడు.

మొలకి అంగోస్త్రంతో గుడి చుట్టూ పడే దొర్లే శర్మ గాడిలా మృత్యువు వరకు దొర్లుకుంటూ పోవలసినవాణ్ణి నల్ల వెలుతురు కళ్ళనిచ్చింది నా ఆలోచనలని నిప్పుల్లో వేసి సుత్తితో కొట్టి పద్యమో పాటో చెయ్! డ్రెస్సింగ్ చేసి తిరిగి కుట్టు పోనీ కుక్క మెదడైనా అమర్చు గ్రామ సింహాన్నై వూరి నిద్ర చెదరగొడ్తాను అని అంటారు.

**పద పారిపోదాం :**

వేగుంట మోహన్ ప్రసాద్, కే శివకుమార్ సంయుక్తంగా రాసిన దీర్ఘ కవిత "పద పారిపోదాం". ఈ సంయుక్త కవితలో వస్తువును పట్టుకోవడం చాలా కష్టం. వాళ్ళిద్దరూ వచ్చి చెప్తే తప్ప మనకు అవగాహన కావడం కష్టం. అయితే ఇందులో కొంత హేతువాద దృక్పథం ఉన్నట్లు కనిపిస్తుంది. చదువుతున్నప్పుడు బాగుంటుంది. కానీ ఏం చదివావో చెప్పమంటే నోరెళ్ల బెట్టాలి.

దేవుళ్ళని, పురాణాలని ప్రచారం చేసే ప్రవచనకర్తలమాటల్ని, భక్తులు విని ఆచరించడం లేదని, వాళ్లకి పాద పూజలు చేయడమే పరమార్థంగా పెట్టుకున్నారని అంటారు. శంకరాచార్యుడు చెప్పిన

అద్వైత సిద్ధాంతాన్ని చీకట్లో నల్ల పిల్లి తో పోలుస్తారు. మతం పేరుతో సాధువుల్ని, సన్యాసుల్ని, మఠాల్ని పెంచుకుంటూ పోవడమే తప్ప మానవత్వాన్ని వంట పట్టించుకునే స్థితి లేదని ఈ కవుల ప్రధాన ఆరోపణ. భక్తులు మూఢనమ్మకాలలోపడిచస్తున్నారని, పురాతత్వశాస్త్ర మహమ్మరిసోకిందని ఆవేదన చెందారు.

**"నా దేశానికి పురాతత్వ శాస్త్రపు మహమ్మరి సోకింది**
**ఇక్కడ ఎవరన్నా వున్నట్లా లేనట్లా**
**నువ్వెన్ని చెప్పినా ఇక్కడ లేనిదల్లా ఒక్క మానవుడే**
**దేవుళ్ళందరూ ఉంటారు ఇక్కడే**
**ఇక్కడ లేనిది నువ్వూనేనే ఇక్కడ లేనిదల్లా ప్రగాఢమైన ప్రేమ**
**ఇక్కడ ఉన్నదల్లా చెర పట్టిన చిరునవ్వు"**

**క్రితం తర్వాత :**

కమ్యూనిస్టు రాజ్యాలలో అప్పుడు జరిగిన పరిణామాలు, ప్రపంచ రాజకీయ, సామాజిక వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో ఆరుగురు కవులు కలిసి త్రిపురనేని శ్రీనివాస్ ప్రోద్బలం తోరాసిన సంయుక్త కవిత.

తూర్పు ఐరోపా జీవితంలోని రాజకీయ సామాజిక అంశాలు, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ పునర్నిర్మాణాలు ఆ ప్రభావం లో నుంచి వీళ్ళు విప్లవ స్వరాలు వినిపించారు. ఎన్నో తరాలుగా బూజుపట్టిపోయిన భావాలను తరిమేసి కొత్త ప్రకంపనాలను మెదడులో కల్పించడమే మానవీయ విప్లవం అంటూ వినూత్న నిర్వచనం ఇచ్చారు.

**"ఇక్కడ కూడా సెసెక్యూలున్నారని మాకు తెలుసు**
**అధికారం ఇస్తే ఒక్కొక్క రుమేనియా నెత్తురు మేనియా**
**కారణాలు ఏవైనా**
**సిద్ధాంతాలు ఏవైనా సంస్థ గతాలు ఏవైనా**
**కొత్త పూల మొక్కని సృష్టించడమే సృజనాత్మకత**
**నాడీ మండలంలో కొత్త ప్రకంపనాలను కదిలించడమే విప్లవీకరణ"**

పీడ కలలకు భయపడి నిద్దర నటించడం పలాయన వాదమంటూ మనిషి రంగు జెండాను ఎగరేసి అరాచకత్వంపై యుద్ధం ప్రకటించాల్సిన తరుణాన్ని కవులు ఆవిష్కరించారు. మనిషి రంగు ఏమిటి అని కాదు, మనం ఆలోచించాల్సింది మనిషి కోసం అతని ఉన్నత కోసం ముందడుగు వేయడమే మనిషి రంగు జెండా పున్న పరమార్థం. చరిత్ర అంటే అనుభవం కాదు చెంప పెట్టని చరిత్ర గుణపాఠమని సరికొత్త హృదయపూర్వక శిశిరానంతర గీతాన్ని క్రితం తర్వాత వినిపించి వక్ర రేఖలను చెరిపేయాలని పిలుపునిచ్చారు. ఇది ఆరుగురు కవులు రాసినప్పటికీ పరిమాణం లో చిన్నది. కవులు సరికొత్త విప్లవాన్ని ఆవిష్కరించాలి అనుకున్నప్పుడు ఆ కవిత్వంలో అస్పష్టత ఉండకూడదు. ఇందులో అక్కడక్కడ మనకు అస్పష్టత కనిపిస్తుంది.



**అతడు ఆమె మేమూ :**

అఫ్సర్, నామాడి శ్రీధర్, బొమ్మి రమేష్ బాబు, ఎం ఎస్ నాయుడు, పెద్ది రామారావు వీళ్లు ఐదుమంది ఐదు దృశ్యాలుగా ఈ కవితను రాశారు. ఈ సంయుక్త కవితను వాళ్ళు లాంగ్ డార్క్ పోయంగా పిలిచారు.

అతడు, ఆమె అనేవి దళిత స్త్రీవాద ఉద్యమాలకు సూచికగా అనుకోవచ్చు. వాళ్ళిద్దరూ ఉమ్మడిగా కలసి ఉద్యమించడం మేము అని భావించవచ్చు.

**ఏడు రంగుల చీకటి మీద పద్యమిది**
**ఇక అభిమన్యుడు చావడు,**
**లోపలే కాదు బయట కూడా అతనిదే విజయం**
**ఇది గెలుపు పద్యం**

అంటూ ఊరి చివర మంకెన చెట్ల అక్రోశాన్ని, అర్ధాకాశాల తెల్లారని రోదనను అపరిచిత దుఃఖాన్ని ఆవిష్కరిస్తూ కవిత సాగుతుంది. వాటన్నిటినీ పగలేసిన పద్యంగా చెప్పుకున్నారు. ఇక మేము తెల్ల కలలను మానేస్తాం ఇవాళ నల్ల నిజాలు, నల్ల పద్యాలు, ఆమె లోకమూ అంటూ తెలుపు, నలుపుల్ని ప్రతీకలుగా వాడారు. మాటల తూటాల మాలలతో నల్ల సీతాకోక చిలుకల దండోరా చేశారు.

**"ఇవాల్టి తర్వాత మళ్లీ**
**నలుపు తెల్లబారడం సహించలేం**
**ఇవాల్టి తర్వాత మళ్లీ ఆమె "అతను"వుగా మారడం సహించలేం.**
**ఇది ముగించలేని కాలం**
**ఇది ముగింపు లేని పద్యం** అంటూ

కవిత ముగుస్తుంది. నా మొహం మీద డిసెంబర్ ఆరు నెత్తురింకా ఆరలేదు, అజా పిలుపు వంటివి అఫ్సర్ రాసిన వాక్యాలు అయి ఉ ండవచ్చు.

**ఇదేదో చాటుమాటు వ్యవహారం :**

శ్రీరామ కవచం సాగర్, డాక్టర్ ఎన్. శైలజ, జె.వి.ఎన్. మూర్తి కలిసి ఈ సంయుక్త దీర్ఘ కవితను వెలువరించారు. భూకంప

నేపథ్యంలో, దాని విధ్వంసం తర్వాత ఈ కవిత మొదలైంది. 50 పేజీల సుదీర్ఘ సంయుక్త కవిత. శిథిలాలు ప్రకంపనల మధ్య పద్యం మొదలైంది అంటూ నేను భూకంపం అవుతానని ప్రకటిస్తూ వ్యవస్థలోని దేశంలోని ఆపసవ్యాలను ఆధిక్యతలను ప్రశ్నిస్తూ కవిత సాగుతుంది.

శవం, నాగుబాము, గది ఈ మూడింటిని ప్రతీకలుగా వాడారు. కల్తీ అయిన మానవ మస్తిష్కాలను కడగాల్సిన అవసరాన్ని, మాట పునరుత్థానం కావాలని పిలుపునిచ్చారు. మార్కెట్ మాయాజాలం గురించి చెబుతూ

**"మన్నించు కెప్టెన్**
**పద్యాన్ని**
**మార్కెట్ భాషలోకి అనువదించలేను**
**మార్కెట్ మెల్లగా పాకి వచ్చి**
**మన నెత్తుటి కొమ్మల మీద పడగ విప్పుతుంది**
**మనిషెప్పుడూ పేటెంట్ లేని వస్తువే"**

అని మనుషులు మానవత్వం వ్యాపారం కావడాన్ని, సరుకు కావడాన్ని నిరసించారు. కరుణ చిప్పిలి చిన్నతడి చూపు కోసం దండం పెడతామని ప్రాధేయపడ్డారు. నీ స్వేచ్ఛ ఒక సంకెళ్ళని తుంచితే అది మరో గొప్ప స్వేచ్ఛకు సంకెలుగా మారుతుంది ఈ వాక్యం ఈ కవితకు పునాదిగా నిలుస్తుంది. కవిత్వం నిండా అస్పష్టత ఉన్నప్పటికీ చదివించే గుణం ఉండటం గమనించదగిన విషయం అవ్యక్త భావాలు పాఠకుడిని ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. సంయుక్త కవిత గురించి శ్రీరామ కవచం సాగర్ ఇట్లా అన్నారు.

కవిత్వం అవసరార్థం వస్తుంది. కవిత్వం అర్థం కోసం రాయరు. అర్థం కావాలనే కమ్యూనిస్ట్ థాట్ కి కన్స్యూమరిజం వెలుగులో మార్మిక తన్నులాటకి మధ్య ప్రపంచీకరణ ముసుగులో ఇదేదో చాటు మాటు వ్యవహారమే.

**విద్యావరణం :**

ద్వానా శాస్త్రి, బండి సత్యనారాయణ సంయుక్త దీర్ఘ కవిత విద్యావరణం. ప్రపంచ ప్రశంసలు అందుకున్న భారతీయ విద్యా విధానం నేడు అనేక దుర్భర మార్పులకు లోనైందనే ఆవేదన లోనుండి ఈ కవిత పుట్టింది. ఇందులో ప్రాచీన విద్య నేటి ఉపాధ్యాయుల స్థితి పాఠ్య బోధన విశ్వవిద్యాలయాలు పాఠ్యపుస్తక కమిటీలు ర్యాగింగ్ కళాశాలలో రాజకీయ జోక్యం వంటి వాటిని ప్రస్తావించారు. ఈ కావ్యం సమకాలీన అంశాలకు ప్రతిబింబంలా అనిపిస్తుంది. కవులు ఈ కవితలోని భాగాలకు పర్వాలుగా పేర్లు పెట్టారు. కవిత్వం సంగతి ఎలా ఉన్నా ఇందులో నిజాలు మాత్రం నిలబడి ఉంటాయి.

**"ఇంటర్నేషనల్ స్కూల్ అంటే**
**ఓ షాపింగ్ మాల్**
**కార్పొరేట్ విద్యాసంస్థల**
**గాలానికి చిక్కుతున్న చేపలు తల్లిదండ్రులు**
**ర్యాంకులు విపణి వీధిలో చిన్నారులు తాజా సరుకు"**

ఈ దీర్ఘ కవితను రాసిన ఇద్దరు బోధనా రంగానికి చెందిన వాళ్లు కాబట్టి విద్యారంగానికి సంబంధించిన సంక్షోభాలను వివిధ కోణాల్లో ఆవిష్కరించారు.

**నేను నాయకురాలు నాగమ్మని మాట్లాడుతున్నా :**

కె.వి నరేందర్, సంగినేని రవీంద్ర సంయుక్తంగా రచించిన దీర్ఘ కవిత ఇది.

పల్నాటి వీర చరిత్రలో ప్రతి నాయకురాలిగా తొలి మహిళ మహా మంత్రిణిగా పేరు తెచ్చుకున్న నాగమ్మ జీవిత చరిత్రలోని మరో కోణాన్ని వెలుగులోకి తేవడమే ఈ కవిత లక్ష్యం.

నాగమ్మ పుట్టుక ఆమె మీద వచ్చిన ఆరోపణలు వాటిలోని నిజా నిజాల విశ్లేషణలతో ఈ కవిత సాగుతుంది. నాగమ్మను గుర్తు చేయడం, ఆమెకు చరిత్ర చేసిన మోసాన్ని చూపడం ఇందులో ప్రధాన ఉద్దేశం. ఈ కవులు ఈ దీర్ఘ కవితకి **ఆత్మ కవిత** అనే ఉప శీర్షికను కూడా పెట్టారు. తన స్వగతం తానే చెప్పుకున్నట్లు ఉత్తమ పురుష కథనంలో ఈ కవిత సాగుతుంది. నాగమ్మ స్వరం వినబడుతుంది.

**"నేను నాగమ్మని**
**నాయకురాలు నాగమ్మని**
**రక్త కాసారం లోంచి**
**అగ్ని కమలంగా విచ్చిన**
**తెలంగాణ బిడ్డని**
**చీకట్లు చీల్చాల్సిన కొక్కొరోకో**
**కత్తుల్లోంచి రాలిపడ్డ**
**నెత్తుటి చుక్కని"**

తెలంగాణ గడ్డమీద పుట్టినప్పటికీ తెలంగాణ చరిత్ర పరిశోధకులు ఎవరూ అంతగా నాగమ్మను పట్టించుకోలేదని ఈ కవులు దుయ్యబట్టారు. చరిత్రలో నాగమ్మ ను వక్రీకరించి ఆమెను దుర్మార్గురాలుగా చర్చించిన శుద్ధ మోసంగా చారిత్రక తప్పిదంగా పాఠకుల దృష్టికి తెచ్చారు.

**నేను రుద్రవీణని... జగిత్యాలని!**

కె.వి నరేందర్, సంగినేని రవీంద్ర సంయుక్తంగా రాసిన మరొక దీర్ఘ కవిత ఇది. తెలంగాణలో శిఖరాయమానమైన పట్టణం జగిత్యాల. ఇది పోరాటాలకు పురిటిగడ్డ. జగిత్యాల తన గొప్పదనాన్ని చెప్పుకున్నట్టు ఉత్తమ పురుషలో ఈ కవిత సాగుతుంది.

జగిత్యాల చరిత్రలో మైలురాళ్లు వంటి సంఘటనలు ఇందులో

చెప్పారు. ఇక్కడ పుట్టిన వీరులు, కవులు, కళాకారులు పోరాట యోధులును గుర్తుకు తెచ్చారు.

తమ ప్రాంతగొప్పతనాన్ని ఈ కవిత ద్వారా బలంగా వినిపించారు. జగిత్యాలలో జరిగిన అనేక పోరాటాలను దృష్టిలో ఉంచుకొని సూర్యుని అనువదిస్తే జగిత్యాల అవుతుంది అనడం గొప్ప అభివ్యక్తి. ఇక్కడి కష్టాలు, వలసలు కూడా ప్రస్తావనకు వస్తాయి.

**"సూర్యుణ్ణి అనువదిస్తే**
**నేనే కదా...**
**ఒక చారిత్రక సంధ్యనని గర్వించినా...అంతరాంతరాల్లో**
**రక్తము ,కన్నీళ్లు, అగ్ని**
**అతలాకుతలం చేసిన**
**గాయాల సంగ్రామాన్ని**
**రెప్పమూస్తే నెత్తుటి కలల**
**లెక్క తేలని నిర్నిద్ర భూమిని.. జగిత్యాలని"**

ప్రాంతీయ అస్తిత్వవాద కవితలు ,కావ్యాలు తెలంగాణ ప్రాంతంలోని ఎందుకు ఎక్కువ వచ్చాయోఈ దీర్ఘ కవితను చూస్తే అర్థం అవుతుంది. ఇద్దరు కవులు రాసిన ఈ సంయుక్త కవిత ప్రవాహ వేగంతో ఉంటూ పాఠకుల్ని చదివిస్తుంది. ఆలోచింపజేస్తుంది.

**అరాచకుడి స్వగతాలు :**

ఈ సంయుక్త కవిత 2022 లో వచ్చింది. పి శ్రీనివాస్ గౌడ్, కొత్తపల్లి సురేష్, డాక్టర్ జి .వి రత్నాకర్ ఈ ముగ్గురు కలిసి దీన్ని గొలుసుకట్టు కవితగా తీసుకొని వచ్చారు. ఒక సగటు జీవి బడుగు దుఃఖాన్ని ఆవిష్కరించారు. ఈ నేల మీద జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను ఆధిపత్యాన్ని ప్రశ్నించాల్సిన అవసరాన్ని గురించి కాస్త కటువుగానే చెప్పారు. గతాల గాయాలను గుర్తు చేస్తూనే వర్తమానానికి సంబంధించి హెచ్చరిక జారీ చేశారు. గొంతులో నుంచి రావలసిన ప్రశ్నలు సాగుతూనే ఉండాలని కోరుకున్నారు. రైతు ఉద్యమాన్ని ఆ విజయాన్ని, అక్షరీకరించారు. సామాన్యుడికి, సగటు మానవుడికి నిర్లిప్తత పనికిరాదు. నేల నలుమూలల సమాధి అయిన గొంతుల సామూహిక స్వరంగా ముగ్గురు కవులు నినదించారు. నిరసనల్ని ఖైదు చేసే కాలాన్ని కనిపెట్టాలని పేర్కొన్నారు. నెగడు రాజేసే వాక్యాలు రాశారు.

**"చూపుడు వేలు**
**చూపిన దారిలో**
**తథాగతుడి అడుగుజాడల్లో**
**నీ చరిత్రలోకి నడవరా**
**రేయ్**
**పట్టుకో దివిటి"** అంటూ అంబేద్కర్ తథాగతుడి మార్గమే సామాన్యులకు విజయం చేకూరుస్తుందని తెలిపారు. అరాచకుని స్వగతం మంచి ధారతో సాగుతుంది. చివరి భాగాలన్నీ రత్నాకర్ రాసినట్టుగా తెలుస్తుంది.

**ఉపసంహారం :**

ఇలా ఈ వ్యాసంలో నా దృష్టికి వచ్చిన సంయుక్త కవితల్ని విశ్లేషించాను. అయితే సంయుక్త కవిత అనేది దీర్ఘ కవితల్లో మాత్రమే ఎఫెక్టివ్‌గా ఉన్నట్టు తెలుస్తోంది.

దాదాపు అన్ని సంయుక్త కవితలు దీర్ఘ కవితలే. సంయుక్త కవితల్లో సంఘర్షణ లేనప్పుడు విభిన్న తాత్విక చింతనను కలిగిన వాళ్లు కలిసి రాసినా ప్రయోజనం ఉండదు. కొన్ని సంయుక్త కవితలు చాలావరకు అస్పష్టంగానే ఉన్నాయి. వీటిలో సాహిత్య ప్రయోజనం కంటే సాహిత్య ప్రయోగం డామినేట్ చేసినట్టు కనిపిస్తోంది. ఎవరో ఒక కవికి ఆలోచన రావడం వాళ్ళు మిగతా వాళ్ళని పురి కొలవడంలో సాహిత్య ప్రయోజనం కంటే వ్యక్తిగత ప్రయోజనమే కనిపిస్తోంది . అయితే ఇవి రాసిన వాళ్ళ కలయికలు చూస్తే మనకు ఆశ్చర్యం వేస్తుంది. ఈ జాబితాను చూస్తే సంయుక్త కవితలు అనుకున్నంత స్థాయిలో తెలుగు సాహిత్యంలో రాలేదని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1.మేమే – శ్రీశ్రీ, అబ్బూరి, ఆరుద్ర

2. కవితా ప్రయోజనం – శ్రీశ్రీ, ఆరుద్ర

3. మోహార్ణవం – వేగుంట మోహన ప్రసాద్, శిఖామణి

4. క్రితం తర్వాత– అఫ్సర్, త్రిపుర శ్రీనివాస్, ప్రసేన్, నరసింహ చారి, కృష్ణుడు, నీలిమా గోపీచంద్

5. అతడూ ఆమె మేము – అఫ్సర్, నామాడి శ్రీధర్ ,ఓమ్మి రమేష్ బాబు, ఎం.ఎస్. నాయుడు, పెద్ది రామారావు

6. ఇదేదో చాటుమాటు వ్యవహారం – శ్రీరామ కవచం సాగర్, డాక్టర్ ఎన్. శైలజ, జె.వి.ఎన్ మూర్తి

7. ఊరూ వాడ – మద్దూరి నగేష్ బాబు, రాణి శివశంకర శర్మ

8. పద పారిపోదాం – మో, శివప్రసాద్

9 విద్యావరణం – డాక్టర్ బండి సత్యనారాయణ, 'ద్వానా శాస్త్రి

10.నేను రుద్రవీణని, జగిత్యాలని – కె.వి నరేందర్, సంగవేని రవీంద్ర.



ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 2 (12) హైదరాబాద్ డిసెంబర్ : 2024

# వేధ – ఖర్మం

డా. వొజ్జల శరత్‌బాబు, ఫోన్ : 99635 33937

వీర్యబలం ! శౌర్యబలం !
మది నిండా మమత బలం
విశ్వమంతా
ఈ దేశపు నాటి బలం !
జ్ఞానబలం! సాధుబలం !
ప్రాపంచిక సత్త్వబలం
అందించినట్టి పసిడి బలం !
ఈ దేశపు నాటి జనం
జనం జనం బలం బలం
దేశానికి బలం జనం
జనం కంత దేశ బలం !

మనం మనం
నేటి జనం నేటి మనం!
జాగృతమై వైకృతమై
జలగలకు చిక్కినట్టి
నేటి మనం!
ఈ నాటి వారసులం !
చెట్టు బలం చేతి బలం
చేమ వనం ఘనపర్వం
వంశావళి బంధుకేళి
వద్దనుకొని వద్దనుకొని
గుదిబండల హద్దులని
ముద్దైన విద్య నెంచి
విద్య తోటి బతుకుందని
బతుకులేని విద్యనిస్తూ
ముందుకెళ్లే మనం !
మనం మనం మనం జనం !
జనం మనం నేటి మనం !
కర్మభూమి! ధర్మభూమి !
మన చరితలు
మనకెంతో ఈసడింపులు!
రాసలీలల పరులచరితలు
మనకెంతో పోహళింపు!
కర్మభూమి! వేద భూమి!

ఈనాటికిది 'ఈతి' భూమి !
నాతి నెల్ల పూజించిన
సనాతనం ప్రాకృతికం!
మహీ తలపు తలపు బలం
వేధ ఖర్మ మైన యీ బలుపు
స్వార్థమైన సంజ కులుకు
అందరికీ తెలిసిన దీ వాపు బలుపు
!
కుర్చీకి కొత్త బలం
కూతకున్న పొత్తుబలం !
జనం నుండి ఓటు బలం
మాటు గళం!
ఓటుమాటు గళపు బలం
దొరలకుండె దొబ్బు గుణం !
అధికారపు మేఘ రణం
జనం కంట నీటి ధార
నీటి బలం వీటి బలం
నీతి లేని నీచ బలం
నీడలేని చౌక బలం !
ఏసీల్లో ఏలు వారు
గుడిసెల్లో కూలు వారు !
ఆకాశం అక్కడనే
భూమి అయితే ఇక్కడనే !
ఇదే ధర్మ మిదేనండి !
ఆకలైన ఈకలిలో
కోకలను ఊడబీకి
మూల గదిలో మూతి మూసి
రేకు గదిలో రెక్క విరిచి
మూలుగుటయే జీవితమని
జీవితంలో మూలుగుమని !
నడి బజార్లో నడివేదిక లెక్కుతూ
నా జనులే దైవమ్మని
నమ్మిస్తూ కీర్తించగ
నడ్డి విరిగి నడుస్తున్న
ఈ జనులకు
శశిపథముల నందిస్తూ
కుజకాంతుల చూపిస్తూ

పాతాళం పంపించే
ఈ కాలం ..
మన కాలం
జనస్వామ్యపు జాతీయం
మానవులకు
భూరి విజయ వాలం

మర్మసూత్ర మందుకున్న వ్యాపారపు
షేర్ కాలం ఆప్యాయపు మమతార్థ
బలం
భావబలం మర్మధనం
జనపుదనం ధనపుజనం
అదే మనకు స్వాతంత్ర్యం !
మన తంత్ర్యం! మనో మంత్రం!
అందులోన ఇందులోన ఎందైనను
అందమైన ఆకర్షణ మేటిపాటి
దానికి ఇప్పుడు లేదు సాటి !
మరణ క్రియల ఒప్పంద కాటి
మన జేబుల కడిగే సూటి ధాటి
కన్నవారు రోదించే కలి తేటి

అడవి దాడి అవని దాడి
అంగట్లో ధరల దాడి అన్నింటనిదే
వాడి
యవ్వనమై నా అమ్మ దాడి !
భాష దాడి! భావ దాడి
భావజాల భాతి నాడి
బాల్యమూడ్చే బ్రతుకువేడి!
ఎవడికెవడు ?
ఎందుకెవడు ?
ఎవడెందుకు ?
మన ముందుకు
బంగారపు పూతలె సుమా !
అమ్మ ఇచ్చు లాలిత్య మేది?
అయ్య జేసు పాలనేది?
బుడుగెక్కడ
అనుబంధపు జాడెక్కడ ?
సంబంధపు సౌధమేది ?
వృద్ధ బ్రతుకు వృద్ధి ఏది?
ప్రాకృతీయ పరిధులున్న
మృగపు బ్రతుకు మేలుసుమా !
ప్లాస్టిక్కులు గీస్టిక్కులు

లాజిస్టిక్కు లిప్స్టిక్కులు
మనలను స్టిక్కుల చేయగ
మనమంతా నిష్ఠమరచి
వైకృతపు పనులు చేసి
ప్రాకృతికపు సౌందర్యము
నిలువెల్లా ముంచేసి
తుంచేసి వంచేసి
సంచితమును చావ జంపి
అనౌచిత్యములకు
పురుడు వోసి
శుద్ధ
మేధోపత్రముల కందించగ !
భావితరపు బాటలేవి ?
బాటలున్న నడకలేవి ?
నడక లేక దేహమెట్లు
దేహమున్న జీవినిట్లు
ఈ నడకను
నడుపుతున్న మనిషెవ్వడు ?
మనిషి నడక
మరిపించిన నరుడెవడు?
చెదపురుగులు ఏడ్చుచుండే
పుస్తకాల గూళ్ళ
వైనమేదియని ?
చరవాణిలో బందీలై
అజాగ్రత్తపు చంచలులై
పసి బాలుర తేనె మనసు
గరళ పూర్ణ గోలెములై
గోళములై తాళాలై
మాట రాక భాష లేక
అభావపు అభాగ్యులై
వినూతనపు వేషజ్ఞులై
పట్టాలను పుచ్చుకుంటూ
చదువు సార లేఖనముల
చాలినంత చూపలేక
చదువుపైన చూపు లేక
సాగుతుంటే విర్రవీగుతుంటే
సద్భావ పులుగు రెక్కలిరిగి
నేల కూలి మూల్గుతుండగ
గురు భారము భారమగుచు
బోధకరువు తాండవించు
వేధీయుడు ముందుకేగు!

# శాస్త్ర రత్నాకర, విద్వన్మణి, మహామహోపాధ్యాయ

# శ్రీమాన్ సముద్రాల రంగరామానుజాచార్యులు

**ఆచార్య పెన్నా మధుసూదన్,** సంచాలకులు, సంస్కృత అకాడమీ, హైదరాబాద్. ఫోన్ : 98605 29642



భారతదేశం యొక్క ప్రతిష్ఠ సంస్కృతం, అందులోని విజ్ఞానం! అలాంటి విజ్ఞానాన్ని ప్రామాణికంగా గ్రహించి అందజేయగల మహానుభావులు ఆ విజ్ఞానానికే ప్రతిష్ఠను కలుగజేయరనడంలో సందేహం లేదు. అలాంటి కొందరు మహానుభావులలో అగ్రగణ్యులు మహామహోపాధ్యాయ **శ్రీమాన్ సముద్రాల రంగరామానుజాచార్యులు** గారు. వీరికి **బ్రహ్మశ్రీ బి.ఎన్. శాస్త్రి గారి స్మారక పురస్కారాన్ని డిసెంబర్ 10 న అందజేస్తున్న ఈ శుభ తరుణంలో** 'మూసీ' పత్రిక నిర్వాహకులనభినందిస్తూ పూజ్యులైన ఆచార్యుల వారి జీవన విశేషాలతో పాటు, వారు చేసిన వాఙ్మయసేవను పాఠకుల ముందుంచే చిరు ప్రయత్నమిది.

ఆచార్యుల వారి పేరు శ్రీమాన్ సముద్రాల రంగరామానుజాచార్యులు. వీరి ఇంటిపేరు 'సముద్రాల' వారు. నిజంగానే జ్ఞానం, అనుష్ఠానం, పరిశోధన, నిశిత పరిశీలన అనే గుణాల సముద్రం వీరు. ప్రాచీన పరంపరను తాము అగస్త్య మహర్షిలా ఆపోశన పట్టి న్యాయ, వేదాంత, మీమాంస, సాహిత్యాది శాస్త్రాలలోని రహస్యాలను వందల కొలది గ్రంథాల రూపంలో మనకందిస్తున్న ఆధునిక మహర్షులు వీరు. ద్రావిడ – సంస్కృత వేదాంతాలలో ఇంతటి ప్రామాణికమైన జ్ఞానం గలవారు మన మధ్య ఉండడం మన భాగ్యం!

తెలుగు రాష్ట్రంలోని గుంటూరుకు చెందిన పెద్దవరం అగ్రహారంలో ఆగస్టు ఐదు, 1949 నాడు శ్రీమాన్ లక్ష్మణాచార్యులకు, శ్రీమతి వేణుగోపాలమ్మ దంపతులకు జన్మించారు వీరు. వీరి నాన్నగారు ఆ కాలంలోని ఉద్దండ పండితులు. న్యాయ వేదాన్త విద్వాన్, సాహిత్య భూషణ మొదలైన బిరుదులను పొందినవారు. శ్రీ వైష్ణవ సంప్రదాయంలో గొప్ప పేరున్నవారు. వారి నుండి ప్రాథమిక విద్యను సంస్కృతంలో చక్కని జ్ఞానాన్ని పొందిన ఆచార్యుల వారు తరువాత కొవ్వూరు ఎస్.వి.జె.వి సంస్కృత కళాశాలలో 'సాహిత్య విద్యాప్రవీణ'కై సాహిత్య విద్యనభ్యసించారు. ఆ తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి సంస్కృతంలో ఎం.ఏ, పి.హెచ్.డి ఉపాధులను పొందారు. వీరి ప్రధాన విషయం వ్యాకరణం కావడం చేత తరువాతి కాలంలో ఏ శాస్త్రంలో కృషి చేసినా వ్యాకరణ శాస్త్ర ప్రభావం వల్ల ఆయా శాస్త్రం యొక్క లోతులను శోధించగల గొప్ప సామర్థ్యమేర్పడిందని చెప్పవచ్చు. తండ్రిగారి నుండి శ్రీ వైష్ణవ విద్యను గ్రహించినా వీరి విద్యా గురువులు మహామహోపాధ్యాయ శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యుల వారు వీరికి విశిష్టాద్వైత వేదాన్తాన్ని బోధించారు. శ్రీమాన్ జె.పి. వెంకటాచార్య స్వామి వారు వీరికి ద్రావిడ ప్రబంధాలను బోధించారు. ఈ విధంగా ఉదాత్తమైన వంశంలో జన్మించి, అత్యంత ప్రామాణికులైన ఆచార్యుల నుండి ఆయా శాస్త్రాలనధికరించిన వారు శ్రీమాన్ ఆచార్యుల వారు.

గుంటూరు జిల్లా ధూళిపూడిలో ప్రాథమిక విద్యను, ఎస్.వి. ప్రాచ్య కళాశాల (తిరుపతి)లో తెలుగు విద్వాన్, కొవ్వూరు సంస్కృత కళాశాలలో సాహిత్య విద్యాప్రవీణ, ఆంధ్ర విశ్వవిద్యాలయం (విశాఖ) నుండి వ్యాకరణ శాస్త్రంలో ఎం.ఏ, పిహెచ్.డి. ఉపాధులను పొందిన మహామహోపాధ్యాయులు వీరు. వీరి సంశోధన విషయం **'కావ్య ప్రకాశ వ్యాఖ్యల విశేషానుచిన్తన'**మన్నది. ఈ విధంగా 1972 వరకు విద్యార్జన చేసి 1973వ సంవత్సరంలో కొవ్వూరు సంస్కృత కళాశాలలోనే సంస్కృత ఉపన్యాసకులుగా ప్రవేశించి 2007వ సంవత్సరం వరకు గొప్ప సేవనందించారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్‌గా 2007లో పదవీ విరమణ పొందారు. 2008వ సంవత్సరంలో తిరుపతి లోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం లో **'గ్రంథ ప్రకాశన పరియోజన'** అధికారిగా విశిష్ట సేవలనందించి ఆ తరువాత శ్రీశ్రీశ్రీ చినజీయర్ స్వామివారి ఆశ్రమానికి చెందిన 'జీవా' (జీయర్ – ఇంటెగ్రేటెడ్ – వేదిక్ – అకాడమీ) అనే సంస్థ యొక్క వైదిక సంశోధన ప్రకాశన విభాగం యొక్క నిర్దేశకులుగా అనితర సాధ్యమైన కృషిని సలిపి దుర్లభమైన గ్రంథాలనెన్నింటినో ప్రచురించారు.

ప్రస్తుతం సుమారు 75 ఏళ్ళ వయసులో కూడా స్వామివారు నిరంతర తపస్సు కొనసాగిస్తూ ఉభయ వేదాంత శాస్త్రాలలో, న్యాయ – మీమాంస – సాహిత్యాది శాస్త్రాలలో వేల సంవత్సరాలుగా నిక్షిప్తమైన ఎన్నో అమూల్యమైన విషయాలను గ్రంథ రూపంలో మనకందిస్తున్నారు.

**బిరుదులు – పురస్కారాలు :**

వీరి అద్భుతమైన పాండిత్యానికి, నిశితమైన పరిశోధనా దృష్టికి, నిరంతర సాహిత్య కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం ద్వారా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన **'రాష్ట్రపతి'** పురస్కారం లభించడం తెలుగువారికి గర్వకారణం. అలాగే కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం వారు **'మహామహోపాధ్యాయ'** అనే బిరుదుతో వీరిని సత్కరించి తమ గౌరవాన్ని పెంపొందించుకున్నారు. అదే క్రమంలో శ్రీరంగం ఆండవన్ స్వామివారి నుండి **'శాస్త్ర రత్నాకర'** అనే బిరుదు, తిరుమల తిరుపతి దేవస్థానం నుండి **'శాస్త్ర విద్వన్మణి'** అనే బిరుదు, మహారాష్ట్రలోని కాళిదాస సంస్కృత విశ్వవిద్యాలయం నుండి **'శాస్త్ర భాస్కర'** అనే బిరుదు, శ్రీశ్రీశ్రీ రామచంద్ర జీయర్‌స్వామి నుండి **'ఉభయ వేదాన్త – వాచస్పతి'** అనే బిరుదు వీరు ఎంతటి గొప్ప పండితులో మనకు తెలియజేస్తాయి.

ఇవేకాక శ్రీభాష్యం అప్పలాచార్య స్మారక పురస్కారం, శ్రీ వేంకటాచార్య స్మారక పురస్కారం, శ్రీ గోపాల దేశిక పురస్కారం, కవిరత్న స్మారక పురస్కారం మొదలైనవి వీరి పురస్కారాల పంక్తిలో విశేషంగా చెప్పుకోదగ్గవి. ఉభయ వేదాన్త ప్రచారంలో భాగంగా వీరు భారతదేశంలోనే గాక, అమెరికా, కెనడా మొదలైన ఇతర దేశాలలో కూడా శ్రీ జీయర్ స్వామి వారితో కలిసి పలుమార్లు పర్యటించారు.

**ప్రచురించిన అద్భుత గ్రంథాలు :**

శ్రీమాన్ సముద్రాల వారు ప్రచురించిన అపురూప గ్రంథాలు అనేకం. వాటిలో ముఖ్యంగా చెప్పుకోవలసినవికొన్ని ఉన్నాయి.

**1. బాదరాయణ – బ్రహ్మసూత్రాలు :**

శంకర భగవత్పాద భాష్యం, భామతి వ్యాఖ్య, భాస్కర భాష్యం, శ్రీ భగవద్ రామానుజుల శ్రీభాష్యం, దాని యొక్క శ్రుతప్రకాశిక అనే వ్యాఖ్య, మధ్వభాష్యం, దానిపై సూత్రార్థ మణిమంజరీ వ్యాఖ్య, శ్రీ గోవింద భాష్యం, ఆనందతీర్థుల అనుభాష్యం దానిపై న్యాయసుధ వ్యాఖ్య, శ్రీ వల్లభాచార్యుల అణుభాష్యం, శ్రీ నింబార్కుల వేదాన్త పారిజాత సౌరభం, శ్రీ కేశవ కాశ్మీరులు రచించిన శ్రీ వేదాన్త కౌస్తుభ ప్రభ – అనే పదమూడు భాష్యాది గ్రంథాల సంకలనం. ఇన్ని ఉద్గ్రంథాలను ఒక దగ్గర చేర్చి వేదాన్త శాస్త్ర విద్యార్థులకు, అధ్యాపకులకు, పరిశోధకులకు గొప్ప ఉపకారం చేసినవారు మన ఆచార్యులు.

**2. భగవద్రామానుజుల శ్రీ భాష్యం :**

భగవద్రామానుజులు బ్రహ్మసూత్రాల రహస్యార్థాన్ని వివరిస్తూ రచించిన శ్రీ భాష్యమనే భాష్య గ్రంథం వేదాన్త సంప్రదాయంలో విలక్షణమైనది, విశిష్ట స్థానం గలది. దీనిని తెలుగు అనువాదంతో ఆచార్యుల వారు ప్రచురించారు. కేవలం శ్రీ భాష్యమే కాక, శ్రీమాన్ శ్రీనివాసాచార్యులు రచించిన 'రత్నావళి' అనే శ్లోకాలను ఇందులో జోడించారు. అలాగే, చాలా ముఖ్యమైన **'వేదాన్త సారము, వేదాన్త దీపము'** అనే వ్యాఖ్యలను కూడా ఇందులో ఇవ్వడం, వాటి భావాన్ని సరళంగా వివరించడం వల్ల కూడా ఈ గ్రంథం యొక్క విలువ చాలా పెరిగిందనడం అతిశయోక్తి కాదు. చతుస్సూత్రి వరకు ఈ గ్రంథం ముద్రించబడింది. విశిష్టాద్వైత వేదాంతులకు కరదీపిక వంటి గ్రంథమిది!

**3. భగద్రామానుజుల వేదార్థ సంగ్రహం :**

తిరుపతి శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో ఉపన్యాస రూపంలో భగవద్రామానుజులు వెలువరించినది **'వేదార్థ సంగ్రహ'**మనే గ్రంథం. భగదద్రామానుజుల దర్శనానికి సారభూతమైన గ్రంథమని దీనిని పెద్దలు కొనియాడతారు. ఈ గ్రంథానికి ఆంధ్రానువాదమే కాక, విస్తృత వివేచనతో కూడిన **'యతి హృదయ ప్రకాశిక'** అనే తెలుగు వ్యాఖ్యానాన్ని కూడా అందించారు ఆచార్యుల వారు. ఈ వివరణలో మనకు శ్రీ భగవద్రామానుజుల ఆశయమే కాకుండా, భాస్కరాచార్య, శంకరాచార్య, యాదవప్రకాశ – మొదలైన ప్రాచీన ఆచార్యుల అభిప్రాయాలు కూడా సరళ భాషలో లభిస్తాయి.

**4. కౌషీతకీ బ్రాహ్మణ – ఉపనిషత్ :**

ఋగ్వేదానికి చెందిన సాంఖ్యాయన ఆరణ్యానికి చెందిన నాలుగు అధ్యాయాలలో మూడు నుండి ఆరవ అధ్యాయం వరకు కౌషీతకి అనే ఉపనిషత్తు. కుషీతకుడనే ఋషి కుమారుడైన కౌషీతకి అనే ఋషి దర్శించిన విద్యలు ఈ ఉపనిషత్తులో వివరించబడ్డాయి. పర్యంక విద్య, ప్రాణవిద్య, ప్రతర్దన విద్య, అర్చిరాది విద్య, బాలాకి విద్య మొదలైన విద్యలు ఇందులో ఉన్నాయి. ఈ ఉపనిషత్తుని తెలుగులో అనువదిస్తున్నా కూడా, ఆచార్యుల వారు కేవలం 'ముక్కస్య ముక్కార్థః' అని సంస్కృత పదాలకు 'డుమువులు' చేర్చి తెలుగు అనువాదమని అనిపించుకోకుండా, తమదైన అద్భుత రీతిలో ఎంతో విలువైన వివరణలను జోడించారు.

శ్రీవైష్ణవ సంప్రదాయంలో అత్యంత ప్రముఖంగా గ్రహింపబడిన అర్చిరాది విద్యను వివరించే క్రమంలో శ్రీశంకరానందయతి, ఉపనిషద్ బ్రహ్మయోగి, విష్ణు వేదయతి, శ్రీరంగ రామానుజ మొదలైన వ్యాఖ్యాతల యొక్క వ్యాఖ్యానాల నుండి అవసరమైన అంశాలను తెలియజేస్తూ ఆయా రహస్యాలను ఆచార్యుల వారు వివరించారు. ఇక్కడ ఆచార్యుల వారి వ్యాకరణ శాస్త్ర ప్రతిభను మనం గమనించ వచ్చు. యష్టిహా, అర, విరజానది, సారజ్యం, ఐరమ్మదీయ, అంబకం, అంబా, ప్రజ్ఞ మొదలైన శబ్దాల వివేచన వీరి సూక్ష్మప్రజ్ఞకు అద్దం పడుతుంది.

ఇది కేవలం అనువాదం కాదు. ఎదురుగా కూర్చుని ఉన్న శ్రద్ధాళువైన శిష్యునికి చాలా జాగ్రత్తగా గురువుగారు వేదాన్త రహస్యం ద్వారా జీవన రహస్యాన్ని ఉపదేశిస్తున్నట్లుంటుంది. ఈ గ్రంథంలో ఆచార్యుల వారు బ్రహ్మసూత్ర, భగవద్గీత, ఛాందోగ్యోపనిషత్తు వంటి గ్రంథాల

నుండే కాక అభిజాన శాకుంతలం వంటి అలంకార శాస్త్ర, సాహిత్య శాస్త్ర గ్రంథాల నుండి కూడా అవసరమైన భాగాలను ఎత్తి చూపి, పాఠకుల మనస్సులోకి ఆయా విషయం హత్తుకునేట్లు చేశారు. ఇది వారి విశ్వరూపం!

ఈ గ్రంథంలో ఆచార్యుల వారి నిశిత పరిశోధనా దృష్టి స్పష్టంగా కనిపిస్తుంది. ఏ వ్యాఖ్యాత ఏ శబ్దాన్ని ఎలా వ్యాఖ్యానించాడో చూపిస్తూ ఏ వ్యాఖ్య మనకు ఉపయోగపడుతుందో చూపడం ఆచార్యుల వారి గొప్ప సూక్ష్మేక్షికకు నిదర్శనం.

ఇవేకాక వేదాన్త కారికావళి, సుబాలోపనిషత్, శరణాగతి గద్య, వైకుంఠ గద్య, వైకుంఠనాథస్తవ ఖండకావ్యం, ప్రణవ మంజూష, శ్రీకృష్ణతత్త్వ మధురిమ, నీలమాధవమ్, ప్రీతిరసప్రప మొదలైన అరవై – డెబ్బయి గ్రంథాలను రచించారు. అలాగే కొన్ని తెలుగు ప్రబంధాలను సంస్కృతంలోకి అనువదించి ప్రామాణికమైన అనువాదము ఎలా ఉండాలో నేర్పారు.

**గొప్ప పరిశోధనా దృష్టి :**

మహామహోపాధ్యాయ శ్రీమాన్ సముద్రాల వారిది అసామాన్యమైన పరిశోధనా దృష్టి అని భారతదేశంలోని ప్రముఖ సంస్కృత పండితులందరూ ముక్తకంఠంతో ప్రశంసించడం తెలుగువారిగా మనకు గర్వకారణం. సాధారణ ప్రజ్ఞ గలవారికి తోచని అంశాలను వారు తమ గ్రంథాలలో తరచుగా చర్చించి వాటి విలువను ఎత్తి చూపిస్తారు.

2011లో తిరుపతి కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం నుండి ప్రచురించిన వారి **'కావ్యప్రకాశ – హృదయప్రకాశ'**మనే గ్రంథాన్నే చూస్తే, అందులో అలంకార శాస్త్రంలో మూర్ధన్యులైన మమ్మటాచార్యుల కావ్యప్రకాశమనే గ్రంథాన్ని వివిధ వ్యాఖ్యానాల దృష్టిలో వివేచించడాన్ని గమించవచ్చు. అలంకార శాస్త్ర సంప్రదాయంలో మమ్మటాచార్యులు తన కంటే ప్రాచీనులైన వామన – రుద్రట – ఉద్భట మొదలైన ఆచార్యుల అభిప్రాయాలను ప్రమాణంగా గ్రహించినా కొన్ని చోట్ల వారి మతాలను ఖండించి తన స్వతంత్రతను నిర్భయంగా ప్రదర్శించడాన్ని మనం గమనించాలి. కావ్య ప్రకాశాన్ని అర్థం చేసుకోకుండా ధ్వని తత్త్వాన్ని అర్థం చేసుకోలేమని పెద్దలంటారు. శబ్దశక్తి మూలధ్వనిని వివరిస్తూ ఆనందవర్ధనుడు చెప్పిన దానిని విశదీకరిస్తూ అభినవ గుప్తుడు 'కేచిత్' అని 'అన్యే' అని కొన్ని వాదాలను చూపగా వాటిలో నిజానికి ఏది ఆనందవర్ధనునికి సమ్మతమో తెలియడం కష్టం. దానితో వ్యాఖ్యాతలు పలు రకాలుగా వ్యాఖ్యానించగా, మమ్మటుడు మాత్రమే, **'అలాంటి చోట ప్రకరణ సిద్ధమైన అర్థం, దానితో సహ ఉపమ అనే రెండూ వ్యంజనా వ్యాపార సిద్ధములే'**నని వివరించడం ఆయన సూక్ష్మ ప్రజ్ఞకు తార్కాణమని ఆచార్యుల వారు వివరించారు.

కావ్యప్రకాశ గ్రంథానికి వందల కొలది వ్యాఖ్యానాలు ఉంటాయంటారు. వాటిలో కొన్ని అతి ప్రాచీనమైనవి, కొన్ని అతి నవీనమైనవి. సర్వతంత్ర స్వతంత్ర వాచస్పతి మిశ్ర రచించినట్లు కూడా ప్రసిద్ధి ఉంది. ఇలాంటి వ్యాఖ్యలన్నింటిలో స్వతంత్ర వివేచనను చూపించే వ్యాఖ్యలు కొన్నే! వాటిలో, మధుసూదన వివృతి, హైమావతీ వ్యాఖ్య అనే వాటిని పరిశీలించి ఆచార్యుల వారు ఈ గ్రంథాన్ని రచించారు. శ్రీవత్సలాంఛనుడనే ఆచార్యుని సారబోధిని అనే వ్యాఖ్య కూడా ఎంత గొప్పదో, రస వ్యాఖ్యాన విషయంలో ఈయన విశ్లేషణ ఎంతో సారగర్భితమో ఆచార్యులు చక్కగా వివరించారు. ఇలా ఎన్నో వ్యాఖ్యానాలను తరచి చూసి వ్రాసిన ఈ గ్రంథం ఈ కాలంలోని అలంకార శాస్త్ర అధ్యాపకులకు చాలా ఉపయోగపడే అపురూప గ్రంథం! గ్రంథం చివరలో కావ్యప్రకాశ గ్రంథం యొక్క ప్రసిద్ధ అప్రసిద్ధ వ్యాఖ్యాతల వివరాలు ఇవ్వడంతో ఈ గ్రంథం విలువ ఇంకా పెరిగిందని చెప్పవచ్చు.

**ప్రీతిరసప్రప :**

ఆచార్యుల వారి అగాధ పాండిత్యం, పరిశోధన అంతా రంగరించుకుని పండితుల ముందుకొచ్చిన ఒక గొప్ప ఆవిష్కారం 'ప్రీతిరసప్రప' అనే పేరు గల దివ్యరస శాస్త్రం.

శృంగారాది రసాల వివేచన ప్రాచీన కాలం నుండి శాస్త్ర గ్రంథాలలో మనకు లభిస్తుంది. ఏది రసమని? రస స్వరూపాన్ని, అలాగే ఎవరికి 'రసానుభవ'మని? రసాశ్రయాన్ని వివేచిస్తూ ఎందరో గ్రంథాలు రచించారు. రస సంఖ్య విషయంలో కూడా మతభేదం ఉండడంతో దానికి సంబంధించిన గ్రంథాలు కూడ వెలుగులోకి వచ్చాయి. అలా, శృంగారాది ఎనిమిది రసాలని కొందరు, శాంత రసం కలిపి తొమ్మిది రసాలని కొందరు తమ తమ వాదాలను గ్రంథ రూపంలో సమాజం ముందుంచారు. అలాగే, భక్తి కూడా రసమని, వాత్సల్యమనేది రసమని, ఉజ్జ్వలమనేది రసమని ఆయా కాలాలలో వాదాలు తలెత్తి అలంకార – రస శాస్త్రంలో తమ తమ స్థానాన్ని పదిలపరచుకున్నాయి.

ఎందరో ఋషులు, సంత – మహాత్ములు అనుభవించిన 'భక్తి' రసమని ఒక సిద్ధాంతముంది. పరమాత్మ పట్ల భక్తుని మనసులో ఏర్పడ్డ పరమప్రేమ అనేదే భక్తి అని నారద మహర్షి సూత్రం. దీని ప్రభావంతో తరువాతి కాలంలో భక్తి రసాయనం, ఉజ్జ్వల నీలమణి మొదలైన గ్రంథాలు భక్తి తత్త్వాన్ని చాలా సూక్ష్మంగా వివేచించి మనకందించాయి.

ఈ భక్తి అనే ప్రీతి శృంగార ప్రధానమైతే 'ప్రీతిరస'మవుతుందని ఆచార్యుల వారు సిద్ధాంతీకరిస్తూ, ప్రాచీన మహాత్ముల సాహిత్యంలో ముఖ్యంగా ద్రావిడ వాఙ్మయంలో ఈ 'ప్రీతి' అనే పరమదివ్య శృంగారమనే రసం ఎలా కనిపిస్తుందో సోదాహరణంగా చూపించారు. రస సంప్రదాయంలో ఇది కొత్త ఆవిష్కారం!

మహారాష్ట్రలో జ్ఞానేశ్వర మహారాజనే ఒక మహాత్ముని వాఙ్మయంలో 'మధుర'రూపంగా ఈ దివ్య శృంగారమనేది ఎలా వ్యక్తమవుతుందో గులాబ్‌రావు మహారాజు మొదలైన వారు విశదంగా వివరించారు. విశిష్టాద్వైత, శుద్ధాద్వైతాది వేదాన్త సంప్రదాయాలలో ఈ ప్రీతి అనేది 'మాధుర్య భావ' రూపంలో ఉండినదని కొందరి వివరణ. 'ప్రీతిరసప్రప' అనే గ్రంథం ముఖ్యంగా పరమదివ్య శృంగారమే ప్రీతి అనే రసమని, అదే మన దేశంలోని 'సంత – మహాత్ముల'కు సమ్మతమైనదని సప్రమాణంగా నిరూపించడానికి రచించిన గ్రంథం! సాహిత్య శాస్త్ర – వేదాన్త శాస్త్రాల మధ్య చక్కగా సమన్వయం చూసి 'రస'మనే కావ్యాత్మ స్వరూపాన్ని వివరిస్తూ 'ప్రీతి' అనే రసాన్ని సహృదయలోకానికి అందజేయడం దీని లక్ష్యం.

ఈ గ్రంథం ఆచార్యుల వారి సూక్ష్మ వివేచనా శక్తికి నిలువుటద్దం! మొత్తం ఎనిమిది ప్రకరణాల ఈ శాస్త్ర గ్రంథంలో క్రమంగా పూర్వరంగం, దర్శనాలలో రసానుభవ ప్రక్రియ, ప్రీతి రసభూమిక, శృంగార స్వరూపం, ద్రవిడ వాఙ్మయంలో రసశాస్త్రం, ద్రవిడ వేదాన్త సంప్రదాయంలో ప్రీతిరస స్వరూపం, ప్రీతిరసం యొక్క లక్ష్య స్వరూపం, ఇతర రసాల అంతర్భావం ప్రీతిరసంలోని వివేచన, ఇతర గ్రంథాలతో సమన్వయం – అనే విషయాలు చాలా సూక్ష్మంగా వివేచించడం గమనించవచ్చు. తిరువాయ్ మొఝి, తిరుప్పావై మొదలైన దివ్య ప్రబంధాల ఆధారంగా ప్రీతి రసాన్ని వివేచించి సిద్ధాంతీకరించడం శాస్త్ర రత్నాకరులైన ఆచార్యుల వారికి మాత్రమే సంభవం! ఇతరులకు అసంభవం!

**ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞానం :**

సుమారొక 250 పుటలు గల గ్రంథం 'ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞాన' మనే గ్రంథం. వేదాన్త శాస్త్రంలో ప్రసిద్ధమైన **'బ్రహ్మ అనేది జగత్తుకు కారణము'** అనే సిద్ధాంతాన్ని ఆయా వేదాన్త సంప్రదాయాల దృష్టిలో వివేచించి భగవద్రామానుజుల విశిష్టాద్వైత వేదాన్తం ప్రకారం మాత్రమే ఈ సిద్ధాంతం సరిగ్గా కుదురుతుందని ఆచార్యుల వారు వివరిస్తారు.

ఈ గ్రంథం వేదాన్తం చదివే వారికి, చెప్పే వారికి నిత్య పారాయణలో ఉండదగింది. ఇందులో సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక, మీమాంసాది శాస్త్రాల సారాన్ని గ్రహించి వేదాంతాన్ని విశదీకరిస్తూ 'బ్రహ్మ' ఎలా జగత్కారణమవుతుందో ప్రతిపాదించారు. జగత్తు మిథ్యే అయితే **"ఏక విజ్ఞానేన సర్వం విజ్ఞాతం భవతి"** అన్న ఉపనిషత్తు వాక్యం సమన్వయించడం కుదరదు. బ్రహ్మ అన్నది మూల కారణం, జగత్తు దాని చేత ఏర్పడిన కార్యం – ఈ విధంగా కార్య కారణాలైన జగత్తు – బ్రహ్మ అనే వాటికి **'శరీరం – శరీరి'** లేదా **'ప్రకారం – ప్రకారి'** అనే సంబంధమున్నదని అందులో చాలా చక్కగా వివరించారు మన ఆచార్యుల వారు. ఇలా ఎన్నో పరిశోధనాత్మక గ్రంథాలను వెలువరించి సంస్కృత జగత్తుకు అందునా తెలుగు రాష్ట్రాలకు విశిష్టంగా ఉపయోగపడే విషయాలను సులువైన భాషలో తెలియజేసిన ఆచార్యుల వారికి మనమెంతో ఋణపడి ఉన్నాం.

విశిష్టాద్వైత వేదాన్తమే వారి జీవనం! కానీ, శాంకర మతం పట్ల అనాదరం లేదు. ముందు చెప్పిన గ్రంథంలో 178వ పుటలో వారు **'వైదిక బ్రహ్మ తత్త్వాన్ని సర్వ ప్రథమంగా ఉపస్థాపితం చేసిన శాంకర మతం సర్వోపాదేయమేననడం సత్యం, సత్యం, పునఃసత్యం'** అని పేర్కొనడం వారి హృదయ వైశాల్యానికి నిదర్శనం. కొన్ని చోట్ల బ్రహ్మసూత్ర వ్యాఖ్యానంలో శాంకర రామానుజ – భాష్యాలలో అర్థసంకోచమనేది సమానమేనైనా ఇతర శ్రుతులు విశిష్టాద్వైతానికే అనుకూలమని భగవద్రామానుజుల అభిప్రాయమని చెబుతూ నిష్పక్షపాత దృష్టిని చూపిస్తారు గురువుగారు.

**"ఏ ఒక తత్త్వాన్ని తెలియడంతో అంతా తెలిసిపోతుందో అది బ్రహ్మ"** అని ఛాందోగ్యోపనిషత్తు ప్రతిపాదించింది. ఒక దానిని తెలిస్తే తక్కినదంతా తెలియడమెలా సంభవం? అన్న దానికి సమాధానంగా **'మట్టి అనే దానిని తెలిస్తే దాని వల్ల ఏర్పడే కుండ మొదలైనవన్నీ దాని కార్యాలు అని తెలుస్తాయి'** అని అనేకమైన ఉదాహరణలను చూపించారు. బ్రహ్మ కారణం, జగత్తు కార్యం – అని మనం తెలియజేయాలి.

శాంకర వేదాన్తంలో ఈ జగత్తు మిథ్య అని చెప్పబడింది. అప్పుడు బ్రహ్మను తెలిస్తే తెలియడానికి వేరొకటేదీ లేక, ఈ ఉపనిషద్ వాక్యం వ్యర్థమవుతుందని తెలియాలి. మాధ్వమతంలో కూడ ఈ వాక్యానికి సమన్వయం కుదరదు. కాబట్టి, కేవలం విశిష్టాద్వైత సంమతమైన 'తత్త్వత్రయ' వాదాన్ని ఆశ్రయిస్తే తప్ప ఈ ఉపనిషద్వాక్యానికి సమన్వయం కుదరదు అని ఆచార్యుల వారు చాలా విశదంగా ఈ గ్రంథంలో చూపారు.

మూర్తీభూత శ్రీవైష్ణవులు, పుంభావ సరస్వతులు, జ్ఞాన మూర్తులు, నిరంతర సాహితీ కృషీవలులు, ఋషి తుల్యులు అయిన శ్రీమాన్ సముద్రాల వేంకట రంగరామానుజాచార్యుల వారు ప్రాచీన సంప్రదాయానికి ఆధునిక యుగానికి మధ్య పెద్ద వంతెన వంటి మహాత్ములు. వీరి నుండి ఇంకా మనకు జ్ఞానాన్ని కలిగించే వాఙ్మయం వెలువడాలని ఆశిద్దాం!



# శేషేంద్ర శర్మ వ్యాస సౌరభం


**డా. జొన్నలగడ్డ భారతి,** అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆలేరు. ఫోన్ : 891 999 6936

**"యా సృష్టి స్రష్టురాద్యా వహతి విధిహుతం యా హవిర్యాచహోత్రీ
యేద్వేకాలం విధత్తః శ్రుతి విషయ గణా యా స్థితా వ్యాప్యవిశ్వం
యా మాహుః సర్వభూతప్రకృతరితి, యయా ప్రాణినః ప్రాణవంతః
ప్రత్యక్ష్యాభిః ప్రపన్నస్తనుభిరవతు వస్తాభి రష్టాభి రీశః"**

ఈ శ్లోకం జగత్ప్రసిద్ధమైన కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంలోని నాందీ శ్లోకం. ఇది ఈశ్వర స్తుతిగా సర్వత్రా భావించబడుతుండగా దానిలో ఉన్న మంత్ర శాస్త్రార్థ ప్రతీతిని వివరిస్తూ **'శాకుంతలం నాందీశ్లోకము దేవీస్తోత్రమే'** అనే వ్యాసం రాశారు గుంటూరు శేషేంద్ర శర్మ. ఈ వ్యాసంలో పై శ్లోకం త్రివిధ అన్వయాలకు అనుకూలమైన నిర్మాణం కలిగినదిగా సవివరంగా నిరూపించారు. 1. పరాశక్తి సర్వకర్త్రి, 2. పరాశక్తి శివుని తనువు, 3. శివశక్తులు అభిన్నములు. **"ఈ శ్లోక రూపము అర్ధనారీశ్వరీ దైవత్వము. శ్లోక హృదయము నిగమాగమ సారమై సచ్చిదానంద స్వరూపమైన శివశక్త్యభేద సిద్ధాంతం. ఈ శ్లోకంలో శబ్దములు యాదృచ్ఛికంగా దొర్లినవి కావు. భావము ఏదో ఒక 'మానుషానంద' దృష్టితో గైకొన్నది కాదు భావము బ్రహ్మానంద బంధురము. భాష శ్రౌతలక్షణ సంపన్నము".** ఇది శ్లోకం ఆధారంగా శేషేంద్ర చేసిన ప్రతిపాదన. ఈ వ్యాసం 1964 ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం. 1964 అంటే ఆనాటికి శేషేంద్ర శర్మ గారి వయసు 37. ఆ వయసుకే సంస్కృత భాషా సాహిత్యాల లోతైన అధ్యయనం, మంత్ర శాస్త్రాదులు, ఆధ్యాత్మికాది అనేక విషయాలను అన్వయం చేసి కొత్త అర్థాన్ని ప్రతిపాదించి, నిరూపించిన విధానం వెరసి శేషేంద్ర ధిషణా సామర్థ్యానికి, నైపుణ్యానికి ఈ వ్యాసం మచ్చుతునక మాత్రమే. ఈ వ్యాసంతో పాటు మొత్తం 24 వ్యాసాలు కలిగిన తులనాత్మక వ్యాససంపుటి 'కాలరేఖ'. ఇది 1990లో మొదటిముద్రణ పొందింది. 1994లో దీనికి కేంద్ర సాహిత్య పురస్కారం లభించింది.

విమర్శకునిగా, విశ్లేషకునిగా శేషేంద్ర యొక్క విభిన్నమైన దృష్టి, విలక్షణ దృక్పథం, విశిష్టమైన చింతన విజ్ఞుల అనుభవంలోకి అందించిన సంపుటి కాలరేఖ. ఇది కాకుండా పూర్వాంధ్ర కవులపై వెలువరించిన 8 వ్యాసాల సంకలనం **'సాహిత్య కౌముది',** 14 వైజ్ఞానిక, సాహిత్య వ్యాసాల మిశ్ర సంకలనం **'నరుడు నక్షత్రాలు'** అనేవి శేషేంద్రుని వ్యాస సౌరభాన్ని గుబాళింప చేస్తూ పునర్ముద్రణ పొందుతున్న వ్యాస సంకలనాలు. వీటిద్వారా ప్రకటింపబడిన శేషేంద్ర విజ్ఞాన ధారను పాఠకుల ధారణలోకి చేర్చే ప్రయత్నమే సమీక్షారూపమైన ఈ వ్యాసం.

**"అంతులేని విద్వత్తూ, అంటరాని విద్యుత్తూ"** అనే శీర్షికతో కాలరేఖ సంపుటికి ముందుమాట రాసిన డా. అద్దంకి శ్రీనివాస్ గారు సాధారణంగా కవిత్వానికి వ్యాఖ్యానం కావాలి, విమర్శ వ్యాసాలకు ఆ అవసరం ఉండదు. కానీ శేషేంద్ర విషయంలో ఇది వ్యతిరిక్తం అంటారు. ఈ సంకలనంలో 8 వ్యాసాలు వాల్మీకి, వ్యాస, కాళిదాస, మయూరాది సంస్కృత కవుల హృదయాలను ఆవిష్కరించాయి. అలాగే వాల్మీకి కవిగా వ్యాస, కాళిదాసాదులలో ఎలా ప్రతిబింబించాడో శేషేంద్ర ఈ వ్యాసాలలో సోదాహరణంగా నిరూపించారు.




ఆరు వ్యాసాలు రాయప్రోలు గురజాడ, పానుగంటి వంటి తెలుగు రచయితల ధోరణికి పరిచయ వ్యాసాలు. ఐదు వ్యాసాలు గజల్ ప్రక్రియ గురించిన వ్యాసాలు. గజల్ ప్రక్రియ పట్ల శేషేంద్రకున్న అభిమానం ఆ వ్యాసాల శీర్షికల ద్వారానే మనకు అర్థమవుతుంది. **'గజల్ ఒక అయస్కాంత విద్య' 'గజల్ ఒక అగ్ని', 'గజల్ ఒక సంస్కృతి' 'గజల్ అందము ఛందము'** ఇవి కొన్ని వ్యాస శీర్షికలు. **'ప్రాచీన ప్రపంచంలో గజల్'** అనే వ్యాసంలో ప్రధానంగా వాల్మీకి రామాయణంలో ఉన్నన్ని గజళ్ళు ఇంకెదులోనూ లేవు అంటారు. వాల్మీకి అనుష్టుప్ నేరుగా ఒక ఉర్దూషేర్ అంటూ పోలికలు చూపుతూ ఉదహరించారు. రెండింటిలోనూ దావాదలీల్ టెక్నిక్ ఉందనీ తెలుగులో వేమన రాసిన ఆటవెలది పద్యం మాత్రమే ఈ టెక్నిక్‌ను నిలుపుకున్నదనీ శేషేంద్ర ప్రకటించారు. దావాదలీల్ టెక్నిక్ గురించిన అవగాహన లేనివారికి ఈ వ్యాసం డా. అద్దంకి శ్రీనివాస్ గారు చెప్పినట్లు అంటరాని విద్యుత్తులాంటిదే.

భారతీయ ప్రపంచ సాహిత్యాల పట్ల శేషేంద్రకున్న సునిశితమైన లోతైన అవగాహనకు ఆయన విద్వత్తుకు అణువంత ఉదాహరణ మాత్రమే ఈ వ్యాస సంపుటి అని పాఠకులు భావిస్తే అది అతిశయోక్తి కాదు. భావోల్బణం ఆపుకోలేనపుడే రాసే, భావోద్వేగ శాంతి కోసం హృదయం ఖాళీ చేసుకోవాలని భావించే రచయితగా శేషేంద్ర వ్యాసాలలోని ప్రతి వాక్యమూ లోకవృత్త పరిశీలన నుండి జ్ఞానమధన ఫలితంగా పుట్టినదే.

కవిత్వం ఛందస్సు రక్తసంబంధం కలిగినవి అని ప్రాచ్య పాశ్చాత్య భాషా సాహిత్య ఉషోదయ సంఘటనలు సూచిస్తున్నాయనీ భారతీయ ప్రాచీన కవిత్వమైన వేదోపనిషదితిహాసాదులు ఈనాటికీ నిలిచి ఉ ండటానికి లయబద్ధత కలిగి ఉండటమే కారణం అంటారు శేషేంద్ర. శబ్దం మీద ఛందస్సుతో చెక్కిన రచనలు అంటే లయాన్విత రచనలు నోటినుంచి నోటికి వ్యాపిస్తూ తరతరాలుగా జీవిస్తూ ఒక నాగరికతలో భాగం అయిపోతాయి అనే అభిప్రాయాన్ని సోదాహరణంగా నిరూపించిన వ్యాసం **ఛందస్సు : కవిత్వ ఆయుస్సు.**

**వచన కవిత : ఒక ప్రపంచ పర్యవేక్షణ** అనే వ్యాసం ప్రపంచమంతా కవిత్వరచనకు లయాత్మకతవైపు ప్రయాణంచేస్తే తెలుగులో మాత్రం లయరహిత పొడి వచన కవిత్వంగా పాపులర్ అయిందనే విషయాన్ని చర్చించింది. తెలుగులో వచన కవిత్వాన్ని ఫ్రీ వర్స్ అంటున్నారు. కానీ 'వర్స్ లిబర్' అనే ఫ్రెంచి పదానికి 'ఫ్రీవర్స్' ఇంగ్లీష్ అనువాదం అంటారు శేషేన్.

వర్స్ లిబర్ అంటే పూర్వకాలపు సుప్రతిష్ఠ ఛందస్సులను విడిచిపెట్టి ఏ కవికి ఆ కవే తనకు సందర్భానుసారంగా స్ఫురించిన లయను అనుసరించి కవితారచన చేయడం. ఇక్కడ ముఖ్యం ఏమిటంటే అందులో లయ ఉంటుంది. దాన్ని వర్స్ లేదా పద్యం అంటారు అని చెప్తూ ఫ్రెంచి, ఇంగ్లీషు సాహితీవేత్తల విమర్శకుల అభిప్రాయాన్ని చర్చిస్తారు. అసలు లయ ఎందుకో వివరిస్తూ –

**"కవితకు లయాత్మకత కలిసినపుడు అది ప్రజలచేత పాడబడి దాని ఆయుష్షుదీర్ఘం కావడము, ప్రజాబాహుళ్యంలోకి ప్రవేశించడము, అవగాహనా విజయాలు సాధించటము, అట్లాకాక లయాత్మకత విడనాడిన కవిత పాడబడలేకపోవడమే కాక, ప్రజావళిలోకి పోలేకపోవడం, జ్ఞాపకంగా ఉండకపోవడం, అందుచేత దాని ఆయుష్షు హ్రస్వం కావడం అనేది సుసంభవం కాదా? ఆలోచించాలి"** అంటారు. అంటే లయ ఉన్న కవిత్వం దీర్ఘాయుష్షు కలిగి ఉంటుంది. లేనిది లేదు.

**విప్లవ కవిత్వము : సాహిత్య విమర్శ** అనే వ్యాసం విమర్శనా పద్ధతికి మార్గసూచి వంటిది. అభిప్రాయ ప్రకటనలో శేషేంద్ర ఎంత నిర్మొహమాటంగా ఉంటాడో ఇక్కడ చూడవచ్చు.

**"కావ్యవిమర్శ కావ్యాన్ని ఆస్వాదించడమే గానీ వాదించడం కాదు. కవి మాట్లాడడు. కావ్యమే మాట్లాడుతుంది. ఈ వాదించే లక్షణమున్న వాడు కవి మాట్లాడతాడనే భ్రమతో ఆ అకృత్యానికి పాల్పడతాడు. కావ్యవిమర్శ ఒక సంస్కృతి. ఒక సర్టిఫికేట్ కాదు విమర్శకుడు కావ్యాన్ని ఒక వినీత మనస్కుడై చేరాలి."** కానీ రంధ్రాన్వేషణ కోసం కాకూడదంటారు.

**"కావ్యాలను శృంగార కావ్యాలు, కరుణరస కావ్యాలు, విప్లవ కావ్యాలు అనటం ఇతివృత్తాన్ని బట్టి లేక భావాత్మక సంవేదనను బట్టి మాత్రమే జరగవలసి ఉంటుంది."**

**"విప్లవకవి, ప్రేమకవి అని కవికి కావ్యానికి చెందిన విశేషణాల్ని తగిలించడం అశాస్త్రీయం. కవిని కవి అనడం మాత్రమే సమంజసం. ఎందుకంటే ఒకడు విప్లవమో, ప్రేమో ఏదో ఒక్క అనుభూతినే గడించినవాడు అయిఉండడం అసహజం. విప్లవానికి జీవితం అంకితం అయిన వ్యక్తులకి కూడా తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, సుఖదుఃఖాలు నిండిన నిత్యజీవన అనుభూతులు ఉంటాయి. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా తెలుగుగడ్డ మీద మోనోపలీ మనస్తత్త్వపరులు ఆత్మరక్షణకోసం విప్లవకవులు అని ఒక నామకరణం ముద్రవేసి గుద్దుకుంటున్నారు. ఇది అశాస్త్రీయం"** అని విమర్శించిన శేషేన్ **"విప్లవకవిత్వం స్వానుభూతిచేత లేక సహానుభూతిచేత అయినా పుట్టచ్చు"** అంటారు. మన దేశంలో స్వానుభూతి కవిత్వానికి వ్యాసుడు, సహానుభూతికి వాల్మీకి కర్తలని అభిప్రాయపడ్డారు.

తులనాత్మక సాహిత్యం గురించి రాస్తూ **'కాలదూరాలను జయించడానికి తులనాత్మక సాహిత్యం అమోఘమైన అస్త్రం'** అనీ, **'ఆధునిక ప్రపంచానికి తులనాత్మక సాహిత్యం అనివార్య'**మనీ అభిప్రాయపడతారు. ఏది తులనాత్మక సాహిత్యం అని చర్చిస్తూ **'ఒక భాషలో ఉన్న మూలాన్ని మరొకభాషలో ఉన్న దాని అనువాదంతో పోల్చడం తులనాత్మక సాహిత్యం కాదు'** అంటారు. దేశ కాలాలను అధిగమించి భిన్నభిన్న భాషల ప్రజల సంవేదననుండి పుట్టే కావ్యాభివ్యక్తులు తులనాత్మకంగా పరిశీలించబడినపుడు సాహిత్యానికి ప్రయోజనం అని అభిప్రాయపడతారు. మన ప్రాచీన కావ్యశాస్త్రంలో ఈ తులనాత్మక సాహిత్యం అనే సాహిత్య ప్రక్రియా విశేషం ఒక భాగంగా ఉందనే విషయాన్ని దండి వామనాది ఆలంకారికుల శ్లోకాలను ఉటంకిస్తూ వివరించటాన్ని గమనిస్తే శేషేంద్ర సంస్కృత సృజనాత్మక సాహిత్యంతోపాటుకావ్య, ఆలంకార, వ్యాకరణ శాస్త్రాలను ఎంత లోతుగా అధ్యయనం చేశారో అర్థమవుతుంది.

ఈ కాలరేఖ వ్యాస సంపుటిలో **'అరవింద సావిత్రి'** అనే విస్తృతమైన వ్యాసం ఉంది. అరవిందులు రచించిన సావిత్రి చదవనివాళ్ళు కూడా సావిత్రి కథలోని రహస్యాలను, ప్రతిబింబించిన

భారతీయతను, స్పష్టంగా ఈ వ్యాసంద్వారా గ్రహించగలుగుతారు. ఈ దేశంలో సాహిత్యంలో రవీంద్రులకివ్వబడిన స్థానం నిజానికి అరవిందుడికి ఇవ్వవలసిందని శేషేంద్ర నిష్కర్షగా చెప్తారు. సావిత్రి కథలో ప్రతిఫలించిన ఉపనిషదర్థాలు, యోగ విధానాల గురించి సాధికారికంగా శేషేంద్ర ఈ వ్యాసంలో వివరించారు. 20వ శతాబ్దంలో 'సావిత్రి'లాంటి మహత్తర ఆధ్యాత్మిక కావ్యం మరొకటి లేదని చెప్తూ నిజానికి మార్క్సిజం, అరవింద సావిత్రి రామాయణంలో పరశురామ శ్రీరాముల్లా కనిపిస్తాయంటారు. ఈ పోలిక ఇవ్వడం ద్వారా పరశురాముడు అవతారం చాలించినట్లు మార్క్సిజం అంతరించి సావిత్రిలో ప్రతిపాదింపబడిన సార్వజనీనమైన ఆధ్యాత్మిక దృక్పథం సమాజంలో స్థిరపడుతుందనేది శేషేంద్ర అభిప్రాయంగా అనుకోవచ్చు.


కొందరు తెలుగు రచయితల గురించి శేషేంద్ర ప్రకటించిన అభిప్రాయ వ్యాసాలుకూడా ఈ సంకలనంలో ఉన్నాయి.

పానుగంటివారి గురించి మాట్లాడుతూ **"ఏది మనసులో అనుకుంటాడో అదే వ్రాస్తాడు భర్తృహరి లాగా, వేమనలాగా, రచయితకు జీవితంలోనూ, రచనలోనూ ఈ త్రికరణ శుద్ధి సిద్ధించాలి. ఇదే ముఖ్యంగా పానుగంటివారిలో రచయితలు గ్రహించవలసింది".** రచయితకు ఉండాల్సిన రెండు నేత్రాలు ధైర్యము, నీతి అని చెప్తూ ఆ నేత్రాలు వెదజల్లిన మహోజ్జ్వల కాంతిపుంజం పానుగంటివారి సాక్షి వ్యాసాలు అంటారు.

**గురజాడ గురించి** : మంచిమనిషి లేకపోతే మనం కలలు గనే విప్లవం లేదు. మంచిమనిషి విప్లవమనే మహా నిర్మాణానికి ప్రాథమిక ఇటుక. అలాంటి విలువఅనే మంచిని పెంచడానికి కలాన్ని కాలాన్ని వినియోగించిన అద్వితీయ ప్రతిభాశాలిగా గురజాడని అభిమానిస్తారు శేషేంద్రశర్మ.

**రాయప్రోలు గురించి :** శేషేంద్ర దృష్టిలో రాయప్రోలు శ్రీనాథుడి ఆధునికావతారం. శ్రీనాథుడిలోనూ, రాయప్రోలులోనూ ఉన్న సమానలక్షణం వక్రోక్తి అంటారు ఆయన. రాయప్రోలు వక్రోక్తి అంతా అంతరాత్మ పరీమళం. రాయప్రోలు ఆంధ్ర కవిత్వవిద్యకు ఆద్యుడు అంటారు శేషేంద్ర. దానిని నిరూపించిన విధానం వ్యాస రచయితలకు ఆదర్శప్రాయం.

ప్రాచీన గ్రీకు, భారతీయ నాటకాల గురించి పరిశీలించినా, మయూర, కాళిదాసాది కవుల రచనలు విశ్లేషించినా, ఆధునిక కవిత్వ ధోరణులను వివేచించినా ఆయన అనుభవ విస్తృతి, తీక్ష్ణ పరిశీలన, ఆలంకారిక అభివ్యక్తి పాఠకునికి అడుగడుగునా అవగతమవు తుంటుంది. ఆయనే చెప్పుకున్నట్లు **'అంతర్వితర్కం మాత్రమే పనిచేయగల అంతరంగ సమస్యలనుంచీ, వాగ్వివాదం పనిచేసే ప్రపంచరంగ సమస్యలవరకూ విస్తృతమైన బహుతంత్రీ సమన్విత వాద్యం ఈ సంకలనం'.**






**నరుడు నక్షత్రాలు : "నిరంతర విజ్ఞాన సాగర మథన ఫలితంగాను, దీర్ఘకాల తపః పరిణామంగాను, లోకవృత్త పరిశీలనా సముత్పన్నంగానూ సమకూడిన భావసారానికి అప్పుడప్పుడు జిజ్ఞాసువుల ఆలోచనార్థం అక్షరరూపం ఇస్తూ వచ్చాను"** అంటారు, 'నరుడు–నక్షత్రాలు' వ్యాససంపుటికి ముందుమాటలోశేషేంద్ర. దీర్ఘకాల తపఃపరిణామమే ప్రతిభ, లోకవృత్త పరిశీలనే వ్యుత్పత్తి, నిరంతర విజ్ఞాన సాగర మథనమే అభ్యాసం. ఈ వ్యాస సంపుటిలోని మొదటివ్యాసం పేరే సంపుటానికి కూడా పెట్టబడింది. ఇందులో 14 వ్యాసాలు ఉన్నాయి. ఇందులో నాలుగు, విజ్ఞాన సాహిత్య విషయాలను చర్చించినవి కాగా మిగిలిన పది వ్యాసాలు సాహిత్య సంబంధమైనవి.

నరుడు నక్షత్రాలు అనే మొదటివ్యాసంలో ఐన్‌స్టీన్‌ని విశ్వపౌరుడు అనీ, కపిల, కణాద శంకరాది పరంపరలోని వాడనీ తీర్మానించారు. అణువంటే ఏమిటో వివరిస్తూ 92 విశిష్టమైన అణువులున్నాయని వివరించారు. రోజూ పడుకునేముందు ఒక గంట అయినా ఆకాశ పఠనం చెయ్యటం ద్వారా అసమాన ఔషధం పొందవచ్చు అంటారు శేషేంద్ర.

విజ్ఞానార్జనకు మానవునికి ఉన్న అవరోధాల గురించి చర్చిస్తూ 1. కోరికలు నియంత్రించక పోవడం 2. స్త్రీ సాంగత్యం అని ప్రాచీనుల అభిప్రాయం అనీ, కానీ ఇది పురుషుల కోణం నుంచి చెప్పిన మాట అనీ విజ్ఞానార్జన పురుషునికి మాత్రమే అవసరమా అని ప్రశ్నించారు. విజ్ఞానార్జనలో స్త్రీ కారణంగా ఏర్పడే భౌతిక అవసరాల కోసం ఎక్కువ కాలం వృథా అవుతుందనే భార్యా బిడ్డలను త్యజించటం కంటే భౌతిక అవసరాలకోసం పురుషుడు మాత్రమే కృషి చెయ్యాల్సిన బాధ్యత లేని సామాజిక వ్యవస్థని సృష్టించుకోవాలి అంటారు.

విజ్ఞానాభివృద్ధికి ఆటంకం స్త్రీ కాదు భౌతిక అవసరాలు తీర్చని సామాజిక వ్యవస్థ ప్రధాన ఆటంకమంటారు శేషేన్.

విజ్ఞానార్జనలో ఉండే అవరోధాలన్నీ తొలగిననాడు **"యస్తు సర్వాణి భూతాని ఆత్మన్యేవాను పశ్యతి"** అనే ఉపనిషత్ వాక్యం అమలు జరుగుతున్న దశ ఏర్పడుతుంది అంటూ సృష్టిలో నుంచి

వచ్చిన మానవుడు తత్త్వమసి అంటూ సృష్టిలో కలిసిపోతాడంతారు. ఈ స్థితికి దశకు చేరడమే విజ్ఞానం అని శేషేన్ స్పష్టంగా ఈ వ్యాసంలో నిరూపించారు.

భూగోళానికి ఒక వైపునుంచి మరొకవైపుకు కేంద్రంగుండా రంధ్రం తవ్వితే ఏమవుతుంది? అసలు తవ్వగలమా? అనే ఊహకు ఆలోచనకు వైజ్ఞానికపరంగా సమాధానాన్ని వెతికే ప్రయత్నం విజ్ఞానంలో ఊహ పాత్ర అనే వ్యాసం. Julesverne రాసిన Journey to the Centre of the Earth నవలలో విషయం వ్యాసగత అంశం ఒకటే అని చెప్పవచ్చు. ఆ నవల 1864లో రాయబడింది. 100 ఏళ్ల తరువాత 1963 లో తెలుగులో ఆ వైజ్ఞానిక అంశం శేషేంద్రుని వ్యాసరూపంగా పాఠకునికి అందింది. విజ్ఞానానికి పునాది ఊహ అనీ కానీ ఆ ఊహ విజ్ఞానంగా రూపుదిద్దుకునే ముందు సరైన గౌరవం పొందట్లేదని ఆయన అభిప్రాయం.

1962లో అమెరికాలో ఒక శాస్త్రజ్ఞుడు రసాయనిక పదార్థాలతో కృత్రిమంగా వైరస్ అనే ప్రాణి సృష్టి చేశాడనే పత్రికావార్తను చదివిన శేషేన్ జీవపరిణామాన్ని గురించిన తన ఊహలను జడపదార్థం పరిణామ ఫలితమే అనే వ్యాసం ద్వారా ప్రకటించారు.

మానవుడు కోతినుంచి వచ్చాడనీ, జీవం నిర్జీవపదార్థం నుంచి వచ్చిందని చెప్పే ఆధునిక విజ్ఞాన పరిధిని దాటి నిర్జీవ పదార్థంలో కూడా ఒక పరిణామముందనే అపూర్వ ఊహను చెప్పడం ఈవ్యాస తాత్పర్యంగా ఆయనే చెప్పుకున్నారు. సాధారణ పాఠకుల కోసం ఆ విషయానికి సంబంధించిన వైజ్ఞానిక వివరాలను కూడా అందిస్తున్నానని చెప్పుకున్నారు.

ఆటమ్, ఎలక్ట్రాన్, ప్రోటాన్ వలయాలు రూపుదిద్దుకునే క్రమం నిర్జీవ ప్రపంచంలో కూడా క్రమపరిణామం ఉందని నిరూపించిన విధానం చాలా గొప్పగా ఉంటుంది. శేషేంద్ర ఒక శాస్త్రవేత్త అనే అభిప్రాయం కలుగుతుంది. అయితే విశ్వవిద్యాలయాల్లో ఉన్నవారికి ఉన్న సౌకర్యాలు లేకపోవటం వలన తనలాంటి వాళ్ళు కాకుండా విశ్వవిద్యాలయాల్లోనివారు ఈ ఊహలను చేపడితే అవి సిద్ధాంతాలుగా మారతాయి అనే ఆశాభావాన్ని వ్యాసాంతంలో వ్యక్తం చేశారు.

**సాహిత్యంలో వైజ్ఞానికచ్ఛాయలు** అనే వ్యాసంలో ప్రపంచ సాహిత్యంలో సాహిత్యానికి విజ్ఞానానికి మధ్య అంతరం నశించి రెండు ఐక్యమైపోతున్నాయి. కానీ సుఖలాలసులైన తెలుగువారికి ఇంతవరకూ సొంతంగా ఊహించే శక్తి రాలేదు. సొంతంగా నడిచే స్థాయి కుదరలేదు. అందుకే 11నుండి 20వ శతాబ్దం దాకా అనువాద సాహిత్యాన్నీ, శబ్ద సౌందర్యాన్నీ సృష్టించగలిగారే కానీ ఒక మహా భారతం లాంటి రచనను సృజించలేకపోయారని శేషేంద్ర విమర్శిస్తారు.

మానవ విజ్ఞాన రంగంలో శాస్త్రానిదే అగ్రస్థానమని, సాహిత్యానికి అంత అర్హత లేదనే వాదాన్ని ఖండిస్తూ రాయబడిన వ్యాసం ఉత్తమ సాహిత్యం ఉదాత్త మనస్తత్త్వ సమున్మీలనమే. మానవ మనస్సును వస్తువుగా చేసుకోని సాహిత్యం ఉత్తమశ్రేణిది కాదనీ, చిత్రలేఖనం, శిల్పాది కళలు సాహిత్యాన్ని అందుకోలేకపోవటానికి సాహిత్యానికి ఉన్న ఉదాత్త మనస్తత్త్వ సమున్మీలనమే కారణమంటారు.

నాటి ఖగోళ శాస్త్రం నుండీ నేటి మానవ శరీర శాస్త్రం వరకూ సులభం నుండి క్లిష్టతమమైన నిర్మాణం కలిగిన శాస్త్రాలు అనీ మానవశరీరమే క్లిష్టమైతే తరువాత పరిణామ ఘట్టమైన, నాగరిక మానవ మనస్సు గురించి చెప్పే శాస్త్రం సాహిత్యం అంటారు శేషేంద్ర.

సాహిత్యం వేదాంతం కంటే ఒక మెట్టు తక్కువ అనే ప్లాటో అభిప్రాయాన్ని శేషేన్ అంగీకరించలేదు. ఎందుకంటే సాహిత్యం, వేదాంతం రెంటికీ వస్తువు ఒకటే. అది మనస్సు. అయితే శాస్త్రదృష్టితో చూస్తే మానవ మనస్సు గురించి సమగ్రంగా చెప్పగలిగేది వేదాంతం కంటే సాహిత్యమే. కనుక సాహిత్యమే ఒక మెట్టుపైన ఉంటుందనేది శేషేన్ వాదన.

మనస్తత్త్వ శాస్త్రం మానవ మనస్తత్త్వ విషయాన్నే వివరించినా అవి సూత్రబద్ధమైన విషయాలేగానీ అనుభూతికి అందేవికావు.

సాహిత్యం కలిగించే చిత్తసంస్కారం లోపించటంవలన శాస్త్రం అందిస్తున్న ఫలితాలు అనర్థదాయకాలవుతున్నాయంటారు శేషేన్. చిత్తాన్ని నిబంధించి, ఉదాత్తస్థాయికి ఉద్ధరించి, విశ్వశ్రేయస్సును సంధానించడమే సాహిత్య పరమావధిగా వివరిస్తూ వాల్మీకి శ్రీరాముడి పాత్ర చిత్రణ ద్వారా దానిని సాధించాడంటారు.

**అందచందాల తెలుగు పద్యం** అనే వ్యాసంలో పద్యం ప్రజలందరిదే కానీ ఒక పరిమిత వర్గంది కాదు అని పద్యం ఒకానొకప్పుడు పామరులకు కూడా ఎంత దగ్గరగా ఉందో గుర్తు చేశారు. పద్యం ఎలా చదవాలి? అంటే కవి చదివేటపుడు పద్యంలోని శిల్పం ప్రత్యక్షమయ్యే విధంగా చదవాలి. అంటారు. **"సనాతన పండితుల్లో అధునాతన దృష్టి ఉంటే, అదేమి ఖర్మమో అధునాతన పండితుల్లో సనాతన దృష్టి కరడుగట్టింది"** అనే అభిప్రాయానికి రావటానికి కారణాలను వివరించిన వ్యాసం ఇది.

**"ఓ నవలామనోజ సుమనోహర వాఙ్మయ భోజ"** అనే పద్యంలో 'ఓ' కి 'నో' తో యతిమైత్రి ఎందుకు పాటించకూడదు. గూఢ స్వరమైత్రి కొన్నిచోట్ల అంగీకరించినపుడు మిగతాచోట్ల అంగీకరించి మరొక అడుగు ముందుకు వెళ్ళాలి అంటారు శేషేన్.

ప్రాసమైత్రి తథలకు దధలకు ఎందుకు పాటించగూడదు? అప్పకవి ఒప్పుకున్న కొన్నింటిని ఆధునిక పండితులు ఒప్పుకోవట్లేదు అని ఉదాహరణలు చూపుతూ విమర్శించారు. సమాసంలో ఎందుచేత విసంధి చేయకూడదు? అంటే అది సంస్కృత భాషా మర్యాద. మర్యాద

కోసం తెలుగు భాషాభివృద్ధిని బలిచేయడంకంటే విసంధి చేయడం మన భాషా మర్యాదగా ఎందుకు వ్యాప్తం చేయకూడదు అని ప్రశ్నించారు. తెలుగుభాష ఎనిమిది తొమ్మిది వందల ఏళ్ల తరువాత కూడా శైశవ దశలోనే ఉంది అనీ సాహిత్య అకాడమీల వంటివి పూనుకుని భాషను సరిగా పోషించకపోతే శైశవదశ నుండి శవదశకు పోతుంది అని అంటారు. రూపాయలతో మనిషి విలువ కొలిచినట్లు శబ్దాలతో కవి విలువ కొలిచే పెద్దలకోసం ఈ వ్యాసం రాయలేదని ఆయనే చెప్పుకున్నారు.

**'హరిహరనాథుడు తిక్కన ఊహ కాదు', 'శ్రీనాథుని జన్మస్థానం నెల్లూరే'** వంటి వ్యాసాలు శీర్షిక తోనే పాఠకులని ఆకట్టుకుంటాయి. శేషేంద్ర సహేతుకంగా చర్చించిన ఆయా విషయాల గురించి ఆలోచింపచేస్తాయి.

**సాహిత్య కౌముది :** ఈ వ్యాస సంకలనంలో 8 వ్యాసాలున్నాయి. **శివకవులు-హరిహర కవులు** అనే శీర్షికతో వారి గురించి చర్చించిన వ్యాసంలో తెలుగుదేశానికి అద్వైత భిక్ష పెట్టినవాడు తిక్కన అంటారు శేషేంద్ర. శంకరుల అద్వైత సిద్ధాంతం వీరశైవం కారణంగా మరుగున పడినప్పుడు తిక్కన పునఃప్రతిష్ఠించాడు అని అభిప్రాయపడ్డారు. తిక్కనను మహాకవిమాత్రంగానో మనుమసిద్ధి మంత్రిగానో చూడటం తప్పు అనీ యూరప్‌లో పోప్‌కు ఎలాంటి స్థానం ఉండేదో అలాంటిదే తిక్కన స్థానం అనీ సోపపత్తికంగా నిరూపించారు. సాహిత్యాన్ని అద్వైత మత పునఃప్రతిష్ఠాపనకు ఒక సాధనంగా చేసుకున్న తిక్కన పాత్ర ఆంధ్ర చరిత్రలో పునర్నిర్ణయింపబడాలి అనేది శేషేంద్ర ఆకాంక్ష.

పాల్కురికి రచనలలో కనబడే బ్రాహ్మణ నింద కులద్వేషంతో చేసింది కాదనీ అది అద్వైత నింద అనీ భావించిన శేషేంద్ర ఆనాటి చారిత్రక సామాజిక పరిస్థితులను తన ఊహకు ఉపబలకంగా చేసుకుని వివేచించారు. తిక్కనను తెలుగు సాహిత్యంలో ఏకైక ధ్వనికావ్య ప్రణీతగా నిరూపిస్తూ శేషేంద్ర అద్భుతమైన వ్యాసం రాశారు. తిక్కన విరాటపర్వం ధ్వనికావ్యం అని శేషేంద్ర అభిప్రాయం. విరాటపర్వంలో వస్తు అలంకార రస ధ్వనులను సోదాహరణంగా నిరూపించటమే కాకుండా ధ్వని కావ్య నిర్మాణంలో తిక్కన చూపిన రచనా పద్ధతిని కూడా వివరించారు. తిక్కన పాత్రల కడుపులో ఎంతో ఉంటుంది కానీ పైకి ఏమీ కనిపించదు అని చెప్తూ తిక్కన పాత్రలు పుంభావ ధ్వనులే అంటారు. ఇటువంటి కొత్త ప్రయోగాలను వినూత్న పదబంధాలను శేషేంద్ర వ్యాసాలలో అనేకచోట్ల గమనించవచ్చు.


శేషేంద్ర దృష్టిలో తెలుగుసాహిత్యంలో మూడు కవిత్రయాలు ఉన్నాయి. మొదటి కవిత్రయం అందరికీ తెల్సిందే. రెండవ కవిత్రయం జక్కన, శ్రీనాథుడు, పిల్లలమర్రి పినవీరన. మూడవ కవిత్రయం అల్లసాని పెద్దన, తెనాలిరామకృష్ణుడు రామరాజ భూషణుడు. వీరిని కవిత్రయాలుగా ఎందుకు పిలవాలో సహేతుకంగా తన వ్యాసంలో చర్చించారు. ఇటువంటి నూతన ప్రతిపాదనలు శేషేంద్ర వ్యాసాలలో అనేకం. కానీ దురదృష్టం ఏమిటంటే శేషేంద్ర వ్యాస శేముషిని కంఠదఘ్నంగా అనుభవించినవారు, వ్యాసగత అభిప్రాయాలకు పారంపర్యత కల్పించిన అనుయాయులు లేరు.

ఇలా చెప్పుకుంటూ వెళ్తే ఒక్కో వ్యాసం ఒక్కో పరిశోధనా పత్రం. కొన్ని ప్రతిపాదనలు డాక్టరేట్ పట్టాలకు అర్హమైనవి. కొన్ని అభిప్రాయాలు సాహిత్య విషయాలను పునర్మూల్యాంకనం చేసేవి. కొన్ని ఊహలు సాహితీ జగత్తును కొన్ని తరాల ముందుకు తీసుకెళ్లేవి. కొన్ని భావాలు సాహిత్య వివేచనకు మార్గసూచకమైనవి. వెరసి, ఆయన విమర్శనా పటిమకు నిలువుటద్దాలైన ఈ వ్యాసాలన్నీ పాఠకునిలో వేనవేల ఆలోచనలను జాగృతం చేస్తాయి. విజ్ఞానశాస్త్రం, చరిత్ర, ప్రపంచసాహిత్యం, వేదోపనిషత్తులు, తత్త్వం, ఛందోలంకార, వ్యాకరణశాస్త్రాలు, సామాజిక రాజకీయాంశాలు ఇలా ఒకటేమిటి అనేక శాఖలలో ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి, విజ్ఞానఖని అని ఈ వ్యాసాలు నిరూపిస్తాయి. **"ఏదో అపూర్వ విషయాన్ని అపూర్వ ధోరణిలో చెప్పవలసి వచ్చినపుడు కలం చేపట్టాలి"** అనే శేషేంద్ర నియమాన్ని ప్రతి వ్యాసమూ ప్రస్ఫుటంగా ప్రతిఫలించింది.

ఈ వ్యాస సంకలనాలన్నీ శేషేంద్ర భావధారకు పాశ్చాత్య సాహిత్య దృక్పథం 'శరీరం', భారతీయ అలంకార శాస్త్రం 'ఆత్మ' అని నిరూపిస్తాయి.

**ఉపయుక్త గ్రంథ సూచి**

1. కాలరేఖ - గుంటూరు శేషేంద్ర శర్మ
2. నరుడు-నక్షత్రాలు - గుంటూరు శేషేంద్ర శర్మ
3. సాహిత్య కౌముది - గుంటూరు శేషేంద్ర శర్మ



ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 2 (22) హైదరాబాద్ డిసెంబర్ : 2024

# భగవద్గీత – ఒక అధ్యయనం

**డా. వీపూరి వేంకటేశ్వర్లు**, పి.జి.టి. తెలుగు, సెయింట్ జోసఫ్స్ ఆంగ్ల పాఠశాల, కర్నూలు. ఫోన్ : 98855 85770

**(11-12-2024న *గీతాజయంతి సందర్భంగా...*)**

**ఉపోద్ఘాతం :**

తాత్త్విక వాఙ్మయంలో భగవద్గీతను మించిన గ్రంథం మరొకటి లేదు. దీని రచనా కాలం క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో ఉండవచ్చుని సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు అభిప్రాయపడ్డారు. క్రీస్తు పూర్వం అయిదవ శతాబ్ది నాటిదని తిలక్ గారు భావిస్తే, డి.డి. కోశాంబి గారయితే మరీ ముందుకు జరిపి క్రీస్తుశకం మూడవ శతాబ్దానికి చెందినదని భావించారు. గీతారచనా కాలం ఎప్పుడైనా బహుళ ప్రచారానికి వచ్చింది మాత్రం శంకరభాష్యంతోనే! అంటే క్రీ.శ. 8వ శతాబ్దం నుంచేనని మనం భావించవచ్చు.

హిందువులలో ఏ శాఖ వారికయినా భగవద్గీత మాత్రం పరమ పూజనీయ గ్రంథం! నిత్యపారాయణ గ్రంథం కూడా!

భారతీయ చింతనకు ఆధారమైన వాఙ్మయాన్ని ప్రస్థానత్రయ మంటారు. అందులో మొదటి ప్రస్థానం ఉపనిషత్తులు, రెండవ ప్రస్థానం బ్రహ్మసూత్రాలు కాగా, మూడవ ప్రస్థానం భగవద్గీత.

**1. గీతోపనిషత్తు :**

ఉపనిషత్తులు చాలా ప్రాచీనమైనవి. పైగా వాటిలో చింతనా వైవిధ్యం ఎక్కువ, ఏకవాక్యత తక్కువ. అందుకే వాటి సారాన్ని ఏకోన్ముఖత చేయడానికి బాదరాయణుడు బ్రహ్మసూత్రాలను వెలయించారు. దీనికే ఉత్తర మీమాంస, వేదాంత దర్శనమని పేర్లు.

అయితే అటు ఉపనిషత్సారాన్ని – ఇటు సాంఖ్య, యోగ, వేదాంత దర్శనాల సారాన్ని పిండీకృతం చేసి, తర్వాతి కాలంలో ధార్మిక, నైతిక, ఆధ్యాత్మిక చింతనను చేర్చుకున్న ఒక సర్వసమన్విత దర్శన గ్రంథం భగవద్గీత.

పండితులు భగవద్గీతను కూడా ఒక ఉపనిషత్తుగానే పరిగణిస్తారు. దీనిలో ప్రతి అధ్యాయం చివర **"భగవద్గీతాసు ఉపనిషత్సు..."** అని ఉంటుంది. అందుకే దీన్ని బ్రహ్మవిద్య యని, యోగశాస్త్రమని కూడా పేర్కొన్నారు.

**2. సంపూర్ణ గ్రంథం :**

భగవద్గీత వ్యాసభారతంలో అంతర్భాగం. **(వ్యాసేన గ్రథితం పురాణమునినా మధ్యే మహాభారతం)** ఇది భీష్మపర్వంలో కౌరవ, పాండవ యుద్ధారంభ ఘట్టంలో వస్తుంది. యుద్ధభూమిలో శ్రీకృష్ణుడు అర్జునుడికి తత్త్వబోధ చేసినట్టుగా, వారి మధ్య సంవాదరూపంలో ఇది వ్రాయబడింది. అయితే ఈనాడు భగవద్గీత భారతంలో భాగంగా కంటే ఒక సంపూర్ణ గ్రంథంగానే స్వీకరిస్తున్నారు. ఎక్కువ మంది పారాయణ చేస్తున్నారు.

**3. ప్రక్షిప్తాలు :**

వ్యాసభారతం జ్ఞాతివైరం, యుద్ధం, పాండవ విజయం మొదలైన వాటిలో జయసంహితగా మొదట 8వేల శ్లోకాలతో; తర్వాత వైశంపాయనుడు జనమేజయునికి చెప్పిన భారతంగా 24వేల శ్లోకాలతో; ఆ తర్వాత సూతుడు శౌనకాది మహర్షులకు నైమిశారణ్యంలో చెప్పిన మహాభారతంగా లక్ష శ్లోకాలతో అలరారింది. ఆ గ్రంథ విస్తరణ క్రమంలో ఎప్పుడో భగవద్గీత కూడా ప్రవేశించి ఉంటుందని పండితుల అభిప్రాయం.

మహాభారతం ఎలాగైతే ఒక్కసారిగా ఒక్క చేతిమీదుగా ఎలా రాలేదో, దాని భాగంగా ప్రసిద్ధమైన భగవద్గీత కూడా అంతేనని, దీనిలోని 18 అధ్యాయాలను 700 శ్లోకాలను విభిన్న వ్యక్తులు, విభిన్న కాలాలలో వ్రాసి చేర్చుతూ పోయారని పరిశోధకుల అభిప్రాయం. ఇలా అభిప్రాయపడడానికి ముఖ్య కారణం కూడా ఉంది. గీతలో అనేక అంతర్విరుధ్యాలు, చర్విత చర్వణాలు ఉండడమే!

**4. వివిధ భాష్యాలు / వ్యాఖ్యానాలు :**

భగవద్గీతపై వచ్చినన్ని భాష్యాలు, వ్యాఖ్యానాలు ప్రపంచంలో మరే గ్రంథానికి వచ్చి ఉండవు. ఈనాటికీ ప్రతి సంవత్సరం తెలుగులో సైతం వ్యాఖ్యానాలు వస్తూనే ఉన్నాయి.

భగవద్గీత ఒక్కొక్క భాష్యకారునికి ఒక్కొక్క విధంగా కనబడింది. ఆ విధంగానే వాళ్ళు అర్థం చెప్పారు.

త్రిమతాచార్యులలో మొదటివారైన శంకరాచార్యులు భగవద్గీత జ్ఞానమార్గాన్ని ఉపదేశిస్తున్నట్టుగా భావించారు. గీతపై వచ్చిన భాష్యాలలో అన్నింటికన్నా ప్రాచీనమైనది (లభ్యమైనంత వరకు) శంకర భాష్యమే! శంకరులు దీన్ని కూడా దశోపనిషత్తులు, బ్రహ్మసూత్రాలకు వలె తమ అద్వైత దృక్పథం నుంచే వ్యాఖ్యానించారు.

రెండవ వారైన రామానుజాచార్యులు గీతలో విశిష్టాద్వైతాన్ని దర్శించగా, మూడవ వారైన మధ్వాచార్యులు ద్వైతపరంగా దర్శించారు. ఇక వల్లభాచార్యుడు శుద్ధాద్వైతపరంగా, నింబార్కాచార్యుడు ద్వైతాద్వైత పరంగా భాష్యాలు వ్రాశారు. వీళ్ళంతా ఊరకే వ్రాయకుండా తీవ్రంగా విభేదించుకుంటూ వ్రాశారు. అయితే దేశభాషలలో వెలువడిన వాటిలో మహారాష్ట్ర భక్తుడు జ్ఞానదేవుడు వ్రాసిన 'జ్ఞానేశ్వరి' వ్యాఖ్య ప్రసిద్ధమైనది. అలాగే ఆధునిక కాలంలో తిలక్ వ్రాసిన 'గీతారహస్యం' కూడా ప్రసిద్ధమే! గీతలో తిలక్‌గారికి కర్మయోగం కనబడగా, గాంధీకి అహింసా ప్రబోధం, అరవిందుడికి భక్తిమార్గం

కనబడ్డాయి. ఇక తెలుగులో అయితే స్వామి విద్యాప్రకాశానందగిరి గారి 'గీతామకరందం'. స్వామి సుందరచైతన్యానంద గారి 'చైతన్యగీత' అలాగే భక్తి వేదాంత సరస్వతి స్వామి గారి (శ్రీల ప్రభుపాద) 'భగవద్గీత యథాతథము', శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యుల గారి శంఖారావము (రహస్య ప్రకాశము) పేరెన్నికగన్నవి.

**5. త్రివేణీ సంగమం :** భగవద్గీత ఒక త్రివేణీ సంగమం. ఇందులో జ్ఞానయోగం, కర్మయోగం, భక్తియోగం మూడూ ప్రతిపాదితాలైనాయి. జ్ఞానయోగానికి ఉపనదిగా ధ్యానయోగం కనబడుతుంది.

భగవద్గీతలోని అధ్యాయాలకు యోగమనే పేరుంది. శ్రీకృష్ణుడు ఏ యోగం గురించి చెబుతుంటే ఆ యోగమే గొప్పదిగా కనబడుతుంది. దీన్ని బట్టి ఎవరికి వారు తమ అభిమాన సిద్ధాంతాన్నే గీత బోధిస్తున్నదని వ్యాఖ్యానించడానికి ఆస్కారం కలిగింది. శంకరులు గీతను జ్ఞానయోగ ప్రతిపాదకం అంటారు. మరి చాలా చోట్ల శ్రీకృష్ణుడు కర్మ, భక్తియోగాలను ప్రశంసించలేదా అంటే, అది అర్థవాదం అంటారు. అంటే వాటి గొప్పతనం శ్రోత మనస్సులో నాటుకోవడానికి తాత్కాలికంగా చెప్పిన మాటలే తప్ప అవే గొప్పవని కాదని, అన్నింటిలోకి జ్ఞానమే మోక్షసాధనమని – శంకరులవాదం. శంకరుల దృష్టిలో జ్ఞానమంటే అద్వైతమే!

**6. అర్జున విషాదయోగం :**

**"ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।**
**మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయః ॥ (1-1)**

"ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో మావాళ్ళు, పాండవులు యుద్ధోత్సాహంతో ఎదురెదురుగా నిలిచిన తర్వాత ఏమి చేశారు సంజయా?" అని ధృతరాష్ట్రుడు సంజయుని అడిగే ఈ ప్రసిద్ధ శ్లోకంతో భగవద్గీత ప్రారంభమవుతుంది.

తమోగుణంతో అంధుడైనవాడు ధృతరాష్ట్రుడు. ఆయనకు రాజ్యమంటే వ్యామోహం, పిల్లలంటే మమకారం. ఈ రెండింటివల్లా ఎన్ని అన్యాయాలనో ఆమోదించి ఊరుకున్నాడు.

మొదటి అధ్యాయం భారతకథలోకి అల్లుకుపోతుంది. సంజయుడు మొదటి పదిరోజుల యుద్ధాన్ని చూచి, భీష్ముడు పడిపోగానే ధృతరాష్ట్రుడికి మొదటి నివేదికను ఇవ్వడానికి హస్తినాపురానికి వచ్చి, ఆ విషయం తెలిపాడు.

కొండంత భీష్ముడు పడిపోవడం ధృతరాష్ట్రునికి ఒక పెద్ద అఘాతం! ధర్మంగా యుద్ధం చేస్తే భీష్ముడు పడిపోవడానికి ఆస్కారం లేదు. 'ఎవరన్నా అధర్మం చేశారేమో?' అన్న సందేహం అతనికి కలిసింది. అదే ధృతరాష్ట్రుని చేత ప్రశ్న వేయించింది. ఈ ఒక్క ప్రశ్నతో భగవద్గీత యావత్తూ సంజయుని ద్వారా అతను వినగలిగినాడు.

ఈ శ్లోకం మొదటి భాగంలోనే సూక్ష్మంగా గీతాసందేశం ఇమిడి ఉంది. ఇందులో పదాలను అటూ ఇటూ సవరిస్తే "క్షేత్రేక్షేత్రే



ధర్మంకురు" – అని ఆదేశం. ఏ క్షేత్రంలో ఉన్నా ధర్మాన్నే ఆచరించమని) తమోగుణంలో ఉన్న ధృతరాష్ట్రుని వంటివాళ్ళు తప్పనిసరిగా పాటించవలసిన ఆదేశం!

విషాదం అంటే విషాన్ని తినేది. ఏదో ఒక కారణం చేత విషాదం అందర్నీ ఎప్పుడో ఒకప్పుడు ఆవరిస్తుంది. ఆ సమయంలో వాళ్ళనీ, వీళ్ళనీ నమ్ముకోకుండా, లోపలే ఉన్న భగవంతుడితో మనగోడు వెలిబుచ్చుకుంటే అది 'విషాదయోగం' అవుతుంది. అయితే ఎవడైనా భగవంతునివైపు తిరిగాడో, ఇక అతడి ఆధ్యాత్మిక జీవితం మొదలైనట్లే! అప్పుడతడి హృదయం విచ్చుకుంటుంది. ప్రథమం అంటే విస్తరించుకోవడం, వికసించడం అనే అర్థాలున్నాయి.

**7. గీతా సందేశం :**

శ్రీకృష్ణుడు అర్జునుడిని ఆవహించిన హృదయ దౌర్బల్యాన్ని పోగొట్టడానికి, యుద్ధోన్ముఖుడిని చేయడానికి గీతోపదేశం చేశాడు.

రాజ్యం కోసం యుద్ధం చేసి శత్రువులనైనా సరే, సంహరించడం పాపం కదాయని అర్జునుడు సందేహిస్తే, శ్రీకృష్ణుడు అది క్షత్రియకుల ధర్మమంటాడు. కులధర్మం ఆచరిస్తే దోషం లేదని, ఆచరించక పోవడమే దోషమని అంటాడు. కులధర్మంగా కర్మను ఆచరించినప్పుడు అది నిష్కామకర్మే అవుతుంది. ఆ విధంగా నిష్కామంగా, ఫలాపేక్షరహితంగా కర్మను ఆచరిస్తే కర్మఫలం మనిషికి అంటుకోదని అంటాడు.

**"స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మోభయావహః" (3-35)**

**"స్వధర్మాచరణంలో మరణమైనా శ్రేయమే! పరధర్మం ఎల్లప్పుడూ భయావహమే!"** అని శ్రీకృష్ణుడు కులధర్మాన్ని సమర్థిస్తాడు. పైగా వర్ణవ్యవస్థను ఎవరూ ప్రశ్నించడానికి వీలు లేకుండా **"చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః" (4-13) "గుణాన్ని బట్టి, కర్మను బట్టి చతుర్వర్ణాలను నేనే సృజించాను"** అంటాడు.

**8. నిష్కామకర్మ :**

పుణ్యకర్మ అయినా, పాపకర్మ అయినా ఆత్మను బంధిస్తుంది. అందుకే తన స్వార్థం కంటే ఉన్నతమైన పరమార్థం కోసం

## చలికి వణుకుతున్న చంద్రుడు

**డా. అంజనా శ్రీ,** ఖమ్మం, బోనగిరి కోట,
ఫోన్ : 770 253 7453

జాబిల్లి జాడల్లో నిద్రలేచిన చుక్కల సమూహం
కాలం ఎత్తైన ఊహల్లో కదిలే సమయానికి
నింగిలించి నేలదాకా
నిశ్శబ్దం కమ్ముకున్న ఆవరణములో
చల్లని తీయని కోకిల పాట
కోటి గొంతుల సుందరయ్య సూర్యకిరణాలు జాడ

మంచు మర్యాదగా
ఆకుల దేహాలపై వర్షిస్తూనే విభూతి పొడి చల్లినట్టు
ఆకాశం అరణ్యం పర్వతాలు
పొద్దున్నే తాటిచెట్ల మధ్య నుండి
వలయ వలయాలుగా కమ్ముకున్న
మంచు మమకారం ఆక్రమించుకున్నది
ప్రకృతిపై ఏదో పరవశం చెట్టు పుట్ట పర్వతాలు

సెలయేటి గమనముగా
చిన్నపాటి కాలువ వంపులను
అనేక వంకలను దాటుతూ చెట్ల పొదల్ని
గమనిస్తూ కొత్త లోకంలోకి పయనిస్తున్న
జాడ నీడ ఒక ప్రత్యేక పచ్చని చూపు
ఈ ప్రకృతి పైన మనిషికి స్వాగతిద్దాం
సదా ఆహ్వానం పలుకుదాం
ఆ ప్రకృతిని నిండు గర్వంతో చూసిన అప్పుడు

సుందర గమనంలో ప్రకృతి
పరవశాల ప్రబోధించే అక్షర గీతం
పొంగుతున్న భావ వేషం
మనసు పరిమళించే
మాటల మనోహర అక్షర సమూహం...

నిష్కామంగా, ఫలాపేక్ష రహితంగా కర్మను చేస్తే అది నైష్కర్మ్యంగానే భాసిస్తుంది. మనిషికి అలాంటి వైరాగ్యం ఎలా సిద్ధిస్తుంది? అంటే అభ్యాసం చేతనే సిద్ధిస్తుంది.

కోరికలు లేకుండా, ఫలితం ఆశించకుండా, ఫలితం పట్ల మమకారం లేకుండా, కర్తవ్యం కనుకనే కర్మ చేయడమనేది సాధన ద్వారా నేర్చుకోవాలి. ఇంద్రియ నిగ్రహం, ధ్యానం, యోగసాధన మొ॥ అందుకు పద్ధతులు.

**9. భక్తియోగం :**

ఏకర్మ చేసినా భగవదర్పణంగా చేయాలి, అప్పుడు మనిషి కర్మ నుండి విముక్తుడవుతాడు.

**"ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేऽ ర్జున తిష్ఠతి ।
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా" ॥
(18-61)**

**"అర్జునా! ఈశ్వరుడు ప్రాణులందరి హృదయాలలోను కూర్చొని, యంత్రంపై ఉన్న (బొమ్మలని లాగా) జీవుళ్ళని మాయచేత త్రిప్పుతున్నాడు."**

ఈశ్వరుడు సమిష్టి వాసనలను ఉపయోగించి జగచ్చక్రాన్ని తయారుచేసి త్రిప్పుతున్నాడు. దానిలో అంతర్భాగాలుగా వ్యష్టి వాసనల ద్వారా జీవుళ్ల శరీరమనోబుద్ధుల యంత్రాల్ని తయారుచేసి, వాటి మీద జీవుళ్ళ నెక్కించి త్రిప్పుతున్నాడు. పిండితార్థంగా మాయ ఈశ్వరుని ఆయుధం, ప్రాణుల హృదయాలు ఆయన స్థానం. ఆయన ప్రీతుడై, శాంతించేవరకు ఈ జీవితచక్రాన్ని నిలపడం ఎవరికీ సాధ్యం కాదు. మరోవైపుకి త్రిప్పడం ఇంకా అసాధ్యం. అందుకే జ్ఞానయోగం, కర్మయోగాల మధ్య భక్తియోగాన్ని ఇమిడ్చారు.

**ఉపసంహారం :**

మనిషి ఈ లోకంలో ఎలా ఉండాలి? ఎలా పని చేయాలి? చివరకు ఎటువంటి ఆహారం తీసుకోవాలి? ఎంతసేపు నిద్రపోవాలి? మనస్సును, ఇంద్రియాలను ఎలా నిగ్రహించుకోవాలి? అనే అనేక నీత్యుపదేశాలకు భగవద్గీత కాణాచి. ఇవి నాటికీ, నేటికీ, ఎప్పటికీ ఆదరణీయాలే! ఆచరణీయాలే!

**ఆధార గ్రంథాలు :**

1. రామమోహనరావు, నండూరి : విశ్వదర్శనం (భారతీయ చింతన), లిఖిత ప్రచురణలు, విజయవాడ (2003), (309 నుంచి 335 పుటల వరకు).

2.స్వామిని శారదా ప్రియానంద : శ్రీమద్భగవద్గీత, చిన్మయారణ్యం పబ్లికేషన్స్, భీమవరం (2019).

* * *

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 2 (25) UGC CARE List Approved Journal హైదరాబాద్ డిసెంబర్ : 2024


# తిరుమలలో క్షేత్రయ్య

**ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి,** తిరుపతి, ఫోన్ : 98493 07333

బంగారు రేణువులు మేట వేసినట్లున్న ఇసుక తిన్నెలను, వాటి మధ్యలో ప్రవహిస్తున్న స్వర్ణముఖి నదిని చూసి, మహర్షులు ఈ నదికి సరైన పేరే పెట్టారు అంటూ... అక్కడి నుండి ఆదిశేషుడు పవళించి ఉన్నట్లుండే శేషాచలం కొండను చూసి సార్థకనామమే అని మోహనాంగికి చెప్తూ... అలిపిరి వైపుకు అడుగులు వేశాడు క్షేత్రయ్య మోహనాంగితో పాటు నడుస్తూ.

కపిలతీర్థం జలపాతంలో మోహనాంగితో పాటు స్నానమాచరించి, కపిలేశ్వర స్వామిని దర్శించి వెలువలికొచ్చేటప్పుడు వేణుగోపాలస్వామిని దర్శించుకొన్నారు. అక్కడ కాసేపు గుడి మెట్ల మీద విశ్రాంతిగా కూర్చొన్నారు. అప్పుడే వేణుగోపాల స్వామి గుడి ముందున్న మంటపంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రారంభమైంది. భక్తులంతా గుమిగూడారు. చుట్టూ కూర్చొన్నారు. ఆశ్చర్యం!... క్షేత్రయ్య పదాన్ని గాయకులు పాడడం ప్రారంభించగానే అందమైన ఆహార్యం, చక్కని అభినయంతో ఓ బాలిక నృత్యం చేస్తుంటే మోహనాంగి, క్షేత్రయ్యలు ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని అవాక్కయ్యారు. అక్కడ ఉన్నది ఆ పదాన్ని రచించిన క్షేత్రయ్యేనని వాళ్ళకు తెలియదు. మెల్లగా అలిపిరి బాట వెంబటి నడుస్తూ ముందుకు సాగారు.

**'వరదా! చూశావా? నీ పదాలు గాలికంటే వేగంగా నలు దిశలా వ్యాపించాయి. నీ పదాలంటే ప్రజలకు పిచ్చి. కొత్త తరహాలో ఉన్న నీ పదాలు అందరికీ మోజును కల్గిస్తున్నాయి. గతంలో ఎందరో పదకర్తలు రాసినా, నీ పదాలు సంగీత, సాహిత్య, నృత్యాలకు చక్కగా వొదిగిపోతాయి. అందుకే నేటి జనాలకు నీ పదాలు కొత్త పుంతగా నిలుస్తున్నాయి. యువతీ యువకులకు అందులోని బాహ్య శృంగారం పిచ్చెక్కిస్తున్నాయి. పలుకు పలుకులో తేనెలొలికే మధురాతి మధురమైన నీ పదాలు ఆ చంద్రతారార్కంగా వర్ధిల్లుతాయి. నీ పదాలు రెండు విధాలైన పాత్రను పోషిస్తాయి. పైకి కనిపించే శృంగార భావాన్ని మాత్రమే స్వీకరించే వాళ్ళను సంతృప్తి పరుస్తాయి. అలాగే ఆధ్యాత్మికానుభూతి కోసం నీ పదాల్లో అంతర్వాహినిగా ఉండే దివ్యమైన ప్రేమను వెతికే భక్తులకూ ఆనందాన్ని కల్గిస్తాయి. భక్తుడికి దేవునిపై గల దివ్యమైన ప్రేమా, అలాగే ఆశా నిరాశల్లో ఆ దివ్యమైన ప్రేమను వెతకడంలో ఎదురయ్యే ఎన్నో భావాలు... ప్రియుని రాక కోసం నిరీక్షించే నాయిక అనుభవించే బాధను నీ పదాలు ఆవిష్కరిస్తాయి. నీ పదాలను అభినయ రూపంలో చూస్తే వాటి మీద మోహం అలివిగానిదవుతుంది'** అని క్షేత్రయ్యతో కాసింత గర్వంతో చెప్పింది మోహనాంగి.




అలిపిరిలో పాదాల మంటపంలో శ్రీవారి పాదరక్షలను నెత్తిన పెట్టుకొని ఇద్దరూ మంటపం చుట్టూ మూడు సార్లు తిరిగి శ్రీవారి పాదాలను మొక్కి పక్కనే ఉన్న లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని పెద్ద గాలి గోపురంకేసి తలెత్తి చూశారు.

'మోహనా! ఈ కొండ మెట్లు ఎక్కగలవా?'

'మీరు చెంతనుండగా, తిరుమలేశుని అనుగ్రహముండగా ఏడు కొండలే కాదు ఎన్ని కొండలైనా ఎక్కేస్తాను'.

చుక్కల పర్వతం వరకూ ఇద్దరూ ఎంతో శ్రమించి ఎక్కారు. అక్కడి నుండి అవ్వాచారి కోన వరకు సునాయాసంగా వెళ్ళిపోయారు. దారిలో అక్కడక్కడా విశ్రాంతిగా క్షేత్రయ్య కూర్చొని తన ప్రేయసి మోహనాంగికి ఉల్లాసం, ఉత్తేజం కల్గించడానికి కొన్ని పదాలను పాడేవాడు. మోహనాంగి కూడా క్షేత్రయ్యకు వినోదం, ఆహ్లాదం కల్గించడానికి ఆ పదాలకు అభినయం చేసేది. యాత్రికులు సంభ్రమాశ్చర్యాలతో వీరి నృత్యగానాలను తిలకిస్తూ, శ్రమను మరచిపోవడానికి వీరిని అనుసరిస్తూ వెళ్ళారు. అవి జన బాహుళ్యంలో ఉన్న క్షేత్రయ్య పదాలని తెలిసినా వారే క్షేత్రయ్య, మోహనాంగులని గుర్తుంచలేకపోయారు.

**'అయ్యా! మీరెవరో దేవదూతల్లా మాకు వినోదంతోపాటు భక్తిని కల్గిస్తూ మా నడకను సనాయాసం చేశారు. మేము పడిన శ్రమంతా మీ వల్ల మరచిపోయాం... మోకాళ్ళ పర్వతాన్ని కూడా మాకు ఎక్కినట్లే లేదు'** అంటూ ఆ భక్తులు తమ జోలెల్లో నుంచి తినుబండారాలు, పండ్లు, కాయలను క్షేత్రయ్య, మోహనాంగి చేతుల్లో పెట్టారు. అందరితో పాటు కూర్చొని, భక్తితో సమర్పించిన వాటిని ఆరగించి, పక్కనే పారుతున్న సెలయేరులో నీళ్ళు తాగి తిరుమలకు చేరుకొన్నారు. స్వామి పుష్కరిణిలో స్నానం చేసి వరాహస్వామిని మొక్కి గుడి ముందుకు చేరుకొన్నారు.

వీరి రాకను తిరుమల తిరుపతి ఆలయ పాలకులైన సభైయ్యర్లు తిరుమల ఆలయాధికారి అయిన స్థానత్తార్‌కు తెలియజేశారు. వారి శరీరాకృతిని, రూపు రేఖల్ని ముందే తెలుసుకోవడంతో వచ్చిన వారు

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 2  హైదరాబాద్ డిసెంబర్ : 2024

క్షేత్రయ్య, మోహనాంగిలని తెలుసుకొని వాళ్ళకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. వేంకటేశ్వర స్వామిని కనులారా కాంచి క్షేత్రయ్య మోహనాంగిలు అనిర్వచనీయమైన ఆనందంతో మైమరచిపోయారు. రంగ మంటపంలో అర్చక స్వాములు వేద మంత్రోచ్చారణ చేసి ఇద్దరినీ ఆశీర్వదించి ప్రసాదాలను అందజేశారు. వారు ప్రసాదాలను కళ్ళకు అద్దుకొని స్వీకరించారు.

**'అయ్యా! క్షేత్రయ్య గారూ! మీకు తిరుపతి నుండే రక్షక భటులను తోడు పంపుతామని సభైయ్యర్లు అంటే మీరు వద్దని వారించారట. మీలాంటి ప్రముఖులకు రక్షణగా ఎవరూ లేకపోతే ఎలా? పైగా సప్తగిరులు అడవితో కూడుకొన్నవి. క్రూరమృగాలు సంచరిస్తుం టాయి. మీకేమైనా అయితే మిమ్మల్ని ప్రేమగా చూసుకొనే మహారాజుల దగ్గర మాకు ఇబ్బందులేర్పడవచ్చు గదా?'** అన్నాడు ఆలయ అధికారి స్థానత్తార్.

'శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు. నాతో పాటు వచ్చిన యాత్రికులకు ఎవరు రక్షకులు? ఆ వేంకటేశ్వరుడే... మాకూ ఆయనే దిక్కు. మేము ప్రముఖ వ్యక్తులుగా కొండకు రాదలచుకోలేదు. సామాన్య భక్తులుగానే రావాలనుకొన్నాం. మా ఏకాంతానికి భంగం వాటిల్లకుండా, భక్తులందరితో కలిసి మెలిసి హాయిగా వచ్చేశాం' అన్నాడు వినమ్రంగా క్షేత్రయ్య.

'నేను తిరుమలకు రావాలనుకునే కోరిక ఎన్నో ఏళ్ళుగా ఉ ండేది. చివరికి నా కల ఫలించింది. శ్రీవారి దివ్య మంగళ స్వరూపం నన్ను పులకింపజేయడమేకాదు, నన్ను ఇక్కడే ఉండి పోయేలా మనసు కట్టి పడవేస్తోంది. నిజంగా ఈ వాతావరణం చూశాక ఇది భూలోక వైకుంఠమేననిపిస్తోంది. స్వామి వారిని చూస్తున్న కొద్దీ చూడాలని పిస్తోంది. దృష్టి మరల్చుకోలేకపోయాను. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు నేను అక్కడే ఉంటే ఆటంకమని బయటకొచ్చానే తప్ప స్వామి వారిని విడచిపెట్టలేక పోతున్నాను. స్వామి వారిని చూస్తున్న కొద్దీ ఇంకా చూడాలనే కుతూహలం కలుగుతోంది. స్వామి వారు ఎంతో గంభీరంగా ఉండడమేకాదు. హృదయాకర్షణగా ఉ న్నాడు. ఆయనలోనే కాదు ఈ తిరుమల క్షేత్రంలోనే అద్భుతమైన అయస్కాంత శక్తి ఉంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి స్వామి విగ్రహాన్ని నా జీవితంలో నేనెక్కడా చూడలేదు. నేను ఇక్కడ కొన్నాళ్ళపాటు ఉండి స్వామిని తనివి తీరా దర్శించుకొంటూ గడుపుతాను ఆయనకు పాదసేవ, పదాల సేవ చేసుకొంటాను' అన్నాడు క్షేత్రయ్య స్థానత్తార్‌తో.

'దానిదేముంది మహాభాగ్యం... మీకు వరాహస్వామి గుడి వెనుక అన్నమాచార్యుని ఇంటి సమీపంలో వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశాం... మీకు ఏ లోటూ రాకుండా చూసుకోవడం మా విధి' అన్నాడు స్థానత్తారు.

మోహనాంగితో కలిసి క్షేత్రయ్య తమ బసకు చేరుకొన్నారు. బాగా అలసిపోవడంతో మోహనాంగి త్వరగా గాఢ నిద్రలోకి జారుకొంది. క్షేత్రయ్య పడుకొన్నాడనే మాటేగానీ వేంకటేశ్వర స్వామి దివ్యమంగళ స్వరూపాన్ని గుర్తుకు తెచ్చుకొంటున్నాడు. స్వామి ఎందుకు తనను ఇన్నేళ్ళు దూరంగా ఉంచి దర్శన భాగం కలిగించ లేదు? ఇందులో ఏదో మర్మముంది? అనుకొంటూ మెల్లగా నిద్రలోకి జారుకొన్నాడు క్షేత్రయ్య.

ఉదయాన్నే గుడి గుంటలు మోగాయి... క్షేత్రయ్య, మోహనాంగి ఇద్దరూ ఘంటారావానికి మేలుకొన్నారు.

'స్వామి వారికి నైవేద్య గంటలు కావొచ్చు. బాగా అలిసి పోవడం వల్ల ఎక్కువసేపు వొళ్ళు మరచి నిద్రపోయాం. త్వరగా స్నాన సంధ్యలు ముగించుకొని ఆలయానికి బయలుదేరుదాం' అన్నాడు మోహనాంగితో క్షేత్రయ్య.

వేంకటేశ్వరునికి నైవేద్యానంతర దర్శనంలో ఇద్దరూ పాల్గొన్నారు. స్థానత్తారు ముందురోజు లాగే వారిద్దరినీ గౌరవించాడు. ఆలయంలోని మహద్వారం వెనుకవైపుండే ప్రతిమా మంటపంలోని రాతి విగ్రహాలు, పంచలోహ విగ్రహాలను చూస్తూ ఆలోచనలో పడ్డాడు.

'క్షేత్రయ్య గారూ! వీరు విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవరాయలు. వారి దేవేరులు తిరుమల దేవి, చిన్నాదేవి... వీరు అచ్యుతదేవరాయలు, వారి దేవేరి వరదాజీ అమ్మ... వీరు వేంకటపతి రాయలు... శ్రీకృష్ణదేవరాయల కులదైవం వేంకటేశ్వర స్వామే... మిగిలిన రాజులకు కూడా స్వామే ఇలవేల్పు' అన్నాడు స్థానత్తారు.

ఆ ప్రతిమలన్నింటికీ నమస్కరించాడు క్షేత్రయ్య. 'ఇంత మంది గొప్ప మహానుభావులు సంచరించిన ప్రదేశంలో తానుండడం పూర్వజన్మ సుకృతం' అన్నాడు క్షేత్రయ్య.

అద్దాల మహలు మంటపంలో ప్రసాదాలను ఆరగించి బయటకొచ్చి వెయ్యిగాళ్ళ మంటపం మెట్లపై కూర్చొని తదేకంగా ఆలయ మహద్వారాన్ని భక్తజనులు ప్రదర్శించే కళారూపాలను చూస్తూ కూర్చున్నారు. ఆలయంలో నుండి గుంపులు గుంపులుగా భక్తులు గోవిందలు పెడ్తూ వస్తున్నారు. ఒక పెద్ద గుంపు నాయకుడు క్షేత్రయ్యను గుర్తుపట్టి ముందు నిల్చుని నమస్కరించాడు.

'అయ్యా! వరదయ్యగారూ! బాగున్నారా? నా పేరు వేంకట స్వామి. నేను తంజావూరు రాజాస్థానంలో మండలాధీశునిగా ఉన్నాను. మిమ్మల్ని విజయరాఘవ నాయక రాజుల వారి సమక్షంలో ఎన్నో పర్యాయాలు చూశాను. నేను, నాతో పాటు మా మండలంలోని వారు ప్రతి ఏటా వేంకటేశ్వర స్వామి దర్శనానికొస్తుంటాం. మీకు మధుర రాజ్యాధీశుడైన తిరుమల నాయకులవారు కూడా అత్యంత ఆంతరంగిక మిత్రుడని కూడా నాకు తెలుసు. మీతో పాటున్న ఈ మహనీయురాలైన మోహనాంగిని కూడా నేనెరుగుదును... మీరు

పదగానం చేస్తుంటే... మోహనాంగి గారు అభినయిస్తుంటే చూడడానికి వేయి కన్నులు చాలదు. స్వామి దర్శనంతో పాటు మిమ్మల్ని ఇక్కడ చూడడం మాకెంతో ఆనందదాయకం. మేము ఇక్కడి తిరుమల చుట్టు పక్కల ఉండే తీర్థాలను దర్శించడానికెళ్తున్నాం. మీరు ఏమీ అనుకోకపోతే మాతోపాటు మీరొస్తే మీకూ, మాకూ బాగుంటుంది. కాదనకండి. ఈ తీర్థాలకు ఇంతమంది జనంతో పాటు వెళ్తేనే మంచిది. ఇక్కడి తీర్థాలన్నీ బాగా తెలిసిన వ్యక్తులు మాతోపాటున్నారు' అన్నాడు వెంకటస్వామి.

దైవేచ్ఛగా భావించి మోహనాంగికేసి చూశాడు క్షేత్రయ్య.

'వెళ్తాం వరదా! నాకూ ఇక్కడి పుణ్యస్థలాలను, తీర్థాలను చూడాలని ఉంది' అంది మోహనాంగి క్షేత్రయ్యతో. వారితోపాటు రెండు రోజులు తీర్థయాత్రలు చేశారు క్షేత్రయ్య మోహనాంగిలు.

'మోహనా! ఈ దుర్గమమైన అడవిలోకి గుంపు లేకపోతే పోలేము. వీరి వల్ల మనం చక్రతీర్థం, గోగర్భం, వైకుంఠతీర్థం, జాబాలి, ఆకాశగంగ, పాపవినాశనం, కుమారధార, రామకృష్ణతీర్థం, తుంబురు తీర్థాలను దర్శించుకోగలిగాం. ఇలా మూడు రోజులపాటు మన తీర్థయాత్రలు ఎంతో ఆహ్లాదాన్ని,ఉల్లాసాన్ని కల్గించాయి. ఆ వేంకటేశ్వరుడే వేంకటదాసు రూపంలో, మునులు ఆ గుంపు రూపంలో వచ్చి మనకు దగ్గరుండి ఏ లోటూ రానీయకుండా అన్నింటినీ చూపించారు. మన జన్మ ధన్యమైంది. అన్నాడు క్షేత్రయ్య మోహనాంగితో.

'తిరుమల గిరులు, ఇక్కడి తీర్థాలు ఇంత అందంగా ఉంటాయని నేనూహించలేదు' అంది మోహనాంగి.

'అందుకే వేంకటేశ్వర స్వామి వెదుక్కొంటూ వచ్చి ఇక్కడ కొలువయ్యాడు' అన్నాడు క్షేత్రయ్య.

'క్షేత్రయ్య గారూ! మీరు ప్రతి తీర్థంలోనూ వేంకటేశ్వరస్వామిని స్తుతిస్తూ పదం పాడుతుంటే, అందుకు అనుగుణంగా అభినయం చేస్తూ మోహనాంగి నృత్యం చేయడం చూసిన మేము ధన్యులం. వేంకటేశ్వరస్వామే మాకీ అదృష్టాన్ని కల్గించాడు. మా పెద్ద కొడుకుకు పదాలంటే చాలా ఇష్టం. మీరు తన్మయత్వంతో ఆశువుగా పాడిన పదాలను మా వాడు గ్రంథస్థం చేశాడు. ఒక ప్రతిని వాడు దాచుకొని, ఇంకో ప్రతిని మీకు సమర్పించి మీ ఆశీర్వాదం పొందాలని మావాడి తపన' అన్నాడు వేంకటదాసు.

వేంకటదాసు కుమారుని దగ్గర తన పదాలు రాయబడిన తాళ పత్రాలను తీసుకొని ఆ కుర్రాడిని ఆశీర్వదించి అందరితోపాటు తిరుమల చేరుకొన్నాడు క్షేత్రయ్య.

వేంకటదాసు అతని గుంపు వీడ్కోలు తీసుకొని వెయ్యికాళ్ళ మంటపంలో విడిది చేయడానికి వెళ్ళిపోయారు. ఉదయాన్నే లేచి తాము తిరుపతికి వెళ్ళిపోతామని చెప్పి సెలవు తీసుకొన్నారు. క్షేత్రయ్య మోహనాంగిలు తమ నివాసానికి చేరుకొని విశ్రమించారు.

'మోహనాంగీ! ఈ రోజు తెల్లవారు జామున సుప్రభాత సేవలో పాల్గొనాలనుకున్నాం కదా? త్వరగా సిద్ధం అయ్యేది. ఈ రోజుటి నుండి మనం ప్రతిరోజు ఒక్కో సేవలో, కైంకర్యంలో పాల్గొందాం' అంటూ మెల్లగా నిద్రలేపాడు క్షేత్రయ్య.

సన్నిధిగొల్ల కాగడా చేతపట్టుకొని ముందుకు నడుస్తుంటే ఏకాంగి మహాద్వారం గుండా వెళ్ళి బంగారు వాకిలి ముందు నిలబడ్డారు. సుప్రభాతం ప్రారంభమైంది. తర్వాత అక్కడున్న భక్తులతో పాటు క్షేత్రయ్య, మోహనాంగిలు కూడా శ్రీవారిని దర్శించుకొని వెలుపలకు వచ్చారు. అక్కడే భక్త బృందాన్ని అదుపు చేస్తున్న ఆలయ స్థానత్తార్ క్షేత్రయ్యను చూశాడు.

'క్షేత్రయ్యగారూ! మీకు అభ్యంతరం లేకపోతే ఈ ఆలయం ముందున్న వెయ్యిగాళ్ళ మంటపంలోని ఆస్థాన మంటపంలో ప్రతిరోజూ ఉదయమో, సాయంత్రమో మీరు పదాలు పాడుతుంటే, మోహనాంగిగారు నృత్యాభినయం చేస్తుంటే మేమూ, మాతోపాటు యాత్రికులు చూసి తరిస్తారు. దయచేసి కాదనకండి. మీరు ఏ క్షేత్రానికి వెళ్తే ఆ క్షేత్రంలోని స్వామి మీద పదాలు పాడారుగా? ఇక్కడ కూడా వేంకటేశ్వరస్వామి మీద పదరచన చేసి పాడండి. మీ పదాలు అజరామరమౌతాయి' అన్నాడు స్థానత్తారు.

'దైవేచ్ఛ... అలాగే ఈ రోజు సాయంత్రం ఆస్థాన మంటపంలో ప్రదర్శన ఏర్పాటు చేయండి. రోజూ మేమున్నన్నాళ్ళు స్వామి దర్శనంతో పాటు, స్వామి సేవ కూడా చేస్తాం'.

'ఇది మామూలు సేవకాదు... వేంకటేశ్వరస్వామికి ఇష్టమైన సేవ' అన్నాడు స్థానాత్తార్.

సాయంత్రం ఆస్థాన మంటపంలో సంగీత, సాహిత్య, నృత్యాభినయాన్ని వీక్షించడానికి భక్తులు, ఆలయ అధికారులు ఆశీనులయ్యారు. వేదిక మీద క్షేత్రయ్య తన్మయత్వంతో–

'ఎవ్వడే ఎవ్వడే ఓ భామ వీడెవ్వడే
ఎవ్వడే నేను పవ్వళించిన వేళ
పువ్వు బాణము వేసి రవ్వ చేసి పోయె
... ... ... ... ...
ఎలమావి తోటలో – నింపొంద నొకనాడు
యెలమి గౌరి పూజ – సలుపుచుండగా
అల మువ్వ గోపాలుడగు వేంకటేశుడు
కలువల శయ్యపై – గలసేమన్నది నిజమై'

అంటూ అచ్చతెలుగు పదాలతో ఆబాల గోపాలాన్ని రంజింపజేసే విధంగా పాడాడు. మోహనాంగి తన నృత్యాభినయంతో ఉద్రూత లూగించింది. అలాగే మరికొన్ని పాటలను చూసిన భక్తజనం తబ్బిబయ్యారు. ఆ రోజుటి కార్యక్రమం ముగిసింది. ఆలయంలోకి వెళ్ళి మళ్ళీ స్వామిని దర్శించారు.

ఆలయ పూజా కార్యక్రమాలను నవ్యదిశలో నడిపే జియ్యంగార్‌కు ఈ విషయం తెలిసి ముచ్చటపడ్డాడు.

'స్థానత్తార్! నేను గుడిలోకి తప్ప వెయ్యిగాళ్ళ మంటపంలోకి రావడం బాగుండదు. క్షేత్రయ్య పదాలు, మోహనాంగి నృత్యాన్ని చూడాని నాకూ అనిపిస్తోంది. గుడిలోని తిరుమల రాయ మంటపం లోని వేదిక మీద వీళ్ళ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగలవా?' అడిగాడు జియ్యంగార్.

'అలాగే స్వామీ! మీ కోరికను క్షేత్రయ్య కాదనగలడా?' అన్నాడు స్థానత్తార్.

మరుసటిరోజు ఆలయ ప్రాంగణంలో క్షేత్రయ్య మోహనాంగీ కార్యక్రమాన్ని చూడడానికి భక్తులు, అర్చకులు, అధికారులేకాదు సాక్షాత్తు మలయప్ప స్వామి, దేవేరులను కూడా వాహన పల్లకీపై తీసుకొచ్చి వేదిక మీద వేం చేయించారు. క్షేత్రయ్య మోహనాంగీలు తమ జన్మ ధన్యమైనట్లు భావించి పాడి ఆడారు.

'నా కోపమే నన్నింత చేసెనమ్మా
రాకేందుముఖి: నావద్ది
రమణులతనిపై చాడి పలుకగ
... ... ... ...
చెలువ! మువ్వ గోపాలుడైన! శ్రీవేంకటేశుడునను
వలరాజు కేళినేలిన! వగలెల్లనిపుడు
తలచి నా మేను గఱగెను! దైవము సగ సాధించెను
నిలుపరాని మోహమాయో! నీవైన దోడితేవే?'

ఇలా కొన్ని పాటలను శ్రీవారి ఉత్సవ మూర్తుల ముందు ఆడిపాడారు. అందరూ పరమానంద భరితులయ్యారు. అన్నమయ్య తర్వాత శృంగార భరితమైన మధుర భక్తి పలువురిని పులకింప జేశాయి.


జియ్యంగార్! అర్చకస్వాములు క్షేత్రయ్యకు తీర్థప్రసాదాలను అందించి శఠారి ఉంచి ఆశీర్వదించారు.

'మోహనా! మనం తిరుమలకు వచ్చి నెల రోజులైంది. స్వామిని వీడాలంటే మనసే రావడం లేదు. ఇక్కడే ఉండిపోవాలని ఉంది. అయితే మన పుట్టిన మువ్వలో కూడా ఈ స్వామే గోపాలుడిగా కొలువున్నాడు కదా? గోల్కొండ నవాబు కోరిక మేరకు పదిహేను వందల పదాలను ఆ మువ్వ గోపాలుడు పలికించాడు. నేడు వేంకటేశ్వర స్వామే నా చేత తన మీద పదాలను పాడించాడు. మనం ఎన్నో ఆస్థానాలను త్యజించి చివరకు అనేక క్షేత్రాలను సందర్శించి కంచి వరదుడి నుండి తిరుమలేశుని వరకు ఎన్నో పదాలను రచించి ఆడిపాడాం. మన జీవితం ధన్యమైంది. నువ్వూ నేను కూచిపూడిలో సహాధ్యాయులుగా ఉంటూ మన మువ్వ గోపాలునితో అనుబంధం పెంచుకొన్నాం. కలిసి మెలిసి తిరిగాం. పెద్దయ్యాక ఇద్దరం ఏకమయ్యాం. నువ్వ భోగకులం దానివని, నిన్ను వీడమని ఎందరన్నా నేను వీడలేదు. మనిద్దరి సాంగత్యాన్ని ఆ మువ్వ గోపాలుడే ఏర్పరచాడు. మనం పెళ్ళాడక పోయినా గొప్ప ప్రేమికులం. మనం ఒకరి కోసం మరొకరం పుట్టాం. నీ అభినయమే లేకపోతే నా పద కవితలు రక్తి కట్టి ఉండవు. ఇక నేరుగా మన మువ్వకు వెళ్ళిపోదాం' అన్నాడు క్షేత్రయ్య.

'వరదా! నీ మనసెరిగి ప్రవర్తించే నాకు నువ్వు ఎక్కడుంటే అదే నా లోకం వెళ్దాం పదా' అంది మోహనాంగి.

తిరుపతికొచ్చి స్థానిక ఆలయాలను సందర్శించి మువ్వకు చేరుకొన్నారు క్షేత్రయ్య మోహనాంగీలు. మువ్వలో క్షేత్రయ్యకు రాజాస్థానాల్లో దక్కిన పరపతికి అందరూ ముగ్ధులయ్యారు. రాజులతో స్నేహం చేసిన క్షేత్రయ్య మువ్వకే గర్వకారణమయ్యాడు. కొన్ని రోజుల్లోనే కృష్ణాష్టమి వచ్చింది. ఊరివారంతా మువ్వ గోపాలుని క్షేత్రాన్ని అలంకరించి సాయంత్రం వార్ధక్యంలో ఉన్న క్షేత్రయ్య తల్లితో పాటు మువ్వలోని ప్రజలంతా మువ్వ గోపాలుని ఆలయ ప్రాంగణానికి చేరుకొన్నారు. కీపాసు పంచ, పైన తెల్లని వస్త్రం, సన్నని శరీరం, ఆజానుబాహుడైన క్షేత్రయ్య సిగ ముడిలో పూలు చూసి క్షేత్రయ్య అందాన్ని పొగుడుకొన్నారు అక్కడి జనం. అలాగే బాగా సింగారించుకొన్న మోహనాంగి రూపాన్ని ఎంతో మెచ్చుకొన్నారు.

క్షేత్రయ్య మువ్వగోపాలుని సన్నిధిలో గానం చేసే పదాలకు మోహనాంగి నృత్యాభినయం వర్ణించనలవి కాకుండా ఉంది. అక్కడి ప్రజలు సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు. చివరిలో గోపాలుని అవతారమే అయిన వేంకటేశ్వర స్వామి మీద పదాలు పాడుతున్నపుడు క్షేత్రయ్య ముఖం చుట్టూ ఒక తేజస్సు ఆవహించింది. క్షేత్రయ్యకు మువ్వ గోపాలునిలో వేంకటేశ్వరస్వామి గోచరిస్తున్నాడు. బాగా అలసిపోయిన వాడిలా నేల మీద వాలిపోయాడు. క్షేత్రయ్య దివ్యాత్మ మువ్వగోపాలునిలో లీనమైంది. పరవశంతో నృత్యం చేస్తున్న మోహనాంగికి అంతా అర్థమైంది క్షేత్రయ్య మువ్వగోపాలునిలో సాయుజ్యం పొందాడని. మోహనాంగి కూడా నృత్యం చేస్తూ మెల్లగా క్షేత్రయ్య మీద వాలిపోయింది.




❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 2 (29) హైదరాబాద్ డిసెంబర్ : 2024

# దళిత సంచార కులాలు : జీవితం – కళలు

**డా. గోపని చంద్రయ్య,** అసోసియేట్ ప్రొఫెసర్, బి.బి.పంత్ సోషల్ సైన్స్ ఇన్స్టిట్యూట్, ఉత్తర ప్రదేశ్.




**వ్యాస సంగ్రహం (Abstract)**

తెలుగు రాష్ట్రాల్లో దళితుల్లో అనేక సంచార కులాలు ఉన్నాయి. ఈ సంచార కులాలు సంఖ్యాపరంగా తక్కువగ వుండి అభివృద్ధికి దూరంగా వున్నారు. అయితే చారిత్రాత్మకంగా దళిత సంచార కులాలు గొప్ప సాంస్కృతిక వారసత్వానికి పునాదులు వేశారు. డక్కలి, చందు, మాష్టి, నులక చందయ్య, బైండ్ల గుర్రం మల్లయ్య, మోసంగ్గి, బెడ బుడగ జంగం మొదలైన కులాలు జానపద కళలకు ప్రాణం పోసి వాటిని నిరంతరం రక్షించారు. వీరు గ్రామాల్లో సంచారం చేసి అనేక కళ ప్రదర్శనలు చేశారు. అయితే సమకాలీన సమాజంలో వస్తున్న సాంకేతిక, ప్రసార సాధనాల ప్రభావంతో వారి జీవితం, కళలు, సంక్లిష్ట పరిస్థితిలో వున్నాయి. దళిత చరిత్రను, సంస్కృతిని, సాహిత్యాన్ని క్రింది స్థాయిలో వున్న దళిత సంచార కులాల జీవిత అనుభవాల నుండి అర్థం చేసుకోవాల్సిన అవసరం వుంది. అప్పుడు మాత్రమే దళితుల చరిత్రను, తాత్వికతలను విస్తృతం చేయగలం. ఈ వ్యాస ముఖ్య ఉద్దేశం క్షేత్రస్థాయి పరిశోధనలో దళిత సంచార కులాల జీవితాన్ని, కళలను పరిచయం చేయడం.

**Key words : దళితులు, సంచార కులాలు, జానపదకళలు, సంస్కృతి**

కులవ్యవస్థలో భాగంగా అనేక వందల కులాలు, అంటబడని కులాలుగా ముద్రవేయబడ్డాయి. ఈ కులాల మధ్య కూడా అసమానతలు, అంటరానితనం నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చి డెబ్బైఐదు సంవత్సరాలు దాటినా దళితులకు అందుతున్న అవకాశాలు, ప్రాతినిధ్యం, గౌరవం అంతంత మాత్రమే. అందునా దళితులో దళితులుగా, అంటరాని వారికి అంటరాని వారుగా ఉన్న దళిత అల్పసంఖ్యాక కులాలకు దక్కుతున్నది శూన్యమని చెప్పవచ్చు. కారణాలు ఏమైనా ప్రతి రాష్ట్రంలో షెడ్యూల్డు కులాలలో ఒకటి లేదా రెండు కులాలు-ఉదాహరణకు తెలుగు రాష్ట్రాల్లో మాలలు, మహారాష్ట్రలో మహర్లు, తమిళనాడులో పరయాలు, పల్లర్లు, కేరళలో పులయాలు, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్లలో చమర్లు కొంతమేరకు అభివృద్ధిని సాధించారని చెప్పవచ్చు. అల్ప సంఖ్యాక దళిత కులాలు కూడా రాజ్యాంగబద్ధంగా షెడ్యూల్డు కులాలే అయినప్పటికీ మాల మాదిగలతో సమానమైన అభివృద్ధిని కాదుగదా కనీస గుర్తింపుకి కూడా నోచుకోలేదు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో షెడ్యూల్డు కులాల జాబితాలో సుమారు 60 కులాలు ఉండగా మొత్తం దళిత రాజకీయాలు, ఉద్యమాలు, అభివృద్ధి అజెండాలు, చర్యలు, వాదోపదాలు అన్నీ కూడా మాల మాదిగల చుట్టూ జరుగుతున్నాయి. కొన్ని భిన్నమైన కులాలు ఒకే గాటనకట్టి షెడ్యూల్డు కులాల జాబితాలో చేర్చారు. ఫలితంగా ఆ జాబితాలోనే ఉన్నప్పటికీ సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన దళిత సంచార జాతులకు లేదా అల్పసంఖ్యాక దళిత కులాలకు అందుతున్న అవకాశాలు, అభివృద్ధి ప్రాతినిధ్యం మాల మాదిగలకంటే కూడా చాలా తక్కువ. దాదాపు ఏమీ అందడం లేదని చెప్పవచ్చు. అయితే ఆ కులాలు ఇప్పుడిప్పుడే మేల్కొని తమ హక్కుల కోసం పోరాడుతున్నాయి.

కులవ్యవస్థ బలపడిన కొద్దీ ప్రతి కులానికి ఒక కులపురాణం పుట్టుకురాగా వీటిని తమ నాట్యం, గానం ద్వారా ప్రదర్శించడానికి కుల గాయక ఉపకులాలుగా కొన్ని కులాలు ఏర్పడినవి. అయితే ఈ కులాలను ఏ పేరుతో సంబోధించాలనే అంశం పై భిన్న అభిప్రాయాలు వున్నాయి. వివిధ సందర్భాల్లో వీరిని ఉపకులాలని, ఆశ్రిత కులాలని, అనుబంధ కులాలని పిలుస్తున్నారు. ఈ కులాలకు వున్న ప్రత్యేక అస్తిత్వం వృత్తి. మారుతున్న సామాజిక, ఆర్థిక సంబంధాల దృష్ట్యా వీటిని అనుబంధ కులాలు లేదా దళిత అల్పసంఖ్యాక కులాలుగా పిలవడం సరైనది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏ కులానికి లేనన్ని అనుబంధ కులాలు మాదిగ కులానికి ఉన్నాయి. అవి మాదిగ జంగం (నుల్క చందయ్యలు), గోసంగి, డక్కలి, మాదిగ మాష్టి, చిందు, కొమ్ము మాదిగ మొదలైన ఆశ్రిత కులాలన్ని వృత్తిగాయక కులాలే. కొన్ని ఆశ్రిత కులాలు సంచారం చేస్తూ కుల పురాణాలను కథల రూపంలోనో, తాళపత్రాలు, పటం ఆధారంగానో గానం చేస్తారు. కులాలు కథలను చెప్పించుకునే అవసరం, ఆలోచన వెనుక తమ కులం తత్వం, మూలాలు, ఔన్నత్యం, అది సమాజ పరిణామ క్రమంలో పోషించిన పాత్రను తరువాతి తరాలకు అందించే ప్రయత్నం ఉంది. ఈ అవసరాన్ని తీర్చడానికి వృత్తిగాయక కులాలు లేదా అనుబంధ కులాలు పుట్టుకొచ్చాయి. ఈ క్రింద మాదిగ అనుబంధ సంచారకులాల పరిచయం చేయడం జరిగింది.

**నుల్క చందయ్య (మాదిగ జంగాలు)**

వీరశైవాన్ని శూద్ర అతిశూద్ర కులాలలో ప్రచారం చేయడం కోసం వివిధ శైవ దేవాలయాల సమీపంలో మఠాలను ఏర్పరిచి మాదిగల నుంచి కొందరిని మఠాధిపతులుగా నియమించిన చారిత్రక క్రమంలో నుల్క చందయ్యలు లేదా మాదిగ జంగాలు పుట్టుకొచ్చారని చెప్పవచ్చు. వీరు తాళపత్రాల ఆధారంగా జాంబవ పురాణాన్ని చెప్తారు. వీరు మాదిగలకు కులగురువుగా వ్యవహరిస్తారు. వీరు వైదిక సమాజంలోని బ్రాహ్మణుల మాదిరిగానే నుదుటి మీద, భుజాల మీద అడ్డనామాలు, మెడలో రుద్రాక్షలు ధరిస్తారు. జంధ్యం కూడా వేసుకుంటారు. తాము మాదిగలకన్నా అధికులమని భావిస్తారు. మాదిగ స్త్రీలను వివాహం చేసుకుంటారు గానీ తమ స్త్రీలను మాదిగలకు ఇవ్వరు. వీరు సంఖ్యాపరంగా తక్కువగా ఉండడం వల్ల ఇప్పుడు మాదిగలతో వివాహ సంబంధాలు కలుపుకొని, మాదిగల్లో కలిసిపోతున్నారు. వీరు నల్గొండ జిల్లా కొలనుపాక, నిజామాబాద్, సిద్ధిపేట్ ప్రాంతాల్లో ఉన్నారు. మరీ చాలా తక్కువ సంఖ్యలో వున్నారు. వీరు చుట్టుపక్కల వున్న శివాలయాల్లో పూజారులుగా కూడా ఉన్నారు. వీరిని ప్రభుత్వం అధికార ఎస్సీ జాబితాలో నులక చందయ్యలుగా గుర్తించలేదు. ఫలితంగా వీరు మాదిగ జంగాలుగా సర్టిఫికెట్ తీసుకునే అవకాశం లేదు. కొందరు మాదిగలుగా సర్టిఫికెట్ తీసుకోవాల్సిన పరిస్థితిలోకి నెట్టేయబడుతున్నారు.

**మాదిగ దాసరి**

దాసరి లేదా మాదిగ దాసరులు వైష్ణవ మతానికి చెందిన మాదిగ గురువు, మాదిగ జంగాలుగానే వీరు వైష్ణవ మత ప్రచారానికి పుట్టుకొచ్చారు. వీరు వైష్ణవ దేవాలయ విధులను నిర్వహిస్తారు. మాదిగ, శుభ, అశుభ కార్యాలకు పౌరోహిత్యం, పెళ్ళిళ్ళు చేయడం, అప్పుడప్పుడు కుల పంచాయితీలను పరిష్కరించడం వీరి పని. కల్వకుర్తి పంజుగుల గ్రామ మాదిగ దాసరులు తమ గురించి ఈ విధంగా చెప్పుకున్నారు. **"మమ్మల్ని తిరుమల దారులంటారు. నోములకు, పండుగలకు, సావులకు మేము మాదిగ పల్లెకు వెళతాం. గ్రామంలోని ఇండ్లను బట్టి మూడు నుంచి పది రోజుల వరకు గ్రామంలోని పెద్ద మాదిగ పల్లెలకు వెళతాం. పల్లె పెద్దదైతే మా కోసం ప్రత్యేకమైన బస వుంటుంది. వంట వీలుకానపుడు వండిన నిండుకుండ నుంచి మాత్రమే తీసుకుంటాం. తిరుగు ప్రయాణంలో మాకు రావల్సిన మిరాశి ధాన్యాన్ని కులపెద్ద సమకూరుస్తారు"** అని చెప్పారు. వీరు కూడా తాము మాదిగల కంటే అధికులమని భావిస్తారు. ప్రస్తుతం తెలంగాణాలో చాలా తక్కువ మాదిగ దాసరి కుటుంబాలున్నాయి. కుడికిల్ల, సాతాపూర్, నాగులపల్లి, పంజుగుల (నాగర్‌కర్నూలు జిల్లా) ప్రాంతాలలో కొన్ని కుటుంబాలున్నాయి.

**బైండ్ల లేదా కొలుపులవారు**

బైండ్లవారు లేదా కొలుపుల వారు మాదిగ ఉపకులం లేదా ఆశ్రిత కులం. వీరు మాదిగలకు పురోహితులుగా పెళ్ళిళ్ళు, కర్మకాండలు చేస్తూ ఉంటారు. గ్రామాలలో ఎల్లమ్మ దేవతలకు పూజారులుగా ఉంటూ ఎల్లమ్మ కథలను గానం చేస్తారు. అలాగే గ్రామాలలో మశూచి, అమ్మవారు, గత్తర, చిన్న పిల్లలకు సందులు లాంటి వ్యాధులు సోకినపుడు 'యంత్రాలు' కట్టి వాటిని అరికట్టే వైద్యులుగా చలామణి అవుతుంటారు. వీరిని వీరు శక్తి బ్రాహ్మణులుగా కొందరు వర్ణించుకుంటారు. బైండ్లవారు అమ్మదేవత భవానీని కొలుస్తారనీ, ఈ దేవత భక్తులను భవానీలు అంటారని, ఈ భవానీలే కాలక్రమంలో బైండ్లుగా మారిందని అంటారు. వీరి ప్రధాన వాద్యం జమిడీక, వీరికి కొన్ని గ్రామాల మేర మిరాశి హక్కు ఉంటుంది. మిరాశి హక్కులున్నవారు తప్ప ఇతరులు వెళ్ళి దేవతల కొలువులు గానీ, వివాహాలు గానీ జరిపించకూడదు. ఈ కట్టుబాటును ఉల్లంఘించిన వారికి జరిమానాతో పాటు కులబహిష్కరణ కూడా విధిస్తారు. దేవుని పేరా దేవాలయ నిర్వహణకు మాన్యాలు ఇచ్చినట్టుగానే వీరికి కూడా మాన్యాలు ఇచ్చేవారు. వీరు కొలుపుల సమయంలో ఇతరులకు అర్థం కాకుండా తమలో తాము మాట్లాడుకోవడానికి సంకేత భాష లేదా పదాలను ఉపయోగిస్తారు. ఉదాహరణకు పైసలు – కంచికాయలు, వడ్లు – జిగిటాల్, సారా – కపట, స్త్రీ – శిరప, మేక – నదువాయి, కోడి – కోరాయి, ఆవు – ఒడిశ, కుక్క – కైక మొదలైనవి. ఇతర సంచార తెగలు కూడా ఇలాంటి సంకేత పదాలను ఉపయోగిస్తారు. బైండ్లవారు తెలంగాణా అంతటా విస్తరించి ఉన్నారు. అన్ని గ్రామాలలో వీరు ఉండకపోవచ్చును గానీ మూడు నాలుగు గ్రామాలకు కలిపి ఒక గ్రామంలో ఉండి తమ వృత్తిని కొనసాగిస్తున్నారు. మాదిగలు క్రిస్టియన్స్‌గా మారడం, పెళ్ళిళ్ళకు బ్రాహ్మణ పూజారులను పిలుచుకోవడంతో బైండ్లవారి సాంప్రదాయక వృత్తి కుంటుపడి వ్యవసాయ ఆధారిత పనులతో ఉపాధి వెతుక్కుంటున్నారు. కొంతమంది పట్టణాలకు వలస పోతున్నారు. వీరు తమ అభివృద్ధి హక్కుల కొరకు బైండ్ల సంక్షేమ సంఘం, బైండ్ల హక్కుల పోరాట సమితి మొదలైన సంఘాల కింద సంఘటితం అవుతున్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం పురోహితులకు జీతాలు ఇస్తుందని ప్రకటించినపుడు వీరు కూడా వివిధ గుళ్ళలో పూజారులుగా ఉన్న తమకు కూడా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**చిందు (చిందోళ్ళు)**

చిందువారు మరొక సంచార మాదిగ ఉపకులం. వీరినే చిందోళ్ళు, సిందోళ్ళు, చిందు మాదిగ అనే పేర్లతో వేరువేరు ప్రాంతాలలో పిలుస్తారు. వీరు సంఖ్యాపరంగా తక్కువ వుండి తెలంగాణ అంతటా విస్తరించి వున్నారు. వీరు మాదిగ జాతి గొప్పతన్నాన్ని తెలియజేసే

జాంబపురాణం, ఎల్లమ్మ కథలతోపాటు రామాయణ, మహాభారతాల్లో శ్రీకృష్ణార్జున యుద్ధం, అల్లీరాణి, రుక్మిణి కళ్యాణం, సీతా వనవాసం మొదలైన కథలను ప్రదర్శిస్తారు. చిందు కళను ప్రపంచస్థాయికి తీసుకువెళ్ళిన చిందుల ఎల్లమ్మది చిందు కులమే. కుటుంబమంతా ఊరూరు సంచారం చేస్తూ ప్రదర్శనలిస్తారు. ఊరి చివర గుడిసెలు వేసుకొని మాదిగ పెద్దతో కట్టడి/త్యాగం మాట్లాడుకొని ప్రదర్శన లిస్తారు. ఏటా వారి మిరాశి గ్రామాలకు వెళ్ళి ప్రదర్శనలిచ్చి తమకు రావాల్సిన కట్టడిని ధాన్యం లేదా డబ్బు రూపంలో తెచ్చుకుంటారు. ఇతర కులాలు కూడా వారికి కొంత కట్టడి ఒప్పుకొని తమ వాడల్లోగాని, తమ ఇంటిముందుగానీ ప్రదర్శనలను ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రదర్శనలు అన్నీ ముగిసిన తరువాత ఎల్లమ్మ కొలువు చేస్తారు. ప్రదర్శనలన్నింటిలోను పురుషులే పాత్రధారులు. కానీ ఒక్క ఎల్లమ్మ వేషం మాత్రం చిందు స్త్రీతో వేయిస్తారు. ఎల్లమ్మ వేషం వేసిన స్త్రీని దేవతగా భావించి గొర్రెపోతులు, బోనాలు సమర్పిస్తారు. చిందు మాదిగలు చెప్పే కథలలో ముఖ్యమైనవి జాంబపురాణం. దీనిని మాదిగ పల్లెల్లో కాకుండా గ్రామ కూడలిలో ప్రదర్శిస్తారు. ఈ కథలో ముఖ్య పాత్రలు గోసంగి వేషంలో ఉండే ఆది జాంబవుడు, సనాతన ఛాందస బ్రాహ్మణుడు. ఆది నుంచి మాదిగలు సమాజానికి చేస్తున్న సేవలను కీర్తిస్తూ, తమను హీన జాతివాడుగా ముద్రవేసిన బ్రాహ్మణవాదాన్ని, దానిని సమర్థిస్తున్న శాస్త్రాలను ఎండగడుతూ సాగుతుంది ఈ ప్రదర్శన. జాంబవుడే సృష్టికి మూలమని, జాంబపురాణమే అన్ని పురాణాలకు మూలమని వీరి అభిప్రాయం. జాంబ పురాణం మాదిగల ఆత్మగౌరవ ప్రకటన. ప్రపంచీకరణ ప్రభావం, ప్రసార మాధ్యమాలు, టీవీ, సినిమాలు విరివిగా రావడం ద్వారా తమ కళలకు ఆదరణ తగ్గిందని చిందు కళాకారులు చెబుతున్నారు. కావున ప్రభుత్వం చిందు కళాకారులను ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసి ఉపాధి కల్పించాలని కోరుతున్నారు. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా చిందుకులం వారు స్థిరనివాసానికి ఇష్టపడుతున్నారు.

**డక్కలివారు**

డక్కలివారు మరొక మాదిగ ఆశ్రితకులం. వీరు అంటరానివారికే అంటరానివారుగా జీవిస్తున్నారు. మాలలు, మాదిగలను తక్కువ కులంగా భావిస్తారు. నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో అట్టడుగున ఉన్న మాదిగలు కూడా అంటరానివారుగా, తక్కువ కులంగా భావించే కులం డక్కలివారు. వీరు తెలంగాణా అంతటా విస్తరించి ఉన్నప్పటికీ సంఖ్యాపరంగా చిన్న కులమే. డక్కలివారు కూడా సంచార కులమే కానీ కేవలం మాదిగల వద్ద మాత్రమే భిక్షాటన చేస్తారు. మాదిగల పుట్టుక, వంశ చరిత్రలను కథలుగా చెబుతూ, తమకు మిరాశి వున్న గ్రామాల్లో మాదిగల దగ్గర మాత్రమే భిక్షాటన చేస్తారు. అంటరానితనం పేరుమీద మాలమాదిగల మీద ఎటువంటి ఆంక్షలు



వుండేవో వీరిమీద కూడా అటువంటి ఆంక్షలే వుండేవి. ఇంకా ఉన్నాయి కూడా. పడుకోవడానికి మంచాలు వాడకూడదు. మాదిగల ముందు చద్దర్లు కప్పుకోవడం, చెప్పులు వేసుకోవడం, మాదిగల ముందు కూర్చోవడం వంటివి నిసేధం. మంచినీళ్ళుగానీ, వాడకపు నీళ్ళు గాని బావుల నుంచి స్వయంగా తోడుకోకూడదు. డక్కలువారిని చిందుమాదిగలు, మాదిగ మాష్టీలు కూడా అంటరానివారిగానే చూస్తారు. సంచార జీవితంలో భాగంగా మిరాశి ఉన్న గ్రామాలకు వెళ్ళి ఊరు చివర గుడిసెలు వేసుకొని జాంబపురాణాన్ని కథల రూపంలోనో, పటం ఆధారంగానో చెబుతారు. తమ త్యాగం ముట్టిన తరువాత వారే గ్రామానికి వెళతారు. గాడిదలను, పందులను పెంచుకుంటారు. తమ సామాగ్రి రవాణాకు గాడిదలను వాడతారు. గ్రామాలలో గాడిదపాలు కూడా అమ్ముతారు. డక్కలి వాళ్ళలో కిన్నెర వాయించే డక్కలి కుటుంబాలు కూడా మనకు తెలంగాణాలో కనిపిస్తాయి.

**మాదిగ మాష్టి :**

మాదిగ మాష్టీలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలో విస్తరించి వున్న మరొక మాదిగ ఉపకులం. సాహసాలతో కూడిన గారడీ విద్యలు ప్రదర్శిస్తూ, మాదిగల గృహావసర వస్తువులైన కర్ర, సామాగ్రి, ఉట్లు, సోలి, తెడ్డు, డప్పు, కుదురులు, పీటలు, మంచాలు తయారుచేసి అమ్ముకుంటూ, మాదిగల వద్ద వారికున్న మిరాశి హక్కులను బట్టి వారు ఇచ్చే 'త్యాగం'తో జీవించేవారు. మాష్టీవారు వారికి వాళ్ళు 'మాస్టర్‌లు' అని అభివర్ణించుకుంటారు. ఈ కుటుంబాలు కమ్మరి పని కూడా చేస్తారు. వీరికి వేటలో కూడా ప్రావీణ్యం వుంటుంది. పూర్వపు సైన్యాలలో అంటరాని కులాలైన మాదిగలు యుద్ధాలలో శూరభటులుగా, గోసంగి దళాలుగా, యుద్ధభేరి మోగించే వారిగా, కొమ్ము బూరలు ఊదేవారుగా, తప్పెట్లు మోగించే వారుగా ప్రత్యేక స్థానం కలిగి వుండేవారు. తాళ్ళపల్లి మనోహర్ తన పుస్తకంలో (2016) చెప్పినట్లుగా 'మాష్టి' అనే పదం 'ముష్టి' నుంచి వచ్చి ఉండవచ్చు. ముష్టికి 'పిడికిలి బిగించడం', 'భిక్షమడగడం' అనే రెండు అర్థాలున్నాయి. ముష్టీలు వివిధ కులాలకు ఆశ్రిత కులాలుగా ఉన్నాయి. ఉదాహరణకు వైశ్యులకు వీరముష్టీలు లేదా వీరు మాష్టీలు. గొల్లలకు ముష్టి గొల్లలు లేదా గొళ్ళ ముష్టీలు. మాలలకు మాల

మాష్టీలు. మాదిగ మాష్టీలు కూడా సంచార జీవులే. ఇతర కులాలతో పెద్దగా సంబంధాలు ఉండవు. మాదిగలు వీరిని అంటరానివారుగా చూడనప్పటికీ వైవాహిక సంబంధాలు ఉండవు. ఈ కులంలో కూడా వివిధ కారణాల వల్ల సంచార జీవితం ఆగి, స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే పట్టణ ప్రాంతాలకు యువత వెళ్ళి అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. వీరు క్రమంగా మాదిగలతో వివాహ సంబంధాలు పెంచుకుంటున్నారు.

**గోసంగి :**

ప్రధానంగా నిజామాబాద్ ప్రాంతంలో ఉండే మరో మాదిగ ఉపకులం గోసంగులు. కోసంగులను గొసికే వారని, గుడిసెల వారని, శారదకాండ్లని, కాటిపాపలని, బైరూపుల వారని, బాలసంతు వారని కూడా పిలుస్తారు. వీరు తమకు వచ్చిన జానపద కళలను ప్రదర్శిస్తూ భిక్షాటన చేసుకుంటూ గ్రామాలలో, పట్టణాలలో జీవిస్తున్నారు. వీరిలో కొందరు రామాయణం, మహాభారతం, బొబ్బిలి యుద్ధం, జగదేకవీరుని కథ, కాంబోజ రాజు, బాల నాగమ్మ, గాంధీ, నెహ్రూ వంటి బుర్రకథలు చెప్పారు. మరికొందరు గొల్ల మల్లయ్య, మందగొల్ల కథలను చెప్పుకుంటూ గొల్లల దగ్గర భిక్షాటన చేస్తారు. కాటి కాపరులు పగటి వేషాలు వేసుకొని శవాల దగ్గర అడుక్కుంటారు. భైరవులవాళ్ళు పిట్టలదొర వేషం వేసుకొని దంబాచారంతో యాచకవృత్తిలో ఉన్నారు. మరికొందరు బలసంతు వేషం వేసుకొని తెల్లవారుజామున జనాలను నిద్రలేపుతూ పాటలు పాడుతూ భిక్షాటన చేస్తారు. కొంతమంది తోలుబొమ్మలాటలు ఆడతారు. గోసంగులందరినీ ఒక్కతాటిపై తేవడానికి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడానికి 1978 లోనే కీ.శే. లక్ష్మణ్ మహారాజ్ బోధన్ ఆధ్వర్యంలో **'నిజామాబాద్ జిల్లా గోసంగి సంఘం'** ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు వివిధ సంఘాలు గోసంగుల సంక్షేమం కోసం పని చేస్తున్నాయి. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరిగితే తమను ఎస్సీ–బి మాదిగ ఉపకులంగా చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

**బెడ బుడగ జంగం**

12వ శతాబ్దంలో కుల, మత అసమానతలకు వ్యతిరేకంగా బసవేశ్వరుడు వీరశైవం స్థాపించాడు. వీరశైవంలో సమాజంలోని అన్ని కులాల నుంచి చేరారు. వైష్ణవ, వీరశైవానికి తీవ్రమైన భావజాల యుద్ధం జరిగింది. బసవేశ్వరుడు శూద్ర, అతిశూద్ర కులాలలో వీరశైవాన్ని వ్యాపించచడానికి అనేక మఠాలు ఏర్పాటు చేశాడు. అతని అనుచరుల్లో ఒకడైన కిన్నెర బ్రహ్మయ్య కంసాలి, నుల్క చందయ్య మాదిగ, మడివాలు మాచయ్య మొదలైనవారు దీని అభివృద్ధికి కృషిచేశారు. ఆనాటి సమాజంలో వీరశైవం తీసుకున్న వారు సామాజికంగా ఆధిక్యతను సాధించారు. ఉదాహరణకు వీరశైవం తీసుకొని బ్రాహ్మణులకంటే వీరశైవం తీసుకున్న బ్రాహ్మణులు అధికులమని, మామూలు శూద్రులకన్నా వీరశైవం తీసుకున్న శూద్రులు అధికులమని, మాలల నుంచి వీరశైవం తీసుకున్న మాలజంగాలు అధికలమనే భావనను ఆపాదించుకున్నారు.

బసవేశ్వరుని మరణానంతరం వీరశైవానికి ప్రాధాన్యత తగ్గి కొన్ని ప్రాంతాలకే పరిమితమయింది. బలమైన వైదిక వైష్ణవం, ముస్లీంల పాలన వీరశైవంలో పూర్తిగా నశించని కులతత్వం వల్ల మళ్ళీ కులవ్యవస్థ బలపడి వివిధ కొత్త కులాలు దీని నుంచి పుట్టుకొచ్చాయి. అలా వచ్చిన కులమే 'జంగం'. ఆచారాలు, విశ్వాసాలు, ఆహార అలవాట్లు, స్థాయి బేధాలను బట్టి మహేశ్వర జంగం, స్థావర జంగం, జంగమదేవర, జంగమయ్యలు మొదలైన కులాలు అగ్రవర్ణాల్లో ఏర్పడగా; శూద్ర, అతిశూద్ర కులాల్లో మాలజంగం, బేడజంగం, బుడగ జంగం కులాలు ఏర్పడ్డాయి.

బుడగ జంగాలు బుడగలు వాయిస్తూ జానపద కథలు చెప్తారు. ఉదాహరణకు బాల నాగమ్మ కథ, బల్మూరికొండయ్య కథ, కాంభోజరాజు కథ, అల్లీ రాణి కథ మొదలైన కథలు చెబుతూ సంచారం చేస్తారు. ఆడ లేదా మగవారు లేదా ఇద్దరు కలిసి ఒక కళాబృందంగా ఏర్పడి ఒకరు కథ చెబుతుండగా మిగతావారు వంత పాడుతారు. వీరు మాంసాహారులు. ఎలుకలు, ఉడుములు, ఉడతలు, తాబేళ్ళు, పంది, రకరకాల పిట్టల్ని పట్టి తింటారు. ఎద్దు మాంసాన్ని తినరు. వీరు వేటలో నేర్పరులు, వేటకు ఉపయోపడే ఉరులు, గూటాలు, కడెం దోర్నాలు, దోటిగాలాలు, శివ్వఉచ్చులు, ఊదర గొట్టాలు, రకరకాల వలలు, బోనులు, మేటులు తయారుచేయడంతో పాటు వాటిని వాడడంలో వీరు మంచి ప్రావీణ్యం వున్నవారు బుడగజంగం మహిళలు ఈత చాపలు అల్లి అమ్ముతారు.

వీరు పెద్దగోసాయి, మైసమ్మ, పోచమ్మ, సంకులమ్మ, అంకమ్మ, సమ్మక్క, సారక్క మొదలైన గ్రామదేవతలను మొక్కుతారు. బుడగ జంగాలకు గోత్రాలు ఉండవు. ఇంటిపేరు ఆధారంగానే పెళ్ళిళ్ళు జరుగుతాయి. వితంతు పునర్వివాహం, బహుభారత్వం వీరిలో వున్నవి. వీరిలో తగాదాలు, వివాదాలు వస్తే కుల పంచాయితీలో చర్చించుకోవడం, పరిష్కరించుకోవడం జరుగుతుంది. దీనికి పుల్లికట్టే పద్ధతిని ఆచరిస్తారు. పెళ్ళిళ్ళు, కర్మకాండలు, దయ్యాల, దేవరళ మొక్కులలో కులపెద్ద ప్రధానపాత్ర పోషిస్తాడు.

ఈ కులాల అభివృద్ధికోసం వివిధ సంఘాల ద్వారా ఈ కులనాయకులు పనిచేస్తున్నారు. 1971లో వీరు కులసంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు వీరు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వున్నారు. అయితే తెలంగాణాలో ఎస్సీలుగా ప్రభుత్వం గుర్తించగా, ఆంధ్రప్రదేశ్‌లో వీరిని ఎస్సీలుగా గుర్తించలేదు. వీరు ఎస్సీలుగా గుర్తింపు కోసం పోరాటం చేస్తున్నారు. బెడ(బుడ్గ) సంక్షేమ సంఘం, బుడగ జంగం హక్కుల దండు, బుడగ జంగం హక్కుల పోరాట సమితి మొదలైన సంఘాల ద్వారా కులాభివృద్ధికి

పనిచేస్తున్నారు. ఇప్పటికీ ఈ కులంలో సంచారం చేసేవారి సంఖ్య ఎక్కువ.

మాదిగలలో లాగే మాలలో కూడా ఉపకులాలున్నాయి. ఉదాహరణకు, అనాముక్, ఫిరెమాల, అరవ మాల, బ్యాగరి, బారికి, చలివాది, ఎల్లమ్మవాండ్లు, హొలియా దాసరి, మదారి కురువ, మహార్, మాలసాలె, మాల సన్యాసి, మన్నె, నీరటికాడు, నేతకాని మొదలైన కులాలు వున్నాయి. ఎస్సీ వర్గీకరణ ఉద్యమం వచ్చిన తరువాత మాదిగ, మాదిగ ఆశ్రిత కులాలపై కొంత పరిశోధన జరిగింది. కొన్ని రచనలు వచ్చాయి. కానీ మాల, మాల ఉపకులాలపై జరిగిన పరిశోధనగాని వెలువడిన రచనలుగానీ తక్కువే. పూర్వ కాలంలో గ్రామాలను దొంగలు, దోపిడీదారుల నుంచి కాపాడడం కోసం రక్షకభటులుగా పనిచేసిన కులం సుంకర కులం. ఇప్పటికీ కొన్ని గ్రామాలలో సుంకరులుగా మాల ఆశ్రిత కులాలున్నాయి. పంట పొలాలకు నీరుపెట్టే పనిని 'నీరటికాడు' అంటారు. పూర్వపు రోజుల్లో ఈ 'నీరటికాళ్ళు' చెరువులకు కాపలా కాయడం, తూముల ద్వారా నీటిని వదలడం చేసేవాళ్ళు. చచ్చిన వారికి బొందలు తవ్వడం, దహనం అయ్యే వరకు అన్ని పనులు చేసేవారు. మాల బేగరులు ఇప్పటికీ తెలంగాణాలో ఉన్నారు. నేతకాని కులంవారు అంటరాని కులాల వారికి బట్టలు నేసి ఇచ్చేవారు. అదేవిధంగా గ్రామంలో బొడ్రాయి పండుగ నుంచి ముత్యాలమ్మ, మైసమ్మ, పోచమ్మ, గంగమ్మ, కట్టమైసమ్మ మొదలైన అతిశూద్ర కులాల దేవతలకు పూజలు, ధూప దీప నైవేద్యాలు ముందుండి చూసుకునేది మాల పంబాలవాళ్ళు. మాలలకు అంటరాని వారిగా అట్టడుగున ఉన్నవారు గుర్రం మాలలు. లేదా గుర్రం మల్లయ్యలు. వీరు కూడా సంచార జీవులే. వీరు బేతాళ పురాణం, చెన్నయ్య పురాణం లాంటి కథలు పటం రూపంలో చెబుతారు. మాలల వద్ద 'త్యాగం' తీసుకుంటూ ఊరూరు తిరుగుతారు. వీరు ఇప్పుడు కరీంనగర్ జిల్లా సిరిసిల్ల దగ్గర వెంకటాపురం, వరంగల్ జిల్లా అనంతారం, నల్గొండ జిల్లా తానేదార్‌పల్లిలో ఉన్నారు.

**ముగింపు**

కులవ్యవస్థలో భాగంగా పుట్టుకొచ్చిన అంటబడని, చూడబడని కులాలు కొన్ని వందల సంఖ్యలో భారతదేశంలో వున్నాయి. వాటివిభిన్నమైన సామాజిక, సాంస్కృతిక ఆర్థిక అస్తిత్వాలు, ఏ రెండు అంటబడని కులాలు ఒకే స్థాయిలో, ఒకే రీతిలో దోపిడీకి, అణచివేతకు, అవమానాలకు గురికాలేదు. వారిలో వివిధ స్థాయిలలో ఈ అసమానతలు, అవహేళనలు తమ జీవితాల్లో భాగమైనాయి. ఈ భిన్నమైన కులాల చరిత్ర పొడువునా అణచివేయబడి జీవితాన్నే కాదు, ఉత్పత్తిలో సామాజిక విజ్ఞానం, సాహిత్య కళాసంపదలను సృష్టించి ఆధిపత్యాలకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర వారసత్వాన్ని అందిస్తున్నాయి. ఈ వారసత్వాన్ని అందిస్తున్న మాదిగ, మాల అనుబంధ కులాలు లేదా దళిత అల్పసంఖ్యాక కులాల జీవితాలను



వారిలో వస్తున్న మార్పులను సరిగా అవగాహన చేసుకొని వారికి సమాజంలో సమానవాటా, గౌరవం దక్కేదిశగా ప్రభుత్వాలు, ప్రజాఉద్యమాలు తోడ్పడవలసిన అవసరం వుంది.

**ఉపయుక్త గ్రంథాలు**


1. ఎన్.ఆర్.వెంటేశం, 2002 'బుడ్గ జంగం దర్శిని', దివ్యదీప్తి ప్రచురణలు, హైదరాబాద్
2. పులికొండ సుబ్బాచారి, 2000, 'తెలుగులో కులపురాణాలు; ఆశ్రిత వ్యవస్థ', పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్.
3. పులికొండ సుబ్బాచారి, 2008; 'కొలనుపాక, నులక చందయ్యల ఆదిజాంబవ మహాపురాణము, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
4. జయధీర్ తిరుమలరావు, 2013 'తొవ్వ ముచ్చట్లు'; మొదటి భాగం, స్ఫృహ సాహితీ సంస్థ, హైదరాబాద్;
5. జయధీర్ తిరుమలరావు, 2017, 'తొవ్వముచ్చట్లు'; రెండవ భాగం ; సాహితీ సర్కిల్, హైదరాబాద్
6. డా.కె.ముత్యం (సంపాదకుడు), 2006, 'నేను చిందుల ఎల్లమ్మను'; దృష్టి ప్రచురణలు, హైదరాబాద్.
7. గనిశెట్టి రాములు, 2015 'గోసంగులు ఎవరు', గోసంగి సంక్షేమ సంఘం, కమ్మరిపల్లి, మోర్తాడ్ మండలాలు.
8. గడ్డం మోహన్‌రావు, 2013, 'చిందుల ఎల్లమ్మ', చిందు పబ్లికేషన్స్, హీజీపూర్.
9. తాళ్ళపల్లి మనోహర్ (సంపాదకులు), 2016, 'మాదిగల సంక్షిప్త చరిత్ర', ప్రాగ్మా పబ్లికేషన్స్, హైదరాబాద్.
10. T.R.Singh, 1969, 'Th Madiga: A study in social structure and Change', Ethnographic and Folk culture society, Lucknow, UP?.


❖ ❖ ❖ ❖ ❖

## ఆదిత్య హృదయ మహిమ

**"ఆదిత్యః సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్**
**సువర్ణ సదృశో భాను ర్హిరణ్యరేతా దివాకరః"**

ఇందులో ఆదిత్యుడు, సవిత, సూర్యుడు, ఖగుడు, పూష, గభస్తిమంతుడు, సువర్ణసదృశుడు, భానువు, హిరణ్య రేతసుడు, దివాకరుడు అని పది నామాలు ఉన్నాయి.

**1. ఆదిత్యుడు :** అదితి అనే కశ్యప ప్రజాపతి ధర్మపత్నికి పుట్టినవాడు. ప్రధానంగా ఇవన్నీ తత్త్వార్థ సంబంధం కల పదాలు కనుక అఖండ జ్ఞానరూపమై తెలియవచ్చేవాడు అని ఈ పదానికి అర్థాన్ని సంభావించాలి.


**2. సవితా :** "సువతి సుప్తం ప్రేరయతి" అని గురుబాల ప్రబోధిక ఈ పదానికి విగ్రహాన్ని చెప్పింది. నిదురించి ఉన్నవానికి మేల్కొల్పేవాడు అని దానికి అర్థం. ఇక్కడ 'నిద్ర' అంటే ప్రతీకాత్మకంగా అజ్ఞానం. అజ్ఞానంలో ఉన్నవానిని జ్ఞానం వైపునకు మళ్ళించడం ప్రేరణ. ఆ పనిచేసేవాడు సవిత. సర్వ నియమాలతో గాయత్రీ మంత్రాన్ని జపింపలేనివారికోసం దయామూర్తులైన ఋషులు ఆ మంత్రార్థాన్నంతటినీ కడుపులో నింపుకొన్న ఒక శ్లోకాన్ని లోకానికి ప్రసాదించారు. మంత్రాన్ని స్వరాది నియమాలు పాటించకుండా లౌకికమైన పద్యం లాగానో, పాటలాగానో చదవటం వల్ల అర్థం సిద్ధించక పోగా అనర్థాన్ని పుష్కలంగా మన నెత్తిమీద రుద్దుతుంది. ఈ ప్రమాదం నుండి జనులను కాపాడటానికీ, అర్థ ప్రాప్తిని పొంది ఆనందం అనుభవించటానికీ కరుణావరుణాలయులైన మహర్షులు మనకు శ్లోకాన్ని అనుగ్రహించారు. సమర్థుడు మంత్రాన్ని జపించి ఏ ప్రయోజనం పొందుతాడో, అసమర్థుడు శ్లోకాన్ని పారాయణ చేసుకొని అదే ప్రయోజనం పొందుతాడు. ఆ శ్లోకం.

**"యో దేవః సవితాஉస్మాకం ధియో ధర్మాది గోచరాః**
**ప్రేరయేత్ తస్య యద్భర్గః తద్వరేణ్య ముపాస్మహే"**

యః – ఏ; సవితా – సవిత అను పేరుగల; దేవః – దేవుడు; అస్మాకమ్ – మనకు సంబంధించిన; ధర్మ+ఆది, గోచరాః – ధర్మము మొదలైనవానియందు ప్రచరించే; ధియః – బుద్ధులను; ప్రేరయేత్ – ప్రేరణ చేయుచుండునో; తస్య – అట్టి దేవుని; భర్గః – తేజస్సు; యద్ – ఏది కలదో; వరేణ్యం – మిక్కిలి శ్రేష్ఠమైన; తత్ – దానిని; ఉపాస్మహే – ఉపాసింతుము. (సశేషం)

(ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి)


## సత్సంగం



### అలజడి లేని జీవితం

నిజమైన ప్రేమ సదవగాహనని కలిగిస్తుంది. వాస్తవాన్ని అంగీకరించటం వల్ల అలజడి పోతుంది.

అన్ని మతాలూ అహంభావరహితంగా ఉండటానికి పద్ధతులు చెప్తాయి. అహంకారయుతంగా ఉండటం గూర్చి కాదు! మనస్సులో ఆలోచనలు ఎక్కువైన కొద్దీ శక్తి తగ్గిపోతుంది. పూజ, జపం వంటివి ఏకాగ్రతను పెంచుకోవటానికి సాధనాలు. అవి సాధనాలే కాని సాధ్యాలు కావు. ఈ విషయం మరచిపోగూడదు. అసలు లక్ష్యం ప్రశాంతత, నిశ్చలత, ప్రతి మతంలోనూ కొన్ని కర్మలు నిర్దేశింపబడియున్నాయి. ప్రారంభదశలో అవి అవసరమే. ఒక వృక్షం ఎదిగినట్టే యిదీను. ముందర విత్తుని నాటుతాం. అది మొలకలెత్తుతుంది. అది చిన్న మొక్కగా ఉన్నప్పుడు గొడ్లు తినేయకుండా దాని చుట్టూ కంచెవేస్తాం. అది పెద్ద చెట్టయిన తర్వాత దానికి ఒక ఏనుగుని కూడా కట్టవచ్చు. మన మానసిక, ఆధ్యాత్మిక ప్రగతి విషయంలోనూ ఇంతే. ప్రారంభ దశలో మతాచారాలు కంచె వంటివి. ఆధ్యాత్మిక పురోగతి కలిగిన తర్వాత ఆ కంచెని తీసివేయవచ్చు.



కర్మయోగం వల్ల ఆనందం కలుగుతుందని గీత చెపుతుంది. "నీ ధర్మాన్ని నీవు నైపుణ్యంతో నిర్వహించు, ఫలితం గురించి పట్టించుకోక. ఒకోసారి కృతార్థుడవవుతావు. ఒకోసారి కావు. నీ కర్మ ఫలితాలు నీ ఆధీనంలో లేవు." ఈ విధంగా పని చేస్తే చాలావరకు అలజడి లేకుండా ఉంటావు. చేసిన పని సఫలం కాదన్న భయమే అలజడికి కారణం. విఫలమవుతుందన్న భయం లేకుండా పని చేసినప్పుడు ఎంతో ఏకాగ్రత కలుగుతుంది. ఈ తత్త్వమే మహాత్మాగాంధి వంటి నాయకులను ఉత్తేజ పరిచింది. నిలిపింది. "కార్యాచరణలో నైపుణ్యమే యోగమంటే" నన్నాడు శ్రీకృష్ణుడు. ఏ పనినైనా బాగా చేసినవానికదే గొప్ప సంతృప్తి.

బాంక్‌లో కాషియర్ వలె పని చెయ్యాలి ప్రతి మానవుడూను. కాషియర్ చేతులమీదుగా ఎంతో డబ్బు వెళ్తుంది. ఆ డబ్బునంతా ఎంతో జాగ్రత్తగా, శ్రద్ధగా లెక్కపెడ్తా డతను. కాని తన చేతుల మీదుగా మారే ఆ డబ్బంటే అతనికి మమకారముండదు. అది తనది కాదని అతనికి తెలుసు. కాని ఆ డబ్బుని అతి ఎంతో జాగ్రత్తగా లెక్కపెట్టాలి. ఆ విధంగానే మన ధర్మాన్ని ఎంతో శ్రద్ధతో, మమతా రాహిత్యంలో నిర్వహించాలి. ఈ విధంగా చేస్తే ఎవ్వరికీ అలజడే ఉండదు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 2

UGC CARE List Approved Journal
హైదరాబాద్ డిసెంబర్ : 2024

# గంగు కిషన్ ప్రసాద్ కవిత్వ, విమర్శ ప్రస్థానం

**కొడుపుగంటి సంతోష్,** పరిశోధకులు, తెలుగుశాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9010384003



అది 2012-13 విద్యాసంవత్సరం. నేను ఎం.ఏ. తెలుగు ప్రథమ సంవత్సరంలో చేరాను. అధ్యాపకులందరు తమ పాఠాలను ఒక్కొక్కరు ఒక్కో విధమైన శైలిలో బోధించారు. గంగు కిషన్‌ప్రసాద్ గారు ప్రాచీన సాహిత్యాన్ని, వ్యాకరణ శాస్త్రాన్ని, భాషా శాస్త్రాలను, అలంకార శాస్త్రాన్ని, తెలుగువారి చరిత్ర సంస్కృతిని సందర్భాన్ని బట్టి ఇతర అంశాల గురించి బోధించేవారు. నా పరిచయం వారితో అప్పటి నుండి ఉంది. కిషన్ ప్రసాద్‌గారు పాఠ్యభాగాలను బోధించాక చూస్తే ఒక గ్రాఫ్ ఉండిపోతుంది. ఆ గ్రాఫ్‌లోనే పాఠం అంతా ఇమిడిపోయి ఉంటుంది. ఈ విధమైన విలక్షణమైన శైలి వీరి సొంతం. మింగుడు పడని ప్రాచీన పద్యభాగం, వ్యాకరణ, భాషాశాస్త్రాలు, అలంకార శాస్త్రాలు మొదలైనవన్నీ కదళీపాకంగా విద్యార్థులకు మారిపోతాయి. సాహిత్యం అంటే ఇష్టం ఉన్న విద్యార్థులలో కూడా, సాహిత్య ప్రక్రియలలో ఆసక్తిలేని నిర్జీవఅంశాలను వీరు కనుక బోధిస్తే ఆసక్తి రేకెత్తించే చైతన్యాంశాలుగా మారి విద్యార్థులకు మస్తిష్కంలో సదా నిలిచిపోతాయి. ఎంత అల్లరి విద్యార్థులైన వీరి తరగతిలో సాహిత్యపు వినువీధులలో ఊయలలూగుతారు. పాఠాలను బోధిస్తూనే వివిధ ప్రక్రియలపై వందల వ్యాసాలు రాసి జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పత్రసమర్పణ చేసారు. వాటిలోనుండి వారి కవిత్వ విమర్శను మాత్రమే ఈ వ్యాసంలో చర్చిస్తాను.

కవిత్వం చాలా ప్రాచీన ప్రక్రియ అయినా కవిత్వ చరిత్ర అంతా ప్రధానంగా పురుషులకిగానే ఉందని ప్రాచీన కవిత్వంలో స్త్రీలు ఒక శాతం మాత్రమే ఉన్నారని, ఆధునిక యుగంలో విద్యావకాశాల వల్ల సామాజిక ఉద్యమాల వల్ల స్త్రీలు కవులు కావటానికి పరిస్థితులు కలసి వచ్చాయని, అయినా ఆధునిక కవుల సరసన స్త్రీలకు సముచితమైన స్థానం లభించలేదని తెలిపారు కిషన్‌ప్రసాద్‌గారు. ఆధునిక కవుల చరిత్రలో ఉపాతీకరించబడిన కవయిత్రులను వాళ్ళ కవిత్వధోరణులను పరిచయంచేస్తూ 1951లో ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ ఆంధ్రకవయిత్రులు అనే గ్రంథాన్ని ప్రచురించిందని పేర్కొన్నారు.

సంస్కరణోద్యమ కాలం నుండి జాతీయోద్యమ కాలం వరకు నాటి సామాజిక రాజకీయ పరిణామాల ఫలితంగా స్త్రీల జీవిత చైతన్యాలలో వచ్చిన మార్పులను వివరిస్తూ **'స్త్రీల కవిత్వం-చైతన్యం'** అనే వ్యాసం రాసారు. 47 సంవత్సరాలలో (1900-1947) 14 మంది స్త్రీలు రాసిన 48 కవితలను పరిశీలించారు. స్త్రీల కవిత్వం భావకవిత్వం ప్రభావాలతో ప్రారంభమై జాతీయోద్యమ కవిత్వంగా ఎదిగిందని పురుషనిర్మితమైన సాహిత్య చరిత్రలో జాతీయోద్యమ చైతన్య కవిత్వ సృజన కర్తలుగా స్త్రీలకు సరియైన స్థానం లభించలేదని వివరించారు.

తెలుగులో **'20వ శతాబ్ది తొలి ఐదు దశాబ్దాల స్త్రీల కవిత్వం'** అనే వ్యాసంలో 132 మంది కవయిత్రులు 252 రచనలు చేసారని, పద్యకవిత్వం రాసినవారు, వచన కవిత్వం రాసినవారు పాటలు రాసినవారు మూడింటిలోను తమ ప్రతిభను చూపిన వారు, కేవలం శతకాలు మాత్రమే రాసిన వారున్నారని తెలియజేశారు. వీరి రచనలను పది రకాలుగా విభజించారు. ప్రకృతి కవిత్వం, ప్రణయ కవిత్వం, వేదాంత కవిత్వం పండగల కవిత్వం, దైవభక్తి కవిత్వం, పిల్లల కవిత్వం, సంస్కరణోద్యమ కవిత్వం జాతీయోద్యమ కవిత్వం అభ్యుదయోద్యమ కవిత్వంగా విభజించి విశ్లేషించారు.

సంఘసంస్కరణ, జాతీయోద్యమ, అభ్యుదయోద్యమాల సంబంధం లోకి వచ్చి ఆ ఉద్యమ ఆశయాలతో ఆచారణలతో ప్రభావితమవుతూ స్త్రీలు తమనుతాము ఉద్ధరించుకోవాలని ఆరాటపడటం, అదే సమయంలో జాతీయ అంతర్జాతీయ అధికారాలనుండి విముక్తిని ఆశించటం 1900-1950 మధ్యకాలపు స్త్రీల కవిత్వంలో కనబడే జీవవంతమైన శక్తి అని అభిప్రాయపడ్డారు.

కిషన్‌ప్రసాద్‌గారు రాసిన మరోవ్యాసం **'నాయని కృష్ణకుమారి - కొలకలూరి స్వరూపరాణి కవిత్వం-భారతీయ సంస్కృతి'** ఈ వ్యాసంలో నాయని కృష్ణకుమారి కవితల్లో ఆశావాదం ఎక్కువగా కనబడుతుందని, ఆశతో జీవించడం లక్ష్యంవైపుకు సాగిపోవటం మానవ జీవన విలువలుగా భారతీయ సంస్కృతిలో కనిపిస్తాయని పేర్కొన్నారు. కృష్ణకుమారి గారికి ఉన్న వ్యవస్థతతో సంతృప్తిలేదని, మార్పుకావాలని, కానీ తనుకోరుకున్న మార్పులో విప్లవానికి గాని, నిరాశకుగాని

తావివ్వలేదని, ఈ భావాలు మనకు ఆమె రాసిన 'నిత్యదు:ఖిత', 'కదులుతున్న అగ్ని' 'విశాఖ నానెచ్చెలి' కవితల్లో కనబడుతాయని తెలియజేశారు. కాలగమనంలో తప్పనిసరిగా తాను ఆశించిన మార్పులు జరుగుతాయని తన కవితల్లో ఆశావాదం వ్యక్తం చేసిందని, రాబోయే కాలం కోసం సహనంతో ఎదురుచూడాలని తెలియజేసిందని తెలిపారు. శ్రీమతి కొలకలూరి స్వరూపరాణి రాసిన "గంగావతరణ శివతాండవం" అనే ద్విపద కావ్యం, 'చంద్రగ్రహణం' అనే పద్యకావ్యం 'ప్రభోదమనే'వచన కవితా సంపుటిని విశ్లేషించారు వ్యాసకర్త.

సమాజ సమస్యలను పరశీలించి చూచి వాటిని చిత్రించడం, మౌళికమైన కారణాలు అన్వేషించడం, పరిష్కారమార్గాలను సూచించడం, వీరి కవితల్లో ఎంతో ముఖ్యమైనదని తెలిపారు కిషన్ ప్రసాద్‌గారు. దారిద్ర్యం, దోపిడి, కులమత విద్వేషాలు ఇంకా ఎన్నో సమస్యలు సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయని వీటిని వ్యవస్థలో నుండి తీసిపారేయాలనే విషయాన్ని "ప్రబోధం" గేయసంపుటి ఉపదేశిస్తుం దని పేర్కొన్నారు. అభ్యుదయ దృష్టితో రాసిన ఈ కవితా సుంపుటిలో భారతీయ సంస్కృతి ధోరణులు కనబడతాయని తెలియజేశారు.

'మత కల్లోలం' కవితలో శైవం, వైష్ణవం, ముస్లిం అంటూ మానవత్వం మాని, మతం పేరుతో పోట్లాడుతున్న సమాజానికి ఇది పనికి రాదని, మనిషి పురోగతి కోసం, సామరస్యం సమభావన, మానవత్వం కలిగి ఐక్యతతో సమాజాన్ని అభివృద్ధిపథంలో నడిపించా లని, మతం కంటే మానవత్వం ముఖ్యమని సూచించిందీ కవిత అని తెలిపారు కిషన్‌ప్రసాద్‌గారు. 'వెర్రితలలు' అనే కవిత పిల్లలకు మానవత్వపు ఓనమాలు క్రమశిక్షణ, గుణింతం–బాధ్యత పాఠం నేర్పాలని చెపుతుందని, క్రమశిక్షణ జీవితాన్ని ధర్మపథంలో నడిపిస్తుందని, భారతీయ సంస్కృతి దానికే అధికతర ప్రాధాన్య మిచ్చిందని అభిప్రాయపడ్డారు.

కిషన్‌ప్రసాద్ మరియు కందాళశోభారాణి గారు కలిసి రాసిన మరో వ్యాసం **'విస్తరించిన స్త్రీల సాహిత్య విమర్శ'** 1990 నుండి 2010 వరకు సాహిత్య విమర్శకులుగా స్త్రీలు సాధించిన అభివృద్ధిని అంచనా వేసిన వ్యాసం ఇది. ఈ వ్యాసానికి ముడిసరకు వివిధ పత్రికలలో వచ్చిన వ్యాసాలు, వ్యాస సంకలనాలు, సంపుటాలు, యం.ఫిల్., పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథాలని 212 మంది స్త్రీలు సాహిత్య విమర్శ రంగంలో చేసిన కృషి ఫలితంగా వచ్చిన 350 వ్యాసాలను, 45 పుస్తకాలను, ఈ వ్యాసరచన కోసం ఉపయోగించు కోవడం జరిగిందని తెలిపారు. కాత్యాయనీ విద్యహే రాసిన 152 వ్యాసాలు, 12 పుస్తకాలను మినహాయించి,198 వ్యాసాలను, 33 పుస్తకాలను, 109 సిద్ధాంత గ్రంథాలను ఈ వ్యాస రచనకు ఉపయోగించామని తెలిపారు. లభించిన సమాచారాన్ని విషయం రీత్యా జానపద సాహిత్య విమర్శ, ప్రాచీన సాహిత్య విమర్శ, ఆధునిక కవిత్వ విమర్శ, కథావిమర్శ, నవలా విమర్శ, నాటక విమర్శ, విమర్శ వ్యాసాలు అని ఏడు రకాలుగా వర్గీకరించి రెండుదశాబ్దాల కాలంలో సాహిత్య విమర్శకులుగా స్త్రీలు సాధించిన అభివృద్ధిని సమగ్రంగా ఈ వ్యాసంలో విశ్లేషించారు వ్యాసకర్తలు.

కిషన్ ప్రసాద్‌గారు విశ్లేషించిన మరోకావ్యం గంగులసాయిరెడ్డి రాసిన కాపుబిడ్డ. ఈ కావ్యంలో కవి తెలంగాణాలోని పల్లె వాతావరణాన్ని వ్యవసాయాన్ని రైతు జీవితాన్ని, కాపు స్త్రీల జీవితాన్ని, తెలంగాణ ప్రజల సంస్కృతిని, కనులకు కట్టినట్లుగా స్వభావోక్తులతో వర్ణించాడని, ఈ కావ్యంలో మొత్తం 147 పద్యాలున్నాయని, ఈ పద్యాలను 26 శీర్షికలలో రసాడని పేర్కొన్నాడు వ్యాసకర్త. 147 పద్యాలలో ఉపమా, ఉత్ప్రేక్ష అలంకారాలు మాత్రమేకాకుండా ఎక్కవగా స్వభావోక్తి అలంకారాలు చోటుచేసుకున్నాయని చంపకమాల, ఉత్పలమాల అనే రెండు వృత్తాలున్నాయని 109 సీస పద్యాలున్నాయని మిగిలినవన్నీ కంద పద్యాలు, గీతపద్యాలని తెలియజేశారు కిషన్‌ప్రసాద్‌గారు.

**'సి.నారాయణరెడ్డి సాహిత్యం–సామాజిక దృక్పథం'** అనే వ్యాసంలో శ్రీశ్రీ, గురజాడ, దాశరథులకు సమవుజ్జీగ సి.నా.రె. సామాజిక చైతన్య గీతాలను కవితలను రాసాడని, సినారె రచనలలో సంస్కృతీ వారసత్వాలను ప్రతిబింబించిన పాటలున్నాయని రైతుజీవన చిత్రణ లేదా రైతు ప్రాధాన్యత కవిత్వముందని, వీరి రచనలలో మానవతా వాదానికి సంబంధించిన కవితలున్నాయని, పరిపాలనా రాజకీయ వ్యవస్థలను ఆవిష్కరించిన తీరు వీరి కవిత్వంలో కనబడుతుందని అభిప్రాయపడ్డారు. సి.నా.రె.ది. మానవీయ దృక్పథమని, ఆయన సాహిత్యం సామాజిక చేతనకే అంకితమని, క్రమశిక్షణ, కవితోపాసన, సభా నిర్వహణ, వాక్చాతుర్యం వంటి ఉన్నత లక్షణాలను ఈతరం వారసత్వంగా తీసుకోవాలని, వారి ఆశయాల వెలుగులో పయనించాలని తెలియజేశారు కిషన్‌ప్రసాద్‌గారు.

కిషన్‌ప్రసాద్‌గారు రాసిన మరోవ్యాసం **'జాషువా కావ్య ఖండికలు'** ఈ కావ్యంలో జాషువా రాసిన ఖండికలన్నీ కలిపి 'ఖండకావ్యాలు' పేరుతో ఏడుభాగాలుగా ప్రచురించారని, ఈ ఏడు భాగాలలో మొత్తం 192 ఖండికలున్నాయని పేర్కొంటూ కొన్ని ఖండికలను మచ్చు తునకలుగా తీసుకొని జాషువా కవితాలక్షణాల్ని, సంస్కరణవాదాన్ని ఆయన వ్యక్తిత్వాన్ని, తాత్త్విక చింతనను గూర్చి విశ్లేషించారు. మహాకవి జాషువా మానవతావాదని, విశ్వమానవతావాదని సర్వేజనా సుఖినోభవంతు అనే సూక్తిని త్రికరణ శుద్ధిగా నమ్మి కావ్యఖండికలో ప్రబోధించి జీవితంలో ఆచరించిన వ్యక్తి అని ఈ సమతావాదం కేవలం మానవులకే కాక మూగజీవులకు కూడా విస్తరింపజేయాలని కోరిన ఆదర్శ వ్యక్తిత్వం జాషువా కవిదని తెలియజేశారు.

**'తొలితెలంగాణ ఉద్యమ కవిత్వం–అనుశీలన'** అనే మరో వ్యాసాన్ని కూడా రాశారు. 1969–1973 తెలంగాణ ఉద్యమ కవిత్వం – కవితా సంకలనం, సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ సుంకిరెడ్డి

నారాయణ రెడ్డి సంపాదకత్వంలో డిసెంబర్ 2009లో వెలువడిందని తెలిపారు. ఈ కవితా సంకలనంలో 93 కవితలున్నాయని ఈ కవితలలో 1969 నాటి తెలంగాణ ఉద్యమం ప్రతిఫలించిన తీరును పరిశీలించినట్లైతే ఐదు అంశాలు మనకు స్పష్టమవుతాయని, అవి తెలంగాణ విశిష్టతను ఆవిష్కరించిన కవిత్వమని (గతవైభవాన్ని స్మరించిన కవిత్వం) తెలంగాణ ఆకాంక్షను వ్యక్తం చేసిన కవిత్వమని, దోపిడీని చిత్రించిన కవిత్వమని, ఉద్యమ తీవ్రతను తెలియజేసిన కవిత్వమని, తెలంగాణ చైతన్య చిత్రణ చేసిన కవిత్వం (చిత్రణా కవిత్వం) అని విభజించి విశ్లేషించారు. ఇవికాక ప్రత్యేకంగా పేర్కొనదగిన మరొక మూడు కవితలున్నాయని అవి రావెళ్ళ వేంకటరామారావు 1954లో రచించిన 'మాతృగీతమని', 1973లో 1969 ఉద్యమంలో ప్రముఖ నాయకుడైన శ్రీధర్‌రెడ్డి రచించిన "1969 ఉద్యమం" అనే కవిత, 1973లో నెల్లుట్ల కోదండరామారావు రచించిన "జనగణమన తెలంగాణకు జయహే" తెలంగాణ ఉద్యమ గీతం. వీటిని ఉద్యమ చారిత్రక కవితలుగా/గేయాలుగా పేర్కొనవచ్చని అభిప్రాయపడ్డారు వ్యాసకర్త.

ప్రజాకవి పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు రచనలపై కిషన్‌ప్రసాద్ గారు సందర్భానుసారంగా ఐదు వ్యాసాలను రచించారు. కాళోజీ వ్యక్తిత్వం, కవిత్వం, కాళోజీ వచనకవిత్వం, కాళోజీ కవిత్వం ప్రజారాజకీయాలు, ప్రశ్నను ప్రగతికి సంకేతం చేసిన కాళోజీ మార్గం, వ్యధార్థ జనజీవన చిత్రణ కాళోజీ కవిత్వం మొదలైనవి. ఈ వ్యాసాల్లో వ్యాసకర్త కాళోజీ ఒక విశిష్టమైన వ్యక్తి అని, న్యాయం కోసం పోరాటం చేసిన ఒక గొప్ప తత్త్వవేత్తని, మన బాధలనే తన బాధలుగా భావించి 'నాగొడవ' రాసాడని, సమాజంలో జరిగే అన్యాయాలను ఎదిరించడమే కాకుండా తన రచనలతో ప్రజలను జాగృతం చేసాడని తెలిపారు. తెలుగుజాతికి ప్రశ్నించడం ప్రతిఘటించడం, ధిక్కరించడం నేర్పినాడని, అన్యాయాన్ని ఎదిరించమన్నారనే విషయాలను తన వ్యాసాలలో తెలియజేశారు. అన్యాయం చేసిన వ్యక్తి అయినా, రాజైన, రాజ్యమైన ధిక్కరించమన్నాడని, కాళోజీ జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని, కవిత్వాన్ని వేరువేరుగా చూడలేమని జీవితమంతా ఉద్యమాలతోనే గడిచిపోయిందనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. కాళోజీపై ఆర్య సమాజప్రభావం కనబడుతుందని కులానికి, గుణానికి ప్రాధాన్యత నిచ్చే లోకాన్ని చూసి ఆర్ద్రత చెందాడని సామాన్యమానవుడిని మానవీయలోకాన్ని చూసి చలించి పోయాడనడానికి 'లోకం' అనే కవితలో రాసిన పంక్తులే నిదర్శనమని అన్నారు. జైల్లో నిజాం పోలీసులకు ఎదురుగా నిలబడి తనను కాల్చమని చెప్పిన ధైర్యశాలి 'కాళోజీ' అని కాళోజీ పౌరుడుగా, నిటారుగా నిలబడినప్పటి నుండి నేటి వరకు ప్రశ్నించినదే 'నా గొడవ' అని పేర్కొన్నారు. తనలాగే ప్రజలందరూ న్యాయాన్ని దోపిడీతనాన్ని గుర్తించి ప్రశ్నించాలన్నాడని, ప్రజలకు ప్రశ్నించే తత్త్వాన్ని నేర్పి సమస్యకు విశ్లేషణ, పరిష్కారాన్ని చూపిన వైతాళికుడు కాళోజీ అని, ఏ ప్రాంతంలో ఉన్నా మాతృభాషను మర్చిపోవద్దనే కవిత్వం రాసాడు కాళోజీ అని ఉద్యమశీలుడిగా జీవనయాత్ర ప్రారంభించిన ప్రజా ఉద్యమకారుడిగా పౌరహక్కుల కార్యకర్తగా కొనసాగిన కాళోజీ ఎవరికి తలవంచకుండా బ్రతికాడని, ఆయన మనసంతా ఎదుటి వారికోసం సమాజం కోసమేనని కాళోజీ జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకొని అన్యాయాన్ని ఎదుర్కొవ డానికి మనవంతు కృషి చేయాలని తెలియజేశారు కిషన్‌ప్రసాద్‌గారు.

**'ఆధునిక కవిత్వానికి ఆద్యుడు- మహాకవి శ్రీశ్రీ'** అనే వ్యాసం శక్తిబిందు పేపర్‌లో ప్రచురితమైంది. **'శ్రీశ్రీ వ్యూలు-రివ్యూలు ఒక పరిశీలన'** అనే మరో వ్యాసాన్ని రాస్తూ ఈ వ్యాసంలో సమకాలికుల గ్రంథాలకు ఎన్నిటికో శ్రీశ్రీ ముందు మాటరాసాడని, మరెందరో రచనలను పత్రికలలో సమీక్షించాడని ఇవన్నీ విరసం వారు 'వ్యూలు-రివ్యూలు' అన్న పేరుతో శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం 16వ సంపుటిగా వెలువరించారని పేర్కొంటూ ఆ సమీక్షలను ముందు మాటలను గూర్చి విశ్లేషించారు. 'వ్యూ'ని పరిచయం 'రివ్యూ'ని సమీక్ష అనవచ్చని, 'వ్యూ'లో దృక్పథం కనిపించినట్లే రివ్యూలో సామాజిక లక్ష్యం, సామాజిక ప్రయోజనం కనిపిస్తాయని, వ్యూలలో కవిగా కనిపించిన శ్రీశ్రీ రివ్యూలలో విమర్శకుడిగా ఎలా తన సత్తా చూపించాడో వివిధ రచయితల గురించి రచనల గురించి శ్రీశ్రీ వెలిబుచ్చిన అభిప్రాయాలను తెలియజేశారు వ్యాసకర్త.

**"19వ శతాబ్ది సాహిత్య విమర్శ విధానం"** అనే వ్యాసాన్ని రచించారు. 1885వ సంవత్సరంలో నెల్లూరి నుండి ప్రారంభమైన అముద్రిత గ్రంథచింతామణి పత్రికలో ప్రచురితమైన రెండు విమర్శలను తీసుకున్నారు. కొక్కొండ వెంకటరత్నం పంతులు రాసిన బిల్వేశ్వరీయం మీద హన్మంతురావు గారి విమర్శనాన్ని (1894), జక్కన విక్రమార్క చరిత్ర పాఠపరిష్కరణంపైన వేదం వెంకటరాయ శాస్త్రి విమర్శనాన్ని (1895) విశ్లేషిస్తూ విమర్శకులు ఎక్కువగా వర్ణాలపైన, శబ్దాలపైన, సంధులపైన, సమాసాలపైన, భాషపైన శ్రద్ధ వహించారని, ఛందస్సుపై కొంత శ్రద్ధవహించారని, భాషాభాగాల చర్చ క్రియావిశేషణాల గురించి విభక్తి ప్రత్యయాలపై కొంత మాత్రమే దృష్టి కేంద్రీకరించారని, అలంకారాలపై అతితక్కువగా విమర్శ ఉందని, రసచర్చ ఏ మాత్రం కనపడదని వర్ణనల విమర్శకు ప్రాధాన్యం లేదని ఇతివృత్త విమర్శకు ప్రాధాన్యం లేదనే విషయాలను తెలియపరిచారు కిషన్ ప్రసాద్.

19వ శతాబ్ది తెలంగాణలోని సాంఘిక సాంస్కృతిక పరిస్థితులు అనే వ్యాసంలో అసఫ్‌జాల పాలనలో దేశకాల పరిస్థితులు, సాంఘిక పరిస్థితులు, స్థానిక ప్రజల పరిస్థితి ముల్కి, నాన్ ముల్కీ వ్యవస్థ నిజాం పాలనలో ఆంధ్రుల పరిస్థితి, భాషా విధానం, మతాంతర వివాహాలు, సామాన్య ప్రజల స్థితిగతులు, మత పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు, నైజాం పాలనలో జాగీర్ధారులు నిజాం పాలనలో పరిశ్రమలు, తదితర పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో విశ్లేసిస్తూ

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యల సాధనకు కృషి చేయాల్సిన బాధ్యత మనందరి మీద ఉన్నదని తెలియజేశారు.

**"కాకతీయుల కాలపు ఆర్థికవ్యవస్థ"** అనే వ్యాసంలో రాజ్యాభివృద్ధికి ముఖ్యమైంది ఆర్థిక వ్యవస్థ అని కాకతీయుల కాలం నాటి ఆర్థిక వ్యవస్థకు సంకేతాలు నాణాలు, పన్నులు, వాణిజ్యమని పేర్కొన్నారు. వస్తుమార్పిడి పద్ధతిలో నాణాలు ప్రముఖపాత్ర వహిస్తాయని వస్తుమారకంగా నాణాలను ఉపయోగిస్తారని, నాణాలతో ఏ వస్తువుకైనా విలువ కట్టవచ్చని ప్రభుత్వం నాణాలను టంకశాలలో ముద్రిస్తుందని అదే ప్రభుత్వం పన్నులను కూడా నిర్ణయిస్తుందని, రాజ్యం యొక్క ఆదాయం ఈ పన్నులపైననే ఆధారపడి ఉంటుందని అభిప్రాయపడ్డారు. వాణిజ్యమంటే వస్తు వినిమయాన్ని పెంచడమని, సంపదలు ఎక్కువైనపుడు ఉత్పత్తులు స్థానిక అవసరాల కంటే ఎక్కువగా ఉన్నప్పుడు వ్యాపారం జరుగుతుందని కాకతీయులు తమ ఉనికిని నిలబెట్టుకోవటానికి ఆర్థికవ్యవస్థ పటిష్టపరచుకోవటానికి ఈ అంశాలకు ఇచ్చిన ప్రాముఖ్యత ఎలాంటిదో విశ్లేషించటం, చర్చించటం ఈ వ్యాసంలో కనబడుతుంది. కాకతీయ రాజులు ప్రజల నుండి వసూలు చేసిన పన్ను అయిదు రకాలని, భూమి పన్నులు, పారిశ్రామిక పన్నులు, ఆస్థిపన్నులు, వృత్తిపన్నులు, వాణిజ్యపన్నులు, (వ్యాపార పన్నులు). ఇతరపన్నులను గూర్చి విశ్లేషించారు.

ఆచార్య కాత్యాయనీ విద్మహే డా॥ గంగు కిషన్‌ప్రసాద్‌గారు కలిసి రాసిన వ్యాసం **'కవిత్రయ భారతం – శ్రీకృష్ణుని రాజకీయ పాత్ర ఒక అధ్యయనం'** ఈ వ్యాసంలో భాగవతంలో శ్రీకృష్ణుడు భక్తులకు సాన్నిధ్యాన్ని, సాయుజ్యాన్ని ఇచ్చేవాడని, అతని బాల్యక్రీడలు, రాసలీలలు, పెళ్ళిళ్ళు మొదలైన వ్యక్తిగత అంశాలు భాగవతంలో ఉన్నప్పటికి అవి కూడా ఆ పరిధికి లోబడినవేనని, భాగవత కృష్ణుడు లీలామానుష విగ్రహుడని, లీలలేమి లేని కేవల మనుష్యుడుగా కనిపించేది భారతంలోనేనని తెలిపారు. కృష్ణుడి పాత్ర భారతంలో మొదటిసారిగా ఆదిపర్వం సప్తమాశ్వాసంలో ప్రవేశిస్తుందని, అక్కడి నుండి పది ఘట్టాలుగా సాగిన పాండవుల అభ్యుదయ పరంపర క్రమమంతా శ్రీకృష్ణుడి ప్రమేయం కనిపిస్తుందని తెలిపారు. పాండవ కార్యార్థియై కౌరవుల వద్దకు రాయబారం నడుపుట మరొక ఘట్టమని ఆ తర్వాత యుద్ధపంచకంలో అనుక్షణం శ్రీకృష్ణుడు పాండవులతోనే ఉన్నాడని, పాండవుల విజయానికి వ్యూహరచన చేస్తూవచ్చాడని పేర్కొన్నారు. గణ వ్యవస్థను రాచరికపు వ్యవస్థగా రూపొందించటంలో పశుపాలక వ్యవస్థ ప్రతినిధిగా కృష్ణుడు నిర్వహించిన పాత్ర మహాభారతంలో విశ్వరూపంతో కనిపిస్తుందని తెలియజేశారు.


**'ఉత్తర రామాయణం శాపవృత్తాంతాల విశ్లేషణ'** అనే వ్యాసంలో కంకంటిపాపారాజు రాసిన ఉత్తరరామాయణం ఎనిమిది ఆశ్వాసాలతో కూడుకొని ఉందని, మనుషుల్లో మంచి, చెడు అనే రెండు స్వభావాలుంటాయని, ఏ చెడునైనా నిరోధించటానికి, ప్రతిఘటించటానికి నివారించటానికి శాపాలు దోహదపడతాయని దీని ద్వారా మంచిని అభివృద్ధి చేయడం, చెడును గురించి మానవ స్వభావాన్ని హెచ్చరించడం, సాహిత్యం చేసేపని అని ఇదే సాహిత్య ప్రయోజనమని పేర్కొన్నారు. ఉత్తర రామాయణంలోని శాపాలు ఈ ప్రయోజనాన్ని ఏ మేరకు నిర్వహించాయో పరిశీలించారు. ఉత్తరరామాయణంలో మొత్తం 19 శాపాలున్నాయని ఈ శాపాలను ఆరువర్గాలుగా విభజించారు. 1) రావణునికి గల శాపాలు అయిదున్నాయని, రావణుడికి నందీశ్వరుడిచ్చిన శాపం, అణరణ్యుడిచ్చిన శాపం, వేదవతి ప్రతిజ్ఞ, దేవాది స్త్రీలు రావణుని శపించటం, నలకూబరుడు, రావణునికిచ్చిన శాపమని తెలిపి విశ్లేషించారు. 2) స్త్రీవ్యామోహ కారణమైన శాపాలు రెండున్నాయని గౌతముడు ఇంద్రునికిచ్చిన శాపం, శుక్రాచార్యుడు దండుడికిచ్చిన శాపాన్ని గూర్చి తెలుపుతూ ఋషులు హనుమంతునికిచ్చిన శాపాన్ని గూర్చి కూడా విశ్లేషించారు. 3) స్త్రీలకు పురుషులిచ్చిన శాపాలు నాలుగున్నాయని పేర్కొంటూ పులస్త్యుడి శాపాన్ని, విశ్రవుడు కైకసికిచ్చిన శాపాన్ని, గౌతముడు అహల్యకిచ్చిన శాపాన్ని, మిత్రుడు ఊర్వశికిచ్చిన శాపాన్ని గూర్చి విశ్లేషించారు. 5) భృగువు విష్ణుమూర్తికిచ్చిన శాపమని 6) విలువలకు సంబంధించిన శాపాలు అరు ఉన్నాయని, బ్రాహ్మణుడు నృగునికిచ్చిన శాపం నిమివశిష్టుల శాపప్రతిశాపాలు, శుక్రాచార్యుడు యయాతికిచ్చిన శాపాన్ని, యయాతి యదువుకిచ్చిన శాపాన్ని, గూర్చి వశిష్ఠుడు వీరసహుడను రాజనకిచ్చిన శాపాన్ని గూర్చి విశ్లేషించారు. ఈ శాపాలన్ని కూడా స్త్రీ వ్యామోహం మంచిది కాదని చెప్పాయని, పరస్త్రీలను చేపట్టరాదని స్త్రీలు పురుషులను రెచ్చగొట్ట కూడదని, మనుషులకు అహంకారం, మదం, వస్తువ్యామోహం మంచిది కాదని తెలిపాయని వ్యక్తపరిచారు. అల్లరి హద్దుమీరకూడదని మనుషుల బాధలకు పూర్వజన్మలో చేసిన కర్మఫలమో, శాపఫలమో కారణమవుతాయని తెలిపాయి. అంతే కాకుండా రాజధర్మాలను కుటుంబ విలువలను తెలయజేశాయని, ఈ వృత్తాంతాలన్ని ఉత్తర రామాయణంలోని శాపాలతో చుట్టకొని ఉన్న మానవజీవన విలువలను సంస్కృతిని వ్యక్తపరిచాయని విశ్లేషించారు కిషన్ ప్రసాద్‌గారు.


ఈ విమర్శలన్నీ భారతీయ సంస్కృతి ధోరణులను, రాజధర్మాలను, కుటుంబ విలువలను, గిరిజన స్త్రీల జీవితాన్ని, కాపు స్త్రీల జీవితాన్ని, రైతు జీవితాన్ని, వ్యవసాయాన్ని, పల్లెవాతావరణాన్ని, తెలంగాణ ప్రజల సంస్కృతిని, ఆశావాదాన్ని, మానవతావాదాన్ని, సమతావాదాల, ధిక్కారస్వరాన్ని, సంస్కరణోద్యమాలను స్త్రీవాదదృక్పథాన్ని, దళిత వాద దృక్పథాన్ని, మార్క్సిస్టు దృక్పథాన్ని, మహిళా అధ్యయనవాదాన్ని, సామాజిక విలువలను, సామాజిక చైతన్యాన్ని, సామాజిక ప్రయోజనాలను గూర్చి సూచించాయని కిషన్‌ప్రసాద్‌గారు తన విమర్శన వ్యాసాలలో తెలియజేసారు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 2  UGC CARE List Approved Journal
హైదరాబాద్ డిసెంబర్ : 2024

# నృత్త రత్నావళి – సంగ్రహ పరిచయం

**డా. కె. రత్నశ్రీ,** అసోసియేట్ ప్రొఫెసర్, నృత్యశాఖ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. ఫోన్ : 9346977657




భారతదేశంలో మనకు సంప్రదాయ నృత్యరీతుల్లో పేరెన్నిక గాంచినవి కూచిపూడి, భరతనాట్యం, కథకళి, మోహినియాట్టం, మణిపురి, ఒడిస్సీ, కథక్, ఆంధ్రనాట్యం. ఈ మధ్యకాలంలో వీటితోపాటు సత్రియ మరియు అంకియానట్‌ను కూడా చేర్చడం జరిగింది. అయితే ముఖ్యంగా ఏ శాస్త్రీయ నృత్యమైనా ఉపయోగించేది పంచమవేదంగా చెప్పుకొనబడుతున్న 'నాట్యశాస్త్ర' గ్రంథం. దీనిని 'పంచమవేదం' అని ఎందుకన్నారంటే, బ్రహ్మ నాలుగు వేదాల నుండి నాలుగు అంగాలను తీసుకుని దీనిని రచించినారు కనుక. **"ఋగ్వేదం నుండి పాఠ్యం, సామవేదం నుండి సంగీతం, యజుర్వేదం నుండి అభినయం, అధర్వణవేదం నుండి రసాలను తీసుకొని ఈ నాట్యశాస్త్రాన్ని పంచమవేదం"**గా సృష్టించినారు. మనకు ఈ నాట్యశాస్త్ర గ్రంథమే కాకుండా నందికేశ్వరుని 'అభినయదర్పణం', శారదాతనయుని 'భావప్రకాశనం', జాయపసేనాని 'నృత్తరత్నావళి' గ్రంథాలను కూడా ప్రధానంగా చెప్పుకుంటారు. అయితే నేను ఎన్నుకున్న అంశం 'నృత్త రత్నావళి' సంగ్రహ పరిచయం.

ఆంధ్రదేశం నందలి శాస్త్రీయ నృత్యంలో ముఖ్యంగా నాట్యమేళం, నట్టువమేళంగా చెప్తారు. దీనిలో నట్టువమేళ సంప్రదాయానికి వచ్చేసరికి దేవదాసీ సంప్రదాయం, రాజనర్తకీ సంప్రదాయమని రెండు విధాలుగా చెప్పారు. తిరిగి ఈ దేవదాసీ సంప్రదాయంలో ఆరాధనా నృత్యం అంటే, ఆలయంలో స్వామివారి సన్నిధిలో చేసేవారు. మరొకటి కేళిక. అంటే, కల్యాణమంటపాలలో చేసేవారు. ఇక రాజనర్తకీ సంప్రదాయానికి వస్తే దీనిలో మార్గ పద్ధతి, దేశి పద్ధతి అని రెండు రకాలుగా చెప్పారు. ఈ ఆలయ నృత్యాలకు వచ్చేసరికి శైవ సంబంధము, వైష్ణవ సంబంధము అని రెండు రకాలు.

ఇక నాట్యమేళ సంప్రదాయానికి వస్తే దీనిలో కూచిపూడి భాగవతులు, ఇతర భాగవతులు అని చెప్పారు. వీరిలో తిరిగి కలాపాలు అనగా, భామా కలాపం, గొల్ల కలాపం. ఇతర భాగవతుల్లో నృత్యనాటకములు అనగా కథా ప్రధానములు, వీధి నాటకములు. మళ్ళీ తిరిగి దీనిలో చెప్పిన రకాలు భగవత్సంబంధిత కథలు అనగా పూర్వ కథాయుతములు. వీటిని ప్రదర్శించువారే భాగవతులుగా పేర్కొనబడినారు.

నృత్తరత్నావళిని మొత్తం ఎనిమిది అధ్యాయాలుగా విభజించారు. కానీ ఇందులో పేర్కొన్న అంశాలు చాలా ఉన్నాయి. నృత్తరత్నావళిలో ముఖ్యంగా చర్చించిన అంశాలు ఏమిటంటే – మొదటి అధ్యాయంలో నాట్యావతరనము, నాట్యలక్షణము, చతుర్విధాభినయములు, నృత్త, నృత్య నాట్యములు, మార్గ, దేశి భేదములు, లాస్య, తాండవముల లక్షణములు, లాస్యాంగములు మొదలైనవాటి గురించి చర్చించబడ్డాయి.


ఇక రెండవ అధ్యాయంలో అంగ, ప్రత్యంగోపాంగములు, శిరో లక్షణము 13గా పేర్కొనగా మరికొన్ని శిరోభేదములు 11గా పేర్కొన్నారు. తరువాత దృష్టి లక్షణములలో రసదృష్టులు, స్థాయీ భావ దృష్టులు, వ్యభిచారీ భావ దృష్టులు వీటన్నింటి లక్షణ, వినియోగాలే గాక తారకర్మల గురించి, కపోల లక్షణముల గురించి, చుబుక లక్షణములు, దంతకర్మలు, ఇవియేగాక హస్త లక్షణములు, వీటిలో అసంయుత హస్తములు 24, సంయుత హస్తములు 13, హస్తకర్మలు ఒక ఇరవైగా, హస్తకరణములు నాలుగుగా మరియు నృత్త హస్తాల గురించి కూడా వివరించారు. ఇవియేగాక ఊరు, కటి, జంఘ, పాద లక్షణములు కూడా వివరించబడ్డాయి. అయితే ఇవన్నీ కూడా నాట్యశాస్త్రము, అభినయదర్పణములో వివరించి నప్పటికీ చెప్పే విధానంలో అనగా, భావప్రకటన విషయంలో తేడా కనపడుతుంది. ఈ ఊరు, కటి, పాద, జంఘల కలయికతో చారీ భేదాలు ఏర్పడ్డాయని నాట్యశాస్త్రంలో పేర్కొన్నారు. సంయుత, అసంయుత, నృత్త హస్తాలు కూడా నాట్యశాస్త్ర, అభినయదర్పణంలో కొంత తేడా కనపడుతుంది.

పట్టే విధానంలో కొన్ని పేర్లు ఒకటైనప్పటికీ తేడా కనపడుతుంది. ఇక తారా కర్మలు, పుట కర్మలు, చుబక భేదాల గురించి, మార్గ దేశి భేదాల గురించి నాట్యశాస్త్రంలో వివరించబడినాయి. శిరో, దృష్టి, భ్రూ భేదాలు రెండింటిలో కూడా వివరించబడ్డాయి.

మూడవ అధ్యాయంలో మనకు భౌమీచారులు, ఆకాశికీచారుల గురించి వివరించబడినాయి. ఇవేకాక పురుష, స్త్రీ స్థానకాలు, మండల భేదాలు వివరించబడినాయి. ఇవి నాట్యశాస్త్రంలో కూడా చర్చించబడినాయి.

# అంతర్యామి

**మల్యాల మనోహర రావు,** ఫోన్ : 81065 42095



సందేహంలో ప్రశ్నలా
ప్రశ్నలో సమాధానంలా
నింగిలో నీలంలా
నీళ్ళలో నిర్మలంగా
పుడమిలో చలనంలా
గాలిలో గంభీరంగా
అగ్నిలో నిశ్చలంగా

దేహంలో ప్రాణంలా
ప్రాణంలో ప్రేమలా
ప్రేమలో ఆశలా
ఆశలో భయంలా
భయంలో అభయంలా



అనుభూతిలో ఊపిరిలా
ఊపిరిలో ఆత్మలా
ఆత్మలో విశ్వంలా
విశ్వంలో మిథ్యలా
మిథ్యలో విభూతిలా
విభూతిలో విశ్వాసంలా
విశ్వాసానికి గురువుగా
గురువులో విద్యలా
విద్యలో విద్వత్తులా
విద్వత్తులో స్పందనగా
చరాచర జగత్తులో
చైతన్యంగా ...



అంతటా ఉన్నట్టుగా
ఉండీ లేనట్టుగా
కనిపించక కదలినట్టుగా
తర్కానికి అందనట్టుగా
సాక్ష్యానికి నిలబడనట్టుగా
అంతుబట్టని రహస్యంగా

అనాదిగా మనిషికి
తన ఉనికిని చాటుకోవడానికి
విశ్వ ప్రయత్నం చేస్తున్న
అంతర్యామికి అంకితం

నాలుగవ అధ్యాయంలో కరణ ప్రయోగం గురించి, అంగహారముల గురించి, రేచకముల గురించి వివరించినారు. వీటిని నాట్యశాస్త్రంలో కూడా వివరించినారు.

ఐదవ అధ్యాయంలో దేశి స్థానకాలు. వీటిలో ఉత్ప్లుతిక కరణాలు మొదలైనవన్నీ చెప్పబడ్డాయి.

ఆరవ అధ్యాయంలో దేశి పాదములు, పాటవములలో ఉన్న భేదాలు, దేశి చారులు, సంకీర్ణ చారులు, దేశీ లాస్యాంగాలు, గతి లక్షణముల గురించి వివరించారు.

ఏడవ అధ్యాయంలో శిక్షా పద్ధతి, పేరిణి లక్షణము, పేరిణి వేషము, పేరణమునక అంగములు, పేరిణి పద్ధతి, పుష్పాంజలి, ప్రేక్కణ పద్ధతి, కందుక నృత్తము (చెండాట), కొల్లాట నర్తనము, నర్తకి లక్షణము, నర్తక లక్షణము, వాద్య బృంద లక్షణము, సంప్రదాయ లక్షణము, మండప లక్షణము, సభాపతి లక్షణము మొదలైనవటి గురించి వివరించబడింది.

ఎనిమిదవ అధ్యాయంలో ప్రధాన నర్తకి నైపథ్యము, బృంద విన్యాసము, వాద్యముల మేళవింపు, శష్క వాద్యము మొదలైనవి చెప్పబడ్డాయి.

మనకున్న శాస్త్రీయ నృత్యాలన్నిటికీ మూలంగా చెప్పుకోబడు తున్నది నాట్యశాస్త్రమే. ఇది పదకొండు అంగాలుగా విభజించబడింది.

**రసా, భావా హ్యాభినయాః ధర్మీ వృత్తి ప్రవృత్తయః**
**సిద్ధి స్వర తథాతోద్యం గానం రంగశ్చ సంగ్రహః**

అని ఈ పదకొండు అంగాలను కూడా 36వ అధ్యాయంలో వివరించినారు. అయితే ఈ నృత్తరత్నావళిలో పేర్కొన్న అంశాలు దాదాపుగా అరవై శాతం వరకు నాట్యశాస్త్రములో, కొంతవరకు 'అభినయదర్పణం'లో చర్చించినప్పటికీ ఈ నృత్తరత్నావళి పూర్తిగా దేశి పద్ధతికి చెందిన రచనగా ఒక అభిప్రాయం. వీటిలో నాట్య శాస్త్రముతో పాటు, అభినయదర్పణం కూడా దక్షిణ భారతదేశానికి సంబంధించిన నృత్యాలు సగానికి పైగా ఉపయోగిస్తారు.

ఈ నృత్తరత్నావళి పూర్తిగా దేశికి సంబంధించినది. దీనిని రామప్పగుడిలోని శిల్పాలను ఆధారంగా చేసుకొని పద్మశ్రీ డా॥ నటరాజ రామకృష్ణగారు పేరిణి శివతాండవాన్ని కనిపెట్టారు. ఇది పేరిణి నాట్యం వారికి ఎక్కువగా ఉపయోగపడుతుంది. దీనిలో కొంత భాగం మాత్రమే ఆంధ్రనాట్యంవారు ఉపయోగిస్తారు. ఈ నృత్తరత్నావళి జాయపసేనాని రచన అని మాత్రమే చాలామందికి తెలుసుకాని దీనిలో ఏయే విషయాలు చర్చించినారో, వీటిలో నాట్యశాస్త్ర, అభినయదర్పణాలలో చర్చించిన విషయాలేమిటో అందరికీ తెలియదు. చర్చించిన విషయాలలో తేడాలేమి చెప్పారో, ఎన్ని అధ్యాయాలున్నాయో కూడా తెలియదు కాబట్టి దీనిని పరిచయం చేయాలనే ఉద్దేశంతో వ్యాసంగా రాయడం జరిగింది.

– – –

# నీతి శాస్త్రము – తాళపత్ర గ్రంథము

**డా. గండ్ర లక్ష్మణ రావు,** విశ్రాంతాచార్యులు ఫోన్ : 98493 28036

**(గత సంచిక తరువాయి)**

అంగమర్దనేన మభ్యంగం ద్విజభోజన శాయినం
గవాన్ కండూయమానైన బ్రహ్మహత్యవ్యపోహవత్ ! –23

పద్యానువాదం –

**స్నానమును భోజనమ్మును శయనమునకు**
**బ్రాహ్మణాతిథి కొనరించు వారలకును**
**ఆవు దురదను మాన్పింప ఔషధమును**
**రాయు వారికి పాపముల్ రాలిపోవు.**

అర్థం : బ్రాహ్మణునకు అభ్యంగన స్నానం చేయించి యిష్టభోజనం పెట్టి పడుకోవడానికి స్థలం యిచ్చినను, గోవుల దూల పోవుటకు నూనె మందు పెట్టినను, గోపురాల స్తంభం ఎత్తినను, బ్రహ్మ హత్య మొదలుకొని పంచమహా పాతకాలు పోవుననిన రీతి.

సింహాదేకం, బకాదేకం చత్వార కుక్కుటాదపి
వాయసాత్పంచ శిక్షేచ్ఛ,షడ్శునః త్రీణి గార్దభాత్ !!–24

పద్యానువాదం –

**ఒనర సింహము బకముల నొక్కటొకటి**
**కుక్కుటమునాల్గు కాకైదు కుక్క యారు**
**గాడిదయు మూడు సుగుణముల్ కలిగియుండు**
**అట్టి గుణములు మానవులరయ వలయు**

అర్థం : సింహమందు ఒక్క గుణం, కొంగయందు ఒక్క గుణం, కోడియందు నాలుగు గుణాలు, కాకియందు అయిదు గుణాలు, కుక్కయందు ఆరు, గాడిదయందు మూడు గుణాలు తెలిశేది.

బహు కార్యేనల్ప కార్యం యన్నరః కర్తుమిచ్ఛతి
సర్వారంభేషు తత్కార్యం సింహాదేకం ప్రకీర్తితా ! –25

పద్యానువాదం –

**అల్పకార్యమొ ఘనకార్యమైన గాని**
**పూని సాధించ నెంచిన పురుషుడెపుడు**
**కూడ గట్టిన బలముతో గురిని జూసి**
**సింహ శౌర్యమ్ము జూపించి చేయవలయు !**

అర్థం : పెద్ద కార్యాలయందు అల్ప కార్యాలయందు యే నరుండేని సింహము వలె వీరత్వముతో చేయవలెను. సర్వకార్యాలయందు సింహమునకు గల ఈ ఒక్క గుణమే శ్రేష్ఠమనిన రీతి.

యింద్రియాణి చ సంయమ్య బకవత్పండితో నరః
దేశకాల బలం జ్ఞాత్వా సర్వకార్యాణి సాధయేత్ ! –26

పద్యానువాదం –

**పనిని సాధించ దలచిన పండితుండు**
**పదియు నింద్రియమ్ములనింత పదిల పరచి**
**పరిసరమ్ముల కాలము సరిగ జూసి**
**బకము వోలిక కార్యము బడయ వలయు**

అర్థం : పండితుడైనవాడు దశేంద్రియాలు నియమించుకొని కొంగరీతిని దేశకాలముల నెరింగి సావధానులై కార్యములను చేశేదనిన రీతి.

ప్రాగువాదనంచ యుద్ధంచ సవిభాగశ్చ బంధుశ్చ
స్వయ మాక్రమ్య భుక్తిశ్చ శిక్షేచ్చత్వారీ కుక్కుటాత్ ! –27
(ప్రత్యుత్థానం చ...... అని పాఠాంతరము కూడా ఉంది)

పద్యానువాదం –

**ఉదయమందున తొందర నిదుర లేవ**
**చేరు శత్రువు నెదిరింప సిద్ధ పడుట**
**కూడబెట్టిన గింజలు కోరి పంచ**
**తాను నిల్చుట కోడిబోధనలు గనుము**

అర్థం : ప్రాతఃకాలముననే మేల్కొనుట, మరొకరితో యుద్ధము నందైన నిలుచుట, తాను గడించినది ఇతరులకు పంచుట, తన కోసం ఆక్రమించుకోవడం.. ఈ నాలుగు గుణాలు కోడి నుండి తెలిసేదనిన రీతి.

గూఢ మైథునమ్ ధీరత్వం కాలే కాలే చ సంగ్రహత్
అప్రమాన సహస్రాయ పంచ శిక్షేణ వాయసాత్ ! – 28
(అప్రమత్త మవిశ్వాసం...... అని పాఠాంతరము కూడా ఉంది)

పద్యానువాదం –

**రతిరహస్యముగను జేయు, సతము తెగువ,**
**కాల తత్త్వము నెరిగి లోకమ్ము గనుట**
**యెపుడు జాగ్రత్త తోను వేయేండ్లు బ్రతుకు**
**అరయ వలయును వీని వాయసమునుండి**

అర్థం : యెవ్వరు యెరుగకుండ రతిచేయుట, సాహసం, కాలం గురించి గుర్తెరిగి యుండుట, లోకాపవాదమునకు గురియగుట (అప్రమత్తంగా ఉండుట), వేయేండ్లు బ్రతుకుట (ఎవరిని నమ్మకపోవుట)... ఈ గుణాలు కాకియందు తెలిసేదనిన రీతి.

బహ్వాశీ మల్ప సంతుష్టి సునిద్రా సుప్రబోధకః
ప్రభుభక్తిశ్చ శూరశ్చ షడేతే శ్వానతో గుణః ! -29

పద్యానువాదం -

**తిండికై యాశ, యెంతున్న తృప్తి పడును**
**పిడికె దన్నమునకె, తీయు పెద్ద నిద్ర ,**
**చిన్న సడియైన లేచును చిటికెలోన**
**చెడని విశ్వాసమును గ్రామ సింహమనగ**
**శౌర్యమును శునకమునకు షడ్గుణములు**

అర్థం : ఆహారము పై ఆశ, అయినా అల్ప సంతుష్టి, సుఖనిద్ర, వెంటనే మేలుకోవడం, యజమాని పట్ల భక్తి, శూరత్వం ... ఈ ఆరు గుణాలు శునకమునుండి తెలిసేది.

అశ్రాంత వహేత్భారం శీతోష్ణ ధ్యానం న చింతయతి
సంతుష్టోపి భవేన్నిత్యం గార్ధభస్త్రయో గుణాః ! -30

పద్యానువాదం -

**పగలు రేయనకుండగ బరువు మోయు**
**చలిని యెండల గురియించి తలపు లేదు**
**నిత్య తృప్తిగా బ్రతుకును నిలుపు కొనును**
**కాంచ నివి మంచి గుణములు గాడిదకును**

అర్థం : అలసిపోయి తా విస్తారమైన బరువులు మోసినప్పుడు, చలి, ఎండ అనక, అంగలార్చక అనుదినం సంతుష్టి కలిగి యుండుట ...ఈ మూడు గుణాలు గాడిదనుండి తెలిసేది.

యే వింశతి సద్గుణాని సర్వేజాత్యకుర్యాత్
జయతి పునః సహంతే శుద్ధిదంచ భవిష్యతి !- 31

పద్యానువాదం -

**సింహ బకములాదిగా జీవతతుల**
**మంచి గుణములు గమనించి మానవులును**
**ఆచరించిన విజయము లందగలరు**
**భావియందున సత్కీర్తి బడయ గలరు**

అర్థం : ఈ 20 గుణాలు తెలిసినవాడు, తామై నడచి చూచినవాడె పండితుడు. మూడు లోకాలలో జయించే సాహసమున్న వాడున్ను అందరిచేత పూజ్యుడన్న రీతి.

స్వామిత్వంచ వర్షాణి దశవర్షాణి బాంధవః
ప్రాప్తా షోడశ వర్షాణి పుత్ర మిత్రవదాచరేత్ ! -32

పద్యానువాదం -

**తనయు డైదేండ్ల వరకును తండ్రి సామి**
**పిదప పదియేండ్ల వరకును ప్రేమ జూపు**
**పదియునారేండ్ల వయసు యవ్వనము వేళ**
**పుత్రుడైనను మెలగుము మిత్రు పగిది**

అర్థం : తమ కుమారుడు అయిదేండ్లు ఉన్నపుడు స్వామి వలె జూచేది, వెనుక పదియేండ్ల వరకు బంధువు వలె జూచేది, అటువెనుక పుత్రులను మిత్రులవలె గుణములు తెలిసి సంభాషించేదనిన రీతి.

కింకులేన విశాలేన విద్యాహీనేన దేహినాం
అకులే కోపి శాస్త్ర జ్ఞానై దైవత్యాది ప్రపూజయేత్ ! -33

పద్యానువాదం -

**సత్కులమునబుట్టి సంపన్నుడైనను**
**విద్య లేక యున్న విలువ లేదు**
**తక్కువకులమైన తగురూపు లేకున్న**
**విద్య యున్న గౌరవింపబడును**

అర్థం : యే కులము వాడైనా విద్య లేనివాడు హీనుడు. హీనకులజుడైనా విద్యగలవాడు ఎల్ల తావులలోను పూజ్యుడన్న రీతి.

దుర్జనం దోషమాదాయ దుర్గంధం యివ సూకరః
సజ్జనస్య గుణం గ్రాహ్యం హంస క్షీరమివాంభసి -34

పద్యానువాదం -

**దుర్జనుండు పరుల దోషమ్ములే జూచు**
**సూకరమ్ము చెడును చూచునట్లు**
**సజ్జనుండు పరుల సద్గుణమ్ములె జూచు**
**పాలు నీరు హంస పంచినట్లు**

అర్థం : దుర్జనుడు సుజనుల దోషాలే వెదుకును. సూకరములు దుర్గంధమే వెదుకును. సజ్జనుడు హంసవలె నీళ్ళు పాలు కలబోసినను నీళ్ళు తొలగించి పాలు త్రాగినట్లు సజ్జనులు మంచి గుణములే వెతుకుదురన్న రీతి.

యేక భార్యా త్రయః పుత్రా ద్వే హలే దశధేనవః
మధ్య రాష్ట్రే గృహం యేషా మత్యంత సుకృతాశ్చమే -35

పద్యానువాదం -

**ఒక్క భార్యయు ముప్వరు నుత్తములగు**
**కొడుకులును రెండు నాగండ్లు నడప గలిగి**
**మంచి భూమియు గ్రామము మధ్యమునను**
**యిల్లు గలవాడు సుఖముల నెల్ల పొందు**

అర్థం : గుణవంతురాలైన ఒక భార్యను, సజ్జనులైన ముగ్గురు కుమారులను, రెండు నాగళ్ళను, పది పాడి యావులను, మంచి ఊరను మధ్యలో మంచి యిల్లును గలవాడు సుఖవంతుడు, భాగ్యవంతుడగునన్న రీతి. (సశేషం)

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 2 హైదరాబాద్ డిసెంబర్ : 2024


# ప్రజా చైతన్య దిశగా సాహిత్య సంస్థలు

**డా. ఎన్. రజని,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం. ఫోన్ : 9010501030

ఆధునిక తెలుగు సాహిత్య సంస్థలు సాహిత్య వ్యాప్తికోసం, పుస్తకాల వ్యాప్తికోసం, అభ్యుదయ వ్యాప్తికోసం చేసిన కృషిని టివిఆర్ కృష్ణ ఈ పుస్తకంలో విశ్లేషణాత్మకంగా వివరించారు. సాహితీ అభిమానులందరం సాహిత్యాన్ని, సాహిత్య ధోరణులను, సాహితీ ప్రక్రియలను, సాహిత్య శైలులను గురించి చర్చిస్తాం, ఉపన్యసిస్తాం, సమీక్షిస్తాం కానీ ఆ సాహిత్యం ఏర్పడడానికి, ఆ సాహితీ ప్రక్రియలు పుట్టడానికి, ఆ అభిమానాన్ని పెంపొందించుకోవడానికి కారణమైన, ముఖ్యకారకమైన సాహిత్య సంస్థల గురించి తక్కువగా మాట్లాడు కుంటాం. వాటి కృషి గురించి లేఖామాత్రంగా ప్రస్తావిస్తాం. కానీ ఏ సాహిత్య సృష్టి అయితే జరుగుతుందో ఆ సాహిత్యం అంతగా వెలుగొందడానికి ప్రేరణగా నిలిచిన సాహితీ సంస్థలు, సంఘాల గురించి మాట్లాడుకోవడం, వస్తున్న సాహిత్యాల నేపథ్యాన్ని గురించి తెలుసుకోవడం అత్యవసరం. ఆ అవసరాన్ని గుర్తించిన రచయిత 40 ఏండ్ల కిందనే ఈ పని చేసినా, ఇప్పటివరకూ తగిన సమగ్రమైన పరిశోధన జరగకుండానే ఉంది. అందువల్ల నాలుగు దశాబ్దాల తర్వాతైనా ఈ పని చేయడం ఒక చారిత్రక అవసరం.

ముందు తరాలు ఈ చారిత్రక బాధ్యతను నెరవేర్చాలంటే ఇట్లాంటి ఒక ఆకరం, ఒక నమూనా, ఒక ఆధారం అవసరం. ఆ అవసరాన్ని ఈ పుస్తకం కచ్చితంగా నెరవేరుస్తుంది. సాహిత్య సంస్థల గురించి ప్రస్తావనలో మధ్యమధ్య కొన్ని ఖాళీలు ఉన్నాయి. ముందు తరాల పరిశోధకులు ఈ పుస్తకం ఆధారంగా ఆ ఖాళీలను కూడా పూడ్చడానికి ప్రయత్నించే అవకాశం ఉంది. అంతేకాదు ఒక్కొక్క సంస్థను, ఒక్కొక్క సంఘాన్ని ఇంకా విపులంగా, వివరణాత్మకంగా పరిశోధించే, పరిశీలించే అవకాశాన్ని ఈ పుస్తకం అందిస్తుంది. అంతేకాదు ఈ పుస్తక పరిశోధన తర్వాతి కాలంలో వచ్చిన వివిధ సాహితీ సంస్థలు, వాటి కార్యకలాపాలు, అవి సృజించిన సాహిత్య ప్రస్తావన కూడా పరిశోధనలో భాగం చేసుకుంటుంది.

సాహిత్య సంస్థల గురించి మాట్లాడుకోవడం ఇప్పటి చారిత్రక అవసరం. ఆ అవసరాన్ని టివిఆర్ కృష్ణ నలభైయేండ్ల కిందనే గుర్తించాడు. ఆ చారిత్రక అవసరం ఇప్పటికి సమాజానికి అత్యవసరం. ముఖ్యంగా రచయితల పేర్లను మాత్రమే గుర్తిస్తున్న ఈ కాలంలో ఆ రచన రావడానికి ప్రేరణగా నిలిచిన ఎన్నో సాహిత్య సంస్థలు మరుగున పడిపోతున్నాయి. ఆ మరుగున పడిన సాహితీ సంస్థలను గుర్తించడం, వాటి కృషిని తెలుసుకోవడం సాహితీ లోకానికి తక్షణ కర్తవ్యం.




విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధన ప్రారంభమై దాదాపు వంద సంవత్సరాలు దాటిపోయినా మొదట పరిశోధనలు వ్యాఖ్యానాలు గానూ, మరుగున పడిన కవులనూ, కావ్యాలనూ వెలికి తీయడం గానూ వచ్చినా తర్వాతి తర్వాతి కాలంలో ముఖ్యంగా సాహిత్యంలో మార్క్స్ భావనల ప్రభావం రావడం ప్రారంభమయ్యాక కావ్యాలను, కవులను, సాహిత్య సంస్థలను అంచనా కట్టడంలో మార్పు వచ్చింది. ఆ మార్పు శాస్త్రీయంగానూ, పాశ్చాత్య పరిశోధన పద్ధతిని అన్వయిస్తూ సాగింది. ఈ క్రమపరిణామంలో భాగంగానే సాహిత్య సంస్థల ఏర్పాట్లు, సాహిత్య సంస్థల కృషి ముందుకొచ్చాయి. సాహిత్య సంస్థల గురించిన పరిశోధనకు ఏ పరిశోధనకూడా పూనుకోలేదు. అట్లాంటి ఆలోచన తక్కువగానే వచ్చింది. సాహిత్యం మీద, భాషమీద, ప్రక్రియ మీద పెట్టిన దృష్టి సాహిత్య సంస్థల మీద పెట్టలేదు అనేది సత్యం. బ్రౌన్ ఒక సాహిత్య సంస్థ చేయగలిగినంత పనిని తన భుజాల మీద వేసుకుని చేసాడు. అయితే బ్రౌన్‌కి పండితులు మాత్రమే కాదు సామాన్య ప్రజలు కూడా సహాయం చేసారు. తాళపత్ర గ్రంథాలను పరిష్కరించాడు. భాషా సాహిత్యాలకు బ్రౌన్ చేసిన సేవ ఒక సాహిత్య సంస్థ సేవగానే గుర్తించాలి.

**ఆంధ్ర సాహిత్య పరిషత్తు :**

జయంతి రామయ్య పంతులు ఆధ్వర్యంలో మద్రాసులో 1911లో ఆంధ్రదేశంలోనే మొట్టమొదటి సాహిత్య సంస్థ ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఏర్పడింది. ఆంధ్ర సాహిత్య పరిషత్తు భాషా వాఙ్మయం అభివృద్ధికి ఎంతో కృషి చేసింది. థామస్ మెకాలే తమ పరిపాలనా యంత్రాంగంలో భాగంగా భారతీయుల్ని తయారు చేసే విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టాడు. దాంతో స్థానిక భాషా, సాహిత్య, సంస్కృతులకు ప్రోత్సాహం తగ్గింది. ఆ సందర్భంలో తెలుగువారు తమ భాషా సంస్కృతులను పరిరక్షించుకోవడం కోసం ఆంధ్ర సాహిత్య పరిషత్తును స్థాపించుకున్నారు. 90 మంది సభ్యులతో ఈ సంస్థ

ఏర్పడింది. ఈ సంస్థను పోషించేవాడు పిఠాపురం రాజా, బ్రౌన్ వ్యక్తిగతంగా చేసినా ఒక సాహిత్య సంస్థ కన్నా ఎక్కువ కృషే చేసాడు. దాని కొనసాగింపుగానే ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఏర్పడింది. దీని ప్రచారంలో భాగంగా 1912 లో "ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక"ను స్థాపించారు. ఇది త్రైమాసిక పత్రికగా వెలువడింది. ఆ తర్వాత కొంత కాలానికి రెండు నెలలకొకసారి వచ్చేది. ఇది సాహిత్య పత్రికే అయినా జరిగేది చరిత్ర, మతం, శాస్త్రం వంటి అన్ని విషయాలను కూలంకషంగా చర్చించేది. ముఖ్యంగా పాశ్చాత్య సంస్కృతి వల్ల సాంప్రదాయ విలువలు నశించిపోవద్దని ప్రాచీన సాహిత్య అవశేషాలను పునరుద్ధరించాలని ఈ పరిషత్తు చాలా కృషి చేసింది. వార్షిక సభలు నిర్వహించింది. పానుగంటి లక్ష్మీనరసింహారావు మొదలైన పండితులతో ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహించి వాటిని భద్ర పరిచింది.

ఆంధ్రభాషలోని శివతత్త్వసారం, శివరాత్రి మహత్మ్యం, కవిజనాశ్రయం వంటి గ్రంథాలను పరిష్కరించింది. ఈ పరిషత్తు భాషకు సంబంధించి విశేష కృషి చేసింది. పదాలు వ్యుత్పత్తి, చరిత్ర విపులంగా చర్చించింది. శాసనాల గురించి కూడా సమగ్ర పరిశీలన చేసిన ఏకైక సంస్థగా ఆంధ్ర సాహిత్య పరిషత్తు నిలిచింది.

తెలుగులో మొదటి వచన గ్రంథమైన రాయవాచకం పరిషత్తు ఆధ్వర్యంలోనే వెలువడింది. రాయవాచకంలోని భాష వ్యావహారికం అప్పటికి గ్రాంధిక వాదులకు, వ్యావహారిక భాషా వాదాల మధ్య జరుగుతున్న సంఘర్షణ వల్ల పరిషత్తు కొంత జాగ్రత్తగా సమతూకంతో వ్యవహరించిందని చెప్పవచ్చు. ఎక్కువగా భాషకే ప్రాధాన్యత ఇచ్చింది. అయితే 1911 లో **"ఆంధ్ర పండిత సభ వృత్తాంతం"** జరిగిన సమయంలో సాహిత్యం – రసపోషణ అన్న చర్చలో భాగంగా ఉత్తమ రసం శృంగారమే కనుక దాన్నే తప్పనిసరి ప్రధాన రసంగా పరిషత్తు అంగీకరించింది. అప్పటికే రాధికాస్వాంతనం వంటి విపరీత శృంగార కావ్యాల పట్ల నిషేధం రావడం అది పెద్ద అపరాధంగా భావించిన పరిషత్తు ఆ నిషేధాన్ని తొలగింపచేసింది. ఒకపైపు వీరేశలింగం, గురజాడ మొదలైన వాళ్ళు అసభ్య శృంగారాన్ని అనుమతించకండి అని విజ్ఞప్తులు చేస్తున్నారు కూడా అప్పటికే వ్యావహారిక భాషను సమర్థించే గిడుగు, గురజాడ వంటి వారికి వ్యతిరేకంగా వ్యావహారిక భాషను తిరస్కరిస్తూ పానుగంటి వేదం వేంకటరాయశాస్త్రి మొదలైన వ్యాసాలు రాసారు. అవి పరిషత్తు పత్రికలో అచ్చయ్యాయి. అయితే ఈ సందర్భంలో గ్రాంథికం, వ్యావహారికం వేరువేరు కాదని తటస్థ విధానాన్ని అవలంబించిన వారిలో చెన్నాప్రగడ భానుమూర్తి ముఖ్యులు. గిడుగు రామమూర్తి పంతులు వ్యావహారిక భాషను పట్టం కట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడంతో అంతేకాక సంస్థలోని చాలా మంది వ్యావహారిక భాషలో రచనలు చేయవచ్చు అనే వాదాన్ని బలపరచడంతో కొంత గ్రాంథిక భాషావాదం విషయంలో పట్టు సడలింది. నిర్బంధం నుంచి తిరుగుబాటు, తిరుగుబాటు నుంచి విముక్తి మార్గాలున్నట్టే గ్రాంథిక భాషపై తిరుగుబాటుగా వ్యావహారిక భాషలో సాహిత్య సృష్టి జరిగింది. సాహిత్య పరిషత్తు ఒక గ్రంథాలయాన్ని నిర్వహించింది. అందులో దాదాపు ఆరువేలకు పైగా తాళపత్ర ప్రతులున్నాయి. 70 పుస్తకాలను ప్రచురించింది. ఆంధ్ర సాహిత్య పరిషత్తు సాహిత్య కృషితో బాటు గ్రాంథిక భాషా విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించింది. ముఖ్యంగా సాహితీ పరులంతా ఒక సంఘంగా ఏర్పడవలసిన అవసరాన్ని మొదట గుర్తించింది. తాను అనుకున్న ఉద్దేశాలను అనుకున్న రీతిలో నెరవేర్చింది.

**ఆంధ్ర సారస్వత పరిషత్తు :**

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా హైదరాబాదు రాజ్యం తెలంగాణ ప్రాంతంలో ఆంధ్రోద్యమం మొదలైంది. నిజాం ఉర్దూను రాజభాషగా చేయటంలో ఇతర భాషలు ముఖ్యంగా ప్రాంతీయ భాషలపై అణచివేత ప్రారంభమైంది. ఒకవైపు ప్రభుత్వ ధోరణి మరొకవైపు మన పొరుగు ప్రాంతమైన మహారాష్ట్రుల అవహేళనకు కూడా తెలంగాణ ప్రజలు తట్టుకోలేకపోయారు. ఇట్లాంటి పరిస్థితులలో కొమర్రాజు లక్ష్మణరావు పంతులు 1901 సెప్టెంబరు ఒకటిన హైదరాబాద్ నగరంలో శ్రీకృష్ణదేవరాయ గ్రంథ మండలి ఏర్పడింది. 1906లో విజ్ఞాన చంద్రిక మండలి ఏర్పడింది. 1921 నవంబర్‌లో ఆంధ్రజన సంఘం ఏర్పడింది. 1923లో ఆంధ్రజన కేంద్ర సంఘంగా రూపొందింది.

మొదట గ్రంథాలయోద్యమంగా ప్రారంభమై భాషోద్యమమై క్రమంగా రాజకీయోద్యమంగా మారింది. ఇదే సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం ఏర్పడిన అంజుమన్ ఇత్తెహాదుల్ ముసల్మాన్ అనే సంస్థ తెలుగుభాషను అణచివేయటం ప్రధాన లక్ష్యంగా పని ప్రారంభించింది. పరోక్షంగా నిజాం ప్రభుత్వం ప్రోత్సహించింది. ఈ సమయంలో తెలుగు భాషా సంస్కృతులను రక్షించడం కోసం ఒక ప్రత్యేక సంస్థ ఏర్పడవలసిన అవసరం కలిగింది. ఆ అవసరాన్ని గుర్తించిన కొంతమంది యువకులు సాహితీ సమితి ఏర్పడడానికి కృషి చేసారు. 1942 లో ఒకసారి, 1943లో మరొకసారి ఆంధ్ర మహాసభ జరుగుతున్న సమయాల్లోనే సాహితీ సంస్థ ఏర్పాటు ప్రయత్నాలు జరిగాయి. ఆ ప్రయత్నాల ఫలితంగా 1943 మే 26న నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు ఏర్పడింది. గోల్కొండ పత్రికాలయంలోనే ఈ చారిత్రక ఘటన జరిగింది. సంస్థ అధ్యక్షులు, కార్యదర్శి , కోశాధికారి, సభ్యులతో ఒక వ్యవస్థాత్మకమైన సంస్థగా ఏర్పడింది. వీరు కొన్ని ముఖ్యాంశాలను కూడా ప్రతిపాదించుకున్నారు. పోలీసు చర్య తరువాత నిజాం రాష్ట్రాంధ్ర సారస్వత పరిషత్తు ఐదవ మహాసభలు తూప్రాన్ గ్రామంలో జరిగాయి. ఆ తరువాత ఆంక్షలు లేకపోవడం వల్ల ఆంధ్ర సారస్వత పరిషత్తు నామాంతరం చెందింది.

పరిషత్తు ఏర్పడిన సంవత్సరం లోనే వరంగల్‌లో మూడు శాఖలు , మహబూబ్‌నగర్ జిల్లాలో ఏడు శాఖలు, నల్లగొండ జిల్లాలో రెండు శాఖలు, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో ఒక్కొక్క శాఖ ఏర్పడ్డాయి. ఈ శాఖలన్నీ మహాకవుల జయంతుల నిర్వహించాయి. అందులో భాగంగా మహాకవుల జయంతులను ఒక్కొక్క ప్రాంతంలో నిర్వర్తించారు. నన్నయ జయంతి వరంగల్, తిక్కన జయంతి ఖమ్మం, పోతన జయంతి జనగాం అట్లా తెలుగు ప్రాంతమంతా సాహిత్య వ్యాప్తిని చేస్తూ తెలంగాణ ప్రజల్లో సాహిత్యాభినివేశాన్ని పెంపొందించే ప్రయత్నాలు చేసింది. అయితే ఈ సాహిత్య కార్యక్రమాలతో పాటుగా సాంఘికమైన సమస్యలపై కూడా వీరికి దృష్టి ఉండడం వల్ల నిరక్షరాస్యతా నిర్మూలనలో భాగంగా వయోజన విద్యా కార్యక్రమం, రాత్రి పాఠశాలలు మొదలైనవి నిర్వహించారు. 1950 జూన్ 15 నుండి 30వ తేది వరకు హైదరాబాద్‌లో **"వయోజన విద్యాశిక్షణ కేంద్రం"** నిర్వహించింది. వయోజన విద్యావ్యాప్తికై 130 కేంద్రాలలో రాత్రి పాఠశాలలను నిర్వహించారు. **"సూర్యుని వెలుతురు వలె పరిషత్తు యొక్క విద్యావాప్తి కార్యక్రమాలు పల్లెపల్లెల్లో వికసిస్తూ సామాన్య ప్రజానీకాన్ని విజ్ఞాన విలసితాన్ని చేస్తున్నాయి"** అని అన్న బూర్గుల రామకృష్ణారావు మాటల్లో నిజంగానే నిజమైన మాటలని చెప్పొచ్చు. పరిషత్తు ఆంధ్రదేశంలోనే కాక మహారాష్ట్ర, మైసూరు, తమిళనాడుల్లో కూడా శాఖలను ఏర్పరిచింది. మారిషస్‌లో కూడా ఒక శాఖను ఏర్పరచింది.

తెలుగు సాహిత్యాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా సభలు, కవి సమ్మేళనాలు నిర్వహించడం, జయంతి ఉత్సవాలు జరపడం వంటి వాటిని ప్రోత్సహించింది. సాహిత్యాన్ని ప్రజా సారస్వతం, బాల సారస్వతం, పండిత సారస్వతం అనే ప్రధానాంశాలుగా విభజించి గ్రంథ ప్రచురణ ప్రారంభించింది. ఇందులో భాగంగా సురవరం ప్రతాపరెడ్డి 20 ఏండ్లు శ్రమించి రాసిన "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" గ్రంథం 1954లో మొదటిసారిగా ఐదువేల రూపాయల నగదు బహుమతిని కేంద్ర సాహిత్య అకాడమీ వారి నుంచి అందుకుని చరిత్రలో నిలిచింది.

పరిషత్తు కార్యక్రమాల్లో కొత్త మార్పులు చేపట్టటం కోసం, నవ్యత కోసం చేసే ప్రయత్నాల్లో భాగంగా సారస్వత వేదిక స్థాపన జరిగింది. సాహిత్యాన్ని కొత్త దృక్కోణంతో చూసే ఉద్దేశంతో ఈ వేదిక ఏర్పడింది. ఇందులో భాగంగా 1978 నుంచి 1984 దాకా ఒక ఆరు సంకలనాలు ప్రచురించడం జరిగింది. ఈ వ్యాస సంకలనంలో ఉన్న వ్యాసాలన్నీ తెలుగు సాహిత్యాన్ని నూతన దృక్పథంతో ఆలోచించటానికి మార్గం వేసాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తు మొదట భాషా వ్యాప్తికోసం, నిరక్షరాస్యతా నిర్మూలన కోసం ప్రారంభమై సమాజ మార్పులకనుగుణంగా వస్తున్న ప్రాచీన సాహిత్యాన్ని తదనంతరం ఆధునిక సాహిత్యాన్ని పాఠకులకు అందించే, విశ్లేషించే వేదికగా క్రమ పరిణామం చెందింది.




గ్రంథమాల సాహిత్యానికి, సాహితీ వ్యాప్తికోసం చేసిన కృషిని గురించి ఇప్పుడు తెలుసుకుందాం. 1906లో విజ్ఞాన చంద్రికా గ్రంథమాల ఏర్పడడం వల్ల గ్రంథమాలలు లేని లోటును తీర్చగలిగింది. ముఖ్యంగా తెలుగు మాట్లాడే ప్రాంతాలలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉండడం వల్ల ఆధునిక విజ్ఞానశాస్త్ర విషయాల గురించి అవగాహన లేకపోవడం ఈ గ్రంథమాల స్థాపనకు మూల కారణంగా భావించవచ్చు. అయితే ఇవి కూడా దాదాపుగా ఆంధ్రోద్యమంలోని అంశాలనే ప్రధానంగా తీసుకున్నాయి. ముఖ్యంగా స్త్రీ విద్య, నిరక్షరాస్యతా నిర్మూలన, ఈ గ్రంథ మండలి కేవలం గ్రంథాల్ని ప్రచురించడానికే పరిమితం కాకుండా ఇంగ్లీషు తెలియని వారికి ఇంగ్లీషులో ఉన్న విజ్ఞానశాస్త్ర గ్రంథాలను తీసుకొచ్చే ప్రయత్నం చేయటం, శాస్త్ర విజ్ఞానానికి, చరిత్రకు సంబంధించిన గ్రంథాలను పాఠకులకు అందించడం ఒక రకంగా జాతీయ పునరుజ్జీవనానికి తోడ్పడిన ఉద్యమంగా చెప్పొచ్చు. తెలుగు పాఠకలోకానికి గ్రంథ మండలి అందించిన మొదటి తెలుగు పుస్తకం గాడిచర్ల హరి సర్వోత్తమరావు రాసిన "అబ్రహం లింకన్" ఆ తర్వాత చాలా పుస్తకాలను వెలువరించింది. దాదాపు 1906 నుంచి పదహారు వరకు 30 పుస్తకాలను వెలువరించి తెలుగు సాహిత్య వికాసానికి ఎంతో కృషి చేసింది.



**ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల :**

ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల పశ్చిమ గోదావరిలోని తణుకులో కొవ్వూరు చంద్రారెడ్డి 1911 ఏప్రిల్ మొదటి తేదీన స్థాపించాడు. దీని స్థాపనలో చాలా మంది ముఖ్యులున్నారు. చంద్రారెడ్డి మరణం తరువాత ఈ గ్రంథమాల కార్యభారాన్ని వేంకట పార్వతీశ్వర కవులు, చాగంటి శేషయ్య వహించారు. ఈ గ్రంథమాల దాదాపు 150 గ్రంథాలను ప్రచురించింది. తెలుగు నవల, అనువాద నవల వంటి వాటిని పాఠకుల దృష్టికి తేవటానికి ఈ గ్రంథమాల చాల కృషి చేసింది. వేంకటపార్వతీశ్వర కవుల షష్టిపూర్తి జరపడం ఒక రజతోత్సవ సంచికను ప్రకటించడం వీరు చేసిన పనుల్లో ముఖ్యమైనవి. పరిశోధకులకు చాలా సహకరించింది ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల.

**ఆంధ్ర గ్రంథమాల :**

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతుల ఈ గ్రంథమాలను మద్రాసులో 1924 లో స్థాపించాడు. ఈ గ్రంథమాల ప్రాచీన, అర్వాచీన గ్రంథాలను సవిమర్శక పీఠికలతో వెలువరించింది. వీరు వెలువరించిన గ్రంథాల్లో **"ఆంధ్ర భారత కవితా విమర్శనం"** ముఖ్యమైంది. వీరు చేసిన కృషిలో **"ఆంధ్ర వాఙ్మయ సూచిక"** ఆంధ్ర గ్రంథమాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. అంతే కాకుండా వివిధ గ్రంథాలయాల్లో ఉన్న గ్రంథాలను సేకరించి "గ్రంథసూచిక" ను ప్రకటించింది. నాగేశ్వరరావు తర్వాత శివలెంక శంభుప్రసాద్ ఈ కార్యభారాన్ని వహించారు. ఈ సమయంలో వచ్చిన టామ్ సాయర్, రాజు, పేద, రెండు మహానగరాల కథ పుస్తకాలు చాలా ముఖ్యమైనవి. ముఖ్యంగా పాశ్చాత్య భాషా సాహిత్యాలను గురించి తెలుసుకునే అవకాశం ఆంధ్ర గంథమాల కలిగించింది.

**అణా గ్రంథమాల :**

1938లో వెల్దుర్తి మాణిక్యరావు మొదలైనవారు అణాగ్రంథమాలను స్థాపించారు. దక్కన్ రేడియోలో వచ్చే రాజ్యాంగ సంస్కరణ ప్రకటనలు ఎంత మేరకు వాస్తవమో తెలపడం కోసం ఈ అణా గ్రంథమాలను స్థాపించారు. ఈ పుస్తకాలు అన్నీ చిన్నవే. వీరు ప్రచురించిన పుస్తకాల్లో జవహర్‌లాల్ నెహ్రు, దయానంద సరస్వతి జీవిత చరిత్ర, అణాకథలు, కాళోజీ కథలు, మొగలాయి కథలు ముఖ్యమైనవి. ఇందులో భాగంగానే వావిళ్ళ గ్రంథమండలి కూడా ఏర్పడింది. 1854లో వావిళ్ళ రామస్వామి శాస్త్రి మద్రాసులో స్థాపించిన ఈ సంస్థ దాదాపు వంద సంవత్సరాల వరకు సాహిత్య సేవ చేస్తూనే వచ్చింది. మొదట "వివేక రత్నాకర ముద్రాక్షరశాల" పేరుతో మొదలై రామస్వామి శాస్త్రి మరణం తరువాత వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ అన్న పేరుతో నడిచింది. ఎనిమిదేళ్ళలో 50 పుస్తకాలు వెలువరించారు. రామాయణ భారతాల వంటి గ్రంథాలెన్నో ముద్రించారు. చేతిరాత పుస్తకాలు చదువుకుంటూ ఇబ్బంది పడుతున్న రోజుల్లో వావిళ్ళ వారు ముద్రణాలయం నెలకొల్పి చదువరుల ఇబ్బందిని నివర్తించారు అన్న సి.పి.బ్రౌన్ మాటలు అక్షరాలా నిజాలు వావిళ్ళ నిఘంటువు కూడా ముద్రించారు.

**నవ్య సాహిత్య సంస్థలు :**

అప్పటికే పాండిత్య ప్రకర్షచే శుష్కించిన సాహిత్యానికి జవాన్ని, జీవాన్ని అందించారు. ఉద్యమాలు అదే నవ్య సాహిత్యోద్యమం. ఇందులో భాగంగానే సంఘసంస్కరణోద్యమం దానికై బ్రహ్మ సమాజాన్ని స్థాపించి సాంఘిక దురాచారాలను గురజాడ, కందుకూరి మొదలగు వారు ఈ నవ్య సాహిత్య ధోరణిలో ముందుకు సాగారు. పద్యకావ్యాలను ప్రత్యామ్నాయంగా నవల, నాటకం, ప్రహసనం అనే ప్రక్రియలు ఈ కాలంలోనే వచ్చాయి. నవలా పోటీలతో నవలలను ప్రోత్సహించారు.

సాహిత్యంలో వస్తువులో, రూపంలో, భాషలో మార్పు తెచ్చి నవ్యతకు ఆద్యుడయ్యాడు గురజాడ. భాష విషయంలో మార్పుతో పాటు రచనలను ప్రజాపరం చేయాలన్న సంకల్పం గురజాడకు కలిగింది. కళకళకోసం కాదు ప్రజల కోసం అని చెప్పడం వల్ల ఆధునిక కవితా వైతాళికుడయ్యాడు. వ్యావహారిక భాషలో కన్యాశుల్కాన్ని రచించి నూతన భాషా ఒరవడికి శ్రీకారం చుట్టాడు గురజాడ. ఈ వాదనకు స్వదేశీయోద్యమం కూడా చాలా దోహదం చేసిందని చెప్పవచ్చు. పాశ్చాత్య విద్యా ప్రభావం కూడా నవ్య సాహిత్యానికి దోహదం చేసిందని చెప్పవచ్చు. ముఖ్యంగా ప్రాచీన సాహిత్యంపై అభిమానం, అభిరుచి తుగ్గుతున్న సమయంలో పాశ్చాత్య ప్రభావం బలపడుతున్న తరువాత ఒక నవీన భావం అంకురించింది. ఆ అంకురించిన నవీన భావంతో వచ్చిన సాహిత్యమంతా నవ్య సాహిత్యం అని స్పష్టంగా చెప్పవచ్చు.

**సాహితీ సమితి :**

ఎంతోమంది ఉత్సాహవంతమైన యువకులు భావకవిత్వం రాయడం మొదలు పెట్టారు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఇట్లాంటి భావకవుల గురించి, భావకవిత్వాన్ని గురించి పట్టించుకోలేదు. పైగా నవ్య కవిత్వాన్ని, నవ్య కవులను విమర్శించింది. ప్రాచీన గ్రంథాల పీఠికలు, వ్యాఖ్యానాలే ధ్యేయంగా పెట్టుకుంది. ఇట్లాంటి సందర్భంలో భావకవులను ఏకం చేసే ప్రయత్నంలో భాగంగా తెనాలిలో తల్లావఝుల శివశంకర శాస్త్రి ఆధ్వర్యంలో తెనాలిలో 1919 ఆగస్టులో సాహితీ సమితి ఏర్పడింది. తెలుగు సాహిత్యం అప్పటికే రెండు భిన్న దృక్పథాలను కలిగి ఉంది. ఒకటి ప్రాచీన సాహిత్య ముద్రణ, పునర్ముద్రణ, రెండవది పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల కొంతమంది యువకులు తెలుగు సాహిత్యంలోకి నూతనత్వాన్ని ఆహ్వానించారు.

పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల తెలుగు సాహిత్యంలోకి వచ్చిన కొత్త ప్రక్రియలకు సాహితీ సమితి, నవ్య సాహిత్య పరిషత్తు స్వాగతం పలికాయి. ఆంధ్రదేశంలో భావ కవిత్వం ఒక ఉద్యమంగా రావటానికి

సకల ప్రయత్నాలు చేసింది సాహితీ సమితి. అప్పటికే నవ్య కవిత్వానికి నాంది పలికిన వారిలో గురజాడ, రాయప్రోలు ఉన్నారు. వస్తువు, రూపం, భాష, సంవిధానం ఇలా సాహిత్యానికి సంబంధించిన అన్ని అంశాలను నవ్యతను సాధించే ప్రయత్నం చేసి గురజాడ నవ్య కవితా వైతాళికుడయ్యాడు. ఆంగ్ల కవిత్వ ప్రభావంతో రాయప్రోలు కవిత్వం కనిపిస్తుంది.

అప్పటికి ఏ రకమైన సాంకేతిక అభివృద్ధి జరగలేదు. ప్రచార, ప్రసార సాధనాలు రాలేదు. ఒకవైపు సంస్కరణోద్యమం ప్రారంభమైంది. మరోవైపు పండిత భాష రాజ్యమేలుతుంది. ఇట్లాంటి కీలక సందర్భంలో సాహితీ సమితి స్థాపించబడింది. సాహితీ సమితికి అనుబంధంగా "సాహితి" అనే మాసపత్రిక వచ్చింది. "సాహితి" పత్రిక నవ్యసాహిత్యానికే ప్రాధాన్యతనిచ్చింది. కొత్త రచయితలకు, కొత్త ప్రక్రియలకు చేయూతనిచ్చింది. తల్లావఝుల గారు ఇటు ప్రాచీనులకు, అటు నవీనులకు వారధిగా నిలిచాడు. సాహితీ సమితి సభ్యులు రచనలు ఎక్కువగా వ్యావహారికంలోనే వచ్చాయి. ఖండకావ్యం, చిన్నకథ, పెద్ద నవల, ఏకాంకిక వంటి ప్రక్రియల సాధన ఈ కాలంలోనే జరిగింది.

ఆంధ్ర సాహిత్య క్షేత్రంలో చీకట్లు అలుముకున్న రోజుల్లో "సాహితి" మొదటి సంచికను తీసుకొచ్చింది. వీరు కొత్త ప్రక్రియలకు ఇచ్చిన ప్రాధాన్యత విమర్శకు ఇవ్వలేదనే చెప్పవచ్చు. అయితే దీనికి ఒక నిబంధనావళి లేకపోవడం, వ్యవస్థాగత లోపాలు ఇది ఎక్కువకాలం నిలబడక పోవడానికి కారణాలుగా చెప్పొచ్చు.

**నవ్య సాహిత్య పరిషత్తు :**

సాహితీ సమితికి ఒక వ్యవస్థాగత నిర్మాణం లేకపోవడం వల్ల నవ్య సాహిత్య పరిషత్తు అనివార్యంగా ఏర్పడవలసి వచ్చింది. 1933 మార్చి 10,11,12 తేదీలలో బరంపురంలో మొదటి సమావేశాన్ని జరుపుకుంది. రెండవ సభ రాజమండ్రిలో 1933 డిసెంబరు 29,30,31 లలో జరిగింది. ఈ సభ నవ్య గ్రంథ విక్రయశాలతో పాటుగా చిత్రలేఖన ప్రదర్శన శాలను కూడా ఏర్పాటు చేసింది.

సాహిత్యాన్ని కొత్త పంథాలో ముందుకు తీసుకుపోయే ప్రయత్నం చేసింది. గురజాడ "కన్యాశుల్కం" లోని కొన్ని అంకాలను రంగస్థలం వారిచే ప్రదర్శింప చేసింది. **"సాహితీ సమితి"**ని పరస్పరాభినందన సమాజం అంటూ హేళన చేస్తున్న సమయంలో నవ్యకవిత్వాన్ని ఒక నిర్దిష్ట ప్రణాళికతో నడిపింది నవ్య సాహిత్య పరిషత్తు.

నవ్య సాహిత్య పరిషత్తు దాని ఉద్దేశాలను, ప్రయోజనాలను నెరవేర్చడం కోసం చేపట్టిన కార్యక్రమంలో భాగంగానే **'ప్రతిభ'** అనే త్రైమాసిక పత్రికను ప్రారంభించింది. నవ్య సాహిత్య పరిషత్తు అందరి నుంచి రచనలను స్వీకరించింది. ఆంధ్ర సాహిత్య పరిషత్తు వలె గిరిగీసుకొని కూచోలేదు. సాహిత్య సంస్థకు అనుబంధంగానే ఉన్న "ప్రతిభ" ఎక్కువగా నవ్య సాహిత్యానికే ప్రాధాన్యతను ఇచ్చింది. **"సాహితీ సమితి స్థాపనలో భావకవులకు ఒక గూడు ఏర్పడింది. నవ్య సాహిత్య పరిషత్తు స్థాపన దాన్ని అపరంజి మేడగా మార్చింది"** అన్నారు సి. నారాయణరెడ్డి. నిజంగా ఈ మాట నిజంగానే నిరూపిత మయింది. ముఖ్యంగా భాషా విషయంలో ఉన్న ఆటంకాన్ని నవ్య సాహిత్య పరిషత్తు తొలగించింది. నవ్య సాహిత్య పరిషత్తు ఎనిమిది వార్షికోత్సవాలను జరిపింది. వీటిల్లో అధ్యక్షోపన్యాసాలు చాలా ఉన్నతమైన విలువలు కలిగి ఉన్నాయి. అంతే కాదు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా చేపట్టింది. కవిత్వంతో పాటుగా పద్య నాటికలను, ఏకాంకికలను కూడా ప్రోత్సహించింది నవ్య సాహిత్య పరిషత్తు. దాని ఉద్దేశాలకు అనుగుణంగానే నవ్య సాహిత్యానికి ఆంధ్రదేశంలో గొప్ప స్థితిని కలిగించింది.

**అభ్యుదయ సాహిత్య సంస్థలు :**




తెలుగు సాహిత్యం ప్రాచీనం నుంచి కాల్పనికత్వం నుంచి మరో కొత్త మలుపును తీసుకుంది. సామాజిక, రాజకీయ పరిస్థితులే ఇలాంటి మార్పులకు కారణాలుగా నిలిచాయి. మూఢ విశ్వాసాలు, దురాచారాలు రూపుమాపడం, సాహిత్యం వైయక్తికం కాకుండా సమాజ పరంగా ఆలోచించడం మొదలైన మార్పులే అభ్యుదయ సాహిత్యానికి, కవిత్వానికి నాంది పలికాయి.

1930 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడ్డ ఆర్థిక సంక్షోభం వల్ల పేదరికం, నిరుద్యోగం పెరిగాయి. ఒకవైపు ప్రపంచ యుద్ధాలు జీవన ప్రమాణాలు తగ్గిపోవడం, ప్రజాతంత్ర వాదులు, మేధావులు వామపక్ష భావజాలం వైపు మొగ్గుచూపారు. 1932లోనే **"న్యూ సిగ్నేచర్స్"** అనే కావ్య సంపుటి వెలువడింది. లండన్ రచయితల మానిఫెస్టోను శ్రీశ్రీ పొలాలనన్నీ హలాల దున్నీ అంటూ మొత్తం సారాంశాన్ని కవిత్వ రూపంలో చెప్పాడు. ఒకపవైపు జర్మనీలో హిట్లర్ విజృంభణలో మాగ్సింగోర్కీ వంటి రచయితలు పుట్టుకొచ్చారు. అదే సమయంలో

1935లో అలహాబాద్‌లో ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ ఏర్పడింది. వారు ఒక ప్రణాళిక ఏర్పర్చుకున్నారు. 1936లో లక్నోలో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. ప్రేమ్‌చంద్ అధ్యక్షత వహించాడు. ఈ సంఘానికి రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వారి సహకారం కూడా లభించింది.

హేతువాద దృష్టితో మూఢాచారాలను నిరసిస్తూ, నిర్మాణాత్మకమైన క్రియాశీలమైన కార్యాచరణకు పూనుకునే సాహిత్యాన్ని అభ్యుదయ సాహిత్యం స్వీకరించింది. "దిగిరాను దిగిరాను దివినుండి భువికి" అంటూ సమాజం పట్ల బాధ్యతను విస్మరించిన భావకవిత్వాన్ని ఖండిస్తూ వచ్చిందే అభ్యుదయ కవిత్వం. **"సమాజాభివృద్ధికి సాహిత్య రంగంలో అనివార్యంగా అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది".** పీడితుల, బాధితుల జీవన పరిస్థితులను వాస్తవ దృష్టితో వ్యక్తం చేయవలసిన అవసరాన్ని అభ్యుదయ కవులు గుర్తించారు. ఛందస్సులు, నిఘంటువులకు కాలం చెల్లిందని సాహిత్యాన్ని కొత్త మార్గంలో నడిపించారు.

1943 ఫిబ్రవరిలో తాపీ ధర్మారావు అధ్యక్షతన అరసం ఏర్పడింది. అరసం అంతకు ముందరి సాహిత్య సంస్థల కన్నా భిన్నమైనది. ముఖ్యంగా ప్రజా సమస్యలను పట్టించుకోవాలన్న స్పృహతో, బాధ్యతతో తన ప్రణాళికను కూడా సిద్ధం చేసింది. ప్రజాస్వామ్య స్వతంత్ర భారత సమాఖ్యను నిర్మించడం భారత ప్రజల ఆశయం. ఆ ఆశయ సిద్ధికి అరసం రచయితలు పూనుకున్నారు. వారి ఆశయాల ప్రచారం కోసం **"తెలుగుతల్లి" "అభ్యుదయ"** పత్రికలను తీసుకొచ్చారు. కులమతం సంకుచితత్వం మొదలు స్వేచ్ఛా ప్రపంచం దాకా రచయితలకు కొన్ని కర్తవ్యాలను నిర్దేశించింది. ఇతర సాహిత్య సంస్థలకు లేని సిద్ధాంత నిబద్ధత వల్ల విశాలత్వాన్ని సంతరించుకుంది. కర్తవ్య ప్రచారంకోసం అభ్యుదయ రచయితలు సాహిత్య పాఠశాలలను నిర్వహించారు.

తెనాలిలోని పెదపూడిలో 1946 మే 11 నుంచి జూన్ 10 వరకూ నెలరోజుల పాటు సాహిత్య పాఠశాల జరిగింది. ఈ పాఠశాలలో జరిగిన ఆంధ్ర సాహిత్యంలో కొత్త పోకడలు **"ఏది విప్లవ పంథా"** అన్న పాఠాలు విద్యార్థుల్లో నూతన ఆలోచనలు కలిగించాయి. ఈ పాఠశాల ఫలితంగా త్వమేవాహం, వజ్రాయుధం, అగ్నిధార, ఉదయిని, నాగొడవ వంటి ఎన్నో కవితా సంపుటులు ప్రజల మనిషి, ఓనమాలు వంటి ఎన్నో నవలలు పుట్టుకొచ్చాయి. ఇది అభ్యుదయ యుగానికి స్వర్ణయుగంగా చెప్పుకున్నారు.

**ప్రజానాట్య మండలి :**

అభ్యుదయ రచయితల సంఘానికి సోదర సంస్థగా **ప్రజానాట్య మండలి** పుట్టింది. ప్రజానాట్యమండలి "కష్టజీవి" వంటి బుర్రకథలను రాష్ట్రమంతా తిరిగి ప్రచారం చేసింది. తెలంగాణలో భూస్వామ్యానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో ప్రధాన పాత్ర వహించింది ప్రజానాట్యమండలి. ప్రతి గ్రామంలో ప్రజా నాట్యమండలి శాఖలు ఏర్పడ్డాయి. ఈ కాలంలోనే "మాభూమి" నాటకం విస్తృతమైన ప్రజాదరణ పొందింది. 1940–50లలో ఆంధ్ర సాహిత్య చరిత్ర అభ్యుదయ చరిత్రగా పరిణమించింది. కమ్యూనిస్టు పార్టీ నిషేధానికి గురికావడంతో అరసం లోని కళాకారులు, జైళ్ళకు వెళ్ళడంతో అరసం కార్యక్రమాలు స్తంభించిపోయాయి. పార్టీలో విభేదాలు తలెత్తడంతో కళాసాహిత్య రంగాల్లో కూడా అదే పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు తెలంగాణ పోరాటం సాగుతున్నా దానికి సంబంధించిన రచనలేవీ రాకపోవడం సాహిత్యంలో ఒక వెనుకబాటుగానే చెప్పుకోవాలి.

**విప్లవ రచయితల సంఘం :**

1967లో జరిగిన నక్సల్బరీ పోరాటం, దాని ప్రేరణగా వచ్చిన శ్రీకాకుళ పోరాటాలు ప్రజల్లో ఆలోచనలు రేకేత్తించాయి. ఈ పోరాటాలకు స్పందించి తిరగబడు (1969), మార్చ్ (1970) కవితా సంపుటులు వెలువడ్డాయి. శ్రీశ్రీ షష్టిపూర్తి సమావేశంలో విశాఖ విద్యార్థులు రచయితలకు విసిరిన సవాల్ పెద్ద సంచలనాన్నే సృష్టించింది. ఇంతకన్నా ముందుగానే 1959 లో "సెవెన్ స్టార్ సిండికేటు" ఏర్పడింది. ఈ సంస్థ **"అభ్యుదయ సాహిత్య సదస్సు"** నిర్వహించాలనుకుంది. వాళ్ళు శ్రీశ్రీ కి సన్మానం చేయాలనుకున్నారు. దిగంబర, తిరుగబడు కవులు దీనికి అభ్యంతరం తెలిపారు. నేను ఒక మహోద్యమ ప్రతినిధిని సదస్సులో పాల్గొని సన్మానాన్ని తిరస్కరిస్తానని శ్రీశ్రీ అనుకున్నారు. కానీ శ్రీశ్రీని వెళ్ళనివ్వకుండా అడ్డుకున్నారు. అప్పుడు దాన్ని బహిష్కరించి విరసం రచయితల సంఘ స్థాపనకు కారకుడయ్యాడు. **"శ్రీశ్రీతో మరి కొంతమంది వర్గ సామరస్య రాజకీయ రొంపిలో దిగి అదే కమ్యూనిస్టు పార్టీ, అరసం, శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మానం పేరుతో పాలక వర్గాలకు కలాన్ని దాసోహం చేయాలని కుట్ర చేసినప్పుడు, నక్సల్బరీ శ్రీకాకుళ పోరాటాలను బలపర్చడం ద్వారా ప్రజల పక్షం వహించి తన అరవయ్యో ఏటే విరసం జెండా ఎత్తుకున్నదు అంటారు"** వరవరరావు ఒకచోట. (వరవరరావు 1980: )

**"ప్రజలను సాయుధం చేస్తున్న రెవల్యూషనరీ నేటి కవి"** అన్న నినాదంతో విరసం ఏర్పడింది. 1970 జూలై 4న ఇంపీరియల్ హోటల్ లో ఏర్పడింది. 1970 అక్టోబర్ ఖమ్మం మహా సభల్లో విరసం తన ప్రణాళికను ప్రకటించింది. సమగ్రమైన మానవ స్వాతంత్ర్యం వైపే విప్లవ సాహిత్యం జరిపే ఈ మహా ప్రస్థానం అని తన ప్రణాళికలో పేర్కొంది. 1977 నవంబరు విరసం అధికారిక పత్రిక అరుణతార అట్టవెనుక విరసం ప్రణాళికను స్పష్టం చేసారు.

జడ్చర్లలో ప్రారంభమైన **"త్రైమాసిక సృజన"** పత్రిక కూడా ఆధునిక సాహిత్య వేదికగా పనిచేసింది. సృజన చేసిన ప్రభావం

కూడా తక్కువేమి కాదు. భాషా విషయంలో ముఖ్యంగా ప్రజల భాషలోని మాండలికాలను తీసుకుంది. గద్దర్, వంగపండు వంటి పాటలు మొత్తం ఆంధ్రరాష్ట్రమంతా ప్రాచుర్యాన్ని పొందాయి. మార్క్సిస్టు దృక్పథంలో విరసం సాహిత్య పాఠశాలలను నిర్వహించింది. కవిసేన మేనిఫెస్టో మీద త్రిపురనేని, సాహిత్యం కుట్రకాదు, రచయిత కుట్రదారుడు కాదు అనే వ్యాసాలు విమర్శలో చెప్పుకోదగ్గవి. ఇంతకుముందరి సాహిత్య సంస్థలన్నీ చేసిన కృషి కన్నా ఎక్కువగా నిబద్ధత, నిమగ్నత ఉన్న సంస్థగా విరసం తెలుగు సాహితీ చరిత్రలో స్థిరపడిందని చెప్పవచ్చు. విరసంలో అంతర్గత అభిప్రాయ భేదాల వల్ల 1975 జనవరిలో విడిపోయిన ఒక వర్గం 1978 ఆగస్టులో జనసాహితీ సాంస్కృతిక సమాఖ్యను ఏర్పాటు చేసింది.

**జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య :**

విరసం నుంచి చీలిపోయిన వారే జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య ఏర్పరచారు. మార్క్సిజం–లెనినిజం– మావో ఆలోచనా విధానాన్ని అంగీకరించిన వారికి మాత్రమే పరిమితమైన సంస్థగా ప్రకటించబడిన విరసానికి ప్రజాసంఘ స్వభావం లేదు. సాంస్కృతికోద్యమ శక్తుల్ని ఏకం చేసే శక్తుల్ని విరసం వదులుకుందని సమాఖ్య విమర్శించింది. భూస్వామ్య వాదాలను వ్యతిరేకిస్తూ నూతన ప్రజాతంత్ర వ్యవస్థను ఏర్పర్చుకోవడానికి వచ్చే అన్ని పోరాటాలకు సంఘీభావాన్ని ప్రకటిస్తాము అని తమ కర్తవ్యాలలో పేర్కొన్నారు. జనసాహితికి అనుబంధంగా **"ప్రజాసాహితి"** మాస పత్రిక ఏర్పడింది. 1977 లో ఆగస్టులో మొదటి సంచిక వచ్చింది. జనసాహితి ప్రచురించిన పుస్తకాల్లో ప్రధానమైనది ప్రజా కళారూపాల ప్రత్యేక సంచిక ఈ సంస్థ తన కర్తవ్యాన్ని తన పరిధిలో నిర్వహిస్తూ ఉంది.

**ప్రజా రచయితల సమాఖ్య :**

1985లో విరసం నుంచి చీలిన మరో వర్గం ప్రరసం గా ఏర్పడింది. దీనికి కన్వీనర్‌గా నమ్ము ఉన్నారు. విప్లవ రచయితలు 26 మంది కలిసి సంఘాన్ని ఏర్పరచారు.

మార్క్సిజం అనే మాట వాడకుండానే తన కర్తవ్యాలను రూపొందించుకుంది. విరసం హింసా వాదాన్ని, రాజకీయాలలో ప్రచారం చేసే వేదికగా మారిందని సమాఖ్య విమర్శిస్తే విరసం హింసాకాండను ఎప్పుడూ బలపరచదు. రాజ్య హింసను ప్రతిఫలిస్తుంది అని విరసం కార్యదర్శి సమాధానమిచ్చారు. స్థూలంగా మార్క్సిస్టు అవగాహన ఉన్న రచనలన్నింటినీ వీరు సమర్థించారు. విరసం ఆవిర్భావం నుంచి ఒక దశాబ్దం పాటు వచ్చిన సాహిత్యాన్ని విప్లవ యుగంగా చెప్పాలి.

ఈ దశాబ్దం దందహ్యమాన దశాబ్దంగా శ్రీశ్రీ వర్ణించారు. **"తెలుగు సాహిత్యంలో అంతకు ముందున్న కేవల రూపవాద అయోమయ వ్యక్తివాద సాహిత్య రీతుల మీద విప్లవ వాదం విజయం సాధించింది"** అని చేకూరి రామారావు అన్నారు. విప్లవ సాహిత్య సంస్థలలో ఎన్ని రకాల చీలికలు వచ్చినా ఇది విప్లవ యుగంగానే ఈ కాలపు సాహిత్యమంతా విప్లవ సాహిత్యంగానే పిలవబడింది.

**జననాట్య మండలి:**

"ఆర్ట్ లవర్స్" గా ప్రారంభమై 1970లలో జననాట్య మండలిగా పరిణమించిన సాంస్కృతిక సంస్థ ఇది. ప్రజా కళారూపాల గురించి ఆలోచించి ప్రజా పోరాటాలను కీర్తిస్తూ ప్రజల్లో విప్లవ చైతన్యాన్ని రగిలించింది. నూతన ప్రజాస్వామిక సంస్కృతికోసం తమ కలాలను, గళాలను వినింపించినవారే జన నాట్యమండలి కళాకారులు. ప్రజల కోసమే పనిచేస్తాం ప్రజల పాటనే మాకు ప్రాణం అంటూ ప్రజా కళారూపాలైన పాట, జముకుల కథలను, ఒగ్గుకథలను విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రజల నుడికారాన్ని ప్రజల బాణీని తీసుకొని పాటను అందించారు.

ఎనబై ఏండ్ల ముందుకాలంలో ఏర్పడ్డ భూమిక ఆ తర్వాత సాహిత్య సంస్థల ఆటుపోట్లు వికాసాలు ఇవన్నీ కూడా ఈ పుస్తకంలో వివరంగా ఉన్నాయి. ఇప్పటి ప్రస్తుత పరిస్థితిలో సాహిత్య సంస్థల వల్ల వచ్చిన సృష్టించిన సాహిత్యాన్ని, భాష, ప్రక్రియ వస్తువు వాటి పట్ల ఎనబై ఏండ్లలో వచ్చిన మార్పులు కూడా చర్చించడానికి అవకాశం ఈ పుస్తకం ఇస్తుంది. సాహిత్య చరిత్రను చర్చించడానికి ఒక మంచి ఆధార గ్రంథంగా కూడా ఈ పుస్తకం తోడ్పడుతుందని ఆశిస్తూ.

కృష్ణ రాసిన ఈ పుస్తకాన్ని గురించిన వివరమైన వ్యాసం ఇది. కొండ అద్దమందు కొంచమై ఉండదా అన్నట్టు దాదాపు ఆంధ్ర సాహిత్య పరిషత్తు నుంచి జననాట్యమండలి వరకు సాహిత్య సంస్థలు చేసిన కృషి చాలా చాలా ఎక్కువ. పాఠకులు, సాహిత్యకారులు, విద్యార్థులు పరిశోధకాలు చేయవలసిన, చేయాల్సిన కృషి ఎంతో ఉంది. రాజాస్థానాల, సంస్థానాల పోషణ నుండి సాహిత్యం ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని కలిగిన సాహిత్య సంస్థలుగా ఎదిగిన క్రమాన్ని కూడా ఈ వ్యాసంలో మనం స్పష్టంగా చూస్తాం. ముఖ్యంగా ఒక్కొక్క సంస్థను ఆయా కాలాన్ని, నేపథ్యాన్ని, పరిస్థితులను ఆ కాలంలో వచ్చిన, పరిష్కరించిన సాహిత్యాన్ని రూప, భాషాశైలిల పరంగా కూడా విస్తృత పరిశోధన చేయడానికి అవకాశాన్ని ఈ పుస్తకం ఇస్తుందని నా నమ్మకం. అట్లాంటి పరిశోధన జరగాలనే కోరికతో నేను ఈ వ్యాసాన్ని మీ ముందుంచుతున్నాను.



# రాజకీయం !

**ఎస్. ఆర్. పృథ్వి,** రాజమహేంద్రవరం.
ఫోన్ : 998 922 3245




చట్టమును వీడి చక్కగా సంచరింత్రు
నోరు దురుసుగ మార్చుచు, పోరుచుంద్రు
బుల్లెటుల నుపయోగించి, గోల సేత్రు
రాజకీయములుండగ రాజసమున


చేయునది తప్పునెరిగినా చేయు చుంద్రు
తప్పుకాదొప్పనుచు నమ్మజెప్పు చుంద్రు
ఓట్లను గనిన ధైర్యము నోట్ల తోడు
గా నిలిచి కాపు గాయుట కాదు గొప్ప!

మనుషులందుండు రక్కసుల్ మాయ చేయ
వున్న దానిని లేనట్లు, లేని దాని
నున్నటుల మాటలందు తేనొలక పోసి
తీపి చాటున చేదుంచు తెలివిగాను

అప్పులు చేయుట కాదులె
తప్పనెడి విధముగా నేటి దళపతులుండన్
చెప్పుచు నుందురు గొప్పలు
మెప్పులు బడయగ ననుచర మెకములు చేరన్!

ఒకరిపై నొకరురుకుచు నుక్క పోత
మాటలను మంటలుగ బెట్టి, మంచి నంత
తగులబెట్టు కుసంస్కృతిన్ ధరణి యందు
పెంచి పోషించు దస్యులు పెరిగిపోయె

చేవ గల్గిన యట్టి చేతి వృత్తులను చి
దిమి, కార్పొరేట్లంత తెగువ బూనె
చిన్న వారికి నెల్ల చిప్పకూడును బెట్టి
ధనవంతుల వెతికి, తలల పైన
మకుటములన్ బెట్టి మంచి చేయగ నెంచు
పాలన, యేవిధి పాలనగును?
ప్రజలార! తెలియుడీ పరిపాలనమ్మెల్ల
మీ ఓట్లె వారికి మేలు చేయు!




పేరుకే ప్రజాపాలన, విప్పి చూడు
కండ్లు, చెప్పిన మాటలు కాలరాచి
రాజుల వలె నేక వ్యక్తి రాజ్యమేలు
దుస్థితియె దాపురించెనే దుఃఖ పడగ

మనసులందు నిలయమైన మలిన స్వార్థ
మంత కరిగినచో జాతికంత మేలు
కలిగి, దుర్నీతి యంతమై, కన్న కలలు
మూడు రంగుల జెండాగ ముచ్చటొలుకు

రండి! కుళ్ళులో పొర్లిన రాజకీయ
ములను వీడి, సేవాంకురములను మదుల
యందు నాటుకొని, ప్రజల యందు ప్రేమ
పెంచుకొని ముందు కురకండి మంచినెంచి

**('ఇంద్ర ధనుస్సు' పద్య కావ్యం నుండి)**

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 2 (51) హైదరాబాద్ డిసెంబర్ : 2024

# మహాభారతం: 'ధర్మ' ప్రశ్నలు – 'భీష్మ' సమాధానాలు-10

**డా. అట్టెం దత్తయ్య**, సహాయాచార్యులు, ఎస్వీ కళాశాల, ఢిల్లీ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9494715445

**"ఆచార పరుఁడె యుత్తముఁ / దాచారములేనివాఁడె యధముఁడు ..."** అని కేతన విజ్ఞానేశ్వరీయంలో ఉంది. ఎటువంటి వారికైనా, ఎంతటి వారికైనా ఆచారాలుంటాయి. ఆ ఆచారాలను పాటించని వారు అధములవుతారు. కారణం, ఆచారమే ప్రతి మనిషికి ఆ పరిసరాలను, ప్రకృతిని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఆచారమంటే ఏమిటో కాదు **"అనుష్ఠానము, ఆచరణము. సంప్రదాయము, గురువులు పెద్దలు మొదలగువారినుండి పరంపరగా వచ్చువాడుక. నడత, ప్రవర్తనము"** అని సూర్యరాయాంధ్ర నిఘంటువు (సం.1, పు.366) తెలియజేస్తుంది. ఎలాంటి వృత్తిని నిర్వర్తిస్తున్నప్పటికీ ఆచారాన్ని పాటించడం వల్ల ఎంతటి కీర్తివంతుడైనాడో తెలియజేసే ఒక కథను గురించి చదువుకుందాం.

**2. ప్రశ్న: 'ఉత్తమమైన ఆచారం ఎట్లాంటిదో నాకు తెలియ జెప్పుము' (శాంతి.5.221) అని అడిగాడు.**

దీనికి **'జాజలి – తులాధారు సంవాదా'**న్ని భీష్ముడు సమాధానంగా చెప్పాడు. **'జాజలి అనే ముని తపస్సు చేస్తూ ఉండేవాడు. పిచ్చుకలు అతడి తలపై గూడు కట్టుకున్నాయి. అందులో గుడ్లు పెట్టాయి. వాటినుండి పిల్లలు పుట్టాయి. పెద్ద పిచ్చుకలు, వాటి పిల్లలూ కలిసి ఆహారం కోసం పోతూ వస్తూ ఆ గూటిలో నివసిస్తున్నాయి. ఆ జాజలి వాటిని దయతో చూసేవాడు. తరిమేవాడు కాదు. తన నియమానికి తానే మెచ్చుకొని 'ఇంతటి ధర్మనిష్ఠ ఎక్కడైనా ఉంటుందా?'** అని అనుకొన్నాడు. అప్పుడు ఆకాశవాణి **'మహాధర్మాత్ముడైన తులాధారుడు ఈ విధంగా ఎప్పుడూ మాట్లాడడు. నిన్ను నీవు గొప్పగా మెచ్చుకొంటూ మాట్లాడటం ఎందుకు?'** అని అతడిని ఆక్షేపిస్తూ పలికింది.

అది విని జాజలి ఆశ్చర్యం పొందాడు. ఆ తులాధారుడిని చూడాలనుకొన్నాడు. ఇంతలో **'అతడు కాశిలో ఉంటాడు'** అంది ఆకాశవాణి. ఆ ముని మాత్సర్యంతో కాశికి వెళ్ళాడు. అక్కడ వ్యాపారంలో మునిగి ఉన్న తులాధారుడిని చూసాడు. తులాధారుడు అతడికి తగిన సత్కారం చేసి ఇట్లన్నాడు.

**"అయ్యా! పిచ్చుకలు నీ తలమీద గూడు పెట్టాయి. అవి వాటి పిల్లలతో కలిసి సుఖంగా జీవిస్తున్నాయి. అయినా ఏ మాత్రం మనోవికారం లేకుండా ఎట్లా తపస్సు చేస్తున్నారు? మీరు నిజంగా నీవు మెచ్చుకోదగినవారు'** అన్నాడు. అది విని జాజలి అతడి జ్ఞానానికి ఆశ్చర్యపడ్డాడు. అతనికెలా తెలిసిందని ప్రశ్నించాడు.

అప్పుడు తులాధారుడు **'నేను వ్యాపార వృత్తిలో కొనడంలోనూ, అమ్మడంలోనూ మోసం చెయ్యను. తగినంత లాభాన్నే పొందుతాను. లాభనష్టాలను ఒకే విధంగా చూస్తాను. నా చిత్తం మట్టిపెళ్ళను, బంగారాన్నీ సమంగానే చూస్తుంది. నాకు నిందాస్తుతులు సమానం.**



**హింసా, ఆత్మ ప్రశంసా నా మనస్సులో లేవు. అన్ని ప్రాణులపట్లా దయగలిగి ఉంటాను. అభయదక్షిణతో సత్యయజ్ఞం చేస్తాను. మితిమీరిన సుఖాలనూ, కీర్తినీ కోరను. ఎవరికి ఎట్లాంటి ఉపకారం చేసిన సరే 'ఇంత చేశాను' అనుకోను. నాకు ఎప్పుడూ మమకారం లేదు. దేనిమీద నేను రాగద్వేషాలు కలిగి ఉండను. ఈ లోకాన్నంతటినీ చిత్రంలో బొమ్మను చూచినట్లే చూస్తాను. అందువల్ల నా మనస్సు కలువరేకును నీరంటనట్లే దేనినీ అంటుకొనకుండా నిస్సంగస్థితిలో ఉంటుంది'** అన్నాడు.

అప్పుడు జాజలి **'నీవు ఇప్పుడు పేర్కొన్న కర్మలలో తపస్సులు, యజ్ఞాలు ధర్మకార్యాలని చెప్పలేదు. వేదశాస్త్రాలలో చెప్పారు కదా! అట్లాంటప్పుడు నీవెందుకు ఆ కార్యాలను పేర్కొనలేదు?'** అన్నాడు.

**'అహంకారం, కోరిక వీటితో కూడిన తపస్సు, ఫలం మీది కోరికతో చేసే యజ్ఞం ప్రయోజనకారులు కావు. వాటివల్ల పదేపదే చావు పుట్టుకలు తప్పవు. అందువల్ల అవి చేటే కాని మేలు కావు. ఎప్పుడూ తృప్తిగా వుండి, సత్యయజ్ఞం చేసేవాణ్ణి చూసి దేవతలు తృప్తిపడతారు. దేవతలు తృప్తిపడితే బ్రహ్మానందం కలుగుతుంది'** అన్నాడు తులాధారుడు.

**"నీవు కర్మ వదలకుండా ఉండటానికి కారణమేమి?"** అన్నాడు జాజలి.

ధర్మం తప్పకుండా, సంసారం మీద మోహం లేకుండా కర్మలు చేసే పుణ్యాత్ములు కర్మలు చెయ్యనట్టే సిద్ధిపొందుతారు. బురదలేని పవిత్రమైన ఆత్మతీర్థం తెలుసుకున్న వాడికి ప్రతీపర్వతమూ పుణ్యపర్వతమే. ప్రతీనదీ పుణ్యనదే. ఏదో కారణంవల్ల ఆరంభించిందైనా కర్మ ప్రారబ్ధకర్మలాగే ఉత్తమగతికి కారణమవుతుంది. విన్నావా? నేను చెప్పిన ఈ నీతి సరైందో కాదో పెద్దవాళ్ళదగ్గర అడిగి సందేహం తీర్చుకుందామా? ఆ పని మనమే చేసుకోవచ్చు. నీవు తండ్రిలాగా పెంచిన పిచ్చుకలు మచ్చికపడి నీ తలమీద నేరుగా ఆకాశంలో

ఎగురుతూ ఉన్నాయి. వాటిని పిలిచి నీ చేతిపై ఉంచుకొని బుజ్జగించు' అని తులాధారుడు చెప్పాడు. జాజలి ఆ పక్షులను పిలిచాడు. అవి అతడి చేతిమీదికి రాకుండానే ఆకాశంలోనే నిలబడి ఇలా అన్నాయి.

మునివర్యా! ధర్మదేవత పంపిస్తే నిన్ను పరీక్షించటానికి వచ్చిన ఆమె సేవకులం. ఇప్పుడు నీకు కలిగిన సంశయం తొలగేటట్లు విషయం చెపుతాం. వినుము. ఎవడి హృదయంలో మాత్సర్యదోషం ఉంటుందో, వారిలో ఈర్ష, కళంకం, కలహం అనే దుర్గుణాలు కల్గుతాయి. వీటివల్లనే హింస కూడా కల్గుతుంది. అందువల్ల మునివృత్తిలో ఉన్నవారు పూర్తిగా మాత్సర్యదోషాన్ని మనసులోనుండి తొలగించుకొంటేనే మేలు కలుగుతుంది. స్పర్థ అనే దుర్గుణం మంచిధర్మాన్ని నశింపచేస్తుంది. మంచి ధర్మం నశిస్తే మనుజుడు పూర్తిగా వినాశానికి గురి అవుతాడు. అందువల్ల తెలివైన నేర్పరి నిర్మలమైన శ్రద్ధగలవాడై స్పర్థ అనే దుర్గుణాన్ని వదలాలి.

సత్వగుణం వల్ల జన్మించిన శ్రద్ధ మనం తెలిసికొనదగిన దానిని తెలియజేస్తుంది. తద్వారా శుభం కలగజేస్తుంది. చిత్తశుద్ధే శ్రద్ధకు స్వరూపం. అందువలన తత్వజ్ఞుడు శ్రద్ధను పురుష స్వరూపునిగా భావించి అనుసరిస్తాడు. దేవతలు నిర్మలమైన శ్రద్ధలేని తపసితనమునూ యాజకత్వాన్నీ అంగీకరించరు. శ్రద్ధతో కూడి ఉంటే వాటిని మెచ్చుకొని అంగీకరిస్తారు. కాబట్టి శ్రద్ధ అనేది చాలా ప్రశస్తమైన గుణం. శ్రద్ధ అనే ధనసంపద మన మాటలను, మనస్సును చెడుదారిలో పోనీకుండా కాపాడుతుంది. 'శ్రద్ధ' అనేది జీవాత్మయొక్క మంచి ప్రసన్నతాగుణమే సుమా! అని పలికిన పక్షుల రూపంలో ధర్మదూతలు 'బ్రహ్మగీతలు'పేరుతో మరిన్ని మాటలు వినిపించాయి.

దేవతలు **'శుచిలేకున్నా యాగం చేసేటప్పుడు శ్రద్ధ గలవాడినీ, శుచి ఉండినా శ్రద్ధలేని వాడినీ పరిశీలించి నిరూపిస్తూ వీరిరువురికీ పుణ్యం సంపాదించటంలో సమానత్వమే ఉంటుంద'**ని నిర్ణయించారు. (శౌచంలేని దోషాన్ని శ్రద్ధ తొలగిస్తుందని భావం) శ్రద్ధ చాలా పవిత్రమైంది. శ్రద్ధగల మనుజుడు గౌరవంవల్ల ఉత్కృష్టుడౌతాడు. అతడి అన్నం భుజించటానికి యుక్తమైనది అని చెప్పాడు.

వడ్డీవ్యాపారంతో బతుకుతూ దానం చేసినవాడూ, దానం చెయ్యని వేదపండితుడూ ఒక్కటే అన్నారు దేవతలు. అయితే ఆ ఇద్దరిలో దానం చేసినవాడు యజ్ఞం కూడా చేస్తే అధికుడవుతడన్నాడు బ్రహ్మ. శ్రద్ధ అనే గుణం లేని వాడికి దానం చేయాలనే స్వభావం ఉండదు. శ్రద్ధ కలిగి ఉండాలి. పాము పొరవొదిలినట్టు శ్రద్ధకలవారు పాపాలు వొదిలేస్తారు. కాబట్టి శ్రద్ధ అలవరచుకోవడం మంచింది. శ్రద్ధవుంటే మనసులో మాత్సర్యం, మాలిన్యం ఉండవని పిచ్చుకలు జాజలితో చెప్పాయి. అది విని జాజలి తేరుకొన్నాడు. తరువాత తులాధారుడిని చూచి సవినయంగా ఇట్లా అన్నాడు.

**'ఓ తులాధారా! పూర్వం నేను మునులవద్ద తత్వం వినలేదు. అందువల్ల నాకు ఇట్లాంటి 'ఆత్మశ్లాఘాపరత్వం' అనే అవినయదోషం సంభవించింది. నీ ఉపదేశవచనాల వల్ల నా మనస్సు కిప్పుడు తెలివిగలిగింది. ఇక మీద నేను శాంతి మార్గంలో నడుచుకుంటా'** నన్నాడు.

అప్పుడు తులాధారుడు **'మానవుడు తనకు విధ్యుక్తమైన ఏ కర్మగలదో, ఆ కర్మను చక్కగా అనుష్ఠించటం మేలు. వారు ఆ కర్మపట్ల నివృత్తిని పొంది శ్రద్ధతో కర్మసన్యాస పద్ధతిని పాటించటానికి తగిన నేర్పుకూడా కలిగి ఉండాలి'**అన్నాడు. 'అవును' అంటూ వెళ్లిపోయాడు జాజలి.

ఈ సమాధానంలో సంవాదానికంటే ముందు భీష్ముడు **"వేదం వివిధాచారాలను నిరూపిస్తున్నది. పరిశీలించి చూస్తే అందరికీ హితకరమైన సదాచారం వేరే ఏమున్నది? మహాత్ములైన వారు ఏ ఆచారాన్ని పాటిస్తారో, దానిని తక్కినవారు పాటించాలి"** (శాంతి. 5.221) అంటాడు. దీనిని వివరించడానికే ఈ సంవాదాత్మక కథ చెప్పాడేమో అనిపిస్తుంది. మనసా, వాచా, కర్మణా త్రికరణ శుద్ధిగా చేసిన తన వృత్తిముందు ఏ వ్రతం, యజ్ఞం, తపస్సు సరితూగవని ఈ కథ ఎరుకపరుస్తుంది. వాటితో పాటు అందరూ పాటించాల్సిన కొన్ని ఉత్తమోత్తమమైన లక్షణాలను ఈ తులాధారుడి ద్వారా తెలియజేసాడు. లాభనష్టాలు, నిందాస్తుతులను సమానంగా స్వీకరించడం. హింసా ఆత్మప్రశంసా చేయకుండా ఉండడం. సుఖ, కీర్తికాంక్షలకై పరుగెత్తకపోవడం. మమకారం, రాగద్వేషాలు లేకుండడం. భూతదయ కలిగి ఉండడం. సత్యాన్ని పాటించడం. శ్రద్ధావంతులు కావడం. స్పర్థతో పనిచేయకుండా ఉండడం. దానాలు చేయడం అనేవి. వీటన్నింటిని ఎవరు కలిగి ఉంటారో వారే మహాత్ములు. అట్లాంటివారు పాటించిన ఆచారాన్ని మిగతావారు పాటించాలనడం సరైందే. ఈ విషయాన్ని భగవద్గీత "యద్య దాచరతి శ్రేష్ఠ ..." అనే శ్లోకం(3.21)లో కూడా తెలుపుతుంది. ఈ శ్లోకంలో ఈ సమాధానానికి రెండు పదాలు చాలా ఉపకరిస్తాయి. 'ఆచరతి, అనువర్తతే' అనేవి. ఉత్తముల పద్ధతులను అనుసరించడం. పెద్దలను – పిల్లలు, గురువులను – శిష్యులు, రాజును – ప్రజలు ఇలా అనుసరిస్తూనే ఉంటారు. ఇది సహజంగా మనిషితో పాటు ఇతర కొన్ని జీవులకు కూడా ఉండే సహజ అలవాటు. కొన్నిసార్లు లోకం గొర్రెపోకడలా కూడా కనిపిస్తుంది. ఎవరు ఏది చేస్తే తనచుట్టువారు అదే చేయడానికి తహతహలాడుతారు. స్వతంత్ర ప్రజ్ఞ చాలా తక్కువమందికుంటుంది. దీనిని ఆసరాగా తీసుకున్న చాలామంది అనేకులను చెడుమార్గంలో ప్రవేశపెడుతారు. తాను చెడిపోతు పదిమందిని చెడగొట్టేవారు కూడా ఉంటారు. అలాంటి వారి మాటలు వినేవారు, అనుసరించే వారు కూడా అనేకులు తయరయ్యారు. అన్నివిధాల శ్రేష్టమైన మహానుభావులు కొందరుంటారు. అట్లాంటి వారిని అనుసరించే వారుకూడా ఎంతో కొంతమంది ఉండకపోరు. మూడోరకం వారిని కూడా చూడవచ్చు. వీరు మంచికి చెడును, చెడుకు మంచిని పూసి ఇతరులమీద రుద్దుతారు. తప్పుదారి పట్టిస్తారు.

ఈ సమాధానంలో బాగా ఆలోచింపచేసేది కర్మ, శ్రద్ధ. ఈ రెండింటి గురించి భగవద్గీత నాల్గవ అధ్యాయంలో తెలిపిన విషయాలే ఇక్కడ ధ్వనిస్తాయి. కర్మచేయని వారు ఎవరుండరు. మానసిక చర్యకూడా కర్మనే. అట్లాంటప్పుడు ఎటువంటి కర్మలు చేయాలి. ఏ కర్మవల్ల సంతోషానందాలు పొందలగుతారు అనేది తెలుసుకోవడం ముఖ్యం. అందుకే తులాధారుడు విధ్యుక్త ధర్మాన్ని చేస్తూ కర్మసన్యాస పద్ధతిని అలవర్చుకోవడం మంచిదంటాడు. కర్మ, అకర్మ, వికర్మ అని మూడు రకాలు. కర్మలో అకర్మను, అకర్మలో కర్మను చూచుట అంటే కర్మచేస్తూ నిర్లిప్తంగా ఉండుట, నిర్లిప్తంగా ఉంటూ కర్మనాచరించుట అను రీతిగా సమస్త కర్మలను చేయువాడే యోగి, బుద్ధిమంతుడు (భగవద్గీత. 4.15). అందుకే తపస్సు చేసుకునే జాజలి కంటే తన వృత్తిలో ఉండి కర్మను అంటని తులాధారుడే యోగి, బుద్ధిమంతుడు. అట్లాగే శ్రద్ధను మించింది లేదంటాడు. భగవద్గీత కూడా 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్..." అని ప్రబోధిస్తుంది. శ్రద్ధ సత్వమనే బుద్ధితో నిర్ణయానికి వచ్చేది కాబట్టి దాని వలన ఆత్మతత్వం లభిస్తుందని శంకరాచార్యులు 'వివేక చూడామణి'లో వివరించారు. ఈ సమాధానాన్ని మరింత బలపరిచే సమాధానం మరొకటుంది. అది ధర్మరాజు ప్రశ్నవల్ల అందినదే.

ప్రశ్న: **ప్రజలకు ఎలాంటి ఆచారం వల్ల, ఎలాంటి శీలం వల్ల, ఏ చదువు వల్ల ముక్తి దొరుకుతుంది?' (శాంతి. 5.18)**

భీష్ముడు ఈ ప్రశ్నకు ఒక ప్రాచీన కథను సమాధానంగా చెప్పాడు. అసితుండనే ముని జైగీషవ్యుడనే మునిని ఇట్లాంటి ప్రశ్ననే అడిగాడు. దానికి జైగీషవ్యుడు సమాధానం ఇలా ఉంది.

'శాంతి సంపన్నులై ప్రియదర్శనులైన వారికి ఏది పాటింపదగినది ధర్మంగా ఉందో, ఆ ధర్మంపట్ల నా చిత్తం ఎనలేని ప్రీతి కలిగి ఉంది. ఆ ధర్మవిధాన మెట్లాంటిదో వివరిస్తాను వినుము అంటూ ఇతరులు పొగిడినా, తెగిడినా మనసులో ప్రీతిగానీ, అప్రీతిగానీ లేకుండా ఉండడం, అట్లాగే పరులు కొట్టినా, కోపం లేకుండా ఉండటం, జ్ఞానులైనవారి ఎన్నదగిన గుణాలుగా ఉన్నాయి. కోరుకున్న వస్తువు లభించకపోవటం వల్ల బాధపడకూడదు. మంచి,చెడు రెండింటివల్ల తృప్తిపొందాలి. తాను అనుకున్నట్లు ఒక పని జరగలేదని చింతించకూడదు. ఇవే మేలైన గుణాలు. సంతోషం, అభిమానం, అసహనం, అపరాధం, మథించటం, తన ఎక్కువతక్కువతనాన్ని గూర్చిగాని చింతిస్తూ ఉండటమనేవి ఋషులు విధించిన సదాచార పద్ధతిలో నిరసించబడిన గుణాలు. అంతరింద్రియ నిగ్రహం కలవాడు తనకు అవమానం జరిగితే అమృతం త్రాగినట్లుగా తృప్తి పొందుతాడు. సన్మానం జరిగితే విషం త్రాగినప్పుడు పొందినట్లు కలతను పొందుతాడు. ఆత్మతత్త్వం తెలిసినవాడికి ఎప్పుడు ఎవరిని చూసినా తన, పర, శత్రు, మిత్ర అనే భేదబుద్ధి కలగదు. ఆ భేదభావం లేకపోవటం వల్ల ఏ పరిస్థితిలోనూ వారి చిత్తంలో సంతోషం లోపించదు. శ్రోత్రాదులైన జ్ఞానేంద్రియాలను, పాదాదులైన కర్మేంద్రియాలను జయించిన వాడు హృదయంలో శాంతి పొందుతాడు. శాంతి వలన వాడికి శాశ్వతసుఖం కలుగుతుంది. అప్పుడతడిలో ఏ విధమైన వికారాలు కలుగవు. అట్లాంటి వాడితో పూజితమైన పద్ధతిలో చెలిమి సాధించటం దేవతలకు సైతం దుర్లభంగా ఉంటుంది.' అని భీష్ముడు ధర్మరాజుతో అన్నాడు.

ఎన్ని ఉత్తమ లక్షణాలుగా చెప్పుకుంటారో అన్నిటినీ ఇందులో చొప్పించాడు. చెడువాటి విధంగానే మంచివి కూడా ఒకదాని తర్వాత ఒకటి అలవడుతూనే ఉంటాయి. ముఖ్యంగా ఆశను అదుపులో ఉంచుకుని, కీర్తికోసం కోరలు చాచకుండా, అంతరింద్రియ నిగ్రహం కలిగి ఉన్నవారికి దుర్గుణాలు ఇంచుమించు దరిచేరవు. అరిషడ్వర్గాలలో మొదటిది ఒకటి చేజారితే మిగతా ఐదు చుట్టేసుకుంటాయి. అట్లాగే సప్తవ్యసనాలు. అష్టమధాలు ఇత్యాదులన్నీ. బుద్ధుడు బోధించినట్లు కామం లాంటి అగ్ని మరొకటిలేదు. ద్వేషం లాంటి భయానక స్థితి మరొకటి లేదు. మూర్ఖత్వం లాంటి బంధం మరొకటి లేదు. దురాశ లాంటి వరద మరొకటి లేదు.

ఇప్పుడు సమాజం ఆచారాలు అంటే బాహ్య పనులకే పరిమితమైనారు. అసలైన ఆచారం అంతరంగంలో జరగాలి. ఏం తింటున్నాం? ఎలా కట్టుకుంటున్నాం? ఏ దిక్కుకు నడుస్తున్నాం? వంటి వాటిని పట్టుకుని ప్రాకులాడటం కంటే అంతఃసౌందర్యాన్ని పెంచుకోవాలి. మనసు, ఆలోచన మారినప్పుడే మనిషి మారుతాడు. మంచి మనసు కలవారికి కట్టుదిట్టమైన ఆచారాలేమి అవసరం లేవు. మనిషి, మనసు అదుపులో లేనివారే ఏ అఘాయిత్యాలు చేస్తారో అనే భయంతో పెట్టుకున్న ఆచారాలే ఎక్కువశాతం.

**ఆధార గ్రంథాలు** :


1. అప్పలస్వామి, పురిపండా. '**వ్యావహారికాంధ్ర మహాభారతం**' (శాంతి పర్వము). 1976. రాజమండ్రి: ప్రాచీన గ్రంథావళి.

2. వెంకటరత్నం, గుంజి. 'మహాభారత విజ్ఞాన సర్వస్వం'. 2021. హైదరాబాదు: ఎమెస్కో

3. నిర్వికల్పానంద, '**శ్రీమద్భగవద్గీత**' (పదచ్ఛేద టీకాతాత్పర్య సహితం). 2010. హైదరాబాద్ : రామకృష్ణమఠం.

4. రామకృష్ణమూర్తి, తిప్పాభట్ల. శ్రీనివాసులు, సూరం. సంపా. '**శ్రీమహాభారతము**' (అన్ని పర్వాలు, 7 సంపుటాలు). 2018. గోరఖ్‌పూర్: గీతాప్రెస్.

5. విశ్వేశ్వర శాస్త్రి, జన్నాభట్ల. సంపా. '**మహాభారత వైజయంతి**' (తొమ్మిది సంపుటాలు). 2006. గుంటూరు : భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.

6. సుబ్రహ్మణ్యం, జి.వి. సంపా. '**కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము**' (అన్ని పర్వాలు, 15 సంపుటాలు). 2014. తిరుపతి: తి.తి.దే.

7. హనుమంతరాయ శర్మ, బలభద్రపాత్రుని. '**మహాభారత విమర్శనము**' (రెండు సంపుటాలు). 1996. గుంటూరు: భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.

# శ్రీచరణ శరణాగతి – రావికంటి కవిత్వానుశీలన

**డా. జి. శ్రీనివాస రావు,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డి,
ఫోన్ : 98480 20646

కవి శిరోమణి, కావ్య కళానిధి బిరుదాంకితులు శతాధిక గ్రంథకర్త, ఆధునిక పద్య కవులలో ఒకరు ఆచార్య రావికంటి వసునందన్‌గారు 2012లో రచించిన పద్య కావ్యము **"శ్రీచరణ శరణాగతి"**

శ్రీచరణ శరణాగతి 1021 వృత్త పద్యాలలో వ్రాయబడిన వైష్ణవ గ్రంథరాజము. మహత్వ పటుత్వ కవిత్వ వైజయంతితో, శ్రీమహావిష్ణువు నలంకరింపజేసిన భక్త కవి వీరు. వీరి విష్ణుభక్తికి పరాకాష్ఠ ఈ కావ్య కౌస్తుభం. సహస్ర నామాలతో విరాజిల్లు శ్రీవిష్ణు పాదాలకు సహస్ర పద్య పుష్పాలతో అర్చన చేసిన ధన్య జీవి వీరు. హరిభక్తి పారవశ్యంలో 'శ్రీ'కారంతో రచన ప్రారంభించడం మరిచారు. కావ్య నామంలోనే 'శ్రీ' ఉండడం కారణం కావచ్చు. శ్రీమహాభాగవత సారభూతముగా ఈ శ్రీచరణ శరణాగతి దర్శనమిస్తుంది. ఒకపరి శుకమహర్షివలె, ఒకపరి పోతనవలె మనకు శ్రీరావికంటి వసునందన్‌గారు కనిపిస్తారు. వీరి కవిత్వమును నేనీ వ్యాసంలో స్థాలీపులాక న్యాయమున స్పృశించెదను.

సమస్త ప్రాణికోటికి పరమగమ్యమైన హరి పాదాలను లక్ష్యంగా భావించి, వైష్ణవ సాహిత్యమే కాక సమస్త వేదాంత సారాన్ని ఈ రచనలో కవి అందించారు.

**ఆయువు మించకుండ, భవదంఘ్రి సమాశ్రయశీలమే నిజో**
**పాయముగా దలంచి, భవబంధవిమోచనకై నుతించి, నీ**
**సాయము జీవసంతతికి సర్వముగూర్చెడి నంచునెంచి, శ్రీ**
**నాయక! వేయి పద్యములు నమ్రతజెప్ప ననుజ్ఞ వేడితిన్ 1**

శ్రీమన్నారాయణుని పాదాల దివ్యసౌందర్యాన్ని సహస్రాధిక పద్యాలలో మనోహరంగా చెప్పడమే కాక వేదోపనిషత్ పురాణాల దగ్గర నుండి నేటి వరకు గల వైష్ణవ సాహిత్యంలోని మణిపూసల వంటి భావాలను గ్రహించి వాటిని వ్యక్తీకరించడము, విష్ణు కథలను, విష్ణులీలలను, విశేషించి విష్ణు అవతారములను తనివితీరా వర్ణించడం జరిగింది.

**నీవనినంతనే మనసు నీరయి యేరయి పోవురా! భవ**
**త్పావన దివ్యసుందర శుభాకృతినాదృతి జేరురా మనో**
**భావనలెన్నియన్ని! మధుపవ్రతమూని యహంత త్వత్పద**
**శ్రీవర పద్మ సేవనము సేయ తపించునురా రమాధవా! 3**

విష్ణు అవతారములలో నరసింహ, వామన, రామ, కృష్ణావతారములను నోరారా వర్ణించారు కవి. ఒక విధంగా చెప్పాలంటే ఈ రచనను సంక్షిప్త భాగవతమని చెప్పవచ్చును. శ్రీరామ కథను వర్ణించునప్పుడు ఇది సంక్షిప్త రామాయణమనిపించును. పోతనగారి తరువాత శ్రీకృష్ణుని లీలలను ఇంత మధురంగా వర్ణించినవారు అరుదు.

అక్కడక్కడ అద్వైత భావాలు కన్పించినా, విశిష్టాద్వైత, ద్వైత భావాలే ఎక్కువ. విశిష్టాద్వైతంలోని కీలకాంశం'శరణాగతి'(ప్రపత్తి). శరణాగతి ద్వారానే భక్తుడు తన 'అహం' పూర్తిగా వదిలేసి భగవంతుని శ్రీచరణాలను శరణు వేడుతాడు. మోక్షమునకు ఇదియే భక్తుడు ఎంచుకొను మార్గం. భక్తుడు తనను తాను భగవంతునికి సమర్పించుకోవడమే ఇందులోని ప్రధానాంశం.

**ఏపాదమ్ములు వేద మూలములో! సాగించన్ మహావిశ్వమున్**
**ఏపాదమ్ములు సద్రసాత్తములో! కీర్తించన్ సదాసత్కవుల్**
**ఏపాదమ్ములు దివ్యవాసనలో! పూరించన్ జగత్ప్రాణముల్**
**ఆపాదమ్ములకేను సాగిలి యుగాద్యంతస్థితిన్ మ్రొక్కెదన్ 6**

వీరి వినయం దాస్య భావన అమోఘం.

**పూవును బట్టి చీమ శివు పూజ్యశిరమ్మును జేరినట్టులే**
**తావియులేని నాపలుకు త్వత్పదకీర్తన నీదు పాదజ**
**ప్రావరణమ్ము మెట్టు చిరుపాయవలెన్ నుతికెక్కదే! భవ**
**త్పావన నామరూపముల పట్టును జెంది ముకుంద! మాధవా!11**

పూవును బట్టి చీమ అనడం నిరుపమానోపముగా చెప్పవచ్చు.

**ఇది నే జెప్పితినంచునెంచ గలనేనిన్ విస్మృతిన్ కేశవా!**
**సదయాకార! అహైతుకీ కృప జగజ్జాలంబు రక్షించు త్వ**
**త్పద మాకందము బొట్టు బొట్టులుగ నింపన్ గుండె గొంతున్, తదా**
**స్పద లౌల్యంబున జంటిపాపనయి తొస్సల్ బల్కితిన్ సైపవే!**

అంతా భగవంతుడే తన నోట పలికించాడనీ, తనకేమీ తెలియదని చెప్పుకోవడం వీరి వినయానికి తార్కాణం.

**ఆలంకారికాభివ్యక్తి**

కవి పరమాద్భుతమైన భక్తి భావ లోకమున విహరించుచు నారాయణ రూప, లీలావైభవమును దర్శించుచు అభివ్యక్తీకరించిన భావనలు కోకొల్లలు. ఇవన్నియు చమత్కార జనితములు పాఠకుని ఒక క్రొత్త లోకమున విహరింపజేయును.

**విష్ణుమూర్తి దివ్య మంగళ రూప వర్ణన**

**అడుగులు విద్రుమమ్ములు, నవాంబరముల్ వరపుష్య రాగముల్**
**నిడుపగుదండపచ్చలు, వినిర్మలకౌస్తుభమెన్న కెంపులున్**
**సుడివడు కౌశముల్ కనులు శోభన హాసము లింద్రనీలముల్**
**విడివడు మౌక్తికమ్ములును, విశ్రుత రత్నవిభూష కేశవా 34**

వివిధ కాంతులీను రత్నములన్నీ హరిని అలంకరించి ఉన్నట్లు వర్ణించడం స్వాభావికంగా ఉంది. రత్నాలన్నీ ఆయన ముందు తీసి కట్టు కదా!





**స్వామీ! నవ్వులు మల్లెపువ్వులు మనశ్శాంతి ప్రదాన ప్రభల్**
**స్వామీ! చేతులు దీర్ఘ దీర్ఘములు వర్షాహర్ష పర్జన్యముల్**
**స్వామీ! చేతలు పావనానిలములై వారించు సంతాపముల్**
**స్వామీ! పాదము లందెవేసినవి యాపాదించు సౌఖ్యోన్నతుల్229**

నవ్వులు మల్లెపూవులు ఎంత చక్కటి పోలిక. ఎలాంటి కల్మషం లేని నారాయణుని నవ్వులు మనశ్శాంతి ప్రదాయకములు. చేతులు ఆనంద వర్షమిచ్చే, మేఘాలనీ, చేతలు సంతాపములు తొలగించు పవిత్రానిలములని చెప్పడం కవి ఊహకు ఊతమిచ్చేవిగా ఉన్నవి. "పాదములందెవేసినవి" అనడం చూడండి. సాధారణంగా అందెవేసిన చేయి అంటాం వ్యవహారంలో. మోక్షమివ్వడంలో అందెవేసిన పాదాలు హరిపాదాలు అని వ్యంగ్యార్థం. గజ్జెలు ధరింపబడినవని అభిధార్థం.

**భారము ఘోరమంచు దల బాదుక నేడ్చెదునట్టి వట్టి సం**
**సారులు నింద్రియావళిని జక్కగ బట్టగ గట్టనేర్చినన్**
**పారము ముట్టలేరెయను పద్ధతి మాటికి కాలుసేతులన్**
**బారలు సాచి లోపలికి బారగజేయుచు కూర్ముడొప్పెడిన్ 652**

సంసారులకు ఇంద్రియములను ఎలా నిగ్రహించుకోవాలో తెలియజేయటానికి విష్ణువు కూర్మావతారం ధరించినట్లుగా చెప్పడం చమత్కారంగా ఉంది.

**తన ఘన తేజమెంతయును దర్పిత ధర్ముడు కౌసలేయ పా**
**వన వర సత్త్వమూర్తి కభివాదము సేయగ భార్గవుండు, వి**
**ష్ణుని ధనువంది పెండ్లియగు శోభనమూర్తికి రామమూర్తికిన్**
**కొనుమని కాన్కవెట్టి చనె గుహ్యమహేంద్రగిరి ప్రవాసియై 764**

రాముడు శివధనస్సును విరిచినందుకు కోపించి భార్గవ రాముడు విష్ణుచాపమును ఎక్కుపెట్టమంటే అలాగే చేస్తాడు రాముడు. ఆ విష్ణుచాపాన్ని రామునికే ఇస్తాడు పరశురాముడు. అది ఎలా ఉన్నదంటే పెండ్లికి వచ్చినవాడు పెండ్లి కానుక ఇచ్చినట్లుగా ఉందనడం ఎంత చమత్కారంగా ఉందో కదా. అప్పుడే పెళ్ళి అయిన రాముని 'శోభన మూర్తి' అనడం కూడా వ్యంగ్యార్థ సూచకం.

**చేపెన్ గోవులు క్షీర సాగరములన్.... 715** అనడం అతిశయోక్తిని తెలియజేస్తుంది.

రామలక్ష్మణ భరత శత్రఘ్నులు పుట్టినప్పుడు వారు **"లోకుల కనుదమ్మికిన్ వెలుగు కుప్పలుగా నుదయించిరంతటన్" 761**

ఎన్నో సంవత్సరాలుగా లోకులు ఎదురు చూసి చూసి కళ్ళు కాయలు కాసిన వారికి వెలుగు కుప్పలుగా దాశరథులు జనించారని చెప్పడం పరమాద్భుతం.

సీతాపహరణానంతరం రాముని వేదనా వర్ణనలు ఎంతటి కఠిన హృదయాన్నైనా కరిగిస్తాయి. మరి రాళ్ళు కరగడం వింత కాదు.

**అంతట రామరాఘవుడు నంతట గాంచిన సీతలేమి నా**
**సొంతము గ్రుంగి చెట్టులను సారెకు పుట్టల పూలతీవెలన్**
**కాంతను జెప్పరేయనుచు కాతరుడై యడుగున్ మహార్తి న**
**త్యంతము రాలునీరగు విధంబున నేడ్చుచు నీడ్చుచున్ దిశల్ 787**

**దీపము లేని ఇంటిగతి, దీనుని మోమువిధాన శూన్యమై**
**పాపపు గాలి సోకిన విభారహితంబగు యజ్ఞవేదికా**
**రూపము దాల్చి పంచవటి రూపతియుంట, కుటిన్ విదేహజా**
**రూపములేమి దాశరథి రోదన జేయుచు వెత్తికైవడిన్ 788**

చాలా సహజంగా కరుణ రస స్ఫోరకంగా ఉంది. రాళ్ళు కూడా నీరయ్యే లాగా రాముని దు:ఖం ఉంది.

సీతా వియోగ దు:ఖంలో ఉన్న రాముడు ఋష్యమూక పర్వతానికి వెళ్ళగానే అచ్చటి ప్రకృతి సౌందర్యం రాముడు కొంత సేదతీరేలా చేసింది.

**"పూచిన పూలు, తేనియల పొట్లము గట్టిన పండ్లు....802**

బాగా పండినపండ్లు తేనెలను పొట్లము కట్టినట్లు ఉన్నాయంట చూడండి.

**చల్లని సాత్త్విక ప్రకృతి జల్వలు బూయక నీవు దేవ! ని**
**ల్వెల్లన నల్లనై నిలుచు లీలకు గారణమై-త్వదంఘ్రి యు**
**త్ఫుల్ల సరోజ శీధువున ద్రుళ్ళెడి భక్త మిళింద సంతతుల్**
**పెల్లుగజుట్ట కార్నలుపు బిట్టు గ్రమ్మెనొ ఏమొ! మ్రొక్కెదన్ 954**

భక్తులనే నల్లని తుమ్మెదలు విష్ణువును చుట్టుముట్టడం వలన విష్ణువు కాఋ నలుపుగా మారెనని చెప్పడం వీరి ఊహకు పరాకాష్ఠ. విరుద్ధ భావ చమత్కారం కొన్ని పద్యాలలో కన్పించి పాఠకున్ని ఆశ్చర్యం చేస్తుంది.

**ఏమో నాకిది పెట్టినావు మదినెంతేచల్లనై కాల్చు నమ్మో మాధుర్య మహోగ్నిపిండగతి 5**

ఇక్కడ మాధుర్య మహోగ్ని చల్లనై కాల్చడం ఆశ్చర్యం.

36వ పద్యంలో ఏ పాదాలు విభీషణున్ని కాపాడాయో, అదే పాదాలు రావణున్ని సంహరించాయి అని చెప్పారు కవి.

**"సృష్టి విచిత్రమెంతయును! జీవనముగ్నినిగల్గినట్లు కో**

**పిష్టి హిరణ్యకశ్యపుని పేగున చల్లని చంద్రబింబమై"-683**

ప్రహ్లాదుడు పుట్టాడట. నిప్పులో నీరు పుట్టినట్టు కోపిష్టి హిరణ్యకశ్యపుని గర్భంలో చల్లని చంద్ర బింబంలాగా ప్రహ్లాదుడు పుట్టాడట ఏమి చమత్కారం. H2o - అగ్నేరాప: (అగ్ని నుండి జలము పుట్టింది) అని వేదోక్తి.

**శోకమెరూపమైవనినశోకుడు రాముడు - 790**

శోకమెరుగని రాముడు శోకమేరూపమైనట్లుగా ఉన్నాడట.

**శబ్ద చమత్కారము**

సందర్భోచితంగా పోతనగారు భాగవతంలో చాలా చక్కగా శబ్దాలంకారాలు ప్రయోగించారు. ఎందరి నోటనో భాగవత పద్యాలు నర్తించడానికి వారి శబ్ద చమత్కృతి కూడా ఒక కారణమే. అలాగే ఈ శ్రీచరణ శరణగతిలో కూడా శబ్ద ప్రయోగం ఆకర్షణీయంగా ఉన్నవి కొన్ని చూద్దాం.

**బాలున్ త్వత్పదశీలు దివ్యగుణ సంపచ్చాలు బ్రహ్లాదు ను**
**ద్వేల ద్వేష పరీత పుణ్యజన నిష్పిష్ట ప్రభాజాలు నీ**
**పాలున్ శ్రీకర దృష్టి గాంచవె? దయాపారమ్య నన్నేలగా**
**శ్రీలక్ష్మీనరసింహ! దివ్యపదమున్ సేవింతు నశ్రాంతమున్ 276**

అంత్యప్రాస కమనీయంగా ఉంది.

**ఉగ్రంబై...అగ్రహోదగ్రంబై...ప్రత్యగ్రంబై...అవ్యగ్రంబై 136**

నరసింహావతారము ఎంత ఉగ్రముగా ఈ శబ్దాలు దాని కనుగుణంగా ఉన్నాయి.

**రాజుల పచ్చిలోభమె తరాజుల దూచెడి గాజులన్ బల**
**వ్యాజము చేత గ్రొవ్వి....138**

పరశురాముడు దుర్మార్గుడైన రాజులను చంపునపుడూరాజులను దూషించే సందర్భంలోనిదీ పద్యం.

వామనావతార సందర్భంలో ఇలా చెప్పారు.

**....కాంతిపరివేషము వేషమువేయబూని-137**

**ఓ నవనీత తుల్య హృదయోత్పల! ఉత్పల వర్ణ! వర్ణమా**
**లానుపగమ్య దివ్య గుణరాజిత! రాజిత మూర్తి! మూర్తి మ**
**ద్దానవ సర్పనాయక పతంగ! పతంగ తురంగవీర! వీ**
**రానుచర ప్రశస్త మణిహారధరా! పదసిద్ధివేదెదన్ 506**

**కోరితినా! మీరితినా! చేరితినా...542**

మరొక ఉదాహరణ

**గోపాలుండవు నీవటంచును సురల్ కొండాడు మోక్షప్రదా!**
**గోపాలుండవుగా జరించు వ్రజగో గోపేశ వంశీధరా!**
**గోపాలుండవె గాన నావచనముల్ కూర్తున్ భవత్పాద రా**
**గోపాఖ్యానముగా గ్రహింపవె దయన్ గోపాలచూడామణీ! 602**

బమ్మెర పోతనగారి శబ్ద చమత్కృతి వలె నత్యంత మనోహరములై, నన్నయగారి అక్షర రమ్యతను తలపించుచున్నవి.

**ఛందస్సు**

శ్రీచరణశరణాగతిలో 1021పద్యాలు ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభం అనే నాలుగు వృత్త పద్యాలలోనే వ్రాయడం జరిగింది. 221వ పద్యం ఉత్పలచంపకము, 222వ పద్యము శార్దూలమత్తేభం ఇది వీరి విచిత్ర ప్రయోగానికి నిదర్శనం.

221వ పద్యంలో 1,3పాదాలు ఉత్పలమాల గానూ, 2,4పాదాలు చంపకమాలగానూ ఉండడం విశేషం.

**ఏదిహిరణ్యగర్భమయియెప్పుడునెల్లు సువర్ణతేజమై**
**ఎదిపరవీర నాశకమునెందు శుభప్రదవుయ్యుశూన్యమై....221**

అదేవిధంగా 222వ పద్యంలో 1,3పాదాలు శార్దూలంగానూ, 2,4పాదాలు మత్తేభంగాను వ్రాశారు. ఛందస్సులో ఇదొక వింత ప్రయోగమనే చెప్పాలి.

ఎన్నో దుష్కర ప్రాసలను అవలీలగా వ్రాయడం చూస్తుంటే వీరి పాండిత్య గరిమ అర్థమవుతుంది.

1011నుండి 1017 వరకు చెప్పిన పద్యాలు చూస్తే ఒక్కొక్కటి తెలుగు విభక్తులను సూచిస్తూ రచించారు కవి. ఇదీ ఒక ప్రయోగమే.

**కవితాశైలి**

వీరి కవిత్వధార సురగంగ ప్రవాహము వేగముగా భూమిపై దూకునట్లు కన్పిస్తుంది. ఎక్కడా యతిప్రాసల కొరకు ప్రాకులాడినట్లు గానీ, ప్రయత్నపూర్వకంగా పదములు పేర్చినట్లు గానీ కన్పించదు. హరిపాదానుగ్రహము వలన జనించిన కవిత్వ జాహ్నవిని హరి పాదార్చనకే వినియోగించిన కవి వీరు.

వీరి కవితాశైలి కదళీ పాకమున పరిపక్వమై, సంస్కృత సమాస భూయిష్టమై ఉరకలెత్తుతూ ఒకచో నన్నయశైలివలె, ఒకచో భక్తిభావ నిర్భరమై పోతన శైలివలె కన్పించును.


**.....పరమాత్మా!వినిపింతునట్టినిను దివ్యంబైన శబ్దంబులన్-627**
అన్నట్లు దివ్యమైన శబ్దార్థాలతో ఈ రచన కొనసాగింది.

**పదమో, భావమొ, ఛందమో, గుణమొ నవ్యాలంక్రియారీతియో,**
**పదునౌ వక్రతయో, చమత్కృతియొ, విస్పష్ట ప్రణాదత్వమో,**
**కుదురైనట్టి రసమ్మొ, ఔచితియొ నీకోసమ్మె కావచ్చు! నిం**
**దెదియో ఇన్నిటి ముద్దయో కవిత! నీకే పాదసంసేవయో! 496**

అన్ని కవితా లక్షణాలను ముద్దజేసి శ్రీచరణసేవకు వినియోగించారీ కవి. ఈ రచనలో వీరి కవిత్వ విరాడ్రూపం కన్పిస్తుంది.

**పూర్వ కవుల ఛాయలు**

ఏ కవియైనా తన కన్నా ముందు ఉన్న రచనల చేత ప్రభావితు లౌతారు. తెలుగు సంస్కృత భక్తి సాహిత్య ప్రభావం ఈ రచనపై ఉన్నదని చెప్పవచ్చు.




వేయికి పైగా విష్ణుపాదాలపై పద్యాలు చెప్పడం **'పాదుకా సహస్రము'**ను గుర్తుకు తెస్తుంది.

**పత్రమొ పుష్పమో ఫలమొ వారి కణమ్మొ భవార్పితమ్ము....505**

ఇది భగవద్గీతలోని పత్రం పుష్పం ఫలం తోయం శ్లోకాన్ని స్ఫురింపజేస్తుంది.

**భగవంతుని లీలలు అనంతం.అబ్దిసిరాయయి నింగిపత్రమై-37** అనే భావన మనకు శివ మహిమ్నస్తోత్రంలో కన్పిస్తుంది.

అందరూ నంది తిమ్మన చెప్పినట్లుగా చెప్పుకొనే "నానాసూన వితాన వాసనల నానందించు" అనే పద్యము లాగా **"నానాసూనవితాన వాసనలు998** పద్యం ఉంది. 562, 563, 566, 574 పద్యాలను చూస్తుంటే శ్రీకృష్ణ కర్ణామృతంలోని శ్లోకాలచే ప్రభావితులయ్యారీ కవి అనిపిస్తుంది.





**కస్తూరీ తిలకమ్ము ఫాలమున, వక్షంబందునన్ కౌస్తుభం**
**బస్తోకంబు సుపాణిమౌక్తికము నాసాగ్రంబునన్, వంశమున్**
**హస్తంబందున, కంకణక్వణము, ముత్యంపున్ సరుల్, గంధమున్**
**మస్తాగ్రంబు పదంబుదాక రససంభావ్యున్ ప్రశంసించెదన్ 574**

956పద్యం కౌసల్యాసుప్రజారామా వలె ఉంది. పోతన భాగవత ప్రభావం స్పష్టముగా ఉందని చెప్పవచ్చు.

**శ్రీకైవల్యపదంబు నిచ్చుటకునై చింతించెదన్ లోక ర**
**క్షైకారంభము, భక్తపాలన కళాసంరంభమున్, దానవో**
**ద్రేక స్తంభము, కేళిలోల విలసిత్కించిద్విహారోద్భవా**
**స్తోకాబ్జ ప్రసవాండకుంభము మనస్తూర్ణంబు శ్రీపాదమున్623**

భాగవత ప్రారంభ పద్యము వలె ఉంది.





***పానీయంబులు ద్రావుచున్ గుడుచున్ భాషించుచున్ హాసలీ***
***లానిద్రాదులు సేయుచున్ తిరుగుచున్ లక్షించుచున్ సంతత***
***శ్రీనారాయణ పాద పద్మ యుగళీ చింతామృతాస్వాద సం***
***ధానుండై మరచెన్ సురారిసుతుడేతద్విశ్వమున్ మత్తుడై 684***

ప్రహ్లాదుని ప్రవర్తన గూర్చి, అతని విష్ణుభక్తిని గూర్చి చెప్పే సందర్భంలోనిదీ పద్యం. 515 కూడా ఇలాగే ఉంది.

83, 494 వంటి పద్యాలు ఎవ్వనిచే జనించు జగము ఈ పద్యము వలె నున్నవి.

720 పద్యం స్వస్తి జగత్రయీ భువనశాసన కర్త పద్యం వలె నున్నది.

శ్రీమహావిష్ణు శ్రీచరణాలకు సహస్ర పద్య పుష్పాలలంకరించడం చాలా అరుదుగా కన్పిస్తుంది. పాదుకా సహస్రం వలె ఇదియు రావికంటి వసునందన్‌గారి రచనలన్నింటిలో కెల్ల మకుటాయమానమై భాసిస్తుంది.




**ఉపయుక్త గ్రంథ సూచిక**

1. పోతన బమ్మెర 1994 శ్రీమహాభాగవతము(మొదటి సంపుటము) హైదరాబాదు:తెలుగు విశ్వవిద్యాలయము. ఏడవముద్రణ (ప్రథమ ముద్రణ 1964)
2. పోతన బమ్మెర 1994 శ్రీమహాభాగవతము(ద్వితీయ సంపుటము) హైదరాబాదు:తెలుగు విశ్వవిద్యాలయము. ఏడవముద్రణ (ప్రథమ ముద్రణ 1964)
3. లీలాశుకుడు 1998 శ్రీకృష్ణకర్ణామృతమ్ (వ్యా.బిరుదురాజు రామరాజు) హైదరాబాదు:సురభారతీ సమితి ద్వితీయ ముద్రణ.

❖ ❖ ❖ ❖ ❖

# "అవని" తత్త్వ ఆకళింపే జీవితం

**ఎం. విప్లవ కుమార్,** ఫోన్ : 951 522 5658




ప్రకృతి నుంచి అనంతం వైపు వేసిన ఒక అడుగే 'కళ' అంటాడు ప్రపంచ వైవిధ్య సాహితీకారుడు ఖలీల్ జిబ్రాన్. అలాంటి కళతోనే అనంతమైన ఈ ప్రపంచాన్ని ప్రకృతివైపు మలిపే ప్రయత్నం చేస్తున్నాడు ప్రజాకవి జయరాజు. సింగరేణి రాకాసి బొగ్గులో నుండి నిప్పురవ్వల్లాంటి పాటల్ని వెదజల్లిన జయరాజు వాగ్గేయకారుడిగా అందరికీ సుపరిచితమే. ఇప్పటిదాకా తనపాటల ప్రవాహంతో ప్రజల మనస్సుల్లో చైతన్యపు పంట పండించిన జయరాజు ఇప్పుడు **"అవని" 'ఫిలాసఫీ ఆఫ్ నేచర్'** పుస్తకంతో వచనమై వినిపిస్తున్నాడు. చిట్టెడు గింజలతో పుట్టెడు వడ్లు పండించినట్టు ఈ అవని పుస్తకంలో నూటా ఇరవై రెండు చిన్న చిన్న పాఠాలతో ప్రకృతితత్వాన్నంతా వివరిస్తాడు. అపారమైన అటామిక్ ఎనర్జీని అణువులో ఎలా ఒదిగించాలో eRmc2 ద్వారా ఐన్‌స్టీన్ చెప్పినట్టూ సముద్రమంత విషయాన్ని నాలుగు చరణాల్లో వివరించగల నేర్పున్న వాగ్గేయ కారుడు కనుకనే జయరాజు ప్రకృతినంతా ఒడిసిపట్టి సింగిల్ పేరాగ్రాఫ్ లో సంక్షిప్తంగా వివరించగలిగాడు.

తల్లీ నన్ను దీవించూ! అంటూ నేలమ్మతో మొదలెడితే చదవడం పూర్తయ్యే వరకు పుస్తకాన్ని మూయలేము. జయరాజు తన పాటంత చిక్కదనం, బాణీ అంతటి చక్కదనాన్ని అవనిలో పొదిగాడు. ఆయన పాట ఎంత ప్రభావశీలమైనదో పాఠమూ అంతే ప్రతిభావంతమైనదై మనల్ని చదివిస్తుంది. ఫ్యాషన్ పురుగులై తిరుగుతూ ప్రేమ జిలుగులై మెరుస్తున్న ఏ పోరడూ ఒక్కసారి పట్టుకుంటే ఈ పుస్తకాన్ని వదలడు. యువత ఎప్పుడెప్పుడా అని ఉవ్విళ్లూరే రతికార్యాన్ని సహితం అందమైన పదాలతో రసరమ్యంగా తీర్చి దిద్దిన తీరు అద్భుతం. ఎక్కడా అశ్లీలత దొర్లకుండా ప్రేమైక వ్యక్తిత్వ వికాసాన్ని చాటిచెప్పిన తీరు ప్రకృతి చర్యల మీద జయరాజుకు ఉన్న వ్యక్తిత్వ పరిపక్వతను తెలియచేస్తుంది. యవ్వనానికి తెగింపుకు ఉన్న అంతఃసంబంధమే ప్రేమ. అందుకే యవ్వనం ప్రేమ యుద్ధాల గెలుపు సంబంధాల మూలమలుపు. సాహసాలు, త్యాగాలు, విజయాలు ఇలా ఏం చేసినా యవ్వనంలోనే. ఆ తర్వాతి కాలంలో చేసేవన్నీ యవ్వన కాల కార్యాల కొనసాగింపు కాబట్టే కొందరు ప్రేమకోసమే జీవిస్తారంటాడు. అలా తన ప్రేమ గురించి వివరించిన తీరుతో **"ప్రేమను ప్రేమించిన ప్రేమ ప్రేమకై ప్రేమించిన ప్రేమను ప్రేమిస్తుంది"** అని చెప్పిన పాబ్లో నెరూడాను గుర్తు చేస్తాడు. భూమి సూర్యునిచుట్టూ తిరగడాన్ని ప్రేమ ప్రదక్షిణలుగా సూత్రీకరిస్తాడీ ప్రకృతి ప్రణయ కారుడు. అందుకే యువజనులందరు అందుకోగలిగిన పుస్తకం "అవని". ప్రేమికులు పరస్పరరం పంచుకోగల సున్నితమైన పెదవుల పాదరసం అవని. మట్టివాసన పాఠం యవ్వనాన్ని పట్టి మట్టి పరిమళంలో ముంచి జీవన సుగంధమే అందమైన రూపమంటుంది. శాస్త్ర, సాంకేతిక, భాషా బంధనాలకంచెను దాటి సరళమైన పద్ధతుల్లో సాటి మనిషికి ప్రకృతి గురించి విప్పి చెప్పే ముచ్చట్ల పొట్లం అని.

ఇందులో వేసిన అద్భుత చిత్రాలు చూస్తేనే అవని అంతరార్థం సగం అర్థమైపోతుంది. పసిపిల్లల చిరువేళ్ళకంటే సున్నితమైన ఎర్రని ఆరుద్ర పురుగులు నేల మోముపై ఎర్రని పుట్టుమచ్చలని అభివర్ణిస్తాడు. పిచ్చుకలు, తూనీగలు, తేనెటీగలు, చిలుకలు, రింగన పురుగుల్లాంటి కనుమరుగౌతున్న జీవజాలం గురించి ఆవేదన చెందుతాడు. సాలీడు, చీమ, పిట్ట, కోకిల, లేడి లాంటి జీవుల ద్వారా ప్రకృతి మనకు ఎంతటి వ్యక్తిత్వ వికాస పాఠాలను నేర్పిస్తుందో వివరిస్తాడు. అడవిలో చెట్లన్నీ అమ్మ రొమ్ముతో, సమానం, వాటినేమన్నా అమ్మ చనుబాల వాసనే మనల్ని చుట్టుముడుతుందని అడవిని అంతం చేసే హరిత హంతకుడికి హితబోధ చేస్తాడు. ప్రకృతిని పలగజీరి పండుగజేసుకుంటున్న పాపుల విధ్వంసం వలన దెబ్బతింటున్న వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ఈ పుడమితల్లికి పచ్చని ఓజోన్ దుప్పటి కప్పుదాం రండీ అని జయరాజు ఇచ్చే పిలుపులో కొపెన్హాగెన్, ప్యారీస్ ఒప్పందాలను తలదన్నే నిజాయితీ కనిపిస్తుంది.


ఖలీల్ జీబ్రాన్ చెప్పిన అనంతం నుండి అనంతానికి ప్రవహించే మానవత్వపు నది ఏదో జయరాజులో ప్రవహించడం 'అవని'లో గమనించవచ్చు. ఎందుకంటే అందరూ ఏవగించుకునే ఊసరవెల్లిని రంగవల్లీ, అమ్మా కల్పవల్లీ అని ముద్దుగా ప్రేమగా పిలుస్తాడు. రంగులు మార్చడం ఊసరవెల్లి రక్షణార్థమే తప్ప అవకాశవాదంతో ఎవ్వరినీ ఏమార్చడానికి కాదంటాడు. ప్రకృతీ ప్రతి నిత్యం మారుతూ ఉంటుంది. పదార్థం చలనంలో ఉంటుంది. చలనంలో ఉండడమే చైతన్యానికి ప్రతీక అని మార్క్స్ గతితర్కపు నియమాలను ప్రకృతితత్వంతో పారాయణం చేస్తున్నాడు జయరాజు. అమ్మ తన

ఎర్రని నెత్తురుని తెల్లని పాలుగా మార్చి బిడ్డలకిస్తుంది. ఏ శాస్త్రవేత్త ఈ పని చేయలేదు. అలాంటి గొప్ప మాతృత్వం పై మగాధిపత్యాన్ని, అమ్మతనంపై అరాచకత్వాన్ని జయరాజు అడగడుగునా నిరసించి అమ్మతనాన్ని ఆరాధిస్తాడు. ప్రకృతిలో ప్రతిదాన్ని అమ్మగానే భావిస్తాడు. మన పోలికే అనే పాఠంలో వృక్షమై వాటి తత్వాన్ని అంతరిక్షానికి వినిపించేలా గొంతెత్తుతాడు. మనిషికీ వృక్షానికి తేడా లేదని కైగట్టిపాడుతున్నాడు. తనే ఒక చెట్టై మహావృక్షమై పరకాయ ప్రవేశం చెంది మమ్మల్ని కాపాడితేనే మానవాళికి భవిష్యత్ అని నినదిస్తున్నాడు. శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ మొక్కలకు ప్రాణముందని నిరూపిస్తే, మనిషికున్నట్టే చెట్టుకూ అవయవా లున్నాయని తన 'ఫిలాసఫీ ఆఫ్ నేచర్' ద్వారా నిరూపిస్తున్నాడు ఈ ప్రకృతి శాస్త్రకారుడు జయరాజు.

అభివృద్ధి పేరుతో అవనిని ధ్వంసం చేసి అడవులను ఆక్రమించే హక్కు మనకుంటే పట్టణాలను, గృహసముదాయాలను ఆక్రమించే హక్కు అటవీ జీవాలకూ ఉంటుంది. అందుకే కోతులు ఊళ్ళనేలుతున్నాయని గుర్తుచేస్తాడు. అడవి ప్రకృతి ప్రసాదం పరిణతికి జన్మస్థాన మంటాడు. పాండవులు, శ్రీరాముడు అరణ్యవాసం చేసింది, వాల్మీకి రామాయణం రాసింది, అన్నమయ్య కీర్తనలుపాడింది, సమ్మక్క సారక్క రాజ్యం చేసింది, కొమురంభీం కోరమీసం దువ్వింది అడవి నుండేనని గుర్తుచేస్తాడు. అడవి తిరుగుబాటుకు ఆదెరువు. జరుగుబాటుకు కల్పతరువు. పొట్టకూటికి బతుకు తెరువు. అందుకే అడవి చరిత్రను మళ్ళీ మళ్ళీ రాస్తానంటాడు. చెట్టు తన ఆత్మకథ రాయగలిగితే అది ఒక జాతి చరిత్రకన్నా ఏమాత్రం తక్కువగా ఉండదన్న ఇండియన్ ఖలీల్ జీబ్రాన్ వలె కన్పిస్తాడు. పచ్చని ప్రకృతిలో పరుచుకుంటున్న కాంక్రీట్ కీకారణ్యం, ప్లాస్టిక్ నవ్వులు, వాట్సప్ ప్రాయాలు, ఫేస్బుక్ జీవితాలు డబ్ స్మాష్ డైలాగులు టిక్ టిక్ నటనలే జీవితాలయిపోయిన వేళ నటజీవితాన్ని వివరిస్తాడు. మనిషి తత్వాన్ని కోల్పోయి నటనే ఆశ్చర్యపోయేలా నటిస్తున్న జనాన్ని చూసి ప్రకృతి ఎంత బాధపడుతుందోనని వెక్కి వెక్కి ఏడుస్తాడు. ప్రకృతి విరుద్ధప్రవర్తనలతో మనిషిలో పెంటగడ్డలా పేరుకుపోతున్న కుత్రతత్వాన్ని నడిబజారులో గల్లాబట్టి నిలదీస్తాడు. ఇలా తన ప్రశ్న సున్నితమైనదే అయినా దాని గాఢత మాత్రం లోతైనది. అభివృద్ధి జపంలో శ్రుతిమించిన యాంత్రీకరణతో మనిషి మర యంత్రంగా మారిపోతున్నాడని తలపోస్తాడు. అలా మనం మరమనుషులం అయ్యాక మానవచరిత్రలో కేవలం మనిషి చిత్రపటాలు మాత్రమే మిగిలే ప్రమాదం ఉందని వలపోస్తాడు. ప్లాస్టిక్ కి మనం ఫుల్ స్టాప్ పెట్టకపోతే అదే మనకు ఫుల్ స్టాప్ పెడుతుందని ఈ కాస్మోపాలిటిక్ కల్చర్ని జయరాజు హెచ్చరిస్తాడు.

ఈ పుస్తకంలో వేట గురించి వివరిస్తూ అత్యంత నైపుణ్యం కలిగిన వేటగాళ్ళు భూమి మీద, సముద్రం మీదనే కాదు. ఇసుకలో కూడా






ఉన్నారంటాడు. కాళేశ్వరం, గోదావరి, కృష్ణా లాంటి ప్రాణమున్న నదులను చంపే ఇసుక వేటగాళ్ళ దుష్ట నైపుణ్యాన్ని గుర్తుకుతెస్తుంది. ఇసుక తీయడమంటే నది ప్రాణాల్నితోడేయడం. భూగర్భ జలాలను పీల్చివేసే దురాగతమంటాడు. అందుకే అభివృద్ధి అంటే ఖరీదైన భారీ వంతెనలు, ఆకాశహర్మ్యాలు కాదు. ప్రకృతిని నాశనం చేయడం కాదు, పక్షుల సంభాషణలు వినగలిగి చిన్న చిన్న జీవుల గుండె చప్పుడు కనగలగడమే నిజమైన అభివృద్ధి అని చాటిచెప్తాడు. ప్రసవంలో బిడ్డలు తండ్లాడి గట్టిపడతారు. అలా పోరాడే తత్వాన్ని పురిటిలో నుండే నేర్చుకుంటారని తాత్వీకరిస్తాడు. అమ్మమ్మలు చేసే ప్రసవం నేడు అస్పత్రిలో ఖరీదైన వ్యాపారమైందని కడుపుకోతలు వికృతేకాని ప్రకృతి ధర్మం కాదంటాడు. శబ్దం ఎన్ని పాటలు పాడిందో, ఎన్నిచైతన్య జ్వాలలు రగిలించిందో అంటూ శబ్దంలో కూడా పాటనే కలగంటాడు ఈ ప్రకృతి కవి జయరాజు. సెలయేటి జలపాతం చప్పుడు నుండి ముని వేళ్ళతో మీటే వాయులీనం దాకా, చిందు ఎల్లమ్మ, సుక్క సత్తయ్య, సుద్దాల హన్మంతు, పాణిగ్రహి, గద్దర్ నుండి ప్రపంచాన్ని కుదిపేసిన శబ్ద సునామీ మైఖేల్ జాక్సన్ దాకా, అక్షరం నుండి ఆయుధం వరకు ప్రతిదీ శబ్దమే. అలా శబ్దమైన ప్రతిదీ సంగీతమే జయరాజు మనసుకు. భగత్ సింగ్, సఫ్దర్ హష్మీ లాంటి స్వర తంత్రులను అంతం చేయలేరని ఈరోజు ఉరితీసినా, కాల్చి బూడిద చేసినా మరునాడు సరాగమై చిరుగాలి సవ్వడితో లేచి వస్తుంది. నిశ్శబ్దపు నిమిషాన్ని నిగ్గు తేలుస్తుంది. ఆ శబ్దం ఎప్పుడైతే నిశ్శబ్దమవుతుందో విశ్వం ఆ రోజే స్మశానమవుతుందని చిన్న పాఠంలో ఓ శబ్దసిద్ధాంత పత్రాన్ని సమర్పిస్తాడు. ఇది పాట మీద జయరాజు కమిట్మెంట్ ను తెలియజేస్తుంది.

ఇక స్వర్గం, నరకం, దైవం, దయ్యం, హృదయం, సుకృతాల గురించి తనదైన తాత్విక దృక్పథాన్ని మన ముందు ఉంచుతారు. ప్రకృతి సంపదలు కొద్దిమంది స్వార్థపరుల చేతుల్లోనే ఉంచుకోవ డానికి, శ్రమదోపిడి చేయడానికి, ప్రజలు ప్రశ్నించకుండా ఉండటా నికి పూర్వజన్మ సుకృతం అనేది సృష్టించారంటూ కర్మ సిద్ధాంతం కడుపులోగుట్టు విప్పి కచ్చిరుకాడ ఎండబోస్తాడు. కోరికలు తీరని

# నానీల కమ్మలు

డా. మడత భాస్కర్, ఫోన్ : 89193 28582

కందువా
మార్చినంత తేలిగ్గా
న్యాయాన్ని మార్చగలవా?
నాయకుడా!?

ప్రమాణ స్వీకారం
కష్టమే సుమీ,
సార్వభౌమాధికారం
మరీ కష్టం

నాయకుడు మారాడు
ప్రభుత్వం మారింది
ఇక మారాల్సింది
ఓటరు తలరాత

ప్రయాణికులకు
విజ్ఞప్తి
మీరు ఎదురు చూస్తున్న బస్సు
ఈ జన్మలో రాదు

కాలనీ వాసులకు
ఐకమత్యం ఎక్కువ
కలిసే
గొడవ పడ్తారు

భారతదేశం
నా మాతృభూమి
భారతీయులు మాత్రం
నా దాయాదులు

సంగీతం
చింతకాయలు రాల్చునో లేదో!
చింతలు బాపును
నమ్మావో లేదో?

పట్నమే అనుకున్నా
ఇప్పుడు
పల్లెటూరు కూడా
'సైట్' కొడుతుంది.

ఈ కాలం పిల్లలు
చెడిపోతున్నారు
పెద్దలు మహా
బాగుపడిపోతున్నట్టు!?

నేను నీకు
దూరమై చాలా కాలమైంది
నువ్వు మాట్లాడుతున్నది
నా నీడతో

ఎనకటి
కాకి బలగం లేదు
ఇకనుండి
ఏకాకి బలగమే

వింటున్నావా?
తల్లీ ! స్టార్ మహిళా!
'సీరియల్' కాదు
సీ 'రియల్'.


ఎప్పుడూ
దూరాలు కొలవడమేనా
ఇప్పుడైనా
స్నేహ ద్వారాలు తెరుద్దాం


కారణ జన్మలు
అంతరిస్తున్నారు
ఇప్పుడందరూ
రణ జన్మలే.

వారే దయ్యాలయితే, యుద్ధంలో చనిపోయిన సైనికులు మరో దేశం సైనికులను ఎందుకు పట్టడం లేదని ప్రశ్నిస్తాడు. భర్తల చేతిలో సమిధలైపోయిన భార్యలు దయ్యాలయి ప్రతీకారం ఎందుకు తీర్చుకోవడం లేదో ఆలోచించమని కోరుతాడు. అలా దయ్యం పేరుతో జరిగే గుండాగిరిని దైవం పేరుతో జరిగే దందగిరిని చీల్చి చెండాడుతాడు. ఒకరోజు దేవుడు ప్రత్యక్షమై మనకు ఏ సహాయం చేయకుండా ఊరికే కూర్చుంటే అతడు నిజంగా దేవుడైనా సరే గెంటి పారేస్తాం. ప్రకృతిని మించిన పరమాత్మ ఎక్కడ ఉండదు. అందుకే మనం తయారు చేసిన ఎంతోమంది దేవుళ్ళ కన్నా మనల్ని తయారుచేసిన ప్రకృతి దేవతలను ప్రేమించండి అని జయరాజు అవని ద్వారా వేడుకుంటున్నాడు. హృదయం ముద్దిమ్మంటూ వెంటపడే స్పందనల తీరం కాదు. రుధిరధారల శుద్ధి కర్మాగార కేంద్రం అని నిర్వచిస్తాడు. ప్రకృతిలోని కొండల మధ్య అడవి దాగి ఉన్నట్లే మనిషి లోపలి దృఢమైన ఎముకల మధ్యలో హృదయం సురక్షితంగా పొందుపరచబడి ఉందంటూ హృదయ స్పందనల శబ్ద తంత్రుల సంగీతం వినిపిస్తాడు.


అవనిలో మన చుట్టూ ఉన్న సాధారణమైన విషయాలే వివరించినట్లు కనిపిస్తాయి. కానీ వాటికి, ప్రకృతికి మనకు ఉన్న అంతర్లీన సంబంధాన్ని చెప్పడంలో జయరాజు ఒడుపు కనిపిస్తుంది. రైతుకు మేలు చేసే కీటకాలు, గీతా కార్మికులకు మేలు చేసే వడ్లపిట్ట లాంటి వాటి గురించి చెబుతున్నప్పుడు వైవిధ్యమైన చూపు సున్నిత అంశాల పట్ల జయరాజు సూక్ష్మ దృక్పథం అబ్బురపరుస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రకృతిలో ఉన్న జీవవైవిధ్యమంతా అవనిలో ఎదురుపడి పలకరిస్తుంది. అలా పలకరించే జీవవైవిద్యాన్ని కాపాడడానికి అక్షరాయుధాలను భుజాన వేసుకొని పహారా కాస్తున్న ప్రకృతి శాస్త్ర విప్లవకారుడై జయరాజు అవనిలో దర్శనం ఇస్తాడు. అమ్మమ్మలు తాతయ్యలు చెప్పే నీతులు చిట్కాలు అన్నింటి నుంచి వి వాంట్ ఫ్రీడమ్ అని పాడుకుంటున్న ఈ తరానికి అందమైన చిత్రాలు చూపించి, ఆకర్షణీయమైన అంశాలను అద్ది నరనరానికి పచ్చదనాన్ని ఎక్కిస్తాడు ఈ ప్రకృతి తాత్వికుడు. మొక్కలను పెంచడం అంటే అడవులను రక్షించడం అంటే ప్రొఫైల్ పిక్కులలో బొమ్మలు మార్చడం కాదు అమ్మ చనుబాల రుణం తీర్చుకునేందుకు పర్యావరణ పరిరక్షణకు పూనుకోవడమేనంటూ దిమ్మదిరిగే ముచ్చట్లతో మన మెదళ్ల నిండా ఆకుపచ్చని అవనిని పరుస్తాడు జయరాజు. అవని చదువుతున్నంత సేపు మనిషి కణజాలంలోనికి పత్ర హరితం ఎక్కినట్లు అనిపిస్తుంది. అందుకే అమ్మ లాంటి అవనిని అర్థం చేసుకుందాం. అవని తత్వాన్ని ఆకళింపు చేసుకోవడమే జీవితమని తెలుసుకుందాం.

# స్వ'కృతి'






**శ్రీ యశస్వినీ (ప్రపంచ పద్య కవితా విపంచి)**
సంపా : డా. బోచ్కర్ ఓమ్రుకాశ్
వెల : 500/-
**ప్రతులకు :** బోచ్కర్ చంద్రకళ, 8-69, ఇందిరా నగర్ కాలనీ, జక్రాన్ పల్లి, నిజామాబాద్ జిల్లా.
ఫోన్ : 9441 955 998





**రమణీయ పద్య ప్రకాశం**
రచన : డా. బోచ్కర్ ఓమ్రుకాశ్
వెల : 200/-
**ప్రతులకు :** బోచ్కర్ చంద్రకళ, 8-69, ఇందిరా నగర్ కాలనీ, జక్రాన్ పల్లి, నిజామాబాద్ జిల్లా.
ఫోన్ : 9441 955 998

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**


చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,
బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,
హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com





**శ్రీవైష్ణవ కవి - పండిత కుటుంబాలు**
డా. శ్రీరంగాచార్య
వెల : 150/-
**ప్రతులకు :** రచయిత, 11-14-25, హరిపురి కాలనీ, హైదరాబాద్ - 500 102.
ఫోన్ : 92994 51266





**గోటీలాట (పిల్లల కథలు)**
గరిపెల్లి అశోక్
వెల : 80/-
**ప్రతులకు :** గరిపెల్లి సరోజన, 404, వి.ఎల్.ఆర్. రెసిడెన్సీ, శ్రీనివాస నగర్, సిద్ధిపేట - 502 103. ఫోన్ : 98496 49101




**ఐతరేయ ప్రశ్నోపనిషత్తులు (ముత్యాల సరాలలో)**
జక్కని వేంకటరాజం
వెల : 75/-
**ప్రతులకు :** 'గురుకృప' నెం. 7-2-109, సుభాష్ నగర్, సిరిసిల్ల - 505 301.
ఫోన్ : 94400 21734.




**చంద్రోదయము**
అల్వాల లక్ష్మణమూర్తి
వెల : 150/-
**ప్రతులకు :** రచయిత, సుభాష్ నగర్, టీచర్స్ కాలనీ, ఇంటి నెం. 3-143/డి, కలువకుర్తి (పోస్ట్) నాగర్ కర్నూలు (జిల్లా) - 509 324



**శక్తి రూప శ్రుతి సంస్తుత వైభవ శ్రీనిధానమా**
కటకం వేంకటరామ శర్మ
వెల : 100
**ప్రతులకు :** రచయిత, 390, కమలాశంకర నిలయం, (7వ వీధి, 3వ లేన్), హెచ్.ఎం.టి. స్వర్ణపురి కాలనీ, మియాపూర్, హైదరాబాద్ - 500 049. ఫోన్ : 94404 72321.

## మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 2

UGC CARE List Approved Journal
హైదరాబాద్ డిసెంబర్ : 2024

# ఏమో? ఎట్లుంటదో?

## కందుకూరి అంజయ్య

ఫోన్ : 94902 22201



ఏమో! ఎట్లుంటదో?
అపరిచితుల మధ్యన
అడుగులు ఎటు పడుతయో!?
కట్టుకున్నవాడు
కండ్లల్లో పెట్టుకొని
సూసుకుంటడో?
కసాయివాడై
కాటేస్తడో?

మామకు భయపడి
బతుడైతదో?
బిడ్డతీరుగ సూసుకొని
బీరతీగ తీరుగ, పోదన చేస్తడో?
బావలు బాకుల
మొనలైతరో
పందిరికి పారిన
చల్లని నీడనిచ్చే
తీగలైతరో?
మరుదులు
మనసెరిగి
మట్టి పరిమళాలు పండిస్తరో?
సన్నకాలపు చిన్న బుద్ధులైతరో?

అత్త ఆత్మగల్ల
తల్లైతదో?
ఆరడి పెట్టే అయిటి కప్పైతదో?
ఆడబిడ్డలు
తోబుట్టువుల లాగ
తోడునీడగుంటరో?
పొయిల ఉప్పు పోసినట్లు
చిటపట చిటికలేస్తరో?

యారండ్లు
అంటిముట్టనట్టుంటరో
పూలదండల
దారం తీరు
మనసులను కలిపే
మమతల పురులైతరో?



కొద్దిగున్న భూమి
కొరితిమీది సావయితదో?
కుదురుకునే కూడలి అయితదో?
కురిపె కొడవలి పట్టుకొని
కంటిమీద కునుకు లేకుండ
రెప్పలను మూయకుండ
మంచె మీద కావలుండుడైతదో?



ఎడ్లను అరుసుకొనుడు
మడ్లను సూసి మురుసుకొనుడు
రోజూ రివాజైతదో?

ఆరుగాలం
రెక్కలు ముక్కలు చేసుకొని
రేయి పగలూ చెమట జల్లును
కురిపించుడైతదో?



ప్రవాహంలో పడి
కొట్టుక పోయి,
కట్టె అయి గట్టుకు తేలుడైతదో?
ఎదురీది ఒడ్డుకు చేరి
ఒళ్ళు విరుచుకొని, నిలబడుడైతదో?
దిగితే కాని లోతు తెల్వది,
గలుమలో కాలుపెడితే కాని,
గుట్టు చిన్నది.
('జమిడిక' కావ్యం)

# ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

## మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

**7416 106 106**
www.ferty9.com

**మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.**

**IUI** **IVF** **ICSI** **IMSI** **HSG**



## ఫర్టీ 9 హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం

మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్